www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

'సృజనాత్మక విధ్వంసానికి' సైద్ధాంతిక పునాది

జోయల్ మోకిర్, ఫిలిప్ అఘియోన్, పీటర్ హోవిట్‌లకు ఆర్థికశాస్త్రంలో నోబెల్

కొత్త విధానాలు, టెక్నాలజీలతోనే పాత వ్యాపార నమూనాలు కనుమరుగు

ఈ ప్రక్రియ కొనసాగితేనే స్తబ్ధత లేకుండా ఆర్థికరంగం పరుగులు 2

ఇక 100% విత్‌డ్రా

పీఎఫ్ పాక్షిక ఉపసంహరణ నిబంధనలు సరళీకరించిన ఈపీఎఫ్‌వో..

విత్‌డ్రా పరిమితుల్లోనూ మార్పు

అన్ని పాక్షిక ఉపసంహరణలకూ కనీస సర్వీసు 12 నెలలకు తగ్గింపు

'ప్రత్యేక పరిస్థితుల'కు కారణం చెప్పక్కర్లేదు 2

ఈపీఎఫ్‌వో ట్రస్టీల సెంట్రల్ బోర్డు నిర్ణయాలు

మంగళవారం | 14-10-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 179 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, బహుళపక్షం, తిథి: అష్టమి ఉ.11.10 తదుపరి నవమి, నక్షత్రం: పునర్వసు ఉ.11.54 తదుపరి పుష్యమి, వర్జ్యం: రా.7.56-9.32, దుర్ముహూర్తం: ఉ.8.31-9.17, రా.9.53-10.41, అమృతఘడియలు: ఉ.9.33-11.07 తె.5.34 మొదలు శేషం ఉ.7.10, రాహుకాలం: మ.3.00-4.30 వరకు, సూర్యోదయం: 6.11, సూర్యాస్తమయం: 5.50 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



సీఆర్‌డీఏ భవనం వద్ద సీఎం చంద్రబాబు

ల్యాండ్ పూలింగ్ కింద భూము లిచ్చినందుకు గత పాలకులు రైతులను, మహిళలను నానా హింసలు పెట్టారు. వారి ఉన్మాదం ఏ స్థాయికి వెళ్లిందంటే.. అమరావతిని ఎడారి అన్నారు. శ్మశానమన్నారు. వేశ్యల రాజధాని అన్నారు. ఎంతో అపహాస్యం చేశారు. వాటన్నిటికీ సమాధానం చెప్పేలా రాజధానిని నిర్మిస్తాం.

రాజధాని రైతులకు ఎలాంటి ఇబ్బందులూ రాకుండా చూస్తాం. వారి సమస్యల పరిష్కార బాధ్యతను కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రి పి.నారాయణ, స్థానిక తాడికొండ ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ తీసుకుంటారు. రైతులతో నిరంతరం మాట్లాడి పరిష్కారం చూపుతారు. ఇంకా పరిష్కారం కానివి ఉంటే నేను బాధ్యత తీసుకుంటా.

\- సీఎం చంద్రబాబు

ఆ తప్పు మళ్లీ చేయొద్దు!

కూటమి ప్రభుత్వం 2047 వరకు ఉండాలి: చంద్రబాబు

అప్పుడే నంబర్ వన్ ఎకానమీగా భారత్

ఆంధ్రప్రదేశ్ దానికి ఇంజన్‌గా ఉంటుంది

అమరావతి అభివృద్ధి యాత్ర మొదలు

రాయపూడిలో సీఆర్‌డీఏ భవంతి ప్రారంభం

రాజధాని మాస్టర్ ప్లాన్‌లో తొలి భవనమిది

క్వాంటం కంప్యూటింగ్, గ్రీన్ ఎనర్జీ వ్యాలీ, ఏఐ డేటా సెంటర్‌తో మరింత ముందుకు

రాజధాని రైతుల త్యాగాలు, ఆడబిడ్డల అవమానాలు మరచిపోను

త్వరలో రైతులతో ప్రత్యేక భేటీ: సీఎం

గుంటూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): 'ఒక్కసారి జరిగిన తప్పునకు రాష్ట్రం ఎంతగా నష్టపోయిందో అందరికీ తెలుసు. మళ్లీ అలాంటి తప్పులు జరగకూడదు' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. 2047 వరకూ కూటమి ప్రభుత్వం ఉండాలన్నారు. అప్పుడే భారతదేశం ప్రపంచంలో నంబర్ వన్ ఎకానమీగా ఆవిర్భవిస్తుందని.. దానికి ఆంధ్రప్రదేశ్ ఇంజన్‌గా ఉంటుందని చెప్పారు. అందుకే పవన్ కల్యాణ్, బీజేపీలతో కలిసి ముందుకెళ్తున్నామన్నారు. రాయపూడిలో నిర్మించిన

మిగతా 13వ పేజీలో...



ఢిల్లీలో మోదీతో సమావేశమైన చంద్రబాబు

నేడే గూగుల్‌తో ఒప్పందం

ఏఐ సిటీగా మారనున్న వైజాగ్!

బాబు బ్రాండింగ్, లోకేశ్ కృషితో అతిపెద్ద పెట్టుబడి

జగన్‌ది క్రిమినల్ మాస్టర్ మైండ్!

వివేకా హత్య తరహాలో ఇప్పుడు 'కల్తీ' వ్యవహారం

రాష్ట్రంలో అలజడి సృష్టించేందుకు ప్రయత్నం 13

నేరాలు చేసి టీడీపీపై నెట్టేస్తున్నారు: ముఖ్యమంత్రి



జోగి రమేశ్

జోగి చెప్పారు మేం చేశాం!

నకిలీ మద్యం గుట్టువిప్పిన జనార్దనరావు



వీడియోలో మాట్లాడుతున్న జనార్దనరావు

కూటమి సర్కారు నిఘాతో నకిలీ మద్యం వ్యాపారం ఆపేశా

కొన్నాళ్లు ఆఫ్రికాకు వెళ్లిపోయా.. జోగి ఫోన్ చేసి రప్పించారు

మళ్లీ ఇబ్రహీంపట్నంలో తయారుచేద్దామనుకున్నాం

తంబళ్లపల్లెలో అయితే బాబుపై బురదజల్లొచ్చని అన్నారు

ములకలచెరువులో ఓ గది తీసుకుని యంత్రాలన్నీ చేర్చా

ఎక్సైజ్‌కు లీకులిచ్చి ములకలచెరువులో దాడులు చేయించారు

జయచంద్రారెడ్డి సస్పెన్షన్‌తో ఇబ్రహీంపట్నానికి సరుకు

బెయిల్ ఇప్పిస్తానని హ్యాండిచ్చారు.. నా తమ్ముడిని ఇరికించారు

నమ్మించి మోసం చేసినందుకే నిజాలు చెబుతున్నా: జనార్దన్

అమరావతి/విజయవాడ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యం కేసులో ప్రధాన నిందితుడైన అద్దేపల్లి జనార్దనరావు అసలు గుట్టువిప్పారు. వైసీపీ నేత, మాజీ మంత్రి జోగి రమేశ్ ఆదేశాలతోనే నకిలీ మద్యం తయారు చేశామని వెల్లడించారు. కూటమి ప్రభుత్వం రాగానే ఆపేసి ఆఫ్రికా వెళ్లిపోయిన తనకు ఈ ఏడాది ఏప్రిల్లో ఆయన ఫోన్ చేసి రప్పించారని.. ఆయన ఇచ్చిన భరోసాతోనే మళ్లీ మొదలు పెట్టామని తెలిపారు. ఇబ్రహీంపట్నంలో కాకుండా తంబళ్లపల్లె అయితే ముఖ్యమంత్రి చంద్రబాబుకు చెడ్డపేరు తీసుకురావొచ్చని మాజీ మంత్రి చెప్పడంతో అక్కడ మొదలుపెట్టామని జనార్దన్ చెప్పారు. అజ్ఞాతంలో ఉన్న టీడీపీ తంబళ్లపల్లె ఇన్‌చార్జి జయచంద్రారెడ్డికి ఈ వ్యవహారంతో ఎలాంటి సంబంధం లేదన్నారు. అద్దేపల్లి జనార్దనరావును శుక్రవారం (10న) గన్నవరంలోని విమానాశ్రయంలో ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత చేసిన విచారణలో ఆయన పలు విషయాలను వెల్లడించారు. దీనికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో ప్రస్తుతం వైరల్ అవుతోంది. వీడియోలో

మిగతా 14వ పేజీలో...

వెంకటేష్ నాయుడి ఫోన్ తెరిచేందుకు అనుమతి

మద్యం స్కాంలో కసిరెడ్డి, చెవిరెడ్డి సహా ఏడుగురికి రిమాండ్ పొడిగింపు: ఏసీబీ కోర్టు

కేంద్ర మంత్రిగా దిగిపోతా!



ఆదాయం భారీగా తగ్గిపోయింది..

మళ్లీ వెళ్లి సినిమాలు చేసుకుంటా

నా పిల్లలు ఇంకా సెటిల్ కాలేదు..

సదానందన్‌ను మంత్రిని చేస్తే మంచిది

నటుడు సురేశ్ గోపి ఆసక్తికర వ్యాఖ్యలు 2

గాజాలో ఎట్టకేలకు శాంతి గీతం



ఇజ్రాయెల్ జైలు నుంచి విడుదలైన పాలస్తీనా వాసులు

పరస్పరం బందీలను విడుదల చేసిన హమాస్, ఇజ్రాయెల్

20మంది ఇజ్రాయెలీలను రెడ్‌క్రాస్‌కు అప్పగించిన హమాస్

1,900 మంది పాలస్తీనీయుల విడుదలకు ఇజ్రాయెల్ ఏర్పాట్లు

ఇజ్రాయెల్ పార్లమెంట్‌లో ట్రంప్‌కు అపూర్వ స్వాగతం

గాజాలో యుద్ధం ముగిసింది: అమెరికా అధ్యక్షుడు

శాంతికి కట్టుబడతా: నెతన్యాహు.. ట్రంప్‌కు హమాస్ కృతజ్ఞతలు

గాజా రెండోదశ శాంతి ఒప్పందంపై ఈజిప్టులో సంతకాలు

ట్రంప్‌కు ఇజ్రాయెల్, ఈజిప్ట్ అత్యున్నత పురస్కారాలు

200% టారిఫ్‌లు వేస్తానని బెదిరించి భారత్-పాక్ యుద్ధం ఆపా

పాక్-అఫ్ఘానిస్థాన్ యుద్ధాన్ని కూడా ఆపుతా: డొనాల్డ్

దేర్ అల్‌బలా(గాజా)/టెల్ అవీవ్/జెరుసలేం, అక్టోబరు 13: పశ్చిమాసియాలో శాంతి కపోతం ఎగిరింది. ఇజ్రాయెల్ దాడులతో రెండేళ్లుగా అతలాకుతలమైన గాజాలో ప్రశాంతత నెలకొనేందుకు మార్గం సుగమమైంది. ట్రంప్ శాంతి ప్రణాళిక అమల్లో భాగంగా తొలిదశ కింద సోమవారం ఇరుపక్షాలూ బందీలను విడుదల చేశాయి. హమాస్ తమ వద్ద బందీలుగా

మిగతా 2వ పేజీలో...

రష్యా యుద్ధం ముగించకుంటే ఉక్రెయిన్‌కు తొమాహక్ క్షిపణులిస్తాం: ట్రంప్

అణ్వాయుధాలు ఇస్తున్నట్లే భావిస్తాం: రష్యా

పీఎం కిసాన్ పక్కదారి!



లక్షలాది కుటుంబాలకు అనుచిత లబ్ధి

నిబంధనల ప్రకారం కుటుంబంలో ఒక్కరికే కానీ.. పలు రాష్ట్రాల్లో భార్యాభర్తలిద్దరికీ అందుతున్న పీఎం కిసాన్ నిధులు

31 లక్షల కేసులు గుర్తించిన కేంద్రం

తనిఖీలు చేయాలని రాష్ట్రాలకు సూచన

ఇప్పటికి 19.02 లక్షల కేసుల పరిశీలన

17.87 లక్షల మంది భార్యాభర్తలు ప్రయోజనం పొందుతున్నారని వెల్లడి

భూముల పూర్వపు యజమానులకూ లబ్ధి

న్యూఢిల్లీ, అక్టోబరు 13: మోదీ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం-కిసాన్) పథకం పక్కదారి పడుతోంది. ఈ స్కీంలో కొందరు అనుచిత లబ్ధి పొందుతున్నట్లు తేలింది. ఒకే ఇంట్లో భార్య, భర్త ఇద్దరికీ నిధులు జమవుతున్నాయని.. ఇలాంటి అనుమానాస్పద కేసులు 31.01 లక్షల వరకు ఉన్నాయని కేంద్రప్రభుత్వం గుర్తించింది. కేంద్ర వ్యవసాయ-రైతు సంక్షేమ శాఖ తనిఖీల్లో ఇది బయటపడింది. ఈ వివరాలను సంబంధిత రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాలకు పంపింది. క్షుణ్ణంగా సోదాలు చేసి తనకు నివేదించాలని కోరింది. ఈ 31.01 లక్షల మందిలో ఇప్పటివరకు 19.02 లక్షల మంది లబ్ధిదారులను తనిఖీచేయగా.. 93.98 శాతం.. అంటే 17.87 లక్షల

మిగతా 11వ పేజీలో...



స్ఫూర్తి కేంద్రంలో శివాజీ మహారాజ్ కాంస్య విగ్రహం

శ్రీశైలంలో వీర శివాజీ

మరాఠా చక్రవర్తిని ఆకర్షించిన ఆధ్యాత్మిక క్షేత్రం

జ్యోతిర్లింగం, శక్తిపీఠం కలిగి ఉన్న ఏకైక క్షేత్రం శ్రీశైలం. ఈ క్షేత్రానికి ఈ నెల 16న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రానున్నారు. స్వామి, అమ్మవార్లకు జరిగే ప్రత్యేక పూజల్లో ఆయన పాల్గొంటారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన శివాజీ మహారాజ్ స్ఫూర్తి కేంద్రాన్ని కూడా సందర్శిస్తారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో ఆ స్ఫూర్తి కేంద్రం గురించి సర్వత్రా చర్చ సాగుతోంది. ఆ కేంద్రం.. అందులోని విశేషాలు ఈ కథనంలో..



శ్రీశైలంలోని శివాజీ మహారాజ్ స్ఫూర్తి కేంద్రం

పదిరోజుల పాటు ఇక్కడ బస.. ధ్యానం

ఛత్రపతికి మల్లికార్జునుడి ఆశీస్సులు

ఖడ్గాన్ని ప్రసాదించిన భ్రమరాంబ అమ్మవారు

ఆయన ధ్యానం చేసిన చోటే స్ఫూర్తి కేంద్రం

16న శ్రీశైలంలో ప్రధాని మోదీ పర్యటన

శివాజీ నడయాడిన ప్రాంతాల సందర్శన

(నంద్యాల/శ్రీశైలం-ఆంధ్రజ్యోతి)

శ్రీశైలంలో అణువణువూ ఓ అద్భుతమే. ప్రతి అడుగూ ఆధ్యాత్మిక పరవశమే. నల్లమల అటవీ అందాల మధ్య, నిండుకుండలా ఆహ్లాదం పంచే జలాశయం చెంతన భ్రమరాంబ సమేతుడై మల్లికార్జునుడు ఇక్కడ కొలువై ఉన్నాడు. ఆధ్యాత్మిక,

మిగతా 12వ పేజీలో...

చురుగ్గా ప్రధాని పర్యటన ఏర్పాట్లు

పనులను పరిశీలించిన మంత్రులు, నేతలు 14

అధికారులతో సమీక్షలు

పలు జిల్లాల నుంచి భారీగా జన సమీకరణ

పోలీసు శాఖను మూసేయండి!

డీజీపీ సహా అధికారులు నిద్రపోతున్నారా?

రికార్డులు సీజ్ చేయమన్నా పట్టించుకోరా?

నిబద్ధత ఉంటే ఆదేశాలు అమలు చేయించేవారు

'పరకామణి' కేసులో నిందితులకు సహకరించారు

ఏ కేసులో వేగంగా స్పందించాలో తెలియట్లేదా?

తదుపరి విచారణకు రికార్డులు కోర్టుకు ఇవ్వండి

సీఐడీ డీజీకి హైకోర్టు ఆదేశం.. పోలీసులపై ఆగ్రహం



12

ఉల్లంఘనలు ఉపేక్షించం!

పోలీసులకు హైకోర్టు హెచ్చరిక

కోర్టులతో ఎలా మెలగాలో వారికి చెప్పండి

హోంశాఖ ప్రత్యేక కార్యదర్శికి నిర్దేశించిన ధర్మాసనం

27న హోం ముఖ్యకార్యదర్శి హాజరుకు ఆదేశం

సీఎం కావాలంటే హైకమాండ్ ఆశీర్వాదం, ఎమ్మెల్యేల మద్దతూ ఉండాలి



బెంగళూరు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి కావాలంటే పార్టీ హైకమాండ్ ఆశీర్వాదంతోపాటు ఎమ్మెల్యేల మద్దతు కూడా ఉండాలని కర్ణాటక సీఎం సిద్దరామయ్య అన్నారు. 'నవంబరులో నాయకత్వ మార్పు, మంత్రివర్గ ప్రక్షాళన' అంటూ వారం రోజులుగా చర్చలు సాగుతున్న నేపథ్యంలో ఆయన స్పందించారు. బాగల్కోటె జిల్లా బండిగణిలో సోమవారం మీడియాతో మాట్లాడుతూ...ఎమ్మెల్యేల మద్దతు లేకుండా సీఎం కావడం సులభం కాదని పేర్కొన్నారు. ఆర్ఎస్ఎస్ కార్యక్రమాలకు ప్రభుత్వ స్థలాలు కేటాయించరాదని మంత్రి ప్రియాంకఖర్గే తనకు లేఖ రాశారని, తమిళనాడులో ఎలా వ్యవహరించారో.. ఇక్కడా అలాగే వ్యవహరించాలని చీఫ్ సెక్రటరీకి సూచించానని తెలిపారు. బెంగళూరులో మంత్రులతో సోమవారం విందు ఏర్పాటు చేయడంపై...'మరోసారి విందు ప్రత్యేకత ఏమిటి?' అని ప్రశ్నించగా, కలిసి భోజనం చేయడం కూడా నేరమా అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

నేను సీఎం అయితే 'గ్యారెంటీ'లను ఇవ్వను

» కర్ణాటక కాంగ్రెస్ సీనియర్ నేత ఆర్‌వీ దేశ్‌పాండే

బెంగళూరు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): తాను ముఖ్యమంత్రిని అయ్యుంటే రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం అమలు చేస్తున్న ఐదు గ్యారెంటీలను అమలు చేసేవాడిని కాదని కాంగ్రెస్ సీనియర్ నేత, ఎమ్మెల్యే ఆర్‌వీ దేశ్‌పాండే అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఐదు గ్యారెంటీలపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆర్టీసీ బస్సులు మహిళలకు మాత్రమే అనేలా మారాయని, పురుషులకు సీట్లు దొరకడం లేదని పేర్కొన్నారు. 'ఓ దేవుడా.. ధారవాడ, బెళగావి, కలబురగితోపాటు రేణుకా యల్లమ్మ ఆలయాలకు మహిళలకు తరలిపోతున్నారు. ఆ ప్రాంతంలో బస్సుల్లో పురుషులు ప్రయాణించాలంటే తిప్పలు పడాల్సి వస్తోంది' అని వ్యాఖ్యానించారు. గృహలక్ష్మి ద్వారా నెలకు రూ.2వేలు ఇస్తున్నారని, ఇది మహిళలకు లాటరీ కొట్టినట్లుగా ఉందని, పురుషుల పరిస్థితి మరింత అధ్వానమైందని, ఇంకా ఎక్కువగా మాట్లాడాలంటే పురుషులను పరోక్షంగా శిక్షించినట్లు ఉందని పేర్కొన్నారు. కాగా, ఆర్‌వీ దేశ్‌పాండే చేసిన వ్యాఖ్యలపై సీఎం సిద్దరామయ్య వివరణ కోరారు.

కేంద్ర మంత్రిగా దిగిపోతా..సినిమాలు చేసుకుంటా



తిరువనంతపురం, అక్టోబరు 13: కేంద్ర మంత్రి, నటుడు సురేశ్ గోపి మరోసారి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మంత్రి అయినప్పటి నుంచి తన ఆదాయం గణనీయంగా తగ్గిందని, మళ్లీ సినిమాల్లో నటించాలని అనుకొంటున్నట్లు పేర్కొన్నారు. పార్టీ తనను తొలగించి.. బీజేపీ రాజ్యసభ ఎంపీ సదానందన్ మాస్టార్‌ను కేంద్ర మంత్రిగా చేస్తే, అది కేరళ రాజకీయాల్లో కొత్త చరిత్ర అవుతుందన్నారు. సురేశ్ గోపి కేరళలో బీజేపీ నుంచి గెలిచిన ఏకైక లోక్‌సభ ఎంపీగా ఉన్నారు. ఆయన కన్నూరులో ఆదివారం సదానందన్ మాస్టార్ ఎంపీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సురేశ్ గోపి మాట్లాడుతూ.. 'నేను డబ్బు సంపాదించాలని అనుకుంటున్నాను. నా పిల్లలు ఇంకా జీవితంలో సెటిల్ కాలేదు. నా ఆదాయంపై ఆధారపడ్డ వారు కొంత మంది ఉన్నారు' అని పేర్కొన్నారు.

ఓటర్ల జాబితాల తారుమారుపై సిట్‌కు సుప్రీం నో

న్యూఢిల్లీ, అక్టోబరు 13: గత ఎన్నికల్లో బెంగళూరు సెంట్రల్ సహా కర్ణాటకలోని లోక్‌సభ నియోజకవర్గాల్లో ఓటర్ల జాబితాలను తారుమారుచేశారని.. దీనిపై మాజీ న్యాయమూర్తి సారథ్యంలో సిట్ ఏర్పాటుచేయాలంటూ దాఖలైన పిటిషన్‌పై విచారణకు సుప్రీంకోర్టు నిరాకరించింది. దీనిపై కేంద్ర ఎన్నికల కమిషన్(ఈసీ)ని ఆశ్రయించాలని సూచించింది. ప్రజాప్రయోజనం పేరుతో పిటిషన్ వేశారని.. దీనిపై విచారణకు తాము సానుకూలంగా లేమని స్పష్టంచేసింది. ప్రత్యామ్నాయ చట్టబద్ధమైన మార్గాలను అన్వేషించాలని హితవు పలికింది. ఈసీ, బీజేపీ కుమ్మక్కయ్యాయని.. బెంగళూరు సెంట్రల్ నియోజకవర్గంలో భారీగా దొంగ ఓట్లను చేర్చారని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ చేసిన ఆరోపణలను పిటిషనర్ తన వ్యాజ్యంలో ప్రస్తావించారు.

బంగారు పలకలకు మాదే బాధ్యత: టీడీబీ చైర్మన్

తిరువనంతపురం, అక్టోబరు 13: కేరళలోని శబరిమల అయ్యప్ప స్వామి ఆలయంలో బంగారం అవకతవకల కేసు విచారణలో పూర్తి సహకారం అందిస్తామని ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు(టీడీబీ) చైర్మన్ పీఎస్ ప్రశాంత్ అన్నారు. బోర్డు పూర్తి నిజాయితీ, పారదర్శకతతో వ్యవహరించిందని చెప్పారు. ప్రస్తుతం విగ్రహాల బంగారు పూత కోసం తీసుకున్న బంగారు పలకలకు బోర్డు పూర్తి బాధ్యత తీసుకుంటుందని చెప్పారు. బంగారు పలకలను తీసుకునేముందు అవసరమైన అన్ని ప్రమాణాలు పాటించినట్టు వెల్లడించారు. 1998 నుంచి ఏం జరిగిందనే దానిపై విచారణ చేయాలన్నారు. తప్పు చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని, రిటైర్డ్ అయినా వదిలిపెట్టరాదని కోరారు. ప్రస్తుత బోర్డును అనుమానించడానికి ఎలాంటి కారణం లేదని, తగ్గిన బంగారాన్ని రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. శబరిమల ఆలయంలో బంగారు తొడుగుల బరువులో 4.5 కిలోలు తగ్గడాన్ని తీవ్రంగా పరిగణించిన కేరళ హైకోర్టు సిట్‌తో విచారణ చేయించాలని ఆదేశించిన సంగతి తెలిసిందే.

పశ్చిమబెంగాల్ గ్యాంగ్‌రేప్ కేసులో మరో ఇద్దరు అదుపులోకి

కోల్‌కతా, అక్టోబరు 13: పశ్చిమబెంగాల్‌లో వైద్య విద్యార్థిని గ్యాంగ్‌రేప్ కేసులో సోమవారం మరో ఇద్దరిని ఆ రాష్ట్ర పోలీసులు అరెస్టు చేశారు. దీంతో ఈ కేసులో మొత్తం అరెస్టయిన వారి సంఖ్య ఐదుకు చేరింది. పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ వైద్య విద్యార్థిని అర్ధరాత్రి 12.30 గంటలకు బయటకు ఎందుకు వెళ్లిందని ప్రశ్నించారు. అయితే ఆ వ్యాఖ్యలకు భిన్నంగా ఆ రాష్ట్ర పోలీసులు ఈ ఘటన శుక్రవారం రాత్రి 8-8.45 గంటల మధ్యే జరిగిందని నిర్ధారించారు. కాగా బాధితురాలి వెంట బయటకు వెళ్లిన ఆమె స్నేహితుణ్ని కూడా పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. మరోవైపు ఈ ఘటన పశ్చిమబెంగాల్‌లో రాజకీయ వాతావరణాన్ని వేడెక్కించింది. ప్రతిపక్ష బీజేపీ నేత సువేందు అధికారి ఈ కేసులో సాక్ష్యాధారాలను నాశనం చేసే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు.

బీజేపీ బలమైన రాజకీయ ప్రత్యర్థి: ఒవైసీ

న్యూఢిల్లీ, అక్టోబర్ 13: బీజేపీని 'బలమైన రాజకీయ ప్రత్యర్థి' అని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఆ పార్టీ, నేతలు కార్యకర్తలు రాత్రింబవళ్లు పని చేస్తారని ప్రశంసించారు. "బీజేపీని ఓడించడం అంత సులువు కాదు. తాను అనుకున్న పనిని రెప్పపాటు కాలంలో చేయగలదు. ప్రతిపక్షాలు బీజేపీని ఎదుర్కోవాలంటే దాని ప్రతి కదలికపై అప్రమత్తంగా ఉండాలి" అని ఏఎన్ఐ వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో అన్నారు. అలాగే, బిహార్‌లో ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై అసహనం వ్యక్తం చేశారు. ఈ అంశంపై తమ పార్టీ సుప్రీం కోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు. రాహుల్ గాంధీ 'ఓట్ చోరీ' ఆరోపణలపై.. ఆయన తరఫున మాట్లాడలేనని, కానీ బీజేపీలా పోరాట పటిమను చూపకపోతే ఆ పార్టీని ఓడించలేమని ఓవైసీ అన్నారు.

ఈ వారం అమెరికాకు భారత వాణిజ్య బృందం

న్యూఢిల్లీ, అక్టోబరు 13: అమెరికాతో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకునే దిశగా తదుపరి దశ చర్చల నిమిత్తం భారతదేశ ఉన్నతస్థాయి వాణిజ్య ప్రతినిధి బృందం ఈ వారం అమెరికాకు వెళ్లనుంది. ఢిల్లీలోని ప్రభుత్వ వర్గాలు సోమవారం ఈ విషయాన్ని వెల్లడించాయి. వాణిజ్య ఒప్పందం దిశగా పెండింగ్‌లో ఉన్న అంశాలను పరిష్కరించుకునేందుకు తదుపరి దశ చర్చలు జరపనున్నట్టు ఆ వర్గాలు పేర్కొన్నాయి. ఇంధన, సాంకేతిక రంగాల్లో వాణిజ్యాన్ని విస్తరించడం తదితర అంశాలపై చర్చలు జరపనున్నట్టు తెలిపాయి. అమెరికా నుంచి మరింత సహజ వాయువును కొనుగోలు చేయాలని, పునరుత్పాదక ఇంధన సాంకేతికతలను దిగుమతి చేసుకోవాలని భారత్ భావిస్తోందని ఒక అధికారి చెప్పారు. ఇరుదేశాల మధ్య చర్చలు మంచి పురోగతి సాధించాయన్నారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న కారణంతో భారత్‌పై ట్రంప్ భారీ సుంకాలను విధించిన సంగతి తెలిసిందే.

గాజాలో ఎట్టకేలకు శాంతి గీతం

(మొదటి పేజీ తరువాయి)

ఉన్న 20 మందిని గాజాలోని మూడు ప్రాంతాల్లో రెడ్‌క్రాస్ సంస్థకు అప్పగించగా.. ఆ సంస్థ వారిని ఇజ్రాయెల్‌కు తరలించింది. మరో 28 మంది బందీలు చనిపోవడంతో వారి మృతదేహాలను అప్పగించేందుకు హమాస్ ఏర్పాట్లు చేస్తోంది. మరోవైపు ఇజ్రాయెల్ తమ వద్ద బందీలుగా ఉన్న 19 వందల కుపైగా పాలస్తీనా ఖైదీల విడుదల ప్రక్రియ ప్రారంభించింది. ఇజ్రాయెల్ ఆక్రమణలో ఉన్న వెస్ట్‌బ్యాంక్‌లోని పలు జైళ్ల నుంచి సోమవారం రాత్రివరకు 1968 మందిని విడుదల చేసింది. గాజా ప్రాంతంలో ఆకలితో అల్లాడుతున్న ప్రజలకు సోమవారం నుంచే పూర్తిస్థాయిలో మానవతాసాయం అందించేందుకు అనుమతించింది. ఒప్పందం మేరకు గాజాలోని పలు ప్రాంతాల నుంచి సైన్యాన్ని ఉపసంహరించుకునే ప్రక్రియను ప్రారంభించింది. తమవారు విడుదలవుతుండటంతో ఇజ్రాయెల్‌లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.పాలస్తీనీయులు మానవతాసాయం కింద ఆహారం, మందులు అందబోతున్నాయని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఎక్కడ చూసినా మృతదేహాలే..

ఇజ్రాయెల్ సైన్యం వైదొలుగుతున్న కొద్దీ ఆయా ప్రాంతాల్లోకి పాలస్తీనీయులు తిరిగి ప్రవేశిస్తున్నారు. ఎక్కడ చూసినా కూలిపోయిన భవనాలు, శిథిలాలతో ఆ ప్రాంతాలు దారుణంగా కనిపిస్తున్నాయి. కాల్పుల విరమణ మొదలైన నాలుగు రోజుల్లోనే గాజాలోని సంక్షుభిత ప్రాంతాల్లో 200 మృతదేహాలను వెలికితీశామని.. ఇంకా పెద్ద సంఖ్యలో మృతదేహాలు శిథిలాల కిందే ఉన్నాయని గాజా ఆరోగ్య విభాగం ప్రకటించింది. ఇజ్రాయెల్ దాడుల్లో మృతుల సంఖ్య 67,800కు చేరిందని, అందులో సగం మందికిపైగా మహిళలు, చిన్నారులేనని పేర్కొంది. కాగా, శాంతి ఒప్పందంతో గాజాలోని పాలస్తీనియులకు తిరిగి స్వేచ్ఛ వచ్చిందని, చెల్లాచెదురైన వారంతా తమ కుటుంబాలను కలుసుకుంటారని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ పేర్కొన్నారు. ఇక గాజాలో శాంతి నెలకొల్పేందుకు ట్రంప్ చేసిన కృషి అమోఘమని ప్రధాని మోదీ కితాబిచ్చారు. ఇజ్రాయెల్, హమాస్‌ల నుంచి బందీల విడుదలపై హర్షం వ్యక్తం చేశారు.



ఈజిప్టులోని షర్మ్ ఎల్ షేక్ నగరంలో సోమవారం జరిగిన శాంతి సదస్సులో ట్రంప్, పలు దేశాల అధినేతలు

గాజాలో యుద్ధం ముగిసింది: ట్రంప్

శాంతి ఒప్పందం, ఇతర అంశాలపై ఇజ్రాయెల్ పర్యటనకు వచ్చిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. ఆ దేశ చట్టసభ కెనెసెట్‌లో ప్రసంగించారు. ఆయన సభలోకి రాగానే ఇజ్రాయెల్ ఎంపీలంతా లేచి నిలబడి రెండున్నర నిమిషాల పాటు కరతాళధ్వనులు చేశారు. ఈ సందర్భంగా ట్రంప్ మాట్లాడుతూ.. "యుద్ధాలతో ప్రజలు విసిగిపోయి ఉన్నారు. ఇప్పుడు శాంతి నెలకొల్పే సమయం. గాజాలో యుద్ధం ముగిసింది. ఉగ్రవాదంపై మీరు (ఇజ్రాయెల్) విజయం సాధించారు. ఆ విజయాన్ని శాంతిగా మలుచుకునే సమయం ఇది. భవిష్యత్తు తరాలు ఈ రోజును గుర్తు చేసుకుంటాయి.." అని పేర్కొన్నారు. గాజా పునర్నిర్మాణానికి సాయం చేస్తామని.. పాలస్తీనీయులు ఉగ్రవాదం, హింసను వీడాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు మాట్లాడుతూ.. శాంతిని నెలకొల్పడానికి తాను కట్టుబడి ఉంటానని, రెండేళ్ల యుద్ధం ముగిసిందని చెప్పారు. అమెరికా అధ్యక్షుల్లో అందరికన్నా ట్రంప్ ఇజ్రాయెల్‌కు గొప్ప స్నేహితుడని అభివర్ణించారు. గాజాలో యుద్ధం ముగిసిపోయిందన్న ట్రంప్ వ్యాఖ్యలపై హమాస్ హర్షం వ్యక్తం చేసింది.



ట్రంప్‌కు బంగారు పావురాన్ని బహూకరిస్తున్న నెతన్యాహు

ట్రంప్‌కు ఇజ్రాయెల్, ఈజిప్ట్ అత్యున్నత పురస్కారాలు

పశ్చిమాసియాలో శాంతి నెలకొల్పేందుకు ట్రంప్ చేసిన కృషికి గుర్తింపుగా ట్రంప్‌కు 'ప్రెసిడెన్షియల్ మెడల్ ఆఫ్ హానర్' పురస్కారం అందజేయనున్నట్టు ఇజ్రాయెల్.. 'ది ఆర్డర్ ఆఫ్ ది నైల్' పురస్కారాన్ని అందజేయనున్నట్టు ఈజిప్ట్ ప్రకటించాయి.

200% టారిఫ్‌లు వేస్తానని బెదిరించి భారత్-పాక్ యుద్ధం ఆపా: ట్రంప్

గాజా శాంతి ఒప్పందంతో కలిపి ఇప్పటివరకు 8 యుద్ధాలను ఆపానని ట్రంప్ చెప్పారు. వాటిలో చాలా వరకు తాను కల్పించుకున్న ఒక్కరోజులోనే నిలిపివేశానన్నారు. ఇజ్రాయెల్ నుంచి ఈజిప్టుకు వెళ్తుండగా ఎయిర్‌ఫోర్స్ వన్ విమానంలో ఆయన మీడియాతో మాట్లాడారు. భారత్-పాక్ యుద్ధాన్ని తానే ఆపానని చెప్పారు. "మీవద్ద అణ్వాయుధాలు ఉన్నాయి. మీరు యుద్ధం కొనసాగించాలనుకుంటున్నారా? అని అడిగా.. అలా అయితే మీపై వంద శాతం, 150 శాతం, 200శాతం టారిఫ్‌లు విధిస్తానని హెచ్చరించా. 24 గంటల్లో సమస్యను పరిష్కరించా" అని పేర్కొన్నారు. ప్రస్తుతం పాక్-అఫ్గానిస్థాన్ మధ్య యుద్ధం జరుగుతోందని తన దృష్టికి వచ్చిందని, దాన్ని కూడా తాను ఆపేయిస్తానని ట్రంప్ చెప్పారు. తాను నోబెల్ శాంతి బహుమతి కోసం ఇదంతా చేయడం లేదని, ప్రజల ప్రాణాలు కాపాడేందుకే చేస్తున్నానని చెప్పారు. అయినా ఇటీవల ఇచ్చిన నోబెల్ 2024 ఏడాదికి సంబంధించి చేసిన ఎంపిక అని, తాను యుద్ధాలను ఆపినది 2025లోనని పేర్కొన్నారు.

యుద్ధాన్ని త్వరగా ముగించకుంటే ఉక్రెయిన్‌కు తొమాహక్ క్షిపణులు!

» రష్యాకు ట్రంప్ గట్టి హెచ్చరిక

వాషింగ్టన్, అక్టోబరు 13: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రష్యాకు గట్టి హెచ్చరిక జారీ చేశారు. ఉక్రెయిన్‌తో యుద్ధాన్ని వీలైనంత పరిష్కరించుకోకుంటే కీవ్‌కు దీర్ఘశ్రేణి తొమాహక్ క్షిపణులను అందజేస్తామన్నారు. ఈ క్షిపణులు యుద్ధంలో దూకుడుకు మారు పేరని అభివర్ణించారు. తమ కీలక ఆయుధ వ్యవస్థ ద్వారా పుతిన్ సర్కారుపై ఒత్తిడి తెచ్చేందుకు ఏ మాత్రం వెనకాబోమని ట్రంప్ సూచనప్రాయంగా తెలిపారు. 'ఇప్పటికైనా ఈ యుద్ధం పరిష్కారం కాకపోతే నేను వారికి తొమాహక్‌లను పంపిస్తాను. తొమాహక్ ఒక అద్భుత ఆయుధం. చాలా ప్రమాదకరమైంది కూడా.. కానీ రష్యా అంతదూరం తెచ్చుకోదని భావిస్తున్నాను. మిస్టర్ పుతిన్ ఇప్పటికైనా దీన్ని పరిష్కరించుకుంటే ఆయనకే మంచిది' అని అన్నారు. ఆదివారం ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో ఫోన్‌లో మాట్లాడిన తర్వాత ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. దీనిపై రష్యా తీవ్రంగా స్పందించింది. ఉక్రెయిన్‌కు తొమాహక్‌లను ఇస్తే.. అణ్వాయుధాలను ఇచ్చినట్లే భావిస్తామని తెలిపింది. ఆ దేశ మాజీ అధ్యక్షుడు డిమిత్రి మెద్వెదేవ్ మాట్లాడుతూ.. 'ఈ క్షిపణుల సరఫరా అనేది ట్రంప్‌తో సహా అందరికీ పీడకలలా మారవచ్చు. అణ్వాయుధాలను మోసుకెళ్లే తొమాహక్ క్షిపణులను ప్రయోగించిన తర్వాత.. వాటికీ సంప్రదాయ క్షిపణులకు తేడా గుర్తించడం అసాధ్యం. సూటిగా చెప్పాలంటే తొమాహక్‌లను మాస్కో అణ్వాయుధాలుగానే భావిస్తోంది. అందుకు తగినట్లుగానే ప్రతిస్పందిస్తుంది' అని వ్యాఖ్యానించారు. అంతకుముందు క్రెమ్లిన్ ప్రతినిధి డిమిత్రి పెస్కోవ్ కూడా ఇదే తరహా వ్యాఖ్యలు చేశారు.

లోకం తీరు



రెండో దశ శాంతి ఒప్పందంపై సంతకాలు

గాజాలో శాంతి నెలకొల్పేందుకు ఉద్దేశించిన ట్రంప్ శాంతి ప్రణాళిక రెండో దశ అమలుపై చర్చించి, ఒప్పందం చేసుకునేందుకు ఈజిప్ట్‌లోని షర్మ్ ఎల్ షేక్ నగరంలో సోమవారం సాయంత్రం శాంతి సదస్సు నిర్వహించారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తోపాటు ఫ్రాన్స్, ఈజిప్ట్, ఖతార్, టర్కీ, అజర్‌బైజాన్ అధ్యక్షులు, జర్మనీ చాన్సలర్, స్పెయిన్, నార్వే, గ్రీస్, ఇరాక్, కెనడా, పాకిస్థాన్, బ్రిటన్ ప్రధాన మంత్రులు, బహ్రెయిన్ రాజు హమద్ బిన్ అల్ ఖలీఫా, జోర్డాన్ రాజు అబ్దుల్లా, పాలస్తీనా అథారిటీ అధ్యక్షుడు మహమూద్ అబ్బాస్, పలు అరబ్, ముస్లిం దేశాల ప్రతినిధులు ఇందులో పాల్గొని చర్చించారు. ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు, హమాస్ ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొనలేదు. సదస్సులో మొదట ట్రంప్ మాట్లాడారు. శాంతి ఒప్పందంలో మధ్యవర్తులుగా వ్యవహరించిన ఈజిప్ట్, టర్కీ అధ్యక్షులు అల్ సిస్సీ, ఎర్డోగాన్, ఖతార్ ఎమీర్ షేక్ తమీమ్‌లను అభినందించారు. రెండో దశ ఒప్పందంపై తొలుత ట్రంప్ సంతకం చేయగా, తర్వాత మిగతా దేశాల ప్రతినిధులు సంతకాలు చేశారు. గాజా ప్రజలకు మంచి జీవితాన్ని తిరిగి అందించేందుకు భారీ స్థాయిలో పునర్నిర్మాణం చేపడతామని.. ఇందుకోసం భారీగా వ్యయం చేయనున్నామని ట్రంప్ ఈ సందర్భంగా తెలిపారు. అయితే గాజాను నిస్సైనికీకరణ చేయడం తప్పనిసరని స్పష్టం చేశారు. గాజాలో కొత్తగా పాలస్తీనా భద్రతా దళాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. కాగా, గాజా పునర్నిర్మాణం కోసం సుమారు రూ.4.7 లక్షల కోట్లు (53 బిలియన్ డాలర్లు) అవసరమని అంచనా వేశారు. ఈ మేరకు నిధుల సమీకరణ, పునర్నిర్మాణంపై నవంబర్‌లో గాజాలో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేస్తామని ఈజిప్ట్ తెలిపింది. ఇక కొత్తగా ఏర్పాటు చేసే పాలస్తీనా భద్రతా దళానికి ఈజిప్ట్, జోర్డాన్ శిక్షణ ఇవ్వనున్నాయి.

లాలూ కుటుంబానికి షాక్

ఐఆర్‌సీటీసీ అవినీతి కేసులో ఢిల్లీ కోర్టు అభియోగాలు

» లాలూ, రబ్రీ, తేజస్విపై మోసం, కుట్ర ఆరోపణలు.. బిహార్ ఎన్నికల వేళ ఆర్జేడీకి ఇబ్బందికర పరిస్థితులు



సోమవారం రౌజ్ అవెన్యూ కోర్టులో లాలూ, రబ్రీ దేవి, తేజస్వి యాదవ్

న్యూఢిల్లీ, అక్టోబరు 13: బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆ రాష్ట్ర మాజీ సీఎం, ఆర్జేడీ అధినేత లాలూప్రసాద్ కుటుంబానికి షాక్ తగిలింది. ఐఆర్‌సీటీసీ అవినీతి కేసులో లాలూతో పాటు ఆయన భార్య రబ్రీదేవీ, కుమారుడు తేజస్వీ యాదవ్‌పై సోమవారం ఢిల్లీ కోర్టు అభియోగాలు మోపింది. బిహార్ అసెంబ్లీకి వచ్చే నెల 6, 11 తేదీల్లో ఎన్నికలు జరగనున్న తరుణంలో రాష్ట్రంలో ప్రధాన పార్టీ అయిన ఆర్జేడీకి ఇది ఇబ్బందికర పరిస్థితే. రబ్రీదేవి, తేజస్విపై మోసం, కుట్ర అభియోగాలు; లాలూపై అవినీతి నిరోధక చట్టం కింద అభియోగాలు మోపినట్లు రౌజ్ అవెన్యూ కోర్టు ప్రత్యేక జడ్జి విశాల్ గాగ్నే ప్రకటించారు. రైల్వే మంత్రిగా లాలూ తన పదవిని దుర్వినియోగం చేశారని పేర్కొన్నారు. భూముల బదిలీ విషయంలో నిందితులపై తీవ్ర అనుమానాలు ఉన్నాయని తెలిపారు. అతి తక్కువ ధరకు కేటాయించడంతో ఖజానాకు భారీ నష్టం వాటిల్లిందన్నారు. కాగా, తాము ఏ తప్పూ చేయలేదని బిహార్ మాజీ సీఎంలు లాలూ, రబ్రీ, మాజీ డిప్యూటీ సీఎం, బిహార్ అసెంబ్లీలో ప్రతిపక్ష నేత తేజస్వి కోర్టుకు వెల్లడించారు. ఈ కేసులో ఈ నెల చివరి వారంలో వీరిపై విచారణ ప్రారంభం కానుంది. కోర్టు ఆదేశాలను హైకోర్టులో సవాలు చేస్తామని పిటిషనర్ల తరఫు న్యాయవాది తెలిపారు.

లాలూ రైల్వే మంత్రిగా ఉన్న సమయంలో(2004-09) ఐఆర్‌సీటీసీ హోటళ్ల నిర్వహణ కాంట్రాక్టుల కేటాయింపులో అవినీతి జరిగిందంటూ సీబీఐ 2017లో ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. కాంట్రాక్టులను పట్నాకు చెందిన సుజాత హోటల్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు అప్పగించారు. దానికి బదులుగా లాలూ ఓ బినామీ కంపెనీ ద్వారా ఖరీదైన ప్రాంతంలో 3 ఎకరాల భూమిని పొందారని సీబీఐ ఆరోపించింది. ఢిల్లీ కోర్టు అభియోగాలు మోపడంపై తేజస్వీ యాదవ్ స్పందిస్తూ.. ఇదంతా రాజకీయ కక్షతోనే చేశారన్నారు. బిహార్‌లో ఎన్నికలు ఉన్నందునే ఇలా చేశారని ఆరోపించారు. కోర్టు ఆదేశాలను తాము గౌరవిస్తామని, ఈ కేసును ఎదుర్కొంటామని చెప్పారు.

ఆర్జేడీ పాలన అంటేనే కుంభకోణాలు: బీజేపీ

ఆర్జేడీ పాలన అంటేనే కుంభకోణాలని బీజేపీ ఆరోపించింది. ఐఆర్‌సీటీసీ అవినీతి కేసులో ఢిల్లీ కోర్టు లాలూ కుటుంబంపై అభియోగాలు మోపిన నేపథ్యంలో బీజేపీ సీనియర్ నేత రవిశంకర్ ప్రసాద్ స్పందించారు. కుంభకోణాలు, ప్రభుత్వ కాంట్రాక్టుల కేటాయింపులో అవకతవకలు, ఉద్యోగాలు కల్పిస్తామంటూ ప్రజల భూములు లాక్కోవడం.. లాలూ ప్రసాద్ మోడల్ పరిపాలన అంటే ఇదేనని విమర్శించారు.

'సృజనాత్మక విధ్వంసానికి' సైద్ధాంతిక పునాది

» జోయల్ మోకిర్, ఫిలిప్ అఘియోన్, పీటర్ హోవిట్‌లకు ఆర్థికశాస్త్రం నోబెల్



జోయల్ మోకిర్, ఫిలిప్ అఘియోన్,పీటర్ హోవిట్

స్టాక్‌హోం, అక్టోబరు 13: ఆర్థికశాస్త్రంలో కీలక అంశమైన 'సృజనాత్మక విధ్వంసం' ను వివరించి, తాజా పరిస్థితులకు అనుగుణంగా అన్వయించినందుకుగాను అమెరికాకు చెందిన జోయల్ మోకిర్, పీటర్ హోవిట్, బ్రిటన్‌కు చెందిన ఫిలిప్ అఘియోన్ ఈ ఏడాది ఆర్థికశాస్త్రం నోబెల్ బహుమతికి సంయుక్తంగా ఎంపికయ్యారు. ఈ మేరకు నోబెల్ కమిటీ సోమవారం ఒక ప్రకటన చేసింది. ప్రయోజనకరమైన వినూత్న టెక్నాలజీలు పాత టెక్నాలజీలను, వ్యాపార నమూనాలను ధ్వంసం చేసి కొత్త వాటికి దారి వేస్తాయి అని చెప్పేదే సృజనాత్మక విధ్వంసం సిద్ధాంతం. 1942లో జోసెఫ్ షుంపీటర్ అనే ఆర్థికవేత్త 'పెట్టుబడిదారీ విధానం, సమసమాజం, ప్రజాస్వామ్యం' అనే పుస్తకం ద్వారా ఈ సిద్ధాంతాన్ని తొలిసారిగా ప్రతిపాదించారు. తర్వాత కాలంలో దీనిని అభివృద్ధిపరిచిన ఘనత జోయల్ మోకిర్, ఫిలిప్ అఘియోన్, పీటర్ హోవిట్‌లదేనని ఆర్థికశాస్త్ర నోబెల్ కమిటీ పేర్కొంది. 'ఆర్థికాభివృద్ధి దానంతటదే కొనసాగదు. సృజనాత్మక విధ్వంసానికి అనుకూలమైన విధానాలను, పద్ధతులను మనం ఎప్పటికప్పుడు తీసుకొస్తూ ఉంటేనే స్తబ్ధత బారిన పడకుండా ఆర్థికరంగాన్ని కాపాడగలుగుతాం' అని ఒక ప్రకటనలో తెలిపింది. సృజనాత్మక విధ్వంసం ద్వారా పాత టెక్నాలజీలు, వ్యాపార నమూనాలు కనుమరుగై కొత్తవి ముందుకు రావటం వెనుక ఉన్న కారణాల్ని శాస్త్రీయంగా జోయల్ మోకిర్ వివరించారని, ఫిలిప్ అఘియోన్, పీటర్ హోవిట్‌లు ఈ సిద్ధాంతానికి గణితపరమైన మోడల్‌ను తయారుచేశారని వెల్లడించింది. కాగా నోబెల్ బహుమతి కింద ఇచ్చే 12 లక్షల డాలర్ల నగదు మొత్తంలో సగాన్ని మోకిర్ తీసుకోనున్నారు. మిగిలిన సగాన్ని ఫిలిప్ అఘియోన్, పీటర్ హోవిట్ పంచుకుంటారు. ఆర్థికశాస్త్రం నోబెల్‌తో ఈ ఏడాది నోబెల్ పురస్కారాల ప్రకటన ముగిసింది.

పోప్ అవుతానేమోగానీ నోబెల్ రాదనుకున్నా!

79 ఏళ్ల వయసున్న మోకిర్‌కు.. నోబెల్ బహుమతికి ఎంపికైన విషయాన్ని ఒక విలేకరి తెలియజేశారు. ఆయన ఆశ్చర్యపోయారు. తనకు నోబెల్ వచ్చే అవకాశం ఉందని తన సహచరులు, విద్యార్థులు పలుమార్లు చెప్పినా తాను నమ్మలేదన్నారు. 'పోప్ పదవికి ఎంపిక అవుతానేమోగానీ ఆర్థికశాస్త్రంలో నోబెల్‌కు మాత్రం ఎంపిక కాను' అని సరదాగా జోక్ చేసేవాడినని చెప్పారు. ఫిలిప్ అఘియోన్ (69) స్పందిస్తూ.. తనకు లభించే బహుమతి మొత్తాన్ని తన రీసెర్చ్ ల్యాబొరేటరీకి ఖర్చు చేస్తానని వెల్లడించారు. కాగా, 2017లో ఫ్రాన్స్ అధ్యక్ష ఎన్నికల్లో మక్రాన్‌కు ఆర్థిక రంగంలో అఘియోన్ కీలక సహకారం అందించారు. ఏఐ రంగంలో ఫ్రాన్స్‌ను అగ్రగామిగా నిలబెట్టటానికి తీసుకోవాల్సిన చర్యలను సూచిస్తూ.. గత ఏడాది మక్రాన్‌కు అఘియోన్ సహా సారథ్యం వహించిన ఓ కమిటీ నివేదిక సమర్పించింది.

100% వరకు విత్‌డ్రా చేసుకోవచ్చు

పీఎఫ్ పాక్షిక ఉపసంహరణ నిబంధనలు సరళీకరించిన ఈపీఎఫ్‌వో



న్యూఢిల్లీ, అక్టోబరు 13: ఈపీఎఫ్‌వో చందాదారులకు శుభవార్త. 7కోట్లకు పైగా పీఎఫ్ చందాదారుల ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకుని పాక్షిక ఉపసంహరణలకు సంబంధించిన నిబంధనలు సరళీకరిస్తూ సోమవారం ఈపీఎఫ్‌వో బోర్డు నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు చందాదారులు తమ ఈపీఎఫ్ ఖాతా నిల్వలో వంద శాతం వరకు విత్‌డ్రా చేసుకునే అవకాశం ఉంటుంది. కేంద్ర కార్మిక శాఖ మంత్రి మాండవీయ నేతృత్వంలో జరిగిన ఈపీఎఫ్ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ (సీబీటీ) సమావేశంలో పలు విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నట్టు కార్మిక మంత్రిత్వ శాఖ సోమవారం వెల్లడించింది. ఈపీఎఫ్ సభ్యుల సౌకర్యార్థం ఈపీఎఫ్ స్కీమ్‌లోని పాక్షిక ఉపసంహరణ నిబంధనలను సులభతరం చేయాలని సీబీటీ నిర్ణయించింది. తాజా నిర్ణయంమేరకు చందాదారులు ఉద్యోగి, యజమాని వాటాతో సహా ప్రావిడెంట్ ఫండ్‌లోని అర్హమైన బ్యాలెన్స్‌లో వంద శాతం వరకు ఉపసంహరించుకునే అవకాశం ఉంటుంది. ఈమేరకు 13 క్లిష్టమైన నిబంధనలను ఒక నిబంధనగా క్రమబద్ధీకరించింది. దీనిని మూడు రకాలుగా వర్గీకరించింది. అవి.. ముఖ్యమైన అవసరాలు (అనారోగ్యం, విద్య, వివాహం), గృహ అవసరాలు, ప్రత్యేక పరిస్థితులు. మరోవైపు ఉపసంహరణ పరిమితులను కూడా సరళీకరించారు. విద్య కోసం ఉపసంహరణలను పదిసార్ల వరకు, వివాహం కోసం ఐదుసార్ల వరకు (ప్రస్తుతం వివాహం, విద్య కోసం ఉన్న మొత్తం మూడు పాక్షిక ఉపసంహరణలకే అనుమతి ఉంది) అనుమతించారు. ఇక అన్ని పాక్షిక ఉపసంహరణలకు సంబంధించిన కనీస సర్వీసును 12 నెలలకు తగ్గించారు. ఇంతకు ముందు ప్రత్యేక పరిస్థితుల కింద చందాదారు పాక్షిక ఉపసంహరణకు సంబంధించి ప్రకృతి విపత్తు, సంస్థల లాకౌట్లు/మూసివేతలు, నిరుద్యోగం, మహమ్మారుల విజృంభణ వంటి కారణాలను స్పష్టం చేయాల్సిన అవసరం ఉండేది. ఇప్పుడు చందాదారు ఏ కారణాన్ని పేర్కొనకుండానే దరఖాస్తు చేసుకోవచ్చు. పీఎఫ్ ఖాతాలో జమ చేసే మొత్తంలో 25 శాతాన్ని కనీస నిల్వగా ఉంచాలన్న నిబంధన తీసుకువచ్చారు. దీంతో ఈపీఎఫ్‌వో అందించే అధిక వడ్డీ రేటు (ప్రస్తుతం 8.25 శాతం వడ్డీ) ప్రయోజనాన్ని సభ్యులు పొందడానికి అవకాశం ఏర్పడుతుంది. ఇది పదవీ విరమణ సమయానికి నిధిని కూడబెట్టుకోవడానికి దోహదపడనుంది. ఈపీఎఫ్ ముందస్తు ఫైనల్ సెటిల్‌మెంట్‌ను పొందే వ్యవధిని ప్రస్తుత 2 నెలల నుంచి 12 నెలలకు మార్చారు. అలాగే తుది పెన్షన్ ఉపసంహరణ వ్యవధిని 2 నెలల నుంచి 36 నెలలకు మార్చారు. కాగా ఈపీఎఫ్ 95 పెన్షనర్ల ఇంటి వద్దనే డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ (డీఎల్‌సీ) సర్వీసులు అందించడానికి గాను ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంకు (ఐపీపీబీ)తో అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకోవడానికి బోర్డు ఆమోదం తెలిపింది. కాగా. వచ్చే నెల 1నుంచి పెన్షనర్లకు డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లు (డీఎల్‌సీ) ఇవ్వాలని కేంద్రం నిర్ణయించింది. ఈ కార్యక్రమం 30 వరకు అమలు కానుంది.

కనీస పెన్షన్ 7,500కు పెంచండి

తన సభ్యులకు నెలవారీ రూ.7,500 కనీస పెన్షన్ ఇవ్వాలన్న డిమాండ్‌తో పెన్షనర్ల సంఘం ఈపీఎస్-95 జాతీయ ఆందోళన కమిటీ సోమవారం ఢిల్లీలో నిరసన చేపట్టింది. తూర్పు కిద్వాయ్ నగర్‌లోని ఈపీఎఫ్‌వో కేంద్ర కార్యాలయం వెలుపల వేలాది మంది పెన్షనర్లు నిరసన ప్రదర్శనలో పాల్గొన్నట్టు కమిటీ పేర్కొంది. రూ.7,500 కనీస పెన్షన్, పూర్తి డీఏ పునరుద్ధరణ, వైద్య ప్రయోజనాలు కల్పించాలని కోరారు.



గుంటూరు కలెక్టర్ తమీమ్ అన్సారియాకు వినతి పత్రం అందజేస్తున్న మంద కృష్ణ మాదిగ

చీఫ్ జస్టిస్ గవాయిపై దాడి అనాగరికం

- మందకృష్ణ మాదిగ
- గుంటూరులో ఎమ్మార్పీఎస్ నిరసన ర్యాలీ

గుంటూరు(తూర్పు), అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్. గవాయిపై దాడి అనాగరికమని, దాడి చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. దాడిని నిరసిస్తూ సోమవారం గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియాకు వినతిపత్రం అందించారు. మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ సీజేను అవమానించిన నిందితులను అరెస్ట్ చేయకపోతే దేశంలో సామాన్య దళిత ప్రజలకు రక్షణ, గౌరవం ఎక్కడ ఉంటుందన్నారు. దాడిని ఖండిస్తూ ప్రధాని స్పందించిన తీరును స్వాగతిస్తున్నామని తెలిపారు. ఈ నెల 17న అన్ని మండల కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు, 22న చలో హైదరాబాద్ పేరుతో తెలంగాణ రాష్ట్రంలో , 23న చలో అమరావతి పేరుతో ఆంధ్రప్రదేశ్‌లో, 24న చెన్నైలో, 25న బెంగళూరులో భారీ నిరసన ర్యాలీలు నిర్వహించనున్నట్టు వివరించారు.

నేడు కోస్తాలో అతిభారీ వర్షాలు

- సీమలో పలుచోట్ల భారీ వర్షాలు
- 15-16 నాటికి పూర్తిగా నిష్క్రమించనున్న నైరుతి
- ఈశాన్య రుతుపవనాల రాకకు అనుకూలంగా వాతావరణం
- ఏలూరు ప్రభుత్వాసుపత్రిలోకి నీరు... నిలిచిన ఓపీ సేవలు



ఏలూరులో కాల్వను తలపిస్తున్న రోడ్లు

అమరావతి, విశాఖపట్నం, ఏలూరుసిటీ, భీమవరం రూరల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): కోస్తాంధ్ర, దక్షిణ తమిళనాడుకు ఆనుకుని నైరుతి బంగాళాఖాతంలో వేర్వేరుగా ఉపరితల ఆవర్తనాలు ఏర్పడ్డాయి. వీటి ప్రభావంతో సముద్రం నుంచి తేమగాలులు కోస్తాంధ్రపైకి వీయడంతో ఆదివారం రాత్రి నుంచి సోమవారం సాయంత్రం వరకూ విస్తారంగా వర్షాలు కురిశాయి. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఏలూరు జిల్లా లింగపాలెంలో 74.25, చింతలపూడిలో 68.75, బాపట్లలో 62.5, విజయనగరం జిల్లా పులిగుమ్మిలో 61, కృష్ణా జిల్లా ఉయ్యూరులో 60.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం ఎనిమిది గంటల వరకు ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, పల్నాడు, గుంటూరు జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ, అనకాపల్లి నుంచి నెల్లూరు జిల్లా వరకూ, నంద్యాల, కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో భారీవర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. మంగళవారం నుంచి నాలుగు రోజులపాటు కోస్తా, రాయలసీమల్లో ఎక్కువచోట్ల వర్షాలు, అక్కడక్కడా భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. కాగా సోమవారం దేశంలో అనేక ప్రాంతాల నుంచి నైరుతి రుతుపవనాలు నిష్క్రమించాయి. ఈశాన్య రుతుపవనాల ఆగమనానికి అనుకూలంగా దక్షిణాదిలో గాలుల దిశ మారింది. ఈనెల 15 లేదా 16వ తేదీన దేశం నుంచి నైరుతి రుతుపవనాలు పూర్తిగా వైదొలుగుతాయని, అదే సమయంలో ఈశాన్య రుతుపవనాలు ప్రవేశించనున్నాయని ఇస్రో వాతావరణ నిపుణుడు తెలిపారు.

ఏలూరు జిల్లాలో కుంభవృష్టి

సోమవారం తెల్లవారుజాము నుంచి కుంభవృష్టిగా వర్షాలు కురిశాయి. ఏలూరు నగరంలో రహదారులన్నీ జలమయం అయ్యాయి. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ఓపీ విభాగంలోకి నీరు చేరడంతో సేవ లు నిలిచిపోయాయి. ఆస్పత్రి ఎదుట డ్రెయిన్ ఫుట్‌పాత్‌పై సిమ్మెంట్ దిమ్మలు లేకపోవడంతో డ్రెయిన్‌లో పడి ఇద్దరు గాయపడ్డారు. జిల్లాలో అత్యధికంగా కొయ్యలగూడెం మండలంలో సోమవారం ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు 91.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. కన్నాపురం వద్ద తూర్పు, పడమటి కాలువలు ఉధృతంగా ప్రవహించాయి. జిల్లాకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేయడంతో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ వెట్రిసెల్వి విజ్ఞప్తి చేశారు.

భారీ వర్షం... వరిసాగుకు గండం

పశ్చిమ గోదావరి జిల్లాలో భారీ వర్షం కురిసింది. ఉండి, పాలకొల్లు, ఆకివీడు, భీమవరం పలు ప్రాంతాల్లో వర్షం కురవడంతో రహదారులు జలమయమయ్యాయి. వరిసాగు ఈనిక దశలో ఉన్నందున వర్షం గండంగా మారింది. ఈదురుగాలులు లేనందున ఎక్కడా నష్టం వాటిల్లలేదు. వర్షపు నీరు చేలల్లోకి భారీగా చేరింది. జిల్లాలో 2 లక్షల ఎకరాల సాగు ఈనిక, పొట్ట వివిధ దశల్లో ఉంది. ఈ సమయంలో వర్షాలు నష్టం చేస్తాయని రైతులు ఆందోళనలో ఉన్నారు.

శ్రీవారి ట్రస్టులకు రూ.1.05 కోట్ల విరాళం

- డీడీలు అందజేసిన పలువురు దాతలు



ఏడీవో ఫౌండేషన్ తరఫున రూ.75 లక్షల డీడీ అందజేస్తున్న ఆ సంస్థ ప్రతినిధి

తిరుమల, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ట్రస్టులకు పలువురు దాతలు రూ.1.05 కోట్లను సోమవారం విరాళంగా అందజేశారు. ఇందులో హైదరాబాద్‌కు చెందిన ఏడీవో ఫౌండేషన్ అనే ఎన్జీవో సంస్థ రూ.75 లక్షలు అందజేసింది. విరాళం డీడీని ఆ సంస్థ ప్రతినిధులు తిరుమలలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడికి అందజేసి ఎస్వీ ప్రాణదానం ట్రస్టుకు వినియోగించాలని కోరారు. బెంగళూరుకు చెందిన ఎం.రాకేష్‌రెడ్డి బర్డ్ ట్రస్టుకు రూ.10 లక్షలు, తిరుపతికి చెందిన బాలాజీ రైల్వే డివిజన్ సాధన సమితి కన్వీనర్ కుప్పాల గిరిధర్ కుమార్ రూ.10 లక్షలు విరాళాన్ని ఎస్వీ విద్యాదానం ట్రస్టుకు, గుంటూరుకు చెందిన సింహాద్రి వెంకట శివప్రసాద్ అనే భక్తుడు ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షలు విరాళంగా ఇచ్చారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న తీస్తా సెతల్వాడ్



అనంతపురంలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న ఐద్వా మహిళలు

ప్రజల ఐక్యత కోసమే ఐద్వా పోరాటాలు

- ప్రైవేటీకరణ అంటే నిరుద్యోగాన్ని ప్రోత్సహించడమే
- అఖిల భారత ప్రధాన కార్యదర్శి మరియం ధవలే
- మతోన్మాద ప్రచారాన్ని తిప్పికొట్టాలి: తీస్తా సెతల్వాడ్

అనంతపురం టౌన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): కులమతాల మధ్య విద్వేషాలు సృష్టిస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ, ప్రజలందరి ఐక్యతే లక్ష్యంగా పోరాటాలు సాగిస్తున్నట్టు అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) అఖిల భారత ప్రధాన కార్యదర్శి మరియం ధవలే తెలిపారు. సంస్థ 16వ రాష్ట్ర మహాసభలను పురస్కరించుకుని అనంతపురం జిల్లా కేంద్రంలో సోమవారం ఆర్ట్స్ కళాశాల మైదానం నుంచి లలితకళా పరిషత్ వరకు మహిళలు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ప్రభావతి అధ్యక్షతన లలితకళా పరిషత్‌లో నిర్వహించిన సభలో ఆమె ప్రసంగించారు. కేంద్రంలోని బీజేపీ విధానాల వల్ల నేడు రాష్ట్రంలో ధరలు పెరిగి, సాధారణ ప్రజలు బతకలేని పరిస్థితి నెలకొందని విమర్శించారు. అనేక మంది మహిళలు నిరుద్యోగ సమస్యతో బాధాకరమైన జీవితాన్ని గడుపుతున్నారని ఆవేదన వక్తం చేశారు. దేశవ్యాప్తంగా మహిళల జీవితాల్లో పెద్ద ఎత్తున విధ్వంసం చోటు చేసుకుంటోందని, ఇందులో ప్రధాన నిందితులు బీజేపీ, ఆర్ఎస్ఎస్ అని మరియం ధవలే ఆరోపించారు. కార్యక్రమంలో ఐద్వా అఖిల భారత అధ్యక్షురాలు శ్రీమతి టీచర్, ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి, కోశాధికారి సావిత్రి తదితరులు పాల్గొన్నారు. కాగా, సాయంత్రం కామ్రేడ్ రబియాబీ ప్రాంగణంలో జరిగిన ఐద్వా ప్రతినిధుల సభలో సామాజికవేత్త తీస్తా సెతల్వాడ్ మాట్లాడారు. 'వామపక్షాలు, దళిత సంఘాలు, అభ్యుదయవాదులు బాధ్యతగా మెలిగి ప్రోటో ఫాసిస్టు ప్రభుత్వం నుంచి సమాజాన్ని కాపాడుకోవాలి. అందుకోసం ఐక్య పోరాటాలు చేయాల్సిన అవసరముంది. దేశంలో ప్రజా స్వేచ్ఛ, హక్కులపై దాడి జరుగుతోంది. బీజేపీ ప్రభుత్వం దేశంలో సీఏఏ, ఎన్ఆర్సీ చట్టాలను తీసుకువచ్చి పౌరహక్కులను హరిస్తోంది. అస్సాం, బెంగాల్, మణిపూర్‌లో మహిళలపై జరిగిన దాడులు వర్ణనాతీతం. దేశం అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. మితవాదంవైపు ప్రయాణం చేస్తోంది. వాట్సాప్ ఫ్యాక్టరీ సమాజంలో పెనుప్రమాదం సృష్టిస్తోంది. మతతత్వ, మతోన్మాద ప్రచారాలు మన కుటుంబాలపై ప్రభావం చూపుతున్నాయి..వాటిని తిప్పికొట్టాలి. ఫాసిస్టు సంఘాలు అన్ని రంగా ల్లో చొచ్చుకునివచ్చాయి. ఓట్ల తారుమారుతోనే నేడు బీజేపీ అధికారంలో ఉంది. కేంద్ర ప్రభుత్వ విధానాలతో ప్రజలను మళ్లీ బ్రిటీష్ కాలంనాటి వలస జీవన విధానంలోకి నెట్టివేస్తున్నారు. ఇది చాలా ప్రమాదకరం' అని తీస్తా హెచ్చరించారు.

విపత్తు ప్రమాద తగ్గింపు ముఖ్యం

- డీఎంఏ ఎండీ ప్రఖర్‌జైన్

అమరావతి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): విపత్తుల ముందు ప్రమాద తగ్గింపు, నష్ట నివారణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. సోమవారం అంతర్జాతీయ విపత్తు ప్రమాద తగ్గింపు దినోత్సవం సందర్భంగా తాడేపల్లిలోని విపత్తుల నిర్వహణ సంస్థ(డీఎంఏ) కార్యాలయంలో యూనిసెఫ్ ఆధ్వర్యంలో 'ఏపీలో సంసిద్ధత, భాగస్వామ్యంతో సామర్థ్యంకల కమ్యూనిటీల నిర్మాణం' అనే అంశంపై వర్చువల్‌గా వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎండీ ప్రఖర్ జైన్ మాట్లాడుతూ... 'విపత్తులను ఎదుర్కొనేందుకు సంసిద్ధత, అప్రమత్తత ముఖ్యం. విపత్తు ప్రమాదాలపై ముందుగా టెక్స్ట్ మెస్సేజ్‌లు, వాట్సాప్ మెస్సేజ్‌లు, మీడియా, సోషల్ మీడియా, అధికార యంత్రాంగం ద్వారా ఎప్పటికప్పుడు ప్రజల్ని అప్రమత్తం చేస్తున్నాం. క్షేత్రస్థాయిలో చివరి వ్యక్తి వరకు ఈ హెచ్చరికలు చేరేలా స్వచ్ఛంద, కార్పొరేట్ సంస్థలు కృషి చేయాలి. విపత్తు తర్వాత పునరుద్ధరణకు ఎక్కువ ఖర్చు చేయడం కన్నా.. ముందుగా ప్రమాద తగ్గింపునకు నిధులు కేటాయించడం ద్వారా ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించవచ్చు. జీవనోపాధిని కాపాడవచ్చు' అని పేర్కొన్నారు. వర్క్‌షాప్‌లో విపత్తుల సంస్థ ఈడీ వెంకట దీపక్, యునిసెఫ్ ప్రతినిధులు మహేంద్ర, రాజారామ్, ప్రసాద్, ఎన్ఐడీఎం నుంచి బాలు, ఎస్‌డీఎంఏ నుంచి హరీశ్ నాయుడు, బస్వంత్‌రెడ్డి పాల్గొన్నారు.

3 నుంచి మున్సిపల్ కార్మికుల సమ్మె: ఏఐటీయూసీ

గుంటూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వచ్చే నెల 3 నుంచి రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు సమ్మెకు దిగుతున్నట్లు ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోట మాల్యాద్రి తెలిపారు. ఈ మేరకు సోమవారం గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు, నగర మేయర్ కోవెలమూడి రవీంద్రకు సమ్మె నోటీసు అందజేశారు. రెండేళ్లుగా విధుల్లో ఉండి మరణించిన, పదవీ విరమణ చేసిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులను అవుట్ సోర్సింగ్ విధానంలో విధుల్లోకి తీసుకోవాలని తదితర డిమాండ్లతో నోటీసు అందజేశారు.



బెలూన్లను ఎగురవేస్తున్న హోం మంత్రి వంగలపూడి అనిత

క్రీడలకు అధిక ప్రాధాన్యం

- హోం మంత్రి వంగలపూడి అనిత
- మంగళగిరిలో జాతీయ స్థాయి పోలీస్ వెయిట్ లిఫ్టింగ్, యోగా పోటీలు ప్రారంభం

మంగళగిరి సిటీ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం క్రీడా రంగానికి అధిక ప్రాధాన్యతను ఇస్తుందని హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. ఆలిండియా పోలీస్ వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్, యోగా పోటీలను మంగళగిరి ఏపీఎస్పీ ఆరవ బెటాలియన్‌లో సోమవారం ఉదయం ఆమె ప్రారంభించారు. తొలుత పోలీసు సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం శాంతి కపోతాలు, బెలూన్లను ఎగురవేసి క్రీడా పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ పోలీసు సిబ్బందిలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అమరావతిలో స్పోర్ట్స్ సిటీ ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయని వెల్లడించారు. డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా, డీఐజీ కేకేఎన్ అంబురాజన్, స్పోర్ట్స్ ఐజీ కేవీ మోహనరావు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

రైతుల పేర్లు వెబ్‌ల్యాండ్‌లో నమోదు కావడం లేదు

- ప్రభుత్వానికి చెడ్డ పేరు తెస్తున్నారు: ప్రజా చైతన్య వేదిక

గుంటూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలో వ్యవసాయ భూముల ఆస్తి హక్కుదారులు తమ పేర్లను, స్థిరాస్తులను వెబ్ ల్యాండ్‌లో నమోదు చేసుకోలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రజా చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సిరిపురపు శ్రీధర్ శర్మ తెలిపారు. సోమవారం గుంటూరులో ఆయన మీడియాతో మాట్లాడారు. వ్యవసాయ భూముల హక్కుదారులు తమ భూములను వారసత్వంగా రిజిస్ట్రేషన్ చేయాలన్నా, ఇతరులకు అమ్ముకున్నా/కోర్టుల ద్వారా రిజిస్ట్రేషన్ జరిగినా.. ప్రస్తుత యజమాని పేరుతో 1బీ, 10బీ అడంగల్‌లో, ప్రభుత్వ రికార్డుల్లో నమోదు కావడం లేదు. వీరి పేర్లు మ్యుటేషన్ ద్వారా ఆన్‌లైన్ వెబ్‌సైట్లో నమోదు కావాలంటే 'ఇతరులు' అన్న సూచిక దగ్గర యజమానుల పేర్లను వెబ్‌సైటు తీసుకోవట్లేదు. దీంతో వ్యవసాయ భూముల యజమానులు భూములు అమ్ముకోలేక, ఇతరులకు, తమ వారసులకు ఇవ్వలేక అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ కారణంతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లు మందగించాయి. భూ యజమానులు కొన్ని నెలలుగా ఎమ్మార్వో, జిల్లా కలెక్టర్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా.. ఇది సీసీఎల్ఏ ప్రధాన కార్యాలయం చేయాల్సిన పని అని, స్థానిక రెవెన్యూ అధికారులు తప్పించుకుంటున్నారు. తక్షణమే ఈ సమస్యను పరిష్కరించాలని ఉన్నతాధికారులను డిమాండ్ చేశారు.

21 నుంచి పత్తి కొనుగోళ్లు ప్రారంభం

- 30 సీసీఐ కేంద్రాలు ఏర్పాటు

గుంటూరు సిటీ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఈనెల 21 వ తేదీ నుంచి సీసీఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) పత్తి కొనుగోలు ప్రారంభించనుంది. అందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా 30 కొనుగోలు కేంద్రాలు తెరవనున్నారు. పత్తి కొనుగోలు కోసం గతంలో మాదిరిగానే జిన్నింగ్ మిల్లులను సీసీఐ ఎంపిక చేయనుంది. జి న్నింగ్ మిల్లుల ఎంపికకు సంబంధించిన టెండర్ ప్రక్రియ ఈనెల 10నే ముగిసింది. అయితే బిడ్డింగ్‌లో పాల్గొన్న జిన్నింగ్ మిల్లులను సీసీఐ బృందం తనిఖీ చేసి, అక్కడ ఉన్న వసతులపై సంతృప్తి చెందిన తర్వాత ఎంపిక ప్రక్రియ ఆరంభం అవుతుంది. ఒకటి, రెండు రోజుల్లో సీసీఐ కేంద్రాలు ఎక్కడ ఏర్పాటు చేయబోతున్నారనేది అధికారికంగా ప్రకటించనున్నారు. కాగా, ఈ ఏడాది రైతుల నుంచి పత్తి కొనుగోలు చేసేందుకు రెండు యాప్‌లను సీసీఐ వినియోగించనుంది. సీసీఐ దేశవ్యాప్తంగా అందుబాటులో తీసుకువచ్చిన కపాస్ కిసాన్ యాప్‌ను రైతులు స్లాట్ బుక్ చేసుకునేందుకు వాడుకోవాలని సీసీఐ అధికారులు చెబుతున్నారు. అమ్మకం ప్రక్రియకు సంబంధించి రాష్ట్ర ప్రభు త్వం అభివృద్ధి చేసిన సీఎం యాప్‌ను వినియోగించుకోవచ్చునని చెబుతున్నారు.

దూది బేల్ కు రూ. 1440

ఈ సీజన్‌లో జిన్నింగ్ మిల్లులకు సీసీఐ చెల్లించే (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) ధరలను సోమవారం రాత్రి ఖరారు చేశారు. దూది బేల్‌కు రూ. 1440 చెల్లించేందుకు సీసీఐ సుముఖత వ్యక్తం చేయగా జిన్నింగ్ మిల్లుల యజమానులు అంగీకరించారు. వాస్తవానికి మన రాష్ట్రంలో సీసీఐ ఇస్తామన్న ధరలు గిట్టుబాటు కానప్పటికీ పత్తి రైతుల కోసం అంగీకారం తెలిపినట్లు జిన్నింగ్ మిల్లుల యజమానులు తెలిపారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

బ్రిటన్‌కు ఆపన్నహస్తం!

పెట్టుబడిదారులు, వణిక్ ప్రముఖులే కాదు, వివిధరంగాల ప్రతినిధులతో కలిపి మొత్తం నూటపాతికమందితో ఆర్థికరాజధానిలో ముంబైలో కాలూనిన బ్రిటిష్ ప్రధాని కీర్ స్టార్మర్ పెద్ద హడావుడి, ఆర్భాటం లేకుండా వచ్చిన పనిముగించుకొని వెళ్ళిపోయారు. బెదిరింపులు, గాండ్రింపులు, హుంకరింపులతో అమెరికా అధినేత ట్రంప్ ఎదుటివారిని అవమానిస్తున్న కాలంలో భారత్–బ్రిటన్ వాణిజ్య ఒప్పందం ఉపశమనాన్ని ఇస్తోంది. ఆర్థికంగా ఎంతో ఎత్తుకు ఎదిగిన భారత్‌తో ఒప్పందాలు కుదుర్చుకోవడం బ్రిటన్‌కే ఎక్కువ అవసరమన్న వాదన వాస్తవమే అయినా, సుంకాలూ ప్రతీకార సుంకాల పేరిట మన ఎగుమతులమీద ట్రంప్ కక్షసాధిస్తూ, వీసాల మీద నియంత్రణలతో మన ఉద్యోగులూ విద్యార్థులనూ హింస పెడుతున్న దశలో వాణిజ్యానికే కాదు, మేధస్సుకూ, నైపుణ్యాలకూ అడ్డుగోడలు ఉండబోవని బ్రిటిష్ ప్రధాని హామీ ఇస్తున్నారు.

ప్రపంచంలోనే మన అతిపెద్ద మార్కెట్ బ్రిటన్‌కోసం తలుపులు తెరుచుకుంటోంది. ఆర్థికవ్యవస్థల వరుసలో నాలుగోస్థానంలో ఉన్న భారత్‌తో యూకే చేస్తున్న వ్యాపారం స్వల్పం. భారత్ మొత్తం ఎగుమతుల్లో బ్రిటన్ వాటా మూడుశాతం, బ్రిటన్‌నుంచి ఇటు జరుగుతున్నది రెండుశాతమే కనుక, ఇరుదేశాల మధ్యా ఇచ్చిపుచ్చుకోవడానికి ఆకాశమంత అవకాశం ఉంది. ఏదో మేర రాజీలూ రాయితీలతో రేపోమాపో అమెరికాతోనూ ఒప్పందం కుదరవచ్చును కానీ, అంతలోగా సుంకాలనూ శాపనార్థాలనూ కలగలిపి మన మనసులను ట్రంప్ గాయపరచిన దశలో, రక్షణనుంచి సినీరంగం వరకూ అన్నీ పంచుకుందామంటూ స్టార్మర్ సగౌరవంగా ప్రతిపాదించడం బాగుంది. కొన్నిరంగాల్లో బ్రిటన్ పెట్టుబడుల ప్రవేశం గురించి మన ప్రభుత్వం ఇప్పటికీ స్పష్టంగా లేదన్న ఆరోపణలు ఉన్నప్పటికీ, అనేక రంగాల్లో భారత్ ఎగుమతులకు అదుపులూ అడ్డంకులూ లేకపోవడం స్వాగతించాల్సిన విషయం. అరడజనుకుపైగా రంగాల్లో బ్రిటన్ కంపెనీలు భారీగా పెట్టుబడులు పెట్టి, రెండుదేశాలూ లాభపడవచ్చునంటున్నారు భారత ప్రధాని మోదీ. మిసైళ్ళు, నౌకల ఇంజన్ల కొనుగోలుతో బ్రిటన్‌తో రక్షణరంగంలో దోస్తీ మరింత హెచ్చింది. మనకంపెనీలు అక్కడ వేలకోట్ల పెట్టుబడులు పెడుతున్నందున, అటునుంచి కూడా ధనప్రవాహం ఉండబోతున్నదట. ఇక్కడి సినీనిర్మాతలు అక్కడ షూటింగ్ చేయడం, అక్కడి యూనివర్సిటీలు ఇక్కడ క్యాంపస్‌లు తెరవడం వంటివి ఆర్థిక ప్రయోజనాలతో పాటు, రెండుదేశాల మధ్యా సాన్నిహిత్యం మరిన్ని రంగాలకు విస్తరించిన సత్యాన్ని తెలియచేస్తున్నాయి. ఉద్యోగవీసాలమీద మీసాలు దువ్వుతూ, విదేశీవిద్యార్థుల ప్రవేశంమీద తమ విశ్వవిద్యాలయాలను ట్రంప్ నియంత్రిస్తున్న తరుణంలో, ఇకపై స్టెమ్ కోర్సుల కోసం బ్రిటన్‌వైపు చూసే విద్యార్థుల సంఖ్య కూడా హెచ్చుతుందట.

పరిణామంలో చిన్నదే కావచ్చును కానీ, ఈ సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం (సీఈటీఏ) ఉభయ దేశాలనూ దగ్గరచేసింది. వస్తు, సేవల రెండింటిలోనూ మిగులు మనవైపే ఉన్న విషయాన్ని అటుంచితే, యాభై ఆరు బిలియన్ డాలర్ల ప్రస్తుత ద్వైపాక్షిక వాణిజ్యాన్ని ఉభయదేశాలూ ఐదేళ్ళలో 120 బిలియన్ డాలర్లు చేయాలనుకుంటున్నాయి. చైనా, అమెరికా, జర్మనీ, ఫ్రాన్స్ వంటివి బ్రిటన్‌కు అత్యధికంగా ఎగుమతులు చేస్తూ తొలి స్థానాలు ఆక్రమించిన నేపథ్యంలో భారత్ ప్రధానంగా లబ్ధిపొందగలిగే రంగాలు ఏమిటన్న నిర్ధారణలు ఇప్పటికే జరిగాయి. సుంకాలు దాదాపుగా సున్నా అయిన స్థితిలో ఇప్పటికే బరిలో ఉన్న మిగతాదేశాలతో పోటీపడటానికి మనం విధానపరంగా చేయాల్సిందేమిటన్న విశ్లేషణలూ సాగుతున్నాయి. ఈ ఒప్పందం రేపటిరోజుల్లో అమెరికా, ఈయూలతో చేసుకోబోయే ఒప్పందాలకు మార్గదర్శకంగా ఉపకరించడంతో పాటు, ఎగుమతుల రంగంలో మనం చేపట్టవలసిన సంస్కరణలకు సన్నద్ధం కావడానికీ ఉపకరిస్తుంది. ట్రంప్ టారిఫ్ అస్త్రాలదెబ్బకు మిగతా ప్రపంచమార్కెట్ల అన్వేషణలో పడిన భారతదేశానికి బ్రిటన్ తొలిమెట్టు కాబోతోంది. ఒకపక్క బ్రెగ్జిట్ బాధనుంచి కోలుకోలేక బ్రిటన్ ఇంకా విలవిలలాడుతూంటే, ట్రంప్ తన అస్తవ్యస్త విధానాలతో మొత్తం ప్రపంచాన్నే చెల్లాచెదురు చేసేశారు. 'సెటా'తో బ్రిటన్‌కు ఆపన్నహస్తం అందించిన భారతదేశం, అక్కడనుంచి వచ్చిపడే చవుక ఉత్పత్తులతో తాను దెబ్బతినకుండా జాగ్రత్తపడాలి. మన చిన్న, మధ్యతరగతి పరిశ్రమలు, వ్యవసాయం, దాని అనుబంధరంగాలను ఎలా కాపాడుకోవాలో పాలకులు ఆలోచించాలి.

సర్వనాశనం రాగంగా శాంతిగీతం!

ఏకపక్ష ప్రేమలూ, ఏకపక్ష యుద్ధాలూ, ఏకపక్ష శాంతి ఒప్పందాల్లేని దేశ చరిత్రలు లేవు! కనీస న్యాయం కావాలని ఘోషించే వారే తరచూ వీటికి బాధితులుగా కనపడతారు. ఇక కనీవినీ ఎరుగని జీవన విధ్వంసానికి సాక్షులుగా నిలిచిన వారికి నోరెత్తే పరిస్థితీ ఉండదు. గాజాలో ఇప్పుడదే జరుగుతోంది. తాము ప్రతిపాదించిన బలవంతపు శాంతి ఒప్పందానికి అంగీకరించకపోతే సర్వనాశనాన్నే చూస్తారనే హెచ్చరికలు అగ్రరాజ్య అధినేత ట్రంప్ నుంచి రావటంతో హమాస్‌కు వేరే దారి కనపడటం లేదు. హమాస్ పూర్తిగా దిగి రావచ్చు. పాదాక్రాంతమూ కావచ్చు. ఇజ్రాయెల్– అమెరికా పెట్టిన అన్ని షరతులకూ అంగీకరించొచ్చు. కానీ హమాసే గాజా కాదు. హమాసే పాలస్తీనా కాదు. ప్రజలను ఒక సంస్థకు గుత్తాధిపత్యంగా భావించలేం. బాధిత ప్రజలకు న్యాయం దక్కటమే లక్ష్యమైతే శాంతి ప్రణాళిక ఆ దిశగా ఉండాలి. కానీ అందులో ఆ ఛాయల్లేవు. బాధితుల గొంతు అందులో లేదు. చిరకాలంగా వారు కోరుకుంటున్న న్యాయమూ లేదు. పాలస్తీనా సమస్య పరిష్కారానికి అందులో నిర్దిష్ట చర్యల్లేవు. రెండు దేశాల ఏర్పాటు వాగ్దానం ఊసేలేదు. ఇజ్రాయెల్ కోరుకున్న రీతిలో శాంతి ప్రణాళిక ఉందనే విమర్శలే ప్రధానంగా వినపడుతున్నాయి. సుంకాల యుద్ధాలతో నలిగిపోతున్న దేశాధినేతలకు.. ట్రంప్‌ను ప్రసన్నం చేసుకోటానికి శాంతి ప్రణాళిక ఒక సందర్భాన్ని సృష్టించింది. అది వేరే కథ!



మొదటి, రెండో ప్రపంచ యుద్ధాల్లో సైతం పరాజితులు తమ విన్నపాలనూ బలంగానే విన్పించారు. పరాజితులు పరాభవ భారంతో మిగిలిపోకుండా, దాని ఆసరాగా ప్రజలను మళ్లీ యుద్ధోన్ముఖులను చేయకుండా ఉంచటానికి ప్రయత్నాలు జరిగాయి. రెండు ప్రపంచ యుద్ధాల్లో తలపడిన దేశాలన్నీ ఎంతోకొంత సమవుజ్జీలు కావటంతో పరాజితులు పూర్తిగా పాదాక్రాంతులు కాలేదు. లేచి నిలబడే స్వేచ్ఛను దక్కించుకున్నారు. లోగొంతుతో కొన్ని స్పష్టంగానే చెప్పారు. స్వంత మార్గంలో ముందుకు వెళ్లటానికి వెసులుబాట్లూ పొందారు. అందుకే పరాజిత దేశాలైన జర్మనీ, జపాన్‌లు పదేళ్లలోనే మళ్లీ పుంజుకుని ఆర్థికంగా కీలకంగా మారాయి. గాజా పరిస్థితి వేరు. 365 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం కలిగిన ఒక చిన్న ప్రాంతంలో జరిగిన బీభత్సమూ, విధ్వంసమూ ఈ శతాబ్దంలో మరెక్కడా చోటుచేసుకోలేదు. ప్రపంచంలోనే అత్యధికంగా శరణార్థులు ఉన్న చిన్న ప్రదేశం గాజా. అత్యధిక జనసాంద్రతలు కలిగిన వాటిల్లో అగ్రభాగాన ఉంది. మరణాలు, ఆస్తులు, సౌకర్యాల విధ్వంసాల గురించి ఇప్పటి వరకూ వస్తున్నవన్నీ తుది లెక్కలు కావు. ప్రాణాలు కోల్పోయిన వారు 67,000 నుంచి 84,000 మంది ఉండొచ్చనే అంచనాలు ఉన్నాయి.

> గాజా, వెస్ట్‌బ్యాంక్ నుంచి వైదొలగటానికి ఇజ్రాయెల్ అంగీకరించి ఆ రెండూ ప్రాంతాలూ కలిసి స్వతంత్ర దేశంగా ఏర్పడటానికి దోహదం చేస్తే శాంతి ప్రణాళికకు అర్థం ఉంటుంది. ట్రంప్‌కు కానీ, నెతన్యాహుకు కానీ ఆ దిశగా అడుగులు వేయాలని ఏ మాత్రమూ లేదు. అందుకే 20 సూత్రాల శాంతి ప్రణాళికలో రెండు దేశాల ఏర్పాటు ప్రస్తావనకు ఎటువంటి ప్రాధాన్యం దక్కలేదు. ఎన్నో చర్చల అనంతరం కుదిరిన ఓస్లో ఒప్పందాలు (1993, 1995) విఫలమైన నేపథ్యంలో పాలస్తీనా నాయకుల ప్రమేయమే లేని 20 సూత్రాల ప్రణాళిక అనుకున్నట్లుగా అమలైతే అది పెద్ద విశేషమే అవుతుంది!

క్షతగాత్రులెందరో పూర్తిగా తెలియదు. అందులో పనిచేయగలిగిన వారెందరో చెప్పలేం. అనుకున్నట్లుగా శాంతి ప్రణాళిక అమలైతే, ఇజ్రాయెల్ దానికి అడ్డంకులు కల్పించకుండా ఉంటే అసలు లెక్కలు తేలతాయి. అప్పుడే యుద్ధ నేరాల, కిరాతకాల సంపూర్ణస్వరూపం బయటపడుతుంది.

1948 నుంచీ ఇప్పటివరకూ అరబ్బు దేశాలతో ఇజ్రాయెల్ పరోక్ష, ప్రత్యక్ష యుద్ధాలు చాలానే చేసింది. వాటిల్లో మరణించిన వారి సంఖ్యతో పోల్చితే గాజా మృతులే ఎక్కువ. 1948 యుద్ధంలో 10 నుంచి 15 వేల వరకూ అరబ్బులు చనిపోయారు. 1967 నాటి ఆరురోజుల యుద్ధంలో 15,000 మంది మరణించారు. 1973 నాటి యుద్ధంలో 8,000 నుంచి 18,500 వరకూ మరణాలు చోటుచేసుకున్నాయి. ఏ కోణం నుంచి చూసినా గాజా యుద్ధమంత దారుణమైంది మరొకటి లేదు. అందుకే ఈ యుద్ధంతో ఇజ్రాయెల్ ప్రతిష్ఠ ఎన్నడూ లేనంతగా దిగజారిపోయింది. సామాజిక మాధ్యమాల్లో గాజా బీభత్సాల దృశ్యాలు చూసిన వారి హృదయాలు విషాదంలో బరువెక్కాయి. యువతలో ఆగ్రహాలు వెల్లువెత్తాయి. విశ్వవిద్యాలయాల్లో నిరసన ప్రదర్శనలు హోరెత్తాయి. నిరసనలకు నిలయాలైన వర్సిటీలకు అందించే ఆర్థిక సహాయానికి కత్తెరవేసే చర్యలు అమెరికాలో మొదలయ్యాయి. వియత్నాం యుద్ధసమయంలో కూడా వర్సిటీల్లో నిరసనలు జరిగాయి. ఇప్పటిలా వాటిపై కత్తికట్టలేదు. భావస్వేచ్ఛకు వీలు ఇవ్వని ఛాందస జాతీయవాదం ఎక్కడైనా చెరుపే చేస్తుందనటానికి ఇంతకంటే నిదర్శనం లేదు.

పాలస్తీనా ప్రజల సమస్య పరిష్కారం అయితేనే గాజా, వెస్ట్‌బ్యాంకులో ప్రశాంతత నెలకొంటుంది. అక్కడి ప్రజలకు ఆమోదంలేని ఏ ప్రణాళికా దీన్ని సాధించలేదు. హమాస్ లాంటి తీవ్రవాద సంస్థలు కూడా ఒక దేశంగా ఇజ్రాయెల్ అస్తిత్వాన్ని అంగీకరిస్తున్నాయి. అరబ్బు దేశాలు కూడా ఇజ్రాయెల్‌తో ఒప్పందాలు చేసుకుంటున్నాయి. ఇజ్రాయెల్‌ను ఇంకా గుర్తించని దేశాలు కూడా తెరవెనుక మంతనాలు సాగిస్తున్నాయి. ఏ దృష్టితో చూసినా ఇజ్రాయెల్ అస్తిత్వానికి ఇప్పుడు ప్రమాదమే లేదు. సైనికంగా ఇజ్రాయెల్‌తో తలపడే దేశం కూడా మధ్యప్రాచ్యంలో లేదు. దుస్సాహసం చేసినా ఓటమినే చూడాల్సి వస్తుంది. అంతటి శక్తిని ఇజ్రాయెల్ సంపాదించుకుంది.



■ రాహుల్ కుమార్

ఇటువంటి పరిస్థితుల్లో ఇజ్రాయెల్ గతంలో కంటే భిన్నంగా ముందుకొచ్చి పాలస్తీనా సమస్యను పరిష్కరించటానికి చర్యలు తీసుకోవాలి. కానీ ఒకనాటి పాలస్తీనా ప్రాంతమంతా గ్రేటర్ ఇజ్రాయెల్‌కే చెందాలనీ దైవనిర్దేశం ప్రకారం అది జరిగితీరుతుందనే మత విశ్వాసాలు గల పార్టీలపై ఆధారపడి అధికారాన్ని నెట్టుకొస్తున్న ప్రధాని బెంజమిన్ నెతన్యాహు అందుకు సిద్ధంగా లేరు. ఆయన నాయకత్వం వహిస్తున్న లికుడ్ పార్టీకీ కూడా పాలస్తీనా స్వతంత్ర దేశంగా ఏర్పాటు కావటం ఇష్టంలేదు. పరిమిత అధికారాలతో కూడిన స్వయంపాలనను పాలస్తీనాకు ఇవ్వటానికి కూడా లికుడ్ పార్టీలో అతివాదులు అంగీకరించరు. వాదనలో సహేతుకత లేనప్పుడూ, ఏ విధంగానైనా ఐక్యరాజ్యసమితి తీర్మానాలను కాలరాయాలని అనుకున్నప్పుడూ అతివాదులకు మతమే ఆలంబనగా ఉంటుంది. బైబిల్‌లో ఇజ్రాయెల్ ప్రజలు, వారు నివసించే ప్రాంతాల ప్రస్తావన ఉంది కాబట్టి.. పాలస్తీనా వాసులందరూ వేరేచోట్లకు తరలివెళ్లాలనే వితండవాదననే అతివాదులు చేస్తారు.

ఐక్యరాజ్యసమితి తీర్మానం ప్రకారం 56 శాతం భూభాగం ఇజ్రాయెల్‌కూ 43 శాతం పాలస్తీనాకూ చెందాలి. ఒకశాతం జెరూసలెం ప్రాంతాన్ని అంతర్జాతీయ పర్యవేక్షణ కింద ఉంచాలి. రెండు దేశాల రాజధానులూ జెరూసలెంలోనే ఉండాలని ఐరాస తీర్మానంలో స్పష్టంగా ఉంది. ఐరాస ప్రణాళికను యూదులు ఆమోదించారు. అరబ్బు దేశాలు దాన్ని వ్యతిరేకించి యుద్ధానికి దిగాయి. బహుశా ఇది చారిత్రక తప్పిదమే కావచ్చు! యుద్ధంలో గెలిచిన ఇజ్రాయెల్ ఎక్కువ భూభాగాన్ని తన స్వాధీనంలోకి తెచ్చుకుంది. 56 శాతం భూమి 78 శాతమైంది. 1967 నాటి యుద్ధంతో మిగతా 22 శాతాన్నీ తన అధీనంలోకి తెచ్చుకుంది. గాజా, వెస్ట్‌బ్యాంకు ప్రాంతాలు అలా వచ్చినవే. ఈ రెండు ప్రాంతాల నుంచి ఇజ్రాయెల్ వైదొలగాలనీ ఐరాస తీర్మానాలు చేసినా అమెరికా, బ్రిటన్ మద్దతుతో ఇజ్రాయెల్ వాటిని ఖాతరుచేయలేదు. గాజా, వెస్ట్‌బ్యాంక్ నుంచి వైదొలగటానికి ఇజ్రాయెల్ అంగీకరించి ఆ రెండూ ప్రాంతాలూ కలిసి స్వతంత్ర దేశంగా ఏర్పడటానికి దోహదం చేస్తే శాంతి ప్రణాళికకు అర్థం ఉంటుంది. ట్రంప్‌కు కానీ, నెతన్యాహుకు కానీ ఆ దిశగా అడుగులు వేయాలని ఏ మాత్రమూ లేదు. అందుకే 20 సూత్రాల శాంతి ప్రణాళికలో రెండు దేశాల ఏర్పాటు ప్రస్తావనకు ఎటువంటి ప్రాధాన్యం దక్కలేదు. ఎన్నో చర్చల అనంతరం కుదిరిన ఓస్లో ఒప్పందాలు (1993, 1995) విఫలమైన నేపథ్యంలో పాలస్తీనా నాయకుల ప్రమేయమే లేని 20 సూత్రాల ప్రణాళిక అనుకున్నట్లుగా అమలైతే అది పెద్ద విశేషమే అవుతుంది! హమాస్, ఇస్లామిక్ జిహాద్ సంస్థలు బలపడటానికి ఓస్లో ఒప్పందాల వైఫల్యాలే ప్రధాన కారణాలు. చరిత్ర పునరావృతమైతే హమాస్ లాంటి సంస్థలే పుట్టుకొస్తాయి. వాటివల్ల ఇజ్రాయెల్ ప్రజలకూ, పాలస్తీనా ప్రజలకూ ఎటువంటి మేలూ జరగదు.

తన చుట్టూ పాలస్తీనా ఒక ముస్లిం దేశంగా ఉండటం ఇజ్రాయెల్‌కు ఇష్టంలేదు. భద్రతా కారణాల దృష్ట్యా అది సబబే అనుకుందాం! మరి చుట్టూ ఉన్న ముస్లిం దేశాల సంగతి ఏమిటి? వాటి నుంచి ప్రమాదాలు రావా? అన్న ప్రశ్నకు ఇజ్రాయెల్ వైపు సహేతుక సమాధానం కనపడదు. పాలస్తీనా స్వతంత్ర దేశంగా ఏర్పడితే దానికంటూ చరిత్రను నెమరువేసుకునే క్రమం మొదలవుతుంది. విద్యాబోధనలో భాగంగా పాలస్తీనా ఛిన్నాభిన్నమైన తీరును వివరిస్తారు. ప్రజల జ్ఞాపకాల్లో నిక్షిప్తమైన బాధలు కళారూపాల ద్వారా వెలుగులోకి వస్తాయి. చరిత్రలో ఎవరు ఎక్కడ నుంచి వచ్చారో, ఎవరు ఎవరిని లొంగదీసుకున్నారో, పరసీమలకు ప్రజలు ఎలా చెల్లాచెదురయ్యారో తెలిపే సంఘటనలన్నీ ప్రజల ముందుంచటం అనివార్యమవుతుంది. అవన్నీ కలిసి ప్రజల్లో ఒక యుక్తాయుక్త వివేచనను మేల్కొలుపుతాయి. అది ఇజ్రాయెల్‌కు అసలు సరిపడదు. కానీ చరిత్రలోని చేదునిజాలను ఎల్లకాలమూ దాయలేం!

గాజాతో పాటు వెస్ట్‌బ్యాంకుని కూడా పూర్తిగా విలీనం చేసుకుని అక్కడి ప్రజలకు పూర్తిపౌరసత్వం కల్పించటానికి ఇజ్రాయెల్ ముందుకొస్తే అదొక కొత్త చరిత్ర అవుతుంది. దీంతోపాటు దేశదేశాల్లో తలదాచుకున్న పాలస్తీనా శరణార్థులందరికీ స్వదేశంలోకి ప్రవేశం కల్పించటానికి సిద్ధపడితే సమస్యలన్నీ పరిష్కారం అవుతాయి. ఇవి జరగాలంటే ఇజ్రాయెల్ ప్రజాస్వామ్యపరంగా ఎంతో ఎదగాలి. యూదుల కోసమే ప్రత్యేక రాజ్యమన్న భావనను వీడాలి. ఒకనాటి పాలస్తీనా భూభాగంలో ఉండే ప్రజలందరికీ

> మనం ఆశించని రీతిలో చరిత్ర టక్కరి మలుపులు తిరుగుతుంది! గురజాడ ఎప్పుడో అన్నట్లుగా మతములన్నీ మాసిపోయి జ్ఞానమొక్కటే నిలిచివెలిగితే మెజారిటీ, మైనారిటీ భావనలు అంతరించక తప్పదు. సమష్టిజీవనానికి సమభావనను సమకూర్చుకోకా తప్పదు!


సమానహక్కులు కల్పించే విధంగా ఇజ్రాయెల్ రాజకీయ వ్యవస్థ పరిణతి చెందాలి. ఒకప్పుడు రెండు దేశాల ఏర్పాటును సమర్థించిన మేధావులెందరో ఇప్పుడది సాధ్యంకాదనే భావనకు వస్తున్నారు. వెస్ట్‌బ్యాంకులో ఇప్పటికే 5 లక్షలకు పైగా యూదులు నివసిస్తున్నారు. ఇజ్రాయెల్‌కు ప్రాణాధారమైన నీరు అక్కడ నుంచే వస్తుంది. అక్కడి యూదు కాలనీలన్నిటినీ ఖాళీచేసి పాలస్తీనాకు అప్పగించటానికి ఇజ్రాయెల్ సిద్ధంగానూ లేదు. ఇప్పుడున్న పరిస్థితుల్లో గాజా, వెస్ట్‌బ్యాంక్ కలిసి ప్రత్యేక దేశంగా ఏర్పాటుచేసినా ఆర్థికంగా మనగలిగే పరిస్థితులు ఉండవనే వాదన కూడా బలంగానే ఉంది. కొందరు ప్రతిపాదిస్తున్నట్లుగా పాలస్తీనా ప్రజలతో కూడిన అఖండ ఇజ్రాయెల్ ఏర్పడితే బలాబలాలు తలకిందులు అవుతాయి. ఇప్పటికే ఇజ్రాయెల్ జనాభాలో 21శాతం మంది పాలస్తీనా అరబ్బులు ఉన్నారు. గాజా, వెస్ట్‌బ్యాంక్‌లు ఇజ్రాయెల్‌లో విలీనమైతే మొత్తం అరబ్బుల జనాభా 7.6 మిలియన్లు అవుతుంది. అప్పుడు యూదులు (7.2 మిలియన్లు) మైనారిటీలు అవుతారు. ఇక పాలస్తీనా శరణార్థులు 4.4 మిలియన్లు ఉన్నారు. వీరు కూడా అఖండ ఇజ్రాయెల్‌లోకి ప్రవేశిస్తే అరబ్బుల జనాభా 12.2 మిలియన్లకు చేరుతుంది. సొంత మతానికి చెందిన ప్రజల కోసం ప్రత్యేక రాజ్యం కావాలని తహతహలాడిన యూదు జాతీయవాదులకు అటువంటి ఊహే భయానకంగా ఉంటుంది. కానీ కొన్ని భయంకర వాస్తవాలను తప్పించుకోలేని పరిస్థితులూ వస్తాయి. మనం ఆశించని రీతిలో చరిత్ర టక్కరి మలుపులు తిరుగుతుంది! గురజాడ ఎప్పుడో అన్నట్లుగా మతములన్నీ మాసిపోయి జ్ఞానమొక్కటే నిలిచివెలిగితే మెజారిటీ, మైనారిటీ భావనలు అంతరించక తప్పదు. సమష్టిజీవనానికి సమభావనను సమకూర్చుకోకా తప్పదు!

(ఆంధ్రజ్యోతి ఎడిటర్)

ప్రపంచ దృష్టిని ఆకర్షించిన పీఓకే ఆందోళన!

మొన్న బంగ్లాదేశ్, నిన్న నేపాల్, తాజాగా పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)లో ప్రజలు తమ ప్రాథమిక సమస్యలపై ప్రశ్నిస్తూ, రోడ్ల మీదకు వచ్చి ప్రభుత్వాన్ని స్తంభింపజేశారు. పీఓకేలో ఉన్న ఫెడరల్ గవర్నమెంట్‌కి, ఆందోళనకారులకీ మధ్య చర్చలు విఫలమయ్యే నాటికి, కనీసం 10 మంది ఆందోళనకారులు, ముగ్గురు పోలీసులు చనిపోయారు, వందలాది ప్రజలు గాయపడ్డారు. అక్టోబర్ 4న అధికారులు, జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ ఆందోళనకారుల మధ్య చర్చలు జరిగి, ఆందోళనలు విరమించాలని ఒక అంగీకారానికి వచ్చారు.

ప్రధాన సమస్యలపై ఆందోళన మే నెలలో ప్రారంభమై, ఆగస్టు నాటికి జాయింట్ యాక్షన్ కమిటీ నాయకత్వాన మిలిటెంట్ రూపం తీసుకుంది. ఆందోళనకారులు 38 అంశాలతో కూడిన డిమాండ్స్‌ను అధికారులకు సమర్పించి, అవి పరిష్కరించకపోతే తాము తిరిగి రోడ్ల మీదకు వస్తామని ప్రకటించారు. ఆందోళన ప్రారంభమైన ఐదవ రోజున పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ మొత్తం ఆగిపోయింది. ఏడవ రోజు కమ్యూనికేషన్ సిస్టం ఆపివేశారు. చివరికి అక్టోబర్ 1న పాకిస్థాన్ ప్రధానమంత్రి షహబాజ్ షరీఫ్ హై పవర్ డెలిగేషన్‌ను పీఓకే రాజధాని ముజఫరాబాద్‌కు చర్చల కోసం పంపించారు. ఆందోళనకారులు లేవనెత్తిన ఆహారం, విద్యుత్ ధరలు పెరుగుదల, నిరుద్యోగం తదితరాలపై రెండు రోజులపాటు చర్చలు జరిగిన తర్వాత ఆందోళనను విరమించాలని ఒక అంగీకారానికి వచ్చారు. 25 అంశాలతో కూడిన అంగీకార పత్రంపై ఇరుపక్షాలు సంతకాలు చేశాయి. వాటిలో ముఖ్యమైనవి.. కాల్పుల్లో చనిపోయిన వారికి నష్టపరిహారం ఇవ్వాలని, అక్రమ కేసులను రద్దు చేయాలని, పౌరులకు హెల్త్ కార్డులు ఇవ్వటానికి నిధులు విడుదల చేయాలని, మంత్రులను 20 మందికి తగ్గించాలని, వీటితో పాటు అంగీకరించిన హామీలను అమలు చేయటానికి కమిటీని ఏర్పాటు చేయాలని, ఎలక్ట్రిసిటీ సిస్టం అభివృద్ధి చేయటానికి ఫండ్స్ కేటాయించాలని తదితర అంశాలతో ఒప్పందం కుదిరింది.



> ఆజాద్ కశ్మీర్ ప్రజల ఆందోళనకు అనేక దేశాలు సంఘీభావం ప్రకటించినా, భారత ప్రభుత్వం ఎందుకు స్పందించలేదు? ఆజాద్ కశ్మీరీ ప్రజలు స్వతంత్ర దేశంగానే ఉండాలని కోరుకుంటున్నారే కానీ, భారతదేశంలో కలిసిపోవాలన్న ఆకాంక్షను ప్రకటించలేదు.

పీఓకే గురించి మనం చాలా కాలంగా వింటున్నాం. ఈ మధ్య పహల్గాంలో ఉగ్రవాద దాడులకు ప్రతిగా భారత్ సిందూర్ పేరుతో చేసిన ప్రతిదాడుల సందర్భంగా హోం మంత్రి అమిత్ షా పీఓకే మనదేనని, ఇవాళ కాకపోయినా రేపైనా దానిని స్వాధీనం చేసుకుంటామని ప్రకటించారు కూడా. 1994లోనే పీఓకే భారతదేశ అంతర్భాగమని, ఆజాద్ కశ్మీర్ ప్రభుత్వాన్ని గుర్తించటం లేదని భారత పార్లమెంటు ప్రకటించింది. పీఓకేను 'ఆజాద్ జమ్మూ–కశ్మీర్'గా పాకిస్థాన్ ప్రకటించి తన అధీనంలో కొనసాగిస్తున్నది. రాజధానిగా ముజఫరాబాద్‌ను నిర్ణయించి, ప్రధాన మంత్రి గల స్వతంత్ర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. కానీ దానిపై పూర్తి అధికారాలను పాకిస్థాన్ ప్రభుత్వం తన చేతులలో ఉంచుకుంది. పీఓకేలో జనాభా సుమారు 40 లక్షల మంది ఉంటారు. పీఓకేకు ప్రత్యేకంగా హైకోర్టు, సుప్రీంకోర్టులు ఉంటాయి. పాకిస్థాన్ పార్లమెంటులో ఇది భాగం కాదు. అయితే పాకిస్థాన్ ప్రభుత్వంలోని కశ్మీరీ ఎఫైర్స్, గిల్గిట్, బాల్టిస్థాన్ వ్యవహారాలకు సంబంధించిన మంత్రిత్వ శాఖ అధీనంలో ఇది ఉంటుంది. పేరుకు మాత్రమే స్వతంత్ర ప్రతిపత్తి గల రాష్ట్రం.

పాకిస్థాన్ ప్రభుత్వం జమ్మూ కశ్మీర్‌లోని పశ్చిమ ప్రాంతాలను, చైనా–పాకిస్థాన్ బోర్డర్‌లో ఉన్న గిల్గిట్, బాల్టిస్థాన్ ప్రాంతాలను 1947–48లో మొదటి పాకిస్థాన్–భారత్ యుద్ధం సందర్భంగా ఆక్రమించుకుంది. యునైటెడ్ నేషన్స్ దీన్ని వివాద ప్రాంతంగా, దీనికి శాంతియుత పరిష్కారం జరగాలని కోరుతున్నది. దీని సార్వభౌమత్వాన్ని మెజారిటీ దేశాలు గుర్తించటంలేదు.

తాజాగా పాకిస్థాన్ ప్రభుత్వాన్ని పెద్ద ఎత్తున కుదిపేసిన ఆజాద్ కశ్మీర్ ప్రజల ఆందోళనకు అనేక దేశాలు సంఘీభావం ప్రకటించినా, భారత ప్రభుత్వం ఎందుకు స్పందించలేదు! కారణం ఆజాద్ కశ్మీరీ ప్రజలు స్వతంత్ర దేశంగానే ఉండాలని కోరుకుంటున్నారే కానీ, భారతదేశంలో కలిసిపోవాలన్న ఆకాంక్షను ప్రకటించలేదు! ఇప్పటికీ 1977లో ఏర్పడిన జమ్మూ కశ్మీర్ లిబరేషన్ ఫ్రంట్ పేరుతో ఒక సంస్థ పాకిస్థాన్, ఇండియా దేశాల నుంచి ఆ ప్రాంత విముక్తి కోసం పోరాటం చేస్తూనే ఉంది. భారతదేశం ఈ సంస్థని టెర్రరిస్ట్ గ్రూపుగా నిషేధించింది. జమ్మూ–కశ్మీర్ భారతదేశంలో భాగంగా ఉన్నప్పటికీ, ఇప్పటికీ ఆ ప్రాంత ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. జమ్మూ కశ్మీర్‌కు రాజ్యాంగం ప్రసాదించిన ప్రత్యేక రాష్ట్ర ప్రతిపత్తి ఆర్టికల్ 370ని 2019లో అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం రద్దు చేసింది. నాటి నుంచి దానిని తిరిగి పునరుద్ధరించాలని అక్కడి ప్రజలు, రాజకీయ పార్టీలు ఆందోళనలు చేస్తూనే ఉన్నాయి. జమ్మూ కశ్మీర్‌లో అపారంగా ఉన్న సహజ వనరులను మోదీ ప్రభుత్వం ప్రైవేటీకరణ విధానాలలో భాగంగా బడా కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్పడానికి అడ్డంకిగా ఉన్న ఆర్టికల్ 370ని ప్రజాభీష్టానికి వ్యతిరేకంగా రద్దు చేసింది. ఏది ఏమైనా పీఓకే ప్రజలు తమ ప్రాథమిక హక్కులు, ముఖ్యమైన సమస్యలపై పాకిస్థాన్ ప్రభుత్వాన్ని మెడలు వంచే విధంగా చేసిన ఆందోళన ఫలితంగా పీఓకే మరొకసారి ప్రపంచ ప్రజల దృష్టిని ఆకర్షించింది.

■ ముప్పాళ్ళ భార్గవ శ్రీ

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిటొపేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

ఈ రోజు మా చిట్టమ్మ పుట్టినరోజు!

ప్రపంచానికి గుముడవెల్లి రేణుక (మిడ్కో)గా తెలిసిన మా 'చిట్టమ్మ' 55వ పుట్టినరోజు.. ఈ రోజు! ఇప్పుడామె భౌతికంగా, మాకు శాశ్వతంగా దూరమైంది కాబట్టి ఇప్పట్నుంచి జయంతి అనాలేమో. తను మా ఇల్లు వదిలి ఇప్పటికి 22 ఏళ్లు. ఈ కాలంలో, ప్రతి అక్టోబర్ 14న ఇంట్లో మా అమ్మ పాయసం వండి అందరికీ పెట్టడం, రోజంతా ఆమెను తలుచుకొని దుఃఖించడం, గర్వించడం ఆనవాయితీ. అయితే, తను బతికుంటే, తన కార్యరంగమైన దండకారణ్యంలో, సహచర విప్లవకారుల మధ్య తన పుట్టిన రోజును ఎలా జరుపుకునేదో? కేక్‌లు కట్ చేయడాలు, లేదా పార్టీలూ.. ఇవేవీ వాళ్ల ఉద్యమ జీవితంలో ఎలాగూ ఉండవు. అయినా కూడా ఒక రచయితగా, విప్లవకారిణిగా ఎందరికో ఎంతో ప్రేమాస్పదురాలిగా నిలిచిన మా చిట్టమ్మ ఈ రోజు నిజంగా ఏమేం చేసి ఉండేదో?

బహుశా చీకట్లు తొలగిపోకముందే నిద్ర లేచేదేమో. తన పాలిథీన్ షీట్‌లో (గెరిల్లాలు పడుకోవడానికైనా, కూర్చోవడానికైనా, నడుం వాల్చి చదువుకోవడానికైనా, ఎవరితోనైనా కూర్చొని మాట్లాడటానికైనా.. అన్నింటికీ ఉపయోగించేది ఓ ఆరడుగుల పొడవు, మూడడుగుల వెడల్పు ఉండే పాలిథీన్ షీటే) అలాగే కాసేపు కూర్చొని ముందుగా అమ్మను, బాపును తలచుకునేదేమో. వాళ్లను చివరిసారి కలిసి అప్పుడే 22 ఏళ్లయిపోయింది కదా అని ఆశ్చర్యంతో, బాధతో గుర్తుచేసుకునేదేమో. వాళ్లకు ఉత్తరం రాసి కూడా 11 ఏళ్లు గడిచిపోయాయి కదా అని గుర్తొచ్చి ఓ నిట్టూర్పు విడిచేదేమో. వృద్ధాప్యంలో ఇప్పుడు వాళ్లెలా ఉన్నారో అని కాసేపు మనసులోనే దుఃఖించేదేమో. తన జీవిత సహచరులు, అమరులు సంతోష్, శాఖమూరిలను తలచుకునేదేమో. చాలా తక్కువ కాలంలో, అత్యంత విషాదకరంగా ముగిసిన వారిద్దరి సహచర్యం తనలో ఎంత స్ఫూర్తిని నింపిందో కదా అని ఆశ్చర్యపోయేదేమో.

ఇంకా.. తానున్న ప్రాంతం, సందర్భం అనుకూలిస్తే ఈ రోజు పొద్దున్నే స్నానం చేసేది. ఉన్నవాట్లోనే తనకిష్టమైన, శుభ్రమైన బట్టలు వేసుకునేది. కిచెన్‌కు వెళ్లి ఆ రోజు తన సహచరులు బ్రేక్‌ఫాస్ట్‌కు ఏం వండుతున్నారో చూసేది. తనకు నచ్చిన వంటకం ఏదైనా చేయడానికి అవసరమైన దినుసులు ఉన్నాయేమో ఆరా తీసేది. ఉంటే, తన డ్యూటీ అయినా, కాకున్నా, ఏదో ఒకటి వండి వాళ్లను సంతోషపెట్టేది. కానీ తనకీ రోజు ఎందుకు ప్రత్యేకం అని మాత్రం ఎవ్వరికీ చెప్పకపోయేది. ఒకవేళ తానున్న క్యాంపులో తనకు బాగా తెలిసిన సన్నిహితులు ఉంటే వాళ్లతో మాట్లాడేది. తనిలా పొద్దున్నే శుభ్రంగా తయారవడం, ముఖంలో ఆ మెరుపును గమనించి, కళ్లతోనే 'ఏంటి సంగతి' అన్నట్టు చూస్తే, నవ్వేసి ఉండిపోయేది. మెల్లిగా 'ఇవ్వాళ్టితో మనకు 55 నిండినై.. అన్నట్టు' అని జవాబిచ్చేది ముఖమంతా వ్యాపించే తన ట్రేడ్‌మార్క్ చిరునవ్వుతో.

> రేణుక (మిడ్కో), తన 55 ఏళ్ల ప్రయాణంలోని మజిలీలన్నీ ఒక్కొక్కటీ నెమరు వేసుకునేదేమో. ఈ రోజంతా తనకు మా ఊరు కడవెండి, తన బాల్యం, కుటుంబసభ్యులు, ఆత్మీయులు అందరూ గుర్తొస్తూనే ఉండేవారేమో. చిన్నప్పుడు ఇంట్లో, ఊళ్లో తనను 'ఒంటూపిరి ప్రాణం అని వేళాకోళమాడే వాళ్లు, ఇప్పుడెంత గట్టి పిండంగా అయ్యానో' అనుకుని తనలోనే నవ్వుకునేదేమో.



వాళ్లు కూడా తమ సంతోషాన్ని హడావిడిగా మార్చకుండానే, గట్టిగా షేక్‌హ్యాండ్ చేసి, లేదా తనను దగ్గరికి తీసుకొని, హత్తుకొని గ్రీటింగ్స్ చెప్పేవాళ్లేమో. కిట్లో ఉన్న ఓ కొత్త పెన్నునో, లేదా వాడకుండా దాచుకున్న ఓ కొత్త డైరీనో ఆర్భాటం లేకుండా తన చేతిలో పెట్టేవాళ్లేమో. లేదంటే కిట్లో దాచుకున్న బిస్కెట్ ప్యాకెట్ తీసి తనకో ముక్క తినిపించేవాళ్లేమో.

ఆ తర్వాత ఆ రోజు చేయాల్సిన పనులేంటో లెక్క వేసుకునేది. వాటిలో తనకిష్టమైన దాన్ని ముందేసుకునేది. లేదా ఏదైనా మంచి పుస్తకం చదివేది. నచ్చిన కవితల పుస్తకం ఉన్నా, ల్యాప్‌టాప్‌లో స్కాన్ కాపీ ఉన్నా ఓపెన్ చేసి కూర్చునేది. తాను చాలాకాలంగా రాయాలని స్ట్రగుల్ అవుతున్న కథనో, కథనాన్నో మొదలుపెట్టడానికి ప్రయత్నించేది. తనకిష్టమైన విమలక్క పాట– 'ఆదివాసీ ఆత్మబంధువు ఏడికెళ్లినే..' కనీసం రెండు సార్లయినా ప్లే చేసుకొని వినేది. ఆ రోజు ఏదైనా గ్రామానికి వెళ్లాల్సి వస్తే, చంటిపిల్లల తల్లులెవరైనా కలిస్తే కాసేపు వాళ్ల పిల్లలను ఎత్తుకొనేది. ముద్దు చేసేది.

తనను తాను ఎన్ని పనుల్లో ఇన్వాల్వ్ చేసుకోవాలనుకున్నా, ఈ రోజంతా తనకు మా ఊరు కడవెండి, తన బాల్యం, కుటుంబసభ్యులు, ఆత్మీయులు అందరూ గుర్తొస్తూనే ఉండేవారేమో. కడవెండి, మోత్కూరు, తిరుపతి, విశాఖ, బాసధార (ఒడిషా), దక్షిణ బస్తర్, పశ్చిమ బస్తర్, అబూజ్‌మడ్... 55 ఏళ్ల ప్రయాణంలోని మజిలీలన్నీ ఒక్కొక్కటీ నెమరు వేసుకునేదేమో. అడవి జీవితంలో 21 ఏళ్లు గడిచినా, అంతంత మాత్రం ఆరోగ్యమే అయినా, ఇంకా బతికున్నందుకు ఆశ్చర్యపోయేదేమో. చిన్నప్పుడు ఇంట్లో, ఊళ్లో తనను 'ఒంటూపిరి ప్రాణం అని వేళాకోళమాడేవాళ్లు, ఇప్పుడెంత గట్టి పిండంగా అయ్యానో' అనుకుని తనలోనే నవ్వుకునేదేమో.

అలా పొద్దంతా అటూ ఇటూ తిరిగిన మనసుకు, అలసిన శరీరానికి విశ్రాంతి కోసం ఏ అర్ధరాత్రో పాలిథీన్ షీట్‌లో పడుకున్న తర్వాత, అసలు తన ప్రయాణం ఎలా మొదలైందీ.. ఏయే మలుపులు తీసుకుందీ.. అన్నీ నెమరు వేసుకునేదేమో. కడవెండిలో బహుశా ఆరో తరగతిలో ఉన్నప్పుడు తను చదివిన మొదటి నవల 'అమ్మ'ను గుర్తు చేసుకునేదేమో. ఓ పాతికేళ్ల తర్వాత దాన్ని మళ్లీ చదివి, ఆ ప్రపంచ ప్రఖ్యాత నవలకు వందేళ్లు నిండిన సందర్భంగా పరిచయ వ్యాసాన్ని కూడా రాసానని గుర్తు చేసుకునేదేమో. తను మొదటి రోజుల్లో రాసిన 'భావుకత', 'విద్యారపు మనిషి' వంటి కథలకు వచ్చిన అనూహ్య స్పందన.. ఆ తర్వాత విప్లవ రచయితల పరిచయాల్లోకి వచ్చాక ఎదుర్కొన్న సంఘర్షణను గుర్తు చేసుకునేదేమో. ఉద్యమకారిణిగా ఎదుగుతూనే తనలోని కథకురాలిని నిలబెట్టుకునేందుకు కొన్నిసార్లు అయోమయంతో, మరెన్నోసార్లు అమాయకత్వంతో పడ్డ సంఘర్షణను గుర్తుచేసుకునేదేమో.

అప్పుడామెకు ఆ నాటికి తను రాసిన కథలన్నీ తనతోనే చదివించుకొని, వాటిని మెచ్చుకోవడమే కాదు, 'కథ మీద నీకు పట్టు దొరికింది కామ్రేడ్, ప్రొసీడ్' అని వెన్నుతట్టిన తన తొలి సహచరుడు సంతోష్ గుర్తొచ్చేవాడు. సంతోష్‌తో తన తొలి షేక్‌హ్యాండ్ గుర్తొచ్చేది. ఆయనను నల్లమల అడవుల్లో మొదటిసారి కలిసి, ఆ తర్వాత, తిరుపతిలోని తన రూమ్‌కు తిరిగొచ్చాక, కేవలం ఆయన చేతి స్పర్శ తొలగిపోవద్దనే, రోజుకు రెండుసార్లు స్నానం చేసే తను, రెండు రోజులు స్నానం చేయకుండా ఉండిపోవటం, ఆఖరుకు అన్నం కూడా స్పూనుతోనే తిన్న సందర్భం గుర్తొచ్చి ముసిముసిగా నవ్వుకొనేదేమో. అలా విప్లవంలో తన తొలి ప్రేమ రోజుల్ని గుర్తు చేసుకొని సిగ్గుతో ముడిసిపోయేదేమో. చివరిసారి, ఆగస్టు 2, 1999న కాంచీపురం బస్టాండులో విడిపోతున్నప్పుడు 'ఈసారి కలవడం లేట్ కావచ్చు' అన్న సంతోష్ చివరి మాటలు కూడా ఆమెకు గుర్తొచ్చేవేమో. అది జీవితకాలం ఎదురు చూసేంత లేట్ అవుతుందని ఊహించలేకపోయాననే అని ఆమె మనసు మరోసారి మూగగా రోదించేదేమో. కన్నీళ్లు వెచ్చగా చెంపల మీదుగా జారిపోతుంటే.. కలత నిద్రలోకి జారుకునేదేమో.

● గుముడవెల్లి సోమయ్య, జయమ్మ, ప్రసాద్, రాజు
రేణుక (మిడ్కో) కుటుంబ సభ్యులు



జోగి మెడకు నకిలీ మద్యం ఉచ్చు!

మాజీ మంత్రి జోగి రమేశ్ మెడకు నకిలీ మద్యం ఉచ్చు బిగుస్తోంది. అద్దేపల్లి జనార్దనరావు విడుదల చేసిన వీడియో వైసీపీలో ప్రకంపనలు సృష్టిస్తోంది. వైసీపీ ప్రభుత్వ హయాం నుంచి నకిలీ మద్యం తయారు చేశారు. అనేక మంది ఈ మద్యం తాగి ప్రాణాలు కోల్పోయారు. ఎన్నో కుటుంబాలు రోడ్డున పడ్డాయి. ఆది నుంచి జోగి రమేశ్ అనేక వివాదాల్లో ఉన్నారు. నాడు చంద్రబాబు ఇంటిపైన దాడికి యత్నించారు. అగ్రిగోల్డ్ భూముల కబ్జాలోనూ ఉన్నారు.

- ఆది నుంచి అనేక వివాదాల్లో జోగి రమేశ్
- నాడు చంద్రబాబు ఇంటిపైన దాడికి యత్నం
- అగ్రిగోల్డ్ భూముల కబ్జా కేసులోనూ ఆరోపణలు



రమేశ్ పేరు ప్రస్తావిస్తూ వీడియో విడుదల చేసిన జనార్దనరావు

వైసీపీ హయాంలో నకిలీ మద్యానికి అనేక కుటుంబాలు బలి

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): నకిలీ మద్యం తయారీ మూలాల వెనుక మాజీ మంత్రి జోగి రమేశ్ ఉన్నాడని జనార్దనరావు బాంబు పేల్చటంతో జోగి చుట్టూ మరో వివాదం ముసురుకుంది. ఇప్పటికే చంద్రబాబు ఇంటిపై దాడికి యత్నం, అగ్రిగోల్డ్ భూముల కబ్జా కేసుల్లో ఉన్నారు. తాజాగా నకిలీ మద్యం తయారీ వ్యవహారంలో కీలకంగా వ్యవహరించినట్టు తెలుస్తోంది. ప్రభుత్వం నకిలీ మద్యంపై సిట్‌ను కూడా ఏర్పాటు చేయటంతో సమగ్ర విచారణ జరిపి నిందితులకు నోటీసులు ఇచ్చి విచారణకు పిలిచే అవకాశం ఉంది. అవసరమైతే అరెస్టులు కూడా చేసి కస్టడీ కోరనుంది. సిట్ విచారణతో కల్తీ మద్యం గుట్టు తేలే అవకాశం ఉంది. జనార్దనరావు వైసీపీ హయాంలో తాను కల్తీ మద్యం చేసినట్టుగా చెప్పటంతో కల్తీ మద్యం ఎక్కడ పుట్టిందన్నది అర్థమవుతోంది. అప్పట్లో కల్తీ మద్యం ఎవరెవరి సహకారంతో చేశారన్నది సిట్ విచారించనుంది. జనార్దనరావు జోగి రమేశ్ పేరును ప్రధానంగా ప్రస్తావించటంతో పాటు ఆయన ఆధ్వర్యంలోనే తాను నకిలీ మద్యాన్ని తయారు చేసినట్టు అంగీకరించటంతో.. జోగి పాత్రపై సమగ్ర విచారణ జరిగే అవకాశం కనిపిస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భయపడి నకిలీ మద్యం తయారీని తాను మానుకున్నానని, జోగి రమేశ్ తనకు ఫోన్ చేసి నకిలీ మద్యం తయారీకి పురికొల్పారని, టీడీపీ ప్రభుత్వాన్ని భ్రష్టుపట్టించటానికి తనతో నకిలీ మద్యం తయారు చేయించారని, ఇబ్రహీంపట్నంలోనే తాను తయారు చేయాలనుకున్నా.. ప్రభుత్వంపై బురద చల్లటానికి తంబళ్లపల్లె నియోజకవర్గాన్ని ఎంచుకున్నానని టీడీపీ ఎమ్మెల్యే మిగతా 6లో..

జోగి, అద్దేపల్లి చిన్నప్పుడు ఒక బజారులోనే ఉండేవారు

జోగి రమేశ్, జనార్దనరావు ఇద్దరిదీ ఇబ్రహీంపట్నం కావటం గమనార్హం. రింగ్ సెంటర్ దగ్గర జోగి రమేశ్ ఉన్నపుడు జనార్దనరావు తాత ఇల్లు కూడా ఉండేది. జోగికి, జనార్దనరావుకు పరిచయమే లేదన్నది హాస్యాస్పదంగానే ఉంది. అద్దేపల్లి జనార్దనరావు వీడియో విడుదల చేసిన కొద్ది గంటలకే జోగి రమేశ్ తన నివాసంలో ప్రెస్‌మీట్ ఏర్పాటు చేశాడు. ఈ ప్రెస్‌మీట్‌లో అద్దేపల్లి జనార్దనరావుతో తనకు పరిచయమే లేదని బొంకారు. నకిలీ మద్యం కేసులు పట్టుబడక ముందు జనార్దనరావు జోగి రమేశ్‌ను కలవటానికి వచ్చారన్న ఆరోపణలు ఉన్నాయి. దీనిపై మీడియా మిత్రులు అడిగిన ప్రశ్నకు జోగి రమేశ్ వచ్చాడేమో ? బయటున్నాడేమో అంటూ వ్యాఖ్యానించారు. మా తాత, వాళ్ల తాత ఒకే బజారులో ఉండేవారంటూ చెప్పుకొచ్చారు.

అంతా జోగేనని అద్దేపల్లి అంటుంటే.. బట్టలూడదీస్తామంటూ జోగి రంకెలు

ఒకవైపు జనార్దనరావు కథ - స్క్రీన్‌ప్లే - డైరెక్షన్ అంతా జోగి రమేశ్ అని చెబుతుంటే ఆయన మాత్రం ప్రెస్‌మీట్‌లో అంతా చంద్రబాబు అని ఆరోపించారు. రిమాండ్ రిపోర్టులో తన పేరు లేదని జోగి వాదించారు. దర్యాప్తులో భాగంగా తదుపరి రిమాండ్ రిపోర్టులో జోగిని చేర్చటానికి అవకాశం ఉంటుంది. ఈ విషయం తెలిసి కూడా జోగి రిమాండ్ రిపోర్టులో తన పేరు లేదంటూ చెప్పుకొచ్చారు. కృష్ణాజిల్లా తన అడ్డా.. గడ్డ అంటూ పేర్కొంటూ తాను రాజశేఖరరెడ్డి అనుచరుడినని, క్షణికానందం కోసం నన్ను అరెస్టు చేయించవచ్చేమో కానీ తర్వాత మీ బట్టలూడదీస్తాం అంటూ రంకెలు వేశారు. రెడ్‌బుక్‌ను ఫైర్ చేస్తానంటూ అరిచారు.

సీబీఐ ఎంక్వయిరీ డిమాండ్ చేయటంలో ఆంతర్యం ఏమిటి ?

మాజీ మంత్రి జోగి రమేశ్ గత మూడు రోజులుగా ఏదో ఒక సందర్భంలో సీబీఐ ఎంక్వయిరీని డిమాండ్ చేస్తున్నారు. ఆదివారం రాత్రి మైలవరంలో సిట్ విచారణలు కాదని, సీబీఐ ఎంక్వయిరీలు చేయించాలని డిమాండ్ చేశారు. సోమవారం ఉదయం మైలవరంలో ఎక్సైజ్ కార్యాలయంలో మహిళలతో కలిసి వినతిపత్రం ఇచ్చిన సందర్భంలో కూడా జోగి సిట్ గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. మీ సిట్‌లు వల్ల ఉపయోగం లేదని సీబీఐ ఎంక్వయిరీ కోరారు. సిట్ వేస్తారని ముందుగానే జోగికి ఎలా లీకైందన్నది ప్రశ్నార్థకంగా ఉంది.

మీ త్యాగం మరువను!

నిలువనీడలేని రోజున కూర్చునేందుకు చోటిచ్చారు



రాజధాని కోసం భూములిచ్చిన రైతులు, మహిళలతో సీఎం చంద్రబాబు

- ఒక్క మాటతో వేల ఎకరాల భూమినిచ్చారు
- రాజధాని నిర్మాణానికి దారి చూపారు.
- స్థల బలం, ఆడబిడ్డల పోరాటంతోనే నేటి అమరావతి
- సీడ్, కోర్ క్యాపిటల్‌లతో సింగపూర్ అద్భుతమైన ప్లాన్
- అమరావతి నుంచి నేరుగా ఏడు రాష్ట్రాలకు రోడ్లు
- గ్రీన్ ఎనర్జీతో కాలుష్యరహిత నగరంగా తీర్చిదిద్దుతాం
- అట్టహాసంగా ప్రారంభమైన సీఆర్డీఏ కార్యాలయం

రాజధాని రైతులు, మహిళలతో సీఎం చంద్రబాబు భావోద్వేగ ప్రసంగం

గుంటూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): 'రాజధాని రైతులు, ఆడబిడ్డలను మర్చిపోను. రాష్ట్ర విభజన జరిగి రాజధాని లేక, నిలువనీడ కూడా లేని సమయంలో కూర్చునేందుకు చోటు కల్పించి, భూములిచ్చిన మిమ్మల్ని మరిచిపోవడమంటే.. మీ త్యాగాలను మర్చిపోవడమే! ఒక్క పిలుపుతో వేల ఎకరాల భూములిచ్చారు. రాజధాని నిర్మాణానికి దారిచూపారు. రాజధానిని కాపాడుకోవడానికి ఆడబిడ్డలు ఉద్యమించారు. రాజధానిని నిలుపుకోవడం కోసం మీ ఆరాటం, చేసిన పోరాటం, పడిన అవమానాలు, పడ్డ ఇబ్బందులు ఏవీ నేను మర్చిపోలేను. అందుకే రాజధాని రైతులకు రెట్టింపు గౌరవం కల్పిస్తా. వారికి అండగా నిలుస్తా' అంటూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఉద్వేగభరిత ప్రసంగం చేశారు. రాజధాని అమరావతిలోని రాయపూడి గ్రామంలో ఏపీ సీఆర్డీఏ కార్యాలయం సోమవారం ఉదయం సీఎం చంద్రబాబునాయుడు చేతుల మీదుగా అట్టహాసంగా మిగతా 6లో..

ప్రధాని సభకు 250 బస్సులు

ఉమ్మడి కృష్ణాజిల్లా నుంచి వెళ్లనున్న ఆర్టీసీ సర్వీసులు

- నేటి సాయంత్రం నుంచి 17వ తేదీ వరకు కర్నూలులోనే..
- ఈ 3 రోజులు ప్రత్యామ్నాయం చూసుకోవాలని ప్రజలకు ఆర్టీసీ అధికారుల విజ్ఞప్తి

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): కర్నూలులో ఈ నెల 16వ తేదీన జరిగే ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన, బహిరంగ సభను పురస్కరించుకుని రికార్డు స్థాయిలో 3,200 ఆర్టీసీ బస్సులను అద్దెకు తీసుకున్నారు. దీంతో ఉమ్మడి కృష్ణాజిల్లా నుంచి 250 సర్వీసులు కర్నూలు తరలివెళుతున్నాయి. ఎన్టీఆర్ జిల్లా నుంచి 150 బస్సులు, కృష్ణాజిల్లా నుంచి 100 బస్సులు కర్నూలుకు బయలుదేరాయి. మంగళవారం సాయంత్రానికే ఆర్టీసీ బస్సులను కర్నూలులో రిపోర్టు చేయాల్సిందిగా అధికారులు నిర్దేశించారు. కర్నూలులో రిపోర్టు చేసిన తర్వాత అక్కడ అధికారులు ఇచ్చే ఆదేశాలను బట్టి బస్సులను 15వ తేదీన ప్రజలను తీసుకురావాల్సిన ప్రాంతాలకు పంపిస్తారు. 16వ తేదీన సభ ఉంటుంది. సభకు వచ్చిన జనాలను మళ్లీ అదే రోజున గమ్యస్థానాలకు తీసుకువెళ్లాల్సి ఉంటుంది. తిరిగి 17వతేదీ ఉదయం ఈ బస్సులన్నీ ఉమ్మడి కృష్ణాజిల్లాకు బయలుదేరతాయి. అదే రోజు సాయంత్రాని కల్లా ఈ బస్సులు ఆయా డిపోలకు వచ్చే అవకాశం ఉంది. ఈ కారణంగా ఈ నెల 14వ తేదీ నుంచి 17వ తేదీ సాయంత్రం వరకు ఉమ్మడి జిల్లాలో 250 ఆర్టీసీ బస్సులు ఉండవు. అందువల్ల ఈ మూడు రోజులు ప్రయాణికులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని ఆర్టీసీ అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.



కృష్ణాలోనూ నకిలీ మరక

ఈలచెట్ల దిబ్బలో నకిలీ మద్యం సీసాల గుర్తింపు

- ఆరు నెలల క్రితం జరిగిన ఘటన
- గోప్యంగా ఉంచిన వ్యవహారం
- అవనిగడ్డకు చెందిన వ్యాపారే సూత్రధారి
- రిమాండ్ రిపోర్టులో వ్యాపారి పేరు



(ఆంధ్రజ్యోతి - విజయవాడ): రాష్ట్రంలో సంచలనం కలిగించిన నకిలీ మద్యం మరకలు కృష్ణా జిల్లాలో కనిపించాయా? అవనిగడ్డ నియోజకవర్గానికి చెందిన మద్యం వ్యాపారికి ఈ మరకలు అంటుకున్నాయా? కొన్ని నెలల క్రితం బయటపడిన నకిలీ మద్యం సీసాలు భూమిలో సమాధి అయిపోయాయా? అంటే అవుననే జవాబులు విశ్వసనీయవర్గాల నుంచి వస్తున్నాయి. అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లెలోని ములకలచెరువులో నకిలీ మద్యం తయారీ కేంద్రం వ్యవహారం వెలుగులోకి వచ్చిన కొద్దిరోజులకే ఇబ్రహీంపట్నంలోని అద్దేపల్లి జనార్దనరావు ఆధ్వర్యంలో జరుగుతన్న నకిలీ మద్యం తయారీ బయటపడింది. ఈ కేసులో రోజుకో కొత్త కోణం బయటపడుతూనే ఉంది. ఇప్పటి వరకు ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం వరకు పరిమితమైన ఈ నకిలీ వ్యవహారం అవనిగడ్డ నియోజకవర్గంలో ఆరు నెలల క్రితమే తేలినట్టు తెలుస్తోంది. నాగాయకలంక మండలంలోని ఈలచెట్లదిబ్బ గ్రామంలో ఆరు నెలల క్రితం నకిలీ మద్యం సీసాలను గుర్తించినట్టు విశ్వసనీయంగా తెలిసింది. అవనిగడ్డలో వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఆ పార్టీ నేతలతో అంటకాగి, ఇప్పుడు కూటమి గోడలకు జారబడిన మద్యం వ్యాపారి పేరు ఈ క్రమంలో వినిపిస్తోంది. తాజాగా అద్దేపల్లి జనార్దనరావును కోర్టులో హాజరుపరిచినప్పుడు ఎక్సైజ్ పోలీసులు సమర్పించిన రిమాండ్ రిపోర్టులో ఆ మద్యం వ్యాపారి పేరు ఉండడం గమనార్హం.

లంకలను టార్గెట్ చేసుకున్నారా?

అవనిగడ్డ నియోజకవర్గంలో లంక గ్రామాలు ఎక్కువగా ఉంటాయి. ఇక్కడ మత్స్యకార జనాభా అధికం నివసిస్తుంటారు. వారిని టార్గెట్ చేసుకుని నకిలీ మద్యం సరుకును చలామణి చేసినట్టు తెలుస్తోంది. ఈలచెట్లదిబ్బలో కొన్ని నెలల క్రితం ఎక్సైజ్ పోలీసులు తనిఖీలు చేసినప్పుడు ఈ నకిలీ మద్యం సీసాలను గుర్తించినట్టు నియోజకవర్గంలో ప్రచారం నడుస్తోంది. వాటిని గుర్తించిన ఎక్సైజ్ పోలీసులు ఏ జిల్లాకు చెందిన వారన్నది సందేహంగా మారింది. ఈ గ్రామం రేపల్లెకు సమీపంగా ఉంటుంది. అక్కడి నుంచి ఎక్సైజ్ పోలీసులు వచ్చి ఈ నకిలీ మద్యం సీసాలను గుర్తించినట్టు తెలుస్తోంది. ఇప్పటి వరకు వెలుగులోకి రాకుండా ఉన్న ఈ విషయం ఇబ్రహీంపట్నం వ్యవహారంతో తెరపైకి వచ్చింది. రేపల్లె ఎక్సైజ్ పోలీసులు వస్తే ఆ సమాచారాన్ని కృష్ణా జిల్లా ఎక్సైజ్ అధికారులకు ఎందుకు ఇవ్వలేదన్నది ప్రశ్నార్థకంగా మారింది. మొత్తం మీద నకిలీ మద్యం తయారీ విషయం ఎక్సైజ్ శాఖను కుదిపేస్తోంది. అవనిగడ్డ నియోజకవర్గంలో కూటమి నేతలతో చెట్టాపట్టాలు వేసుకుని తిరుగుతున్న ఆ మద్యం వ్యాపారి పేరును జనార్దనరావు పోలీసులకు ఇచ్చిన వాంగ్మూలంలో పేర్కొన్నాడు. ఇదే విషయాన్ని పోలీసులు రిమాండ్ రిపోర్టులో స్పష్టం చేశారు. జనార్దనరావుతో కలిసి హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ఈ7 బార్‌లో అవనిగడ్డకు చెందిన మద్యం వ్యాపారి ఒక భాగస్వామిగా ఉన్నాడు. జనార్దనరావు ఈ బృందాన్ని తీసుకుని గోవాకు వెళ్లినప్పుడు అందులోనూ ఉన్నాడు. అసలు నకిలీ మద్యం తయారీకి ఫార్ములాను రూపొందించిన బాలాజీతో జరిగిన చర్చల్లో పాల్గొన్నాడు. తాను వైసీపీ అధికారంలో ఉన్నప్పటి నుంచి నకిలీ మద్యం తయారు చేస్తున్నట్టు జనార్దనరావు అంగీకరించాడు. ఈ పరిస్థితుల్లో అవనిగడ్డకు చెందిన మద్యం వ్యాపారిపై ఇప్పుడు అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

అవినీతి జలగల దొంగాట!

ఆర్‌డబ్ల్యూఎస్ విభాగంలోని కొందరు అవినీతి అధికారులు దొంగాట మొదలుపెట్టారు. గత వైసీపీ ప్రభుత్వంలో యథేచ్ఛగా చేసిన తప్పులను కూటమి ప్రభుత్వంలో సరిచేసుకునేందుకు కొత్త ప్లాన్ వేశారు. రీ ఎంక్వయిరీ వేయించుకొని క్లీన్ చిట్ పొందేందుకు ఈఎన్‌సీ కార్యాలయంలోని ఓ ఉన్నతాధికారితో బిగ్ డీల్ కుదుర్చుకున్నారు. అందుకు అనుగుణంగా పావులు కదుపుతున్నారు. దీనిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల తీరుపై విమర్శలు

- గత వైసీపీ ప్రభుత్వంలో యథేచ్ఛగా అక్రమాలు
- కూటమి ప్రభుత్వంలో తప్పులను సరిచేసుకునే ప్లాన్!
- రీ ఎంక్వయిరీ వేయించుకొని.. క్లీన్ చిట్ పొందేందుకు యత్నం
- ఈఎన్‌సీ కార్యాలయంలోని ఓ ఉన్నతాధికారితో బిగ్ డీల్!
- అందుకు అనుగుణంగా కదులుతున్న పావులు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): నాడు చేసిన తప్పులను కూటమి ప్రభుత్వంలో కడిగేసుకునేందుకు గ్రామీణ నీటి సరఫరా (ఆర్‌డబ్ల్యూఎస్) విభాగంలోని కొందరు అవినీతి అధికారులు ఈఎన్‌సీ కార్యాలయంలో తిష్టవేసి పైరవీలు ప్రారంభించారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆర్‌డబ్ల్యూఎస్‌శాఖలో భారీ స్థాయిలో అవినీతి, అక్రమాలు జరిగాయి. ఈ అవినీతి బాగోతాలు పత్రికలకెక్కినా నాటి ప్రభుత్వం పట్టించుకోలేదు. లోకాయుక్తకు ఫిర్యాదులు అంది ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే కానీ, అప్పట్లో పంచాయితీరాజ్ అధికారులు చర్యలు చేపట్టలేదు. లోకాయుక్త ఆదేశాలతో విచారణ జరపగా.. అధికారుల అవినీతి బాగోతాలు ఆధారాలతో సహా బయట పడ్డాయి. ఒక డీఈఈ, పలువురు ఏఈలపై అప్పట్లో ఆరోపణలు నిగ్గుతేలాయి. దీంతో మిగతా 6లో..

మాయాబజార్!

- కందులు, పెసలు, మొక్కజొన్నకు గిట్టుబాటు ధరలేక అవస్థలు


6లో

చలి గాలి.. చిరు జల్లు

- జిల్లాలో చల్లని గాలులతో కూడిన వర్షం
- ఉపరితల ఆవర్తన ప్రభావంతో మరో రెండు రోజులు తేలిక పాటి జల్లులు

8లో

దుర్గగుడిలో అంతర్గత బదిలీలు



ఇంద్రకీలాద్రి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఆలయ పరిపాలనా సౌలభ్యం కోసం దుర్గామల్లేశ్వర దేవస్థానంలో పనిచేసే సహాయ కార్యనిర్వహణాధికారులు (ఏఈఓలు), ఈఈలు, పర్యవేక్షకుల (సూపరింటెండెంట్‌లు) అంతర్గత బదిలీ జరిగాయి. ఈ మేరకు ఈవో వీకే శీనానాయక్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ రంగారావుకు సీవీరెడ్డి ఛారిటీలు, భూమి సంబంధిత అంశాలు, ఆర్టీఐ, ప్రజా ఫిర్యాదుల విభాగం అప్పగించారు.

ఏఈవోల బదిలీ

బీవీ రెడ్డికి ప్రధాన ఆలయ సరుకుల స్టోర్, ఉత్సవాలు, పూజలు, చీరల విభాగం, మెయిన్ టెంపుల్‌లోని గోశాల, ఎం.తిరుమలేశ్వరావుకు కేశఖండనశాల, దుర్గాఘాట్ నిర్వహణ, హారతులు తదితరాలను అప్పగించారు. పి.సుధారాణికి అన్నదానం, వసతి సత్రాలు, పి.చంద్రశేఖర్‌కు ప్రసాదాల తయారీ, దత్తత దేవాలయాలు, వేదపాఠశాల, రమేష్‌బాబుకు లీజులు, లైసెన్స్‌లు, ఆడిట్, ట్రస్ట్‌బోర్డు, ప్రథమ చికిత్సా కేంద్రం, కొండమీద, దిగువన కౌంటర్ల పర్యవేక్షణ, కె.గంగాధర్ కనకదుర్గ ప్రభ, పీఆర్వో, ప్రోటోకాల్ విభాగాలు, డోనర్ సెల్, ధర్మపదం, ప్రభుత్వ పథకాలు, సేవాదారుల రిజిస్ట్రేషన్, భక్తుల అభిప్రాయ సేకరణ కౌంటర్ల నిర్వహణ, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ వింగ్ పర్యవేక్షణ అప్పగించారు. ఎం.ఎస్.ఎల్.శ్రీనివాస్ పరిపాలనా విభాగం, సెక్యూరిటీ ఎస్‌పిఎఫ్, హోంగార్డులు, ప్రైవేట్ సెక్యూరిటీ, రికార్డు రూమ్ తదితరాలను అప్పగించారు. ఈఈ కె.వి.ఎస్.ఆర్. కోటేశ్వరరావు అన్ని సెక్యూరిటీ విభాగాలు, నెలవారీ చెల్లింపుల బిల్లులకు సర్టిఫికేషన్ అప్పగించారు. ఈఈ-2 బి.రాంబాబు శానిటేషన్ సూపర్‌విజన్, శానిటరీ విభాగ అన్ని అంశాలు, నెలవారి చెల్లింపుల సర్టిఫికేషన్ అప్పగించారు. సూపరింటెండెంట్‌లు పి.భాగ్యజ్యోతి అన్నదానం, కొండదిగువన కౌంటర్లు, స్టాక్ రిజిస్టర్‌ల వెరిఫికేషన్ (సెకండ్‌షిఫ్ట్) తదితరాలను అప్పగించారు. వై.హేమ దుర్గాంబ కేశఖండనశాల, దుర్గాఘాట్, దుర్గాఘాట్ హారతుల నిర్వహణ, ఆడిట్, తదితరాలను అప్పగించారు. పి.సూర్యనారాయణమూర్తి దత్తత దేవాలయాలు, వసతి గృహాలు, వేదపాఠశాల, కొణిదెన శ్రీనివాసరావు (చందు) ప్రధాన ఆలయం, ఉపాలయాలు, కొండమీద గోశాల, ప్రచార రథం, పూలమాలలు, పూలు, పండ్లు టెండర్ల విభాగం, పి.వి.వి.సత్యనారాయణ లీజులు, భూములు, న్యాయపరమైన అంశాలు, ఆర్టీఐ యాక్ట్ తదితరాలను అప్పగించారు. కె.హరికృష్ణ కనకదుర్గ ప్రభ, టోల్ ఫ్రీ కౌంటర్ తదితరాలను అప్పగించారు. పి.సునీత పండుగలు, పూజలు, ప్రథమ చికిత్సా కేంద్రం, సేవాదార్ల రిజిస్ట్రేషన్, బి.కళ్యాణి సరుకుల స్టోర్, గణాంక విభాగం, జీఎస్టీ, ఐటీ స్క్రూటినీలు, సి.హెచ్.వి.నరసింహరాజు పరిపాలనా విభాగం, సెక్యూరిటీ, శానిటేషన్, ఏజెన్సీల ఫైళ్ల కరస్పాండెన్స్, న్యాయపరమైన అంశాలు, రికార్డు రూమ్, ట్రస్ట్ బోర్డు, పూరెళ్ల శ్రీనివాసరావు ప్రసాదాల తయారీ, కొండదిగువన కౌంటర్ల నిర్వహణ, స్టాకు రిజిస్టర్‌ల వెరిఫికేషన్ (ఫస్ట్ షిఫ్టు), బి.ఎస్.జగదీష్ ప్రసాద్ ప్రధాన ఆలయం, ఉపాలయాలు, చీరల విభాగం, ఎం.శ్రీనివాసరావు ప్రోటోకాల్, డోనార్ సెల్, కొండ పైన కౌంటర్లు, డి.సి.ఆర్, స్టాక్ రిజిస్టర్ వెరిఫికేషన్ (సెకండ్ షిఫ్టు), ఎల్.శ్రీనివాసరావు ప్రోటోకాల్, డోనార్ సెల్,కొండపైన కౌంటర్లు, డి.సి.ఆర్, స్టాక్ రిజిస్టర్ వెరిఫికేషన్ (ఫస్ట్ షిఫ్టు) అప్పగించారు.



వివిధ విభాగాల అధికారులతో మాట్లాడుతున్న ఈవో శీనానాయక్

వినూత్నంగా ఆలోచించండి

- ప్రతి భక్తుడు అమ్మవారిని సంతృప్తికరంగా దర్శనం చేసుకోవాలి : ఈవో శీనానాయక్

ఇంద్రకీలాద్రి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : భక్తుల సౌకర్యాల నిమిత్తం ప్రతి ఉద్యోగి వినూత్నంగా ఆలోచించి, ముందడుగు వేయాలని, రానున్న కార్తీకమాసం, భవాని దీక్షలు సందర్భంగా ప్రతి భక్తుడు దుర్గా మల్లేశ్వరుల దర్శనం సంతృప్తిగా చేసుకొని వెళ్లేలా ప్రణాళిక అమలు చేయాలని ఈవో వీకే శీనానాయక్ కోరారు. సోమవారం మహామండపం 4వ అంతస్తులోని కార్యాలయంలో వైదిక కమిటీ, ఇంజనీరింగ్, వివిధ విభాగాల అధికారులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ, దసరాలో దేవస్థానం సిబ్బంది శ్రద్ధ, పనితీరు, సహనం ప్రతీఒక్కరూ గమనించారని, మరింత బాధ్యత దేవస్థానం యంత్రాంగంపై పెరిగిందన్నారు. భక్తుల నమ్మకం పోకుండా అందరూ తగిన చర్యలు తీసుకోవాలని, ఎక్కడ అలక్ష్యం జరిగినా సహించేది లేదని పేర్కొన్నారు. ధర్మకర్తల మండలి, దేవస్థానం యంత్రాంగం ఒకే దారిలో నడుస్తూ సమన్వయంతో వ్యవహరిద్దామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సివిల్ పనులు, భవానీ దీక్షల విరమణ, గోల్డ్ అండ్ సిల్వర్ అప్రైజర్ క్యాబిన్, హుండీల ఏర్పాటు, ఆశీర్వచనం ప్రాంతం, టెంకాయ, శారీ కౌంటర్లు, విఐపీ లాంజ్, టికెట్ల కౌంటర్లు (కనకదుర్గానగర్), కనకదుర్గానగర్ కాటేజ్‌లు, శ్రీచక్ర నవావరణార్చన, సీసీ కెమెరాలు ఏర్పాటు, తదితర 66 అంశాలపై చర్చించారు. ఆయా విభాగాలకు సంబంధించి మార్గదర్శకాలను జారీ చేశారు.

కనకదుర్గమ్మను దర్శించుకున్న సమాచార పౌర సంబంధాల శాఖ డైరెక్టర్

ఇంద్రకీలాద్రి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ సోమవారం ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, అర్చకస్వాములు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి, వేద మంత్రోచ్ఛరణలతో అంతరాలయానికి తోడ్కొని వెళ్లారు. ఆలయ ప్రధాన అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అమ్మవారి దర్శనానంతరం ఆయనకు ముఖ్య అర్చకులు ఆర్.శ్రీనివాసశాస్త్రి అమ్మవారి చిత్రపటం, లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.



విశ్వనాథన్‌కు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న అర్చకుడు



కళాశాలకు ప్రింటర్, జిరాక్స్ మిషన్‌లు అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

శారదా గోపాలరత్న ఫౌండేషన్ సేవలు అభినందనీయం

- కళాశాలకు ప్రింటర్, జెరాక్స్ మిషన్ల వితరణ

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : శారదా గోపాలరత్న ఫౌండేషన్ లేడీయాంప్తిల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ప్రతిభ గల 18 మంది విద్యార్థులకు యేటా ప్రోత్సాహక నగదు బహుమతులు అందిస్తున్నారని, ఈ విద్యాసంవత్సరంలో రూ.20వేల విలువ గల జిరాక్స్ మిషన్ ఇవ్వడం వల్ల ఎంతో ప్రయోజనం చేకూరుతుందని ప్రిన్సిపాల్ పి.లక్ష్మి అన్నారు. ఫౌండేషన్ ట్రస్టీ ఎ.అనసూయ ఆధ్వర్యంలో సోమవారం కళాశాలకు రూ.20వేల విలువ గల ప్రింటర్, జిరాక్స్ మిషన్లను అందజేశారు. ట్రస్టు సభ్యులు మూర్తి, శర్మ, కళాశాల లెక్చరర్లు హరనాథబాబు, సురేష్, శిరీష తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ ఉత్పత్తులు చేతికి వచ్చే తరుణంలో మార్కెట్లో ధర పడిపోవటం ఆనవాయితీగా మారింది. ఆరుగాలం రేయినక, పగలనక శ్రమటోడ్చి పండించే రైతులకు వ్యాపారుల మాయాజాలం వల్ల గిట్టుబాటు ధర లభించటమన్నది ఎండమావిగా తయారైంది. కేంద్ర ప్రభుత్వం ప్రకటిస్తున్న కనీస మద్దతు ధరలు కూడా రైతులను ఆదుకోవటం లేదు. సకాలంలో పంటను కొని అన్నదాతకు మద్దతుగా నిలబడాల్సిన పాలకులు ఆ దిశగా చర్యలు తీసుకోవటం లేదు. ఏవో సాకులు చూపిస్తూ, కొనుగోలు కేంద్రాలు ప్రారంభించటంలో అధికారులు మీనమేషాలు లెక్కిస్తూ కాలయాపన చేస్తున్నారు. అమ్మబోతే అడవి, కొనబోతే కొరివి అన్నట్టుగా తయారుకావటంతో ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో తమ దుస్థితిని తలుచుకుని రైతులు మానసికంగా కుమిలిపోతున్నారు.





మాయాబజార్!

- కందులు, పెసలు, మొక్కజొన్నలకు గిట్టుబాటుధరేదీ?
- అమ్మబోతే అడవి.. కొనబోతే కొరివి.. నిస్సహాయ స్థితిలో రైతులు

వ్యాపారుల మాయాజాలం.. ధరలు ధమాల్!

(ఆంధ్రజ్యోతి, కంచికచర్ల)

కంచికచర్ల, వీరులపాడు మండలాల్లో గత ఖరీఫ్‌లో రైతులు సుమారు రెండువేల ఎకరాల్లో కంది పంట సాగు చేశారు. సగటున నాలుగు క్వింటాళ్ల వంతున ఫిబ్రవరి మొదటి పక్షంలోపు పంట చేతికి వచ్చింది. అప్పట్లో బయటి మార్కెట్లో క్వింటా కందుల ధర రూ.6100లు మాత్రమే. మద్దతు ధర రూ. 7,550లు. పాలకులు, అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేసినప్పటికీ స్పందన లేదు. మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరావు పుణ్యమా అంటూ రంగంలోకి దిగిన మార్క్‌ఫెడ్ అధికారులు కేవలం 45 టన్నులు మాత్రమే కొన్నారు. ఈక్రాప్‌లో కంది పంట విస్తీర్ణం చాలా తక్కువగా నమోదైంది అంటూ కుంటి సాకులు చెప్పారు. సాధారణంగా కంది పంట సాలుకు సాలుకు వంద అంగుళాలకు పైగా ఎడం ఉంటుంది. ఎక్కువ స్థలం ఖాళీగా ఉంచకుండా రైతులు కందిలో అంతర పంటగా మొక్కజొన్న సాగు చేస్తున్నారు. వ్యవసాయాధికారులు మాత్రం ఎకరంలో 20శాతం కంది పంట, 80 శాతం మొక్కజొన్నగా ఈ క్రాప్‌లో నమోదు చేశారు. రైతులు గత్యంతరం లేక కందులను ఏదో ఒక ధరకు తెగనమ్ముతున్నారు. గత నెలలో క్వింటా రూ.5,800 అమ్మారు. ప్రస్తుతం రెండు రోజుల నుంచి రూ. 6350 వరకు పలుకుతోంది.

10వేల ఎకరాల్లో పెసర, మినుము సాగు..

కంచికచర్ల, వీరులపాడు మండలాల్లో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో పదివేల ఎకరాల్లో రైతులు పెసర, మినుము పంట సాగుచేశారు. భారీ వర్షాలకు మినుము పంట ఎక్కువ భాగం దెబ్బతిన్నది. పెసర మాత్రం ఎకరానికి రెండు నుంచి నాలుగు క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. గత నెల మొదటి వారంలో పంట పూర్తిగా చేతికి అందింది. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటా రూ. 8,768లు. బయటి మార్కెట్లో వ్యాపారులు రూ.6000కి కూడా కొనటం లేదు. పెసలు కొనుగోలు చేయాల్సిందిగా రైతులు వేడుకుంటున్నప్పటికీ స్పందన శూన్యం. మద్దతు ధర వస్తుందన్న ఆశతో శీతల గిడ్డంగుల్లో, మార్కెట్ యార్డుల్లో, ఇళ్లల్లో రైతులు పెసల బస్తాలు నిల్వ చేశారు. రైతులు స్థానిక యార్డు చుట్టూ తిరుగుతున్నారు. గత మూడేళ్లుగా మార్క్‌ఫెడ్ పెసలను కొనకపోవడంతో రైతులు నిల్వ చేస్తూనే ఉన్నారు. గతేడాది కొంటామంటూ రైతులను సీఎం యాప్‌లో పేర్లు నమోదు చేసుకోమన్నారు. రైతుల ఫోన్లకు మేసేజ్‌లు కూడా పంపారు. కాని కిలో కూడా కొన్న దాఖలా లేదు.

పదివేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు..

కంచికచర్ల, వీరులపాడు, నందిగామ, చందర్లపాడు మండలాల్లో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో పదివేల ఎకరాల్లో రైతులు మొక్కజొన్న సాగుచేశారు. ప్రస్తుతం కోతలు జరుగుతున్నాయి. ఎకరానికి 20 నుంచి 25 క్వింటాళ్ల దిగుబడి వస్తున్నది. పంట కోసిన తర్వాత మొక్కజొన్న రెండు మూడు రోజులు ఆరాల్సి ఉంది. వారం రోజుల నుంచి తెరపి లేకుండా వర్షాలు పడుతుండటంతో మొదట్లో కోసిన పంట ఆరుదల కోసం రైతులు పడిన ఇబ్బందులు వర్ణనాతీతం. మద్దతు ధర రూ.24 వందలు కాగా, బయటి మార్కెట్లో రూ.19 వందల నుంచి రూ.1950లోపు కొంటున్నారు. క్వింటాకు నాలుగు వందలకు పైగా రైతులకు నష్టం జరుగుతున్నది. పంట కోసిన రైతులు దాదాపుగా వ్యాపారులకు అమ్మేశారు. వర్షం వల్ల ప్రస్తుతం కోతలు జరగటం లేదు.



కందులు కొనుగోలు చేయాలని వేడుకుంటున్న రైతులు

రైతులకు న్యాయం చేయండి

ఏది ఏమైనా ప్రకటనలు కాదు.. క్షేత్రస్థాయిలో జరుగుతున్న వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకోవాలి. పంటల సాగునుంచి అమ్మకాల వరకు బాధలు, కష్టాలు, నష్టాలు గురించి క్షుణంగా తెలుసుకున్నప్పుడు రైతులకు న్యాయం జరుగుతుంది. ప్రస్తుతం బాధిత రైతులందరూ ప్రభుత్వ మద్దతు కోసం వేయికళ్లతో ఎంతో ఆశగా నిరీక్షిస్తున్నారు. పాలకులు తక్షణం స్పందించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ, హాజరైన అధికారులు

చిన్న నీటిపారుదల పునరుద్ధరణకు రూ.7.50కోట్లు

మచిలీపట్నం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఆరు చిన్ననీటివనరుల పథకాలను పునరుద్ధరించేందుకు జిల్లాస్థాయి అమలు పర్యవేక్షణ కమిటీ తీర్మానం చేసింది. జిల్లాపరిషత్ సీఈవో చాంబరులో సోమవారం కలెక్టర్ బాలాజీ అధ్యక్షతన జిల్లాస్థాయి కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జలవనరులను పునరుద్ధరించి సాగుకు అవసరమైన నీటిని అందించడానికి ఆర్‌ఆర్‌ఆర్ పేరుతో ప్రయోగాత్మక పథకానికి కేంద్రప్రభుత్వం అనుమతులు ఇచ్చిందన్నారు. ఈ నేపథ్యంలో నీటిసంఘాల ప్రతినిధులతో చర్చించి జలవనరుల పథకాలను పునరుద్ధరించాలని నిర్ణయించామన్నారు. గన్నవరం మండలం వెదురుపావులూరు, పురుషోత్తపట్నం, వీరపనేనిగూడెం, చిక్కవరం, బాపులపాడుమండలం కొయ్యూరు. వీరవల్లి గ్రామాల్లోని చెరువులను పునరుద్ధరించేందుకు రూ.7.50కోట్ల అంచనాలతో ప్రతిపాదనలు తయారుచేసి కేంద్రప్రభుత్వానికి పంపనున్నట్టు కలెక్టర్ తెలిపారు. సమావేశంలో జలవనరులశాఖ ఎస్ఈ ఆర్.మోహనరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బి.సోమశేఖర్, డ్వామా పీడీ ఎన్‌వీ శివప్రసాద్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

22నుంచి బ్యూటీషియన్ కోర్సుపై శిక్షణ

ఉంగుటూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాజిల్లా, ఉంగుటూరు మండలం, ఆత్కూరు, స్వర్ణభారత్‌ట్రస్ట్ ప్రాంగణం(విజయవాడ చాప్టర్)లోని యూనియన్ బ్యాంక్ స్వశక్తి గ్రామీణ స్వయంఉపాధి శిక్షణాకేంద్రం(యూబీఆర్‌ఎస్ఈటీఐ)లో ఈనెల 22నుంచి మహిళలకు జూనియర్ బ్యూటీ ప్రాక్టీషనర్/బ్యూటీ పార్లర్ బ్యూటీషియన్ కోర్సులో ఉచిత శిక్షణా తరగతులు ప్రారంభిస్తున్నట్టు శిక్షణాకేంద్రం డైరెక్టర్ వి.అమరేశ్వరరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ఉమ్మడి కృష్ణాజిల్లాల్లోని గ్రామీణప్రాంతాలకు చెందిన నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించాలనే ఉద్దేశ్యంతో భారత ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి సంస్థ, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సంయుక్తంగా పలు వృత్తినైపుణ్యకోర్సుల్లో శిక్షణ అందజేస్తున్నట్టు పేర్కొన్నారు. బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ పొందేందుకు 10వ తరగతి చదివి, 19నుంచి 45 మధ్య వయసుగల ఉమ్మడి కృష్ణాజిల్లాల్లోని గ్రామీణప్రాంత యువతులు అర్హులని తెలిపారు. 35రోజుల కాలవ్యవధితో కూడిన కోర్సులో శిక్షణ పొందేందుకు ఆసక్తిగల నిరుద్యోగ మహిళలు ఈనెల 20లోగా తమ విద్యార్హతల సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డ్, రేషన్‌కార్డు, నాలుగు పాస్‌పోర్ట్‌సైజ్ ఫోటోలతో నేరుగా కార్యాలయానికి విచ్చేసి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. శిక్షణాకాలంలో అభ్యర్థులకు శిక్షణ, వసతి, భోజన సదుపాయాలు పూర్తిగా ఉచితమన్నారు. శిక్షణ పూర్తిచేసిన అభ్యర్థులకు సర్టిఫికెట్లు, టూల్ కిట్లు అందజేస్తామని తెలిపారు. వివరాలకు 6304254730(రామకృష్ణ), 9490011081(శ్రీహరి), 7416169916 (గోపి)ఫోన్‌నెంబర్లలో సంప్రదించాలి

మీ త్యాగం మరువను!

(5వ పేజీ తరువాయి)

ప్రారంభమైంది. కార్యాలయంలోని సీఆర్డీఏ, సీడీఎంఏ, ఏడీసీఎల్, మినిస్టర్ చాంబర్లను ప్రారంభించారు. ఏడంతస్తులు తిరిగి కార్యాలయంలోని ఏర్పాట్లను పరిశీలించారు. గ్రౌండ్ ఫ్లోర్లో ఏర్పాటు చేసిన ధ్యాన బుద్ధ లోహ విగ్రహాన్ని, రిసెప్షన్, క్యాంటీన్‌లను పరిశీలించారు. ఫస్ట్ ఫ్లోర్లోని కాన్ఫరెన్స్ హాళ్లను పరిశీలించారు. అనంతరం రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచంలో ఎక్కడా లేని ల్యాండ్ పూలింగ్ కాన్సెప్టును తీసుకు వచ్చి ఒక్క పిలుపు ఇస్తే వేల ఎకరాలు ఇచ్చి, రాజధాని నిర్మాణానికి ముందుకు వచ్చిన రైతుల త్యాగాలను ఆయన కొనియాడారు. ప్రజాధనాన్ని ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయకుండా నిర్మిస్తున్న సెల్ఫ్ మానిటైజేషన్ నగరమని, విమర్శకులు ఆ విషయం గుర్తించాలని హితవు పలికారు. సీడ్ క్యాపిటల్, దాని చుట్టూ కోర్ క్యాపిటల్, ఆ తరువాత సీఆర్డీఏ రీజియన్‌లతో సింగపూర్ అద్భుతమైన మాస్టర్ ప్లాన్ ఇచ్చిందని, దానితో రైతుల భవిష్యత్తు రాబోయే రోజుల్లో అద్భుతంగా మారుతుందని చెప్పారు. రైతులు అందివచ్చిన అవకాశాన్ని వదులుకోవద్దని, వారి భూములను అమ్ముకోవద్దని విజ్ఞప్తి చేశారు. హైటెక్ సిటీ రాక ముందు ఎకరా లక్ష రూపాయలు ఉన్న భూములు ఇప్పుడు ఎకరా 170 కోట్లు ఉందని చెప్పారు. దీనిని బట్టి భవిష్యత్ నగరం ఎలా ఉండబోతోందో ఆలోచించుకోవాలన్నారు. రాజధాని గ్రీన్ ఎనర్జీతో కూడిన కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దబోతున్నామన్నారు. ఒక వైపు కృష్ణమ్మ, మరోవైపు పచ్చని చెట్లతో అద్భుత నగరంగా అమరావతి ఉండబోతోందన్నారు. రాజధానిలో అద్భుతమైన రోడ్లు నిర్మిస్తున్నామన్నారు. రాజధానిలోని ఏడు రోడ్లు నేరుగా ఇతర రాష్ట్రాలకు వెళతాయన్నారు. డ్రెయిన్లు, వాటర్ లైన్లు, విద్యుత్ లైన్లు అన్నీ ప్రత్యేకించి యుటిలిటీ డక్టుల్లో నిర్మిస్తున్నామని చెప్పారు. తద్వారా రేపటి అమరావతి అద్భుత నగరంగా మారబోతోందని చెప్పారు.

అమరావతికి స్థల బలం..

దేవతల రాజధాని అమరావతి అయితే.. మన ప్రజా రాజధాని అమరావతి అని సీఎం కొనియాడారు. దేశంలోని దేవాలయాల నుంచి మట్టి, పవిత్ర జాలలు తెచ్చి దేవుడి ఆశీస్సులతో ప్రారంభమైన నగరమని అన్నారు. సాక్షాత్తూ ప్రధాని పార్లమెంటులోని మట్టి, యమునా నదీ జలాలు తెచ్చి అమరావతికి తోడ్పాటునిచ్చారన్నారు. ఇప్పుడు కూడా రాజధానికి ప్రధాని ఎంతో తోడ్పాటునిస్తున్నారన్నారు. రాజధాని నిర్మాణాన్ని పూర్తి చేసే బాధ్యత తనదేనని, అందుకు ప్రజలు సహకరించాలని కోరారు. ఆ బాధ్యతతోనే పవన్ కల్యాణ్, బీజేపీతో కలిసి పనిచేస్తున్నామన్నారు. 2047 వరకూ ఇదే ఒరవడి కొనసాగితే అమరావతికి అద్భుతమైన భవిష్యత్తు ఉంటుందన్నారు. అప్పటి వరకూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

త్యాగాల ఫలితాలు రైతులే అనుభవించాలి

రాజధాని కోసం రోడ్డెక్కి పోరాడిన అమరావతి మహిళా రైతుల త్యాగం మరవలేనిదన్నారు. గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా అనేక ఉద్యమాలు చేసి, వారు పడ్డ అవమానాలు, బాధలు అన్నీ గుర్తేనన్నారు. అందుకే తాను కూడా జోలె పట్టి వారికి అండగా నిలిచామన్నారు. కష్టాలు మరిచిపోవద్దని, రైతులు చేసిన త్యాగాల ఫలితాలను రైతులే అనుభవించాలన్నారు. ఫేజ్-1లో ల్యాండ్ పూలింగ్ కింద భూములిచ్చారని గత పాలకులు రైతులను నానా హింసలు పెట్టారని సీఎం గుర్తుచేశారు. రాజధాని ఎడారని, స్మశానమనమని. వేశ్యల రాజధాని అనే స్థాయికి వారి ఉన్మాదం చేరిందని వాటన్నిటికీ సమాధానం చెప్పేలా రాజధానిని నిర్మిస్తానని చెప్పారు. రైతులకు రెట్టింపు గౌరవం దక్కేలా.. రెట్టింపు ఫలాలు అనుభవించేలా చేస్తా' అంటూ సీఎం హామీనిచ్చారు. రైతులు వచ్చిన అవకాశాన్ని అందిపుచ్చుకుంటే అనుకున్న లక్ష్యాలు సాధిస్తారన్నారు. ఇంటికో పారిశ్రామికవేత్త విధానం అమరావతి నుంచే ప్రారంభం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రి నారాయణ, ఎమ్మెల్యేలు తెనాలి శ్రావణ్ కుమార్, ధూళిపాళ నరేంద్ర, కొలికపూడి శ్రీనివాసరావు, మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

అవినీతి జలగల దొంగాట!

(5వ పేజీ తరువాయి)

అప్పటి రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయితీరాజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ బుడితి రాజశేఖర్ బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాల్సిందిగా కూడా నిర్దేశించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వైసీపీ హయాంలో తప్పులు చేసిన వారిపై పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటారని అంతా భావించారు. ఇక తమ పని అయిపోయిందని అవినీతి అధికారులంతా భయపడ్డారు. తమకు కలసి వచ్చే సమయం కోసం ఎదురుచూశారు. ఇంజనీర్ ఇన్ చీఫ్ కార్యాలయంలో ఒక ఉన్నతాధికారితో డీల్ పెట్టుకున్నారని తెలిసింది. బేరసారాలు అన్నీ కుదుర్చుకున్నారని సమాచారం. దొడ్డిదారిన రీ ఎంక్వయిరీ చేయించి తప్పులు నిర్ధారణ కాలేదన్నట్టుగా ఉన్నతస్థాయిలో నివేదిక పంపి అందరికీ క్లీన్‌చిట్ ఇచ్చేందుకు రహస్య ఒప్పందం కుదిరినట్టు తెలిసింది. ఈ డీల్ కోసం భారీ ఎత్తున నగదు సిద్ధం చేసినట్టు తెలుస్తోంది. ఈ వ్యవహారానికి సంబంధించి చాపకింద నీరులా అన్నీ జరిగిపోతున్నాయని గుసగుసలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వానికి నివేదిక పంపి అందరికీ క్లీన్‌చిట్ ఇచ్చేందుకు ప్రయత్నం చేస్తున్న దశలో ఇవన్నీ వెలుగులోకి వచ్చాయి.

అప్పట్లో జరిగిన అక్రమాల్లో కొన్ని..

విజయవాడ రూరల్ మండలం రాయనపాడు, పైడూరుపాడు గ్రామాల్లో రక్షిత మంచినీటి పనులకు సంబంధించి అవినీతి జరిగింది. జీఐ పైపులు సిమెంట్ రోడ్డు మీద వేయగా.. భూమి తవ్వి లోపల వేసినట్టుగా రికార్డు జరిగింది. ఏఈ అడ్డగోలుగా రికార్డు చేయగా.. ఇన్‌చార్జి డీఈఈ చెక్‌మెజర్‌మెంట్ చేశారు. ఇన్‌చార్జి ఈఈ పేమెంట్‌కు క్లియర్ చేశారు. చందర్లపాడు మండలంలో రక్షిత మంచినీటి పైపులైన్లకు సంబంధించి 63 ఎంఎం డయా పైపులు వేశారు. కానీ 75 ఎంఎం డయా పైపులు వేసినట్టుగా రికార్డు చేశారు. పైపులు వేసిన నిర్ణీత దూరం కంటే కూడా ఎక్కువగా వేసినట్టు రికార్డు చేశారు. కంచికచర్లలో హెచ్‌డీపీఈ పైపులు కాకుండా డూప్లికేట్ పైపులు వేయటంతో.. అవి ప్రెజర్ టెస్ట్‌లో పగిలిపోయాయి. ఇలా చెప్పటానికి అనేక అక్రమాలు ఉన్నాయి. ఈ అక్రమాలకు సంబంధించి అప్పటి ఇన్‌చార్జి ఈఈ రింగ్ మాస్టర్‌గా వ్యవహరించారని ఆరోపణలు ఉన్నాయి. ఈ అక్రమాలపై లోకాయుక్తకు ఫిర్యాదు అందిన తర్వాత క్వాలిటీ కంట్రోల్ విభాగం నేతృత్వంలో తనిఖీలు నిర్వహించగా, అక్రమాలు నిజమని తేలింది. వీటిపై అప్పటి ఈఎన్‌సీ కార్యాలయంలోని చీఫ్‌ఇంజనీర్ సంజీవ్ రెడ్డి పంచాయితీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ ఉన్నతాధికారులకు నివేదికిచ్చారు. ఆ తర్వాత అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్నవారిపై చార్జ్‌ఫ్రేమ్స్ ఇవ్వటం జరిగింది.

జోగి మెడకు నకిలీ మద్యం ఉచ్చు!

(5వ పేజీ తరువాయి)

జయచంద్రారెడ్డికి సంబంధం లేదని జోగి రమేశ్ తనను నమ్మించి మోసం చెయ్యటంతోనే తాను నిజం చెబుతున్నానని వీడియో విడుదల చేయటంతో జనార్దనరావు, జోగి రమేశ్‌ల బంధం ఏమిటన్నది చర్చనీయాంశంగా మారింది.

అద్దేపల్లిని జోగి అడ్డంగా ఇరికించాడా?

రాజకీయ ప్రయోజనాల కోసం అద్దేపల్లిని మాజీ మంత్రి జోగి పావుగా వాడుకున్నాడా అన్న ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. జనార్దనరావు నకిలీ మద్యం తయారు చేసిన వ్యవహారం వెలుగులోకి వచ్చాక కూటమి ప్రభుత్వం దీనిపై దృష్టి సారించింది. టీడీపీ ఎమ్మెల్యే జయచంద్రారెడ్డితో పాటు మరికొందరిని సస్పెండ్ చేసింది. దీంతో పాటు బాధ్యులైన వారిని ఎవ్వరినీ వదలవద్దని ఆదేశించటంతో .. అద్దేపల్లి తాను కేసులో ఇరుక్కుపోయానని భావించి లొంగిపోయాడా అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇదే విషయాన్ని జనార్దనరావు కూడా తన వీడియోలో ప్రస్తావించాడు. తనను దక్షిణాఫ్రికా పంపించింది కూడా జోగి రమేశ్ అని, తనను బెయిల్ మీద బయటకు తీసుకువస్తానని చెప్పి పట్టించుకోలేదని చెప్పటంతో జోగి రమేశ్, అద్దేపల్లి జనార్దనరావును పావుగా ఉపయోగించుకున్నాడా అన్న అనుమానాలు కూడా కలుగుతున్నాయి.



కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు

సుప్రీం సీజేపై దాడిని నిరసిస్తూ ఎమ్మార్పీఎస్ ధర్నా

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై దాడిని ఖండిస్తూ ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పి, విహెచ్‌పిఎస్ నాయకులు కలెక్టరేట్ వద్ద నిరసన, ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా కృష్ణాజిల్లా ఇన్‌చార్జి, ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు జలదంకి నరసింగరావు మాదిగ మాట్లాడుతూ, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి యత్నాన్ని నిరసిస్తూ కృష్ణాజిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన నిర్వహించడం జరిగిందన్నారు. చీఫ్ జస్టిస్‌పై దాడి అనాగరికమైంది, ఈ దాడి ప్రజాస్వామిక స్ఫూర్తి, రాజ్యాంగం మీద జరిగిన దాడిగానే ఉందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దాడి దళిత పీడిత వర్గాల ప్రజలను తీవ్ర మనోవేదనకు గురిచేసిందని, దేశ ప్రజలందరూ దీనిని ఖండించారన్నారు. ధర్నా అనంతరం జిల్లా డీఆర్వోకి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఎంఎస్‌పి కృష్ణాజిల్లా ఇన్‌చార్జి సిద్దెల జయరాజు మాదిగ, ఎమ్మార్పీఎస్ కృష్ణాజిల్లా అధ్యక్షుడు పసుమర్తి దినేష్ మాదిగ, ఎమ్మార్పీఎస్ కృష్ణాజిల్లా ఉపాధ్యక్షులు చిట్టూరి అర్జునరావు మాదిగ, గన్నవరం నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద వేణు మాదిగ, మచిలీపట్నం ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మట్టా గోపాలకృష్ణ, అవనిగడ్డ నియోజకవర్గ అధ్యక్షుడు కొడాలి ఏలియా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గూగుల్‌తో ఒప్పందం విప్లవాత్మకం: వర్ల

అమరావతి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర యువతకు 20 లక్షల ఉద్యోగాలను సృష్టించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గూగుల్ అనుబంధ సంస్థ రైడన్‌తో మంగళవారం చేసుకోనున్న ఒప్పందం విప్లవాత్మకమైనదన్నారు. దక్షిణాసియాలోనే అతిపెద్ద డేటా సెంటర్ క్లస్టర్‌ను విశాఖలో నిర్మించడానికి ఇది శ్రీకారమని అన్నారు. ఈ ఒప్పందం రాష్ట్రాభివృద్ధికి గొప్ప ఊతమిస్తుందని తెలిపారు.

పాఠశాల లైబ్రరీలకు పుస్తకాల ఆహ్వానం

అమరావతి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విద్యా సంస్థల్లోని పాఠశాల లైబ్రరీల్లో పాఠ్యేతర పుస్తకాల కోసం ప్రచురణ సంస్థలు, రచయితల నుంచి పుస్తకాలు ఆహ్వానిస్తున్నట్లు సమగ్ర శిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రచురణ సంస్థలు, రచయితలు వారి నమూనా పుస్తకాలను ఈనెల 30నాటికి విజయవాడలోని సమగ్రశిక్ష కార్యాలయానికి పంపాలని కోరారు. ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ ప్రాథమిక ఆమోదం అనంతరం రాష్ట్ర కమిటీ తుది నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. ఆ తర్వాత టెండరు ప్రక్రియ ద్వారా పుస్తకాలు కొనుగోలు చేస్తామని పేర్కొన్నారు.

మత్స్యకారుల బీమా నిధులు విడుదల

అమరావతి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రమాదవశాత్తు మరణించిన మత్స్యకారులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న గ్రూప్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ స్కీం కింద రూ.5.30 కోట్ల విలువైన క్లైములను ఉపయోగించుకోవటానికి ప్రభుత్వం మత్స్యశాఖకు అనుమతి ఇచ్చింది. 19 జిల్లాల్లోని 106 మంది మత్స్యకారుల డెత్ క్లైములను పరిష్కరించడానికి ఈ నిధులు విడుదల చేసింది. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

వైసీపీ తోరణాలు తొలగించినందుకు టీడీపీ కార్యకర్త ఇంటిపై దాడి

సొబ్బాల(గంపలగూడెం) అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ స్థలంలో కట్టిన వైసీపీ తోరణాలు తొలగించినందుకు, టీడీపీ కార్యకర్త దారెల్లి పుల్లయ్య ఇంటిపై వైసీపీ కార్యకర్తలు దాడిచేసిన ఘటన ఆదివారం రాత్రి జరిగింది. సొబ్బాల గ్రామంలోని దళితవాడలో 10 సెంట్ల ఖాళీ ప్రభుత్వ స్థలంలో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. ఈ నేపథ్యంలో వైసీపీకి చెందిన ఓ కార్యకర్త స్థలంలో ఓ స్తంభాన్ని ఆధారం చేసుకొని, తనఇంటి వరకు వైసీపీ తోరణాలు కట్టాడు. ఈ విషయాన్ని గ్రామసర్పంచ్, టీడీపీ నేత వున్నం కృష్ణారావుకు దళితవాడకు చెందిన టీడీపీ కార్యకర్తలు తెలిపారు. వాటిని రెండురోజుల్లో తొలగించాలని సర్పంచ్ వైసీపీ కార్యకర్తలకు తెలిపారు. తోరణాలు తొలగించకుండా ఏంచేస్తారో చేయండని వైసీపీ కార్యకర్తలు చెప్పడంతో సర్పంచ్ టీడీపీ కార్యకర్తలతో వైసీపీ తోరణాలు తొలగించారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ తీవ్రస్థాయికి చేరడంతో, వైసీపీ కార్యకర్తలు రాళ్లు కర్రలతో టీడీపీ కార్యకర్త దారెల్లి పుల్లయ్య ఇంటిపై దాడిచేసి, సమీపంలో ఉన్న కొంగల బాబురావును గాయపర్చారు. వెంటనే పోలీసులు రంగంలోకి దిగి ఇరువర్గాలను చెదరగొట్టారు. జరిగిన ఘటనపై గ్రామ ఉపసర్పంచ్ గొల్లమందల రామకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్ఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	130,139, 150
చికెన్ విత్ స్కిన్	248
చికెన్ స్కిన్‌లెస్	258

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 525

ఐటీఐలో ప్రవేశానికి ఆన్‌లైన్ దరఖాస్తులు

భారతీనగర్: జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో 2025-26/27 విద్యా సంవత్సరానికి ఐదో విడత అడ్మిషన్స్ పొందడానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తామని ఐటీఐ ప్రధానాధికారి, కన్వీనర్ ఎం.కనకారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 8వతరగతి, పదో తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అభ్యర్థులు ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్ సైట్ ద్వారా ఈనెల 16లోగా దరఖాస్తు చేసుకోవాలి, అదే రోజు సాయంత్రం 4గంటలలోపు వెరిఫికేషన్ పూర్తి చేసుకోవాలని తెలిపారు. ఎస్ఎంఎస్‌ల ద్వారా అభ్యర్థులకు కౌన్సెలింగ్ వివరాలు తెలియజేస్తారని, ఎస్ఎంఎస్‌లు అందనివారు ఐటీఐలో సంప్రదించాలని తెలిపారు. 17న కౌన్సెలింగ్ జరుగుతుందని తెలిపారు.

జీఎస్టీతో ప్రతి కుటుంబానికి మేలు


జీఎస్టీ తగ్గింపుపై 13వ డివిజన్ నాయకులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

గుణదల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ సంస్కరణల వల్ల ప్రతి కుటుంబానికి మేలు జరిగిందని తూర్పు ఎమ్మెల్యే గద్దే రామ్మోహన్ తెలిపారు. 13వ డివిజన్‌లో సోమవారం పర్యటించి స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రధాని మోదీ తీసుకువచ్చిన సంస్కరణలను ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రంలో చక్కగా అమలు చేస్తున్నారని చెప్పారు. జీఎస్టీ-20 సంస్కరణలపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వంట నూనెలు తప్ప అన్ని వస్తువులపై ధరలు తగ్గాయని తెలిపారు. ఇన్సూరెన్స్ ప్రీమియంలపై జీఎస్టీ లేకపోవడం వల్ల చాలా మంది ప్రీమియంలు తీసుకుంటున్నారని, దీని వల్ల వారి జీవితాలకు భరోసా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్, గద్దె ప్రసాద్, నూతి శ్రీను, వీరంకి డాంగే కుమారి, తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా సంపు నిర్మాణం

రామలింగేశ్వరనగర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రామలింగేశ్వరనగర్‌లో కృష్ణానది రిటైనింగ్ వాల్ సమీపాన భారీ సంపు నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. సర్కిల్-3 పరిధిలోని రాణిగారితోట, రామలింగేశ్వరనగర్, ఆటోనగర్ వెనుక ఉన్న కనకదుర్గానగర్ ప్రాంతాల్లోని తాగునీటి ఓవర్ హెడ్ ట్యాంకులకు శుద్ధి చేసిన తాగునీటిని అందించేందుకు ఈ సంపు నిర్మాణం జరుగుతుందని అధికారులు తెలిపారు. ఈ భారీ సంపు నిర్మాణానికి ప్రభుత్వం రూ.76 కోట్లను కేటాయించింది. నెల రోజుల క్రితమే దీని పనులకు శంకుస్థాపన జరిగింది. బేస్‌మెంట్ పనులు పూర్తయ్యాయి. నూతన సంపు నిర్మాణం పూర్తయితే తాగునీటి సమస్య పరిష్కారం అవుతుందని మునిసిపల్ అధికారులు చెబుతున్నారు.


రామలింగేశ్వరనగర్‌లో సంపు నిర్మాణం

మహిళలు పోషకాహారం తీసుకోవాలి

మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిణి భానుమతి

మొగల్రాజపురం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): నేటి జీవన విధానంలో ప్రతి మహిళ సమతుల్య ఆహారం తీసుకోవడం అత్యంత అవసరం అని మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రొబేషన్ అధికారిణి పి.భానుమతి తెలిపారు. మొగల్రాజపురంలోని జన శిక్షణా సంస్థాన్‌లో కుటుంబ పోషకాహారం-పరిశుభ్రతపై సోమవారం సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆమె మాట్లాడుతూ మహిళలకు సమతుల్య ఆహారంతో పాటు నివసించే చోట, పనిచేసే చోట పరిశుభ్రత కూడా అంతే అవసరం అని చెప్పారు. జనశిక్షణా సంస్థాన్ డైరెక్టర్ ఏ. పూర్ణిమ మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంగా ఉంటే కుటుంబం కూడా ఆరోగ్యంగా ఉన్నట్లేనని చెప్పారు. అనంతరం ఆకుకూరలు, తృణ ధాన్యాలు రాగి, సజ్జ, జొన్న, కొర్రలు తదితర వాటితో తయారు చేసిన పదార్థాలను, పండ్ల రసాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె. రమాదేవి, కార్యకర్తలు, తరుణీ తరంగాల కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రొబేషన్ అధికారిణి భానుమతి


ఆకుకూరలు, తృణధాన్యాలతో తయారు చేసిన పదార్థాలు

నైపుణ్యంతోనే విజేతలు కాగలం

● అంతర్జాతీయ సౌరవిద్యుత్ నిపుణులు డాక్టర్ బోస్

విజయవాడ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): యువత ఎప్పటికప్పుడు సమయాన్ని సద్వినియోగం చేసుకోకపోతే భవిష్యత్తు లేదని మానస ఎలక్ట్రానిక్స్(ఢిల్లీ) వ్యవస్థాపకుడు, అంతర్జాతీయ సౌరవిద్యుత్ నిపుణుడు డాక్టర్ పి.సుభాష్ చంద్రబోస్ తెలిపారు. పీబీ సిద్ధార్థ కాలేజీ వెబినార్ హాలులో సోమవారం రసాయన విభాగం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, అమెరికా వీసా కోసం పాకులాడడం కాకుండా నైపుణ్యాలను పెంచుకుంటే ప్రపంచం దాసోహమవుతుందన్నారు. లక్షద్వీప్‌లో డీజిల్ బదులు సౌరవిద్యుత్ ప్రవేశపెట్టామని, కరీంనగర్‌లో చంద్రకాంతి పథకంలో తన సంస్థ భాగస్వామిగా ఉందని వెల్లడించారు. సోలార్ ప్యానల్స్, సోలార్ ఇన్వర్టర్లు, సోలార్ వ్యాక్సిన్ తదితర సేవలతో తన సంస్థ ఇతర దేశాల్ని ఆకట్టుకుందన్నారు. ఎప్పుడూ నవ్వుతూ జీవించాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం కృష్ణా యూనివర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ బసవేశ్వరరావు మాట్లాడుతూ, తమతో స్టార్టప్ ఏర్పాటుకు ముందుకు రావాలని కోరారు. ఈ సందర్భంగా డాక్టర్ సుభాష్ చంద్రబోస్‌ను ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్, వైస్ ప్రిన్సిపాల్ మనోరంజని, కెమిస్ట్రీ హెచ్‌వోడీ పి.టి.ఎస్.ఆర్.కె.ప్రసాద్, ప్రొఫెసర్స్ నాగార్జున, ఏ.రామారావు సత్కరించారు.


మాట్లాడుతున్న డాక్టర్ బోస్


ఎక్సైజ్ సీఐ పెద్దిరాజుకి వినతి పత్రం అందజేసిన వైసీపీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్, నాయకులు

రాష్ట్రంలో నకిలీ మద్యం అరికట్టాలి

● వైసీపీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్

భారతీనగర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నకిలీ మద్యాన్ని అరికట్టి, ప్రజల ప్రాణాలు కాపాడాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ కోరారు. నకిలీ మద్యం దందాపై సీబీఐతో దర్యాప్తు జరిగేలా చూడాలని సోమవారం తూర్పుపరిధిలోని కనకదుర్గ గెజిటెడ్ ఆఫీసర్స్ కాలనీలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో ఇన్‌స్పెక్టర్ పెద్దిరాజుకు వైసీపీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నకిలీ మద్యం రాష్ట్రంలో ఏరులైపారుతుందన్నారు. తూర్పు నియోజకవర్గ నాయకులు, ఫ్లోర్‌లీడర్, డిప్యూటీ మేయర్, డివిజన్ కార్పొరేటర్లు, ప్రెసిడెంట్లు, కార్యకర్తలు, మహిళా నాయకులు పాల్గొన్నారు.

వీధికుక్కల బెడద .. స్థానికుల అగచాట్లు

భారతీనగర్, ఆంధ్రజ్యోతి: కాలనీ మెయిన్, అంతర్గత రోడ్డుల్లో వీధికుక్కలు గుంపులుగా తిరుగుతూ స్థానికులను తీవ్ర భయాందోళనలకు గురిచేస్తున్నాయి. తూర్పు పరిధి 4, 10, 3, 11 డివిజన్లలోని ఎల్ఐసీ, జయప్రకాష్‌నగర్, ఫిల్మ్‌నగర్, ఆర్టీసీ, న్యూపోస్టల్ కాలనీ, శ్రీరామచంద్రనగర్, నాగార్జుననగర్, భారతీనగర్, శ్రీనివాసనగర్ బ్యాంక్ కాలనీ, పలు ప్రధాన కాలనీల్లో వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉంది. ఈ కాలనీల్లో వీధికుక్కలు గుంపులుగా తిరుగుతూ ఆయా కాలనీలోని ఖాళీల స్థలాలను నివాస స్థావరంగా ఏర్పాటు చేసుకుంటున్నాయి. రోడ్డుపై వేసిన చెత్తను చిందరవందరగా చేస్తున్నాయని స్థానికులు అంటున్నారు. రాత్రి సమయంలో కుక్కలు అరుస్తూ వాహనదారుల వెంట పడుతున్నాయని, బయటకు రావాలంటే భయపడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ు కోరుతున్నారు.


ఫన్‌టైమ్ క్లబ్ రోడ్లో ..


కోనేరువారి వీధి సోనోవిజన్ ఎదురు రోడ్డులో పిచ్చి మొక్కలు, చెత్తా, చెదారంతో ఖాళీ స్థలం

ఖాళీ స్థలంలో చెత్త గుట్టలు

రోగాలబారిన పడతామంటున్న స్థానికులు

రామలింగేశ్వరనగర్, ఆంధ్రజ్యోతి: 13వ డివిజన్ పటమట కోనేరు వారి వీధి సోనోవిజన్ ఎదురు రోడ్డులో నివాసాల మధ్యనే ఉన్న ఖాళీ స్థలంలో నిర్మాణం కోసం యజమానులు గొయ్యి తవ్వి వదిలేశారు. దీంతో ఆ గొయ్యిలో చెత్తా చెదారం వ్యర్థాలు డంప్ చేస్తున్నారని, దీనివలన ఈగలు, దోమలు వ్యాప్తి చెంది వ్యాధుల బారిన పడే ప్రమాదముందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పిచ్చిమొక్కల్లో విషపురుగులు సంచరిస్తున్నాయని, ఏ సమయంలో ఎటువంటి ప్రమాదం సంభవిస్తుందోనని ఆ ప్రాంత వాసులు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఖాళీ స్థలంలో చెత్త, చెదారం తొలగించాలని కోరుతున్నారు.


దాత వసంత రామారావుకు అమ్మవారి చిత్రపటం, రశీదు అందజేస్తున్న ఆలయ అధికారులు, అర్చకులు

దుర్గగుడిలో అన్నదాన పథకానికి విరాళాలు

ఇంద్రకీలాద్రి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వర దేవస్థానంలో జరుగుతున్న నిత్య అన్నదాన పథకానికి సోమవారం విశాఖపట్నంకు చెందిన వసంత రామారావు, వారి కుటుంబం పేరున రూ.1,01,700లు అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది దాతలకు అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితులు వేద ఆశీర్వచనం అందజేశారు. అనంతరం అధికారులు దాతలకు అమ్మవారి చిత్రపటంతో పాటు విరాళం రశీదు, లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం, అందజేశారు.


ప్రజల నుంచి అర్జీలు తీసుకుని పరిశీలిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

ప్రజా ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించండి

కమిషనర్ ధ్యానచంద్ర

కార్పొరేషన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చే సమస్యల అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. నగరంలో వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ సమస్యలను అర్జీలుగా కమిషనర్‌కు అందజేశారు. మొత్తం 13 ఫిర్యాదులు వచ్చాయి. అదనపు కమిషనర్ ప్రాజెక్ట్ డాక్టర్ డి.చంద్రశేఖర్, చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, సీఈ ఆర్ శ్రీనాథ్‌రెడ్డి, ఎస్టేట్ ఆఫీసర్ ఏ.శ్రీధర్, డిప్యూటీ డైరెక్టర్ చంద్రశేఖర్, పాల్గొన్నారు.


విజేతలను అభినందిస్తున్న సిద్ధార్థ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ఏడుకొండలు

ఐఏఎంఎంటీఏపీసీ కాన్ఫరెన్స్‌లో సిద్ధార్థ మెడికల్ విద్యార్థులకు బహుమతులు

ప్రభుత్వాసుపత్రి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(నిమ్స్)లో ఈ నెల 11, 12 తేదీల్లో జరిగిన ఏపీ, తెలంగాణ సంయుక్త శాఖ ఐఏఎంఎంటీఏపీసీ(ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ మెడికల్ మైక్రోబయాలజిస్ట్స్, తెలంగాణ అండ్ ఆంధ్రప్రదేశ్ కంబైన్డ్ చాప్టర్) వార్షిక సమావేశంలో స్థానిక సిద్ధార్థ మెడికల్ కాలేజీ మైక్రో బయాలజీ పీజీ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఈ సమావేశాన్ని పురస్కరించుకుని నిర్వహించిన పలు పోటీల్లో 18 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఉత్తమ మౌఖిక ప్రదర్శనలో డాక్టర్ పి.సాయిఅవినాష్ రెండో బహుమతి, క్విజ్‌లో డాక్టర్ అబ్దుల్ రజాక్ మూడో బహుమతి, డాక్టర్ అశ్వినీకిరణ్, డాక్టర్ డి.రాధాదేవి, డాక్టర్ ఎం.విశ్వనాథ్ టాప్-10లో స్థానం దక్కించుకున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్ ఏడుకొండలు విజేతలను అభినందించారు.


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్ తదితరులు

17న సిద్ధార్థ అకాడమీ నవోన్మేషికోత్సవ్

విజయవాడ కల్చరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): సిద్ధార్థ అకాడమీ ఆఫ్ జనరల్ అండ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ సర్ణోత్సవ సంవత్సర కార్యక్రమంగా అంతర్ రాష్ట్ర విద్యార్థులతో నవోన్మేషికోత్సవ్ పేరుతో అతిపెద్ద యువసృజనోత్సవ్ ఈనెల 17న నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్, డైరెక్టర్ వేమూరి బాబురావు, డీన్ ఆచార్య రాజేశ్, సి.జంపాల, కల్చరల్ కమిటీ ఉపాధ్యక్షులు డాక్టర్ బి.జయప్రకాష్, ఎం.శివరంజని తెలిపారు. విజయవాడ పీబీ సిద్ధార్థ కళాశాలలో సోమవారం ఈ సాంస్కృతిక మేళా పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. కర్ణాటక గాత్రం సోలో, శాస్త్రీయ వాద్యం, బృందగానం, జానపద గేయాలాపన, ఫోక్ గ్రూప్ డాన్స్, శాస్త్రీయ నృత్యం, స్కిట్, మైమ్, మిమిక్రీ అంశాల్లో ఈ సాంస్కృతిక మేళా నిర్వహిస్తున్నామని తెలిపారు. విజేతలకు పెద్దమొత్తంలో నగదు బహుమతులు అందజేస్తామన్నారు. ఈ పోటీల్లో రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల విద్యార్థులు కూడా పాల్గొని ప్రతిభను కనబరచాలని వారు కోరారు.


కోర్టు నిర్దోషులుగా విడుదల చేసిన టీడీపీ 18వ డివిజన్ నాయకులు

టీడీపీ 18వ డివిజన్ నాయకులపై కేసు కొట్టివేత

విజయవాడ లీగల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో కృష్ణలంక, రాణిగారితోట టీడీపీ 18వ డివిజన్ నాయకులపై వైసీపీ నాయకులు పెట్టిన తప్పుడు కేసును కొట్టివేస్తూ సోమవారం రెండో అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం రాణిగారితోటలో 108 అంబులెన్సుకు ఉన్న రేకుల షెడ్డును స్థానిక కార్పొరేటర్, వైసీపీ నాయకుడు సత్యనారాయణ 2022లో తొలగింపచేశారు. 108 సిబ్బందికి టీడీపీ నాయకులు సంఘీభావం తెలియజేయగా టీడీపీ నాయకులపై కృష్ణలంక పోలీసు స్టేషన్‌లో తప్పుడు కేసు పెట్టించారు. ఈ కేసులో టీడీపీ 18వ డివిజన్ అధ్యక్షుడు వేముల దుర్గారావు, నాయకులు ఎం.పీరుబాబు, ప్రసాద్, వెంకటేశ్వరరెడ్డి, వేముల దుర్గ, మరియమ్మ తదితరులున్నారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి, నిందితులపై నేరం రుజువుకాకపోవడంతో కేసును కొట్టివేసి నిందితులందరినీ నిర్దోషులుగా విడుదల చేస్తూ తీర్పు చెప్పారు.


ర్యాలీలో పాల్గొన్న డీఎంహెచ్‌వో డాక్టర్ సుహాసిని

అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణకు ప్రణాళికలు

● డీఎంహెచ్‌వో డాక్టర్ సుహాసిని

భారతీనగర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా వైద్యశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా వైద్యశాఖ అధికారిణి డాక్టర్ సుహాసిని తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సోమవారం అధికారుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని మాట్లాడుతూ అంతర్జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా జిల్లాలో ఈ నెల 18 వరకు వివిధ శాఖల సమన్వయంతో ప్రతిరోజు వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహించడానికి ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖతో విద్యాశాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ సమన్వయంతో బాలికల సంరక్షణకు తీసుకొనే చర్యలను తెలిపే పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం కార్యాలయం ప్రాంతంలోని పలు రోడ్లలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

● 10 మంది అరెస్ట్ ● రూ 1.21లక్షలు స్వాధీనం

గుణదల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదివారం రాత్రి దాడిచేసి 10మందిని అరెస్ట్ చేశారు. చుట్టుగుంట వద్ద ఓఇంట్లో గడచిన కొద్ది కాలం నుంచి పేకాట స్థావరం నడుస్తున్నట్లుగా టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం అందింది. సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ సీఐ శ్రీధర్ సిబ్బందితో దాడిచేసి పేకాట ఆడుతున్న 10మందిని అదుపులోకి తీసుకున్నారు. ఘటనా స్థలం నుంచి రూ.1.21లక్షలు, 9 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పేకాట ఆడుతుండగా దొరికిన 10మందిని మాచవరం పోలీసులకు అప్పగించారు. పోలీసులు సోమవారం వీరిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు.

డాక్టర్ రమేష్‌కు లైఫ్‌టైం అచీవ్‌మెంట్



విజయవాడ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆస్టర్ ర మేష్ ఆసుపత్రిలో ప్రముఖ కార్డియాలజిస్టుగా సేవలందిస్తున్న డాక్టర్ పోతినేని రమేష్‌బాబు 'లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ ఇన్ రీజినల్ కార్డియాలజీ అండ్ హెల్త్‌కేర్ లీడర్‌షిప్ అవార్డు' అందుకున్నట్టు ఆసుపత్రి మేనేజ్‌మెంట్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ అవార్డును వాయిస్ ఆఫ్ హెల్త్‌కేర్ (వీవోహెచ్) సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన బీట్-2025 నేషనల్ కార్డియోవాస్కులర్ సమ్మిట్ అండ్ అవార్డ్స్‌లో ప్రదానం చేసినట్టు తెలిపింది. డాక్టర్ రమేష్‌బాబు ఆధ్వర్యంలో ఆస్టర్ రమేష్ ఆసుపత్రి కార్డియాలజీ రంగంలో రాష్ట్రంలోనే అగ్రగామిగా సంస్థగా ఎదిగిందని ఆసుపత్రి మేనేజ్‌మెంట్ వెల్లడించింది. ఆసుపత్రిలో ఆధునిక గుండె చికిత్సలు, నివారణ, ప్రజా అవగాహన సదస్సులను విజయవంతంగా నిర్వహిస్తోందని తెలిపింది.

బోధనేతర సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

ఇంటర్ ఉద్యోగుల సేవాసంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసులు

విజయవాడ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ విద్యాశాఖలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల సంక్షేమం, సమస్యల పరిష్కారం కోసం నూతన కార్యవర్గం అంకితభావం, బాధ్యతాయుతంగా పనిచేస్తోందని ఇంటర్ ఉద్యోగుల సేవా సంఘం రాష్ట్ర నూతన అధ్యక్షుడు ఏ శ్రీనివాసులు అన్నారు. నగరంలోని గాంధీనగర్‌లో ఎన్జీజీవో హోంలో సోమవారం రాష్ట్ర కార్యవర్గ ఎన్నికలు జరిగాయి. నూతన కార్యవర్గంలో సహాధ్యక్షుడిగా ఐ రాంబాబు, ఉపాధ్యక్షుడిగా ఎస్డీ అబ్దుల్ సమద్, యూ యోసేపు, ఈవీ రాఘవేంద్ర గౌడ్, టీ మధుస్వామి, ప్రధాన కార్యదర్శి బీవీ సుధాకర్, కార్యనిర్వహక కార్యదర్శిగా పీ సురేష్ తదితరులు నియమితులయ్యారు. రాష్ట్ర జనరల్ సెక్రటరీ బీసీహెచ్ సుధాకర్‌తో పాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాల ఉద్యోగులు పాల్గొన్నారు.

మంత్రి ఉపసంఘం ఏర్పాటు అభినందనీయం

● స్వాగతించిన సంఘం రాష్ట్ర చైర్మన్ జానీపాషా

విజయవాడ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రామవార్డు సచివాలయ ఉద్యోగుల పదోన్నతులకు సంబంధించి 10 మంది మంత్రులతో మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేస్తూ రాష్ట్ర చీఫ్ సెక్రటరీ జీవోఆర్‌టీ నెం.1859ను విడుదల చేయడాన్ని గ్రామవార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర చైర్మన్ ఎండీ జానీపాషా సోమవారం ఒక ప్రకటనలో స్వాగతించారు. గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల పదోన్నతులు, ఇతర ప్రభుత్వ శాఖల్లో పదోన్నతులతో విలీనం చేయాలని ఐక్యవేదిక తరపున కృషి ఫలించిందని జానీపాషా అన్నారు. మంత్రివర్గ ఉప సంఘం త్వరగా గ్రామవార్డు సచివాలయ ఉద్యోగులకు న్యాయం చేస్తూ నిర్దిష్ట గడువులోగా పదోన్నతులు కల్పించాలన్నారు.



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న డీసీపీ ఉదయకుమారి

పోలీస్ పీజీఆర్ఎస్‌లో 72 ఫిర్యాదులు

విజయవాడ సిటీ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో ప్రజల నుంచి 72 ఫిర్యాదులను స్వీకరించినట్టు డెప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (డీసీపీ) ఏబీటీఎస్ ఉదయరాణి తెలిపారు. ఆస్తి వివాదాలపై 41, కుటుంబ కలహాలపై నాలుగు, కొట్లాటలపై ఒకటి, మోసాలపై మూడు, మహిళా సంబంధిత నేరాలపై ఆరు, చోరీలపై రెండు, చిన్నచిన్న వివాదాలపై 15 మంది ఫిర్యాదలిచ్చినట్టు చెప్పారు. ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడిన అనంతరం ఫిర్యాదులను సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులకు బదిలీ చేసినట్టు తెలిపారు. నిర్ణీత కాలవ్యవధిలో ఫిర్యాదులను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్టు చెప్పారు.

భారత కబడ్డీ జట్టుకు హరీష్ ఎంపిక

విజయవాడ స్పోర్ట్స్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 22 నుంచి 31 వరకు బహ్రెయిన్‌లో జరిగే 3వ ఏషియన్ యూత్ గేమ్స్ పాల్గొనే ఇండియన్ కబడ్డీ (అండర్-18) జట్టులో రాష్ట్ర క్రీడాకారుడు గద్దె హరీష్ ఎంపికయ్యాడు. క్రీడాశాఖ మంత్రి ఎంరాంప్రసాద్ రెడ్డి, శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు, ఏపీ కబడ్డీ అసోసియేషన్ ప్రెసిడెంట్ కేవీ ప్రభావతి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్ అర్జునరావు, జనరల్ సెక్రటరీ యలమంచిలి శ్రీకాంత్ అభినందనలు తెలిపారు.

'ఏఐ' భార్గవ్..!

● చంద్రబాబు, దేవినేని నకిలీ వీడియోల సృష్టికర్త

● నిందితుడు పశ్చిమగోదావరి జిల్లా వాసి

● పరారీలో నిందితుడు ● గాలింపునకు ప్రత్యేకబృందాలు

ఆంధ్రజ్యోతి - విజయవాడ: తెలంగాణలోని టీడీపీ నేతల సెల్‌ఫోన్ల స్క్రీన్లపై చంద్రబాబు వీడియో ప్రత్యక్షమైంది. ఎన్టీఆర్ జిల్లా కంచికచర్లకు చెందిన నేతల ఫోన్ల స్క్రీన్లపై మాజీ దేవినేని ఉమా వీడియో కనిపించింది. ఈ రెండు వీడియోల సారాంశం ఒక్కటే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో టికెట్ల కేటాయింపు. కొద్దిరోజుల క్రితం హల్‌చల్ చేసిన నకిలీ వీడియోలు ఇవి. ఇలా చంద్రబాబు, దేవినేని ఉమామహేశ్వరరావు ఏఐ వీడియోలను ఉపయోగించి టీడీపీలోని ఆశావహులకు ఎరవేసిన నిందితుడు ఎవరన్నది తేలిపోయింది. ఇవన్నీ చేసిన యువకుడు పశ్చిమగోదావరి జిల్లా గంగన్నగూడెం గ్రామానికి చెందిన ఉప్పలపాటి భార్గవ్‌గా విజయవాడ సైబర్ క్రైం పోలీసులు గుర్తించారు. బాధితులకు వచ్చిన ఫోన్ కాల్స్ ఆధారంగా నంబర్లను సేకరించారు. దేవినేని ఉమా పేరుతో 20 రోజుల వ్యవధిలో ముగ్గురికి టోకరా వేసినట్టు పోలీసులు గుర్తించారు. వారిలో కంచికచర్ల మండలానికి చెందిన ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షుడు ఏడుకొండలు మాత్రం మోసం నుంచి త్రుటిలో తప్పించుకున్నాడు. ఈ ఏఐ వీడియోలను ఉపయోగించి పలువురి నుంచి రూ.75వేల నుంచి రూ.1లక్ష వరకు కాజేసినట్టు తెలిసింది. ఆ డబ్బులు ఏ నంబరు ఖాతాలకు వెళ్లాయి, అవి ఎక్కడెక్కడ ఉన్నాయన్న వివరాలను రాబట్టారు. ప్రస్తుతం భార్గవ్ పరారీలో ఉన్నాడు. అన్ని సిమ్‌లను ఆఫ్ చేశాడు. భార్గవ్‌కు సంకెళ్లు వేయడానికి ప్రత్యేకబృందం పనిచేస్తోంది. భార్గవ్ చివరి లొకేషన్ హైదరాబాద్ అని విశ్వసనీయంగా తెలిసింది.

జనార్దన్.. జోగి స్నేహితుడే..!

● రమేశ్ అసత్య ఆరోపణలపై మండిపడ్డ టీడీపీ శ్రేణులు

మైలవరం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): వైసీపీ మాజీమంత్రి జోగి రమేష్ నకిలీ మద్యాన్ని ఎమ్మెల్యే వసంత, అతడి అనుచరులకు ఆపాదిస్తూ చేస్తున్న అసత్య ఆరోపణలపై పట్టణ టీడీపీ శ్రేణులు మండిపడ్డారు. నకిలీ మద్యంపై జోగి సోమవారం మైలవరం పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయం వద్ద నిర్వహించిన నిరసన ప్రదర్శనలో ఎమ్మెల్యేపై చేసిన ఆరోపణలు ఖండిస్తూ మీడియాతో టీడీపీ నేతలు మాట్లాడారు. నకిలీ మద్యంలో నిందితుడిగా ఉన్న ఆరేపల్లి జనార్ధన్ జోగి స్నేహితుడు, పార్టనర్ కాదా అని ప్రశ్నించారు. జోగి బార్ షాపును అద్దెకిచ్చి వ్యాపారంలో భాగస్వాములుగా చేసింది వాస్తవం కాదా అన్నారు. ఐదేళ్లుగా జోగి చేసిన అవినీతి, అక్రమాలు ఎక్కడ బయటపడతాయోనని తన అనుచరులతో ప్రతి సంఘటనను ఎమ్మెల్యేకు ఆపాదిస్తూ అసత్య ప్రచారాలు చేయడం జోగి నీచ సంస్కృతికి నిదర్శనమన్నారు. వసంతపై చేస్తున్న అసత్య ఆరోపణలు నిరూపించకపోతే రాజకీయాల నుంచి వైదొలగిపోతావా అని ప్రశ్నించారు. పార్టీ మండల ప్రధాన కార్యదర్శి దూరు బాలకృష్ణ, ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చారుగుండ్ల ప్రసాద్, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు లంక లితీష్, పట్టణ ఉపాధ్యక్షుడు తొమ్మండ్రు ప్రేమసాగర్, జల్లి కృష్ణ, బుడిపూటి వెంకట్రావు, పరికెల సాంబయ్య, బెనార్జి పాల్గొన్నారు. తొలుత పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయం ఎదుట మాజీ మంత్రి జోగి తన అనుచరులతో కలిసి మందు సీసాలు తొక్కుతూ చిందులు వేసి హడావుడి చేశాడు. అనంతరం ఎక్సైజ్ సీఐ జే శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు.

జీఎస్టీ 2.0తో స్వర్ణాంధ్ర, వికసిత్ భారత్ సాకారం

● ఎంపీ కేశినేని శివనాథ్



కలెక్టర్, జేసీ, వీఎంసీ కమిషనర్, అధికారులతో కలిసి పున్నమీఘాట్‌లో గ్రేట్ అమరావతి షాపింగ్ ఫెస్టివల్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ శివనాథ్

విద్యాధరపురం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర, వికసిత్ భారత్ సాకారానికి జీఎస్టీ 2.0 దోహదపడుతుందని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. సోమవారం భవానీపురం పున్నమిఘాట్ వద్ద ఆయన కలెక్టర్ డాక్టర్ జీ లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఎస్ ఇలక్కియ, వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర, జీఎస్టీ జాయింట్ కమిషనర్ ఎస్ ప్రశాంత్ కుమార్‌తో కలిసి గ్రేట్ అమరావతి షాపింగ్ ఫెస్టివల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ డబుల్ ఇంజిన్ సర్కారుతో అభివృద్ధి, సంక్షేమం సమపాళ్లలో అందుతుందన్నారు. జీఎస్టీ సంస్కరణలతో వాణిజ్య, వ్యాపార రంగాలు అభివృద్ధి దిశగా పయనిస్తాయన్నారు. నగర ప్రజలు ఈ ఫెస్టివల్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ జీఎస్టీ 2.0 సంస్కరణలతో ప్రజలకు జరుగుతున్న ప్రయోజనాలపై అవగాహన కల్పించే క్రమంలో సోమవారం నుంచి ఈ నెల 19 వరకు జరిగే గ్రేట్ అమరావతి షాపింగ్ ఫెస్టివల్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సూపర్ జీఎస్టీతో రాష్ట్ర ప్రజలకు దాదాపు రూ.8 వేల కోట్లు, ప్రతి కుటుంబానికి నెలకు రూ.6 నుంచి రూ.12 వేల వరకు ఆదా అవుతుందన్నారు. జీఎస్టీ జాయింట్ కమిషనర్ ఎస్ ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ ఎలక్ట్రానిక్స్, గృహోపకరణాలపై గతంలో 28 శాతం జీఎస్టీ ఉండగా జీఎస్టీ 2.0 సంస్కరణలతో అది 18 శాతానికి తగ్గిందన్నారు. సబ్బులు, టూత్‌పేస్టులు, వంటనూనెలు, డిటర్జెంటులు వంటి నిత్యావసర ఎఫ్ఎంసీజీ వస్తువులపై గతంలో 18 శాతం జీఎస్టీ ఉండగా, ప్రస్తుతం అది 5 శాతానికి తగ్గిందన్నారు. బీమా, ఆరోగ్య పాలసీలపై గతంలో 18 శాతం జీఎస్టీ ఉండగా, అది నేడు సున్నా శాతం అయిందన్నారు. ఈ ప్రయోజనాలను ప్రజలకు వివరించే క్రమంలో ఈ షాపింగ్ ఫెస్టివల్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఈ ఫెస్టివల్‌లో ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ వస్తువులతో పాటు కార్లు, బైక్‌లు, తదితర వాహనాల స్టాల్స్, స్థానిక హస్త కళాకారులు, లీడ్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను అతిథులు సందర్శించారు. షాపింగ్ ఫెస్టివల్ ప్రారంభోత్సవంలో కళాకారుల నృత్య ప్రదర్శనలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. డీఆర్వో ఎం లక్ష్మీనరసింహం, వీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ డీ చంద్రశేఖర్, జిల్లా పరిశ్రమల అధికారి పీ మధు, డీఈవో యూవీ సుబ్బారావు, ఎల్‌డీఎం కే ప్రియాంక పాల్గొన్నారు.

నకిలీ మద్యంలో జగన్ రెడ్డి హస్తం?

నకిలీ మద్యం వ్యాపారంలో వైసీపీ ఎమ్మెల్యే వైఎస్ జగన్ రెడ్డి హస్తం ఉందని, నకిలీ మద్యం పేరుతో కూటమి ప్రభుత్వంపై ఆరోపణలు చేయటంలో వైసీపీ నేతలు విఫలమయ్యారని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. సోమవారం సాయంత్రం ఆయన భవానీపురం పున్నమీ ఘాట్‌లో గ్రేట్ అమరావతి షాపింగ్ ఫెస్టివల్‌ను ప్రారంభించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో నకిలీ మద్యాన్ని ఎక్కడికక్కడ కట్టడి చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో దొంగచాటుగా నకిలీ మద్యం అమ్మించిన వైసీపీ నేతలు మరో కొత్త డ్రామాకు తెరలేపారని విమర్శించారు. నకిలీ మద్యం కేసులో పట్టుబడిన ఏ1 ముద్దాయి వైసీపీ నేతలకు బాగా కావాల్సిన వ్యక్తి అని, ఆ వ్యక్తి వెనుక వైసీపీ గజదొంగలు, బందిపోట్లు ఉన్నారన్నారు. ఈకేసులో వైసీపీ ముఖ్య నేతల్లో ఒకరి పేరు బయటకు వచ్చిందని, మిగిలిన వారి పేర్లు త్వరలో బయటకు వస్తాయన్నారు. జిల్లాలోని వైసీపీ నేతలతో పాటు దేవినేని అవినాష్, పేర్ని నాని, జోగి రమేష్, వెలంపల్లి శ్రీనివాస్ హస్తం నకిలీ మద్యం వ్యాపారంలో ఉందన్నారు. ఆ వివరాలన్నీ త్వరలోనే బయటపడతాయన్నారు. ఈ వ్యాపారంలో ఎమ్మెల్యే జగన్ రెడ్డి షేర్ ఎంతో, వైసీపీ నేతల షేర్ ఎంతో తెలుస్తుందని, తప్పకుండా వారందరికీ శిక్ష పడుతుందన్నారు.



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న బాధితులు

బంగారం పేరుతో కుచ్చుటోపీ

రూ.5కోట్లతో పారిపోయిన కేటుగాడు

పెనుగంచిప్రోలు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): బంగారంపై మక్కువతో కొందరు, భవిష్యత్‌కు భరోసా కోసం కొందరు ఆశపడి మోసగాడి బారినపడ్డారు. పేదల ఆశను ఆసరా చేసుకొని వాయిదాల పద్ధతిలో బంగారం అందిస్తానని నమ్మబలికి కేటుగాడు ఉన్నందంతా ఊడ్చాడు. ప్రజలను వంచించిన చిన దుర్గారావు అర్ధరాత్రి పరారయ్యాడు. సుమారు రూ.5కోట్ల మేర ముంచిన వంచకుడు కుటుంబంతో కలిసి పర్యారయ్యాడు. విషయం తెలుసుకున్న బాధితులు రోదిస్తూ పోలీసులను ఆశ్రయించారు. వివరాల్లోకి వెళితే మండల కేంద్రమైన పెనుగంచిప్రోలుకు చెందిన చిన్నం చిన దుర్గారావు అనే చిరు వ్యాపారి రెండు దశాబ్దాలుగా బట్టల వ్యాపారం చేస్తూ నమ్మకస్తుడిగా పేరు తెచ్చుకున్నాడు. అతడికి భార్య ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. వారికి పెళ్లిళ్లు చేసి ఐదేళ్ల క్రితం కుమారుడితో బట్టల షాపు పెట్టించాడు. తాను వినాయకుడి గుడి సెంటర్‌లో షాపు అద్దెకు తీసుకొని హోమ్ నీడ్స్ వ్యాపారం చేస్తున్నాడు. ఈక్రమంలోనే తనకున్న పరిచయాలతో చిట్టీలు కట్టించడం ప్రారంభించారు. తరువాత బంగారం స్కీమ్‌కు తెరలేపాడు. బంగారం ధరలు ఆకాశాన్నంటి పేదలు కొనలేని స్థితికి చేరుకోవడంతో కుట్ర పన్నాడు. ఒకే దఫా గ్రాము బంగారం కొనలేని పేదలకు వాయిదా పద్ధతిలో బంగారం అందిస్తానని నమ్మబలికాడు. సుమారు 150 మంది చేరారు. ఐదేళ్ల పాటు పక్కా ప్రణాళికతో ప్రజలను నమ్మించి రూ.5కోట్లకు పైబడి సొమ్ము చేతికి చేరిన తరువాత దెబ్బతీశాడు. కొన్నాళ్లుగా ఎవరికీ పేమెంట్లు చేయకపోవడం, బంగారం ఇవ్వకపోవడంతో అనుమానంతో కొందరు నిలదీశారు. దీంతో శుక్రవారం రాత్రి చిన దుర్గారావు, భార్య, కుమారుడి కుటుంబంతో పలాయనం చిత్తగించాడు. 3 రోజులుగా హోంనీడ్స్ షాపు, కుమారుడి బట్టల షాపు తీయకపోవడంతో అనుమానం వచ్చిన బాధితులు ఇంటికి వెళ్లి పరిశీలించగా ఆచూకీ లేదు. దీంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. ప్రస్తుతం అందుతున్న సమాచారం ప్రకారం ఐదు కోట్ల వరకూ మోసం చేసినట్లు తెలుస్తుంది. ఈ మొత్తం కూడా ఇంకా పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అర్జీలను నిర్ణీత కాల వ్యవధిలో పరిష్కరించండి

● కలెక్టర్ లక్ష్మీశ ● పీజీఆర్ఎస్‌లో 153 వినతులు

విజయవాడ సిటీ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో వచ్చిన అర్జీలను నిర్ణీత కాల వ్యవధిలో పరిష్కరించాలని జిల్లా అధికారులకు కలెక్టర్ జీ లక్ష్మీశ సూచించారు. ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించి అర్జీదారులకు సంతృప్తికర సేవలను అందించాలని ఆదేశించారు. కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశపు మందిరంలో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌లో కలెక్టర్ పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అర్జీలకు సరైన ధ్రువీకరణ పత్రాలు సమర్పించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు తెలియజేశారు. ప్రభుత్వ మార్గదర్శకాలు పాటించడంలో కొందరు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ప్రవర్తన మార్చుకోవాలని హెచ్చరించారు. ఫిర్యాదుల ఆడిటింగ్‌ను సక్రమంగా పూర్తి చేయాలని, సమస్య పరిష్కార అధికారి స్వయంగా ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని ఆదేశించారు. పీజీఆర్ఎస్‌కు గైర్హాజరైన అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని అధికారులకు సూచించారు. ప్రజలిచ్చిన 153 అర్జీలను కలెక్టర్ స్వీకరించారు. వీటిల్లో రెవెన్యూశాఖకు 52, విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్‌కు 19, పోలీస్ శాఖకు 18, డీఆర్‌డీఏ 10, పంచాయతీ రాజ్ శాఖకు 9, రవాణా శాఖకు 8, ఆరోగ్య శాఖకు 7 అర్జీలు వచ్చాయి.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించండి

దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పెన్షన్ విత్ డిజేబులిటీస్ ఫెడరేషన్ (పీడబ్ల్యూడీ) రాష్ట్ర అధ్యక్షుడు కానూరు శంకరరావు, ప్రతినిధులు కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు.

సీజేఐపై దాడి చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలి

సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై దాడి చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని కోరుతూ ఎంఆర్‌పీఎస్ నేతలు కలెక్టరేట్ వద్ద ఆందోళన చేశారు. ఈ ఆందోళనలో నేతలు మందా వెంకటేశ్వరరావు, ఏలీషా, ప్రకాష్, పిచ్చియ్య, నాగేశ్వరరావు, నరసింహులు, సురేష్, కృష్ణ, విజయ్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎన్టీఆర్ జిల్లా బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్స్ యూనియన్ (బీసీడబ్ల్యూయు) పూతలు కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు.



చలి గాలి.. చిరు జల్లు

● జిల్లాలో చల్లని గాలులతో కూడిన వర్షం ● ఉపరితల ఆవర్తన ప్రభావంతో మరో రెండు రోజులు తేలిక పాటి జల్లులు

విజయవాడ సిటీ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉపరితల ఆవర్తన ద్రోణి ప్రభావంతో జిల్లాలో సోమవారం చిరుజల్లులు కురిశాయి. సముద్ర మట్టానికి సగటున 5.8 కిలోమీటర్ల ఎత్తులో విస్తరించిన ఆవర్తనంతో ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై చల్లని గాలులు వీచాయి. తెల్లవారు జామున తేలికపాటి జల్లులు కురిశాయి. తరువాత కొద్ది సేపు వర్షం జాడ లేదు. తిరిగి 11.30 గంటల నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. ముసురుతో కూడి దాదాపు గంట పాటు కురిసిన వర్షానికి నగరంలోని పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఇదే సమయంలో వర్షానికి చల్లని గాలులు తోడవడంతో జన సంచారం కొద్ది సేపు స్తంభించింది. తిరిగి సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో ఓ గంట పాటు తేలిక పాటి చిరుజల్లులు కురిశాయి. అయితే ఉదయం నుంచి సాయంత్రం వరకు ముసురు వాతావరణం ఉంది. నేడు, రేపు ఇదే వాతావరణ పరిస్థితులు ఉండవచ్చని వాతావరణ శాఖ ప్రకటించింది.

ఎట్టకేలకు కానిస్టేబుల్‌కు వైద్యం

ప్రాణాపాయం లేదని వైద్యులు నిర్ధారణ..

క్రమశిక్షణ చర్యలకు సిఫార్సు

జగ్గయ్యపేట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉన్నతాధికారులు వేధింపులు భరించలేక పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేశానని చెప్పి హైడ్రామా సృష్టించి ప్రభుత్వాసుపత్రిలో చికిత్సకు నిరాకరించి అదృశ్యమైన చిల్లకల్లు పోలీస్ కానిస్టేబుల్ మేజర్ల నాగ శ్రీను (38)ను ఎట్టకేలకు జగ్గయ్యపేట సర్కిల్ పోలీసులు పట్టుకుని విజయవాడలో ప్రైవేట్ ఆసుపత్రికి చికిత్సకు పంపించారు. ఆదివారం మధ్యాహ్నం ఒక కేసుకు సంబంధించి రికార్డు కోసం స్టేషన్ నుంచి ఒక కానిస్టేబుల్‌తో ఫోన్ చేయించగా, సెలవులో ఉన్న తనను డ్యూటీకి రమ్మని వేధిస్తున్నారని ఆరోపిస్తూ పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన నాగశ్రీను ప్రభుత్వాసుపత్రిలో చేరటంతో తెలుసుకున్న సీఐ వెంకటేశ్వర్లు, చిల్లకల్లు ఎస్సై శ్రీనివాస్, పేట ఎస్సై రాజు హుటాహుటిన ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. ఈలోగా తనకు చికిత్స వద్దని సెలైన్ తీసేసుకుని వెళ్లిపోయాడు. విజయవాడ రిఫర్ చేసినా ససేమిరా అన్నారు. అతడికి ప్రాణాపాయం అవుతుందని భావించిన అతడిని పట్టుకుని స్థానికంగా ఒక ప్రైవేట్ ఆసుపత్రికి, అక్కడ నుంచి విజయవాడ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. సోమవారం పరిస్థితి నిలకడగానే ఉందని, ప్రాణాపాయం లేదని నిర్ధారించారు. ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకుంటున్న సీఐ వెంకటేశ్వర్లు ఆయా వివరాలను సీపీ దృష్టికి తీసుకు వెళ్లారు. 2 నెలలుగా విధులకు సక్రమంగా హాజరు కావటం లేదని, రెండు రోజుల క్రితం వచ్చి సెలవు కావాలన్నా చిల్లకల్లు ఎస్సై సరేనని పంపేశారని, కీలక కేసులో రికార్డు కోసం రమ్మంటే ఇలా ఆత్మహత్యాయత్నం చేసినట్టు సీపీకి తెలిపారు. విధి నిర్వహణలో అలక్ష్యంగా వ్యవహరించటమే కాకు, తోటి అధికారులపై అసంబద్ధమైన ఆరోపణలు, ఫిర్యాదులు చేసిన చిల్లకల్లు పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ మేజర్ల నాగ శ్రీనుపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని సీపీని కోరతామని సీఐ పీ వెంకటేశ్వర్లు చెప్పారు.

మల్లవల్లి సిగలో మరో మణిహారం వాయుపుత్ర

రాష్ట్రంలోనే మొదటి పర్యావరణహిత 'వేగా' సీలింగ్ ఫ్యాన్ల ఉత్పత్తి ప్లాంట్



ఆంధ్రజ్యోతి, హనుమాన్‌జంక్షన్ రూరల్: రాష్ట్రానికే తలమానికమైన మల్లవల్లి పారిశ్రామికవాడలో మరో మణిహారమైన పరిశ్రమ ఏర్పడుతోంది. రాష్ట్రంలోనే మొదటి పర్యావరణహిత సీలింగ్ ఫ్యాన్ల ఉత్పత్తి ప్లాంట్ ఏర్పాటు జరుగుతోంది. వాయుపుత్ర ఎకో సిస్టం అత్యాధునిక ఫీచర్లతో కూడిన సీలింగ్ ఫ్యాన్ల ఉత్పత్తి ఫ్యాక్టరీని మల్లవల్లిలో ఏర్పాటు చేసింది. ప్రస్తుతానికి లీజుకు తీసుకున్న ఆవరణలో ఫ్యాన్ల ఉత్పత్తి ప్రారంభించనున్నట్టు ఎండీ విజయ్‌కుమార్ ఆంధ్రజ్యోతికి తెలిపారు. తక్కువ కరెంటుతో అత్యాధునిక సాంకేతికతతో కూడిన సీలింగ్ ఫ్యాన్లను అక్టోబరు నెలాఖరు నుంచి ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండే ధరలతో డీలర్ సిస్టంను ఏర్పాటు చేసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వం సహకరించి తమకు స్థలం కేటాయిస్తే ఉత్పత్తిని పెంచుతూ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేలా రూ.20 కోట్లకు పైగా ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుతామని ఆయన తెలిపారు. తన స్వగ్రామం రంగన్నగూడెం కావడంతో తన స్వంత మండలానికి చెందిన వారికి ప్రాధాన్యత ఇచ్చేలా ఉద్యోగావకాశాలు కల్పిస్తానన్నారు.



చురుగ్గా ఈ-క్రాప్ నమోదు

● జిల్లా వ్యవసాయ అధికారిణి విజయకుమారి

విజయవాడ సిటీ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ-క్రాప్ నమోదు చురుగ్గా సాగుతున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారిణి డీఎంఎఫ్ విజయకుమారి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 2,31,875 ఎకరాల విస్తీర్ణంలో పంటల సాగు జరుగుతుందని, దీనిలో సోమవారం నాటికి 2,09,635 ఎకరాల్లో (90 శాతం) ఈ-క్రాప్ పూర్తి చేసినట్టు వివరించారు. జిల్లావ్యాప్తంగా ఈ-క్రాప్ నమోదుకు 215 మంది క్షేత్ర స్థాయి సిబ్బంది (ఏఈవో, ఎంపీఈవో, వీహెచ్ఏ)ని నియమించినట్టు తెలిపారు. 1,18,815 ఎకరాల్లో వరి, 51 ఎకరాల్లో జొన్న, 10,830 ఎకరాల్లో మొక్కజొన్న, 853 ఎకరాల్లో కంది, 10,575 ఎకరాల్లో పెసర, 7,810 ఎకరాల్లో మినుము, 8 ఎకరాల్లో పశుగ్రాసం, 53 ఎకరాల్లో వేరుశెనగ, 64 ఎకరాల్లో నువ్వులు, 58 ఎకరాల్లో ఆముదం, 81,875 ఎకరాల్లో పత్తి, 883 ఎకరాల్లో చెరుకు సాగు జరుగుతున్నట్టు తెలిపారు. 13 పంటలకు సంబంధించి మొత్తం 22,240 ఎకరాల్లో ఈ-క్రాప్ పూర్తి చేయాల్సి ఉందన్నారు. ఈ-క్రాప్ నమోదుకు ప్రభుత్వం ఈ నెల 25 వరకు అవకాశం ఇచ్చిందని, అయితే జిల్లాలో మరో వారం రోజుల్లో ఈ-క్రాప్ పూర్తి చేస్తామన్నారు.

పరారైన దొంగల కోసం పోలీసుల గాలింపు

వన్‌టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో గొర్రెలు, మేకలు దొంగిలించేందుకు ప్రయత్నించిన కొందరు సీసీఎస్ పోలీసులకు పట్టుబడగా, మరికొందరు పరారయ్యారు. దీంతో పోలీసులు వారి సొంతూళ్లకు వెళ్లి గాలిస్తున్నారు. శనివారం రాత్రి జగ్గయ్యపేటలో గొర్రెలు, మేకలు దొంగిలించేందుకు గుంటూరు జిల్లా స్టువర్టుపురం, చీరాలకు చెందిన కొందరు కార్లు, వ్యాన్లలో వెళ్లగా విధుల్లోని పోలీసులను చూసి తమ వాహనాలు దిగి పారిపోవటానికి ప్రయత్నించారు. ఈ క్రమంలో కొందరు పట్టుబడగా, మరికొందరు పరారయ్యారు. పోలీసులు పట్టుకున్న వారిని విచారణ నిమిత్తం వన్‌టౌన్ సీసీఎస్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. వాహనాన్ని కూడా స్టేషన్‌కు తీసుకువచ్చారు.



యువజనోత్సవాల పోస్టరును ఆవిష్కరిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

యువజనోత్సవాలను సద్వినియోగం చేసుకోవాలి: కలెక్టర్

కలెక్టరేట్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): యువతలో కళానైపుణ్యం, జాతీయ భావం పెంపొందించడంలో భాగంగా యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో ఈనెల 23న జిల్లాస్థాయి యువజనోత్సవాలు జరుగనున్నాయని, యువత సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ లక్ష్మీశ అధికారలతో కలిసి యువజనోత్సవాల పోస్టరును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విజయవాడ కొత్తపేట కేబీఎన్ కళాశాలలో యువజనోత్సవాలు జరుగనున్నాయని, జిల్లా స్థానికత ఉన్న యువత పాల్గొనవచ్చన్నారు. పలు అంశాల్లో పోటీలు నిర్వహించనున్నట్టు జిల్లా యువజన సంక్షేమాధికారి యూ శ్రీనివాసరావు తెలిపారు. ఔత్సాహికులు ఆన్‌లైన్ లింక్ ద్వారా ఈనెల 22లోపు పేర్లు నమోదు చేసుకోవాలని లేదా వేదిక వద్ద 23న ఉదయం పేర్లు నమోదు చేసుకోవచ్చన్నారు. వివరాలకు 9949522694, 9032115987 నెంబర్లలో కార్యాలయ పనివేళల్లో సంప్రదించవచ్చని తెలిపారు.

నేడు ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం

ప్రభుత్వాసుపత్రి: ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం ఈ నెల 14న మంగళవారం నిర్వహిస్తున్నట్టు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏవీ రావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసుపత్రి సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ జీ లక్ష్మీశ, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, స్థానిక ప్రజాప్రతినిధులు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ప్రతినిధులు పాల్గొంటారన్నారు. ఆసుపత్రికి అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలను సమావేశంలో చర్చిస్తారన్నారు.



ప్రొక్టాలజీ

గుప్త ప్రదేశంలో గూఢ సమస్యలు

కొన్ని అలవాట్లు గుప్త ప్రదేశాల్లో పలు రకాల ఇన్‌ఫెక్షన్లు, వ్యాధులకు కారణమవుతూ ఉంటాయి. కటి దిగువ ప్రదేశంలో తలెత్తే అలాంటి కొన్ని సమస్యలు, నివారణోపాయాల గురించి వైద్యులు ఇలా వివరిస్తున్నారు.

అందంగా కనిపించాలనే తాపత్రయంతో ఒంటిని అసౌకర్యానికి గురి చేసే బిగుతైన దుస్తులు, లోదుస్తులూ ధరించే అలవాటు కొందర్లో ఉంటుంది. అలాగే ఇంకొందరు బాహ్య సౌందర్యానికి ప్రాధాన్యమిస్తారే తప్ప, దుస్తుల వెనక దాగి ఉండే శారీరక శుభ్రత పట్ల ఈశ్రద్ధ వహిస్తూ ఉంటారు. ఇలాంటి అలవాట్లు, అశ్రద్ధలు అంతిమంగా ఆసన ఆరోగ్యాన్ని దెబ్బతీసే వ్యాధులకూ, ఇన్‌ఫెక్షన్లకూ దారి తీస్తూ ఉంటాయి.

అసలు సమస్య అలవాట్లతోనే...

ఆసనం... గాలి చొరబడే వీల్లేని గుప్త ప్రదేశం. అలాంటి ప్రదేశంలో సహజంగానే ఇన్‌ఫెక్షన్లు తలెత్తే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. పైగా బిగుతైన దుస్తులు, లోదుస్తులు ధరించడం, చమట, అపరిశుభ్రత, అపరిశుభ్ర లోదుస్తులు... ఇలా పలు కారణాల వల్ల ఆ ప్రాంతంలో రెట్టింపు సమస్యలు తలెత్తుతూ ఉంటాయి. వాటిని విపులంగా చర్చించుకుంటే...

- బిగుతైన జీన్స్ వేసుకునేవాళ్లు, అవే దుస్తుల్లో ఎక్కువ గంటలు పని చేసేవాళ్లలో ఆసన ప్రాంతంలో చమట పడుతూ ఉంటుంది. ఈ ప్రదేశాన్ని పొడిగా ఉంచుకోలేకపోవడం వల్ల ఫంగల్ ఇన్‌ఫెక్షన్లు వేధించే ప్రమాదం ఉంటుంది
- అవాంఛిత రోమాలు ఒక్కొకరిలో ఒక్కోలా ఉంటాయి. కొందర్లో త్వరగా, దట్టంగా పెరుగుతాయి. వీటికి చమట తోడై ఇన్‌ఫెక్షన్లు పెరుగుతాయి.
- కొందర్లో ఆసనం దగ్గర కూడా దట్టమైన వెంట్రుకలుంటాయి. ఇలాంటి వారికి కూడా అసౌకర్యాలు తప్పవు
- లోదుస్తుల పరిశుభ్రత లోపించినా ఇన్‌ఫెక్షన్లు వేధిస్తాయి
- కొందరు బిగుతైన దుస్తుల్లోనే నిద్రకు ఉపక్రమిస్తూ ఉంటారు. ఇది కూడా సరి కాదు

ఆసనంలో తలెత్తే సమస్యలు ఇవే!

ఫాలిక్యులైటిస్: అవాంఛిత రోమాల మూలంగా చమట పట్టి, 'ఫాలిక్యులైటిస్' అనే సమస్య తలెత్తుతుంది. ఇది కాలక్రమేణా అల్సర్‌గా మారి చీము పడుతుంది

అజీర్తి: బిగుతైన జీన్స్‌తోనే నిద్రకు ఉపక్రమిస్తూ ఉండడం వల్ల, ఆ ఒత్తిడికి పొట్ట ఒత్తుకుపోయి, జీర్ణప్రక్రియ కూడా మందగిస్తూ ఉంటుంది

మలబద్ధకం: సాధారణంగా ఉదయం నిద్ర లేవగానే యానల్ కెనాల్ రిల్యాక్స్ అవుతుంది. కానీ రాత్రంతా బిగుతైన దుస్తుల్లో నిద్రపోవడం వల్ల ఆసనం రిల్యాక్స్ అవలేక, ఉదయం మలవిసర్జన జరగదు. దాంతో ఆఫీసుకు వెళ్లే



హడాహుడిలో కాలకృత్యాలను వాయిదా వేసి, ఆ తర్వాత మలబద్ధకంతో బాధపడుతూ ఉంటారు. ఈ సమస్య అంతిమంగా మొలలు, ఫిషర్లకు దారి తీస్తుంది.

ఫిస్టులా: ఫిషర్లను నిర్లక్ష్యం చేయడం వల్ల అంతిమంగా పెరినియల్ యాబ్సెస్‌కు దారి తీస్తూ ఉంటుంది

ప్రొరైటస్ యాని: మలద్వారం చుట్టూరా దురద ఉంటుంది. దీనికి ఫిస్టులాలు, చమట, బిగుతైన లోదుస్తులు ప్రధాన కారణాలు

పిరుదుల మధ్య: బిగుతైన, గాలిచొరబడని, సింథటిక్ లోదుస్తుల వల్ల పిరుదుల మధ్య ఇన్‌ఫెక్షన్లు తలెత్తుతాయి

మలబద్ధకంతో...

మలబద్ధకం తలెత్తినప్పుడు, మలవిసర్జన సమయంలో ఒత్తిడిని ఉపయోగించడం మూలంగా మలద్వారం దగ్గర చీలిక ఏర్పడి ఫిషర్ ఏర్పడుతుంది. కోత ఏర్పనప్పుడు ఆ ప్రదేశంలోని చర్మం ముడుచుకుపోయి అతుక్కుపోతుంది. అలా ఆసనం దగ్గర పదే పదే ఫిషర్స్ ఏర్పడి, చర్మం అతుక్కుపోతూ ఉండడం వల్ల మలద్వారం బిగుతుగా మారిపోతుంది. దాంతో మలవిసర్జన సమయంలో మరింత ఒత్తిడిని ఉపయోగించవలసి వస్తుంది. ఫలితంగా మలద్వారం లోపల ఉండవలసిన పైల్స్ బయటకు జారతాయి. దీంతో మలద్వారం కుంచించుకుపోయి సమస్య మరింత జటిలమై, రక్తనాళాలు చిట్లి రక్తస్రావం, నొప్పి వేధిస్తాయి. దాంతో నొప్పిని తట్టుకోలేక మలవిసర్జనను పదే పదే వాయిదా వేస్తూ ఉంటారు. ఈ క్రమంలో ఫిషర్‌లో మలం నిల్వ ఉండిపోయి, అది పక్కకు ప్రయాణించి ఫిస్టులా ఏర్పడుతుంది. అలా వేరు మలద్వారం లోపల ఉండిపోయి, దాని కొమ్ములు ఆసనం చుట్టూరా ఏర్పడతాయి. వీటి నుంచి చీము స్రవిస్తూ ఉంటుంది. అయితే చాలా మంది వీటిని గమనించి, ఇది మలద్వారం దగ్గర కాకుండా పక్కన ఉంది కాబట్టి దీనికి మలద్వారంతో సంబంధం లేదనుకుని నిర్లక్ష్యం చేస్తూ ఉంటారు.

> **బిగుతైన బ్రాసరీలతో...**
>
> **బిగుతైన బ్రాసరీలు, వైరుతో కూడిన బ్రాసరీలతో రొమ్ముల దిగువన చర్మం ఒరుసుకుపోయి, అల్సర్లు, మొటిమలు ఏర్పడతాయి. అలాగే అక్కడ పేరుకునే చమట వల్ల సెబేషియస్ సిస్టులు తలెత్తుతాయి. రొమ్ములు గట్టిగా మారిపోతాయి లేదా రొమ్ముల్లో గడ్డలు ఏర్పడతాయి. ఇలా జరగకుండా ఉండాలంటే సరైన కొలతలతో కూడిన కాటన్ బ్రాసరీలను ఎంచుకోవాలి.**

ఈ జాగ్రత్తలు తప్పనిసరి

అంతర్గతంగా ఆరోగ్యంగా లేనప్పుడు ఆ అసౌకర్యం, బాధ ముఖంలో ప్రతిఫలిస్తూ ఉంటాయి. కాబట్టి ముఖాన్ని ఎంత ఆకర్షణీయంగా, పరిశుభ్రంగా ఉంచుకుంటామో, ఆసన ప్రాంతాన్ని కూడా అంతే ఆరోగ్యంగా, పరిశుభ్రంగా ఉంచుకోవాలి. అందుకోసం ఈ జాగ్రత్తలు పాటించాలి

- బిగుతైన జీన్స్ వాడకాన్ని పరిమితం చేయాలి. రాత్రుళ్లు అవే దుస్తుల్లో నిద్రకు ఉపక్రమించకూడదు
- రాత్రివేళ గాలి ధారాళంగా వీచే దుస్తులు వేసుకోవాలి. రాత్రుళ్లు లోదుస్తులు ధరించకపోయినా పరవాలేదు
- ముందు వైపు, ఆసనం చుట్టూరా ఉండే అవాంఛిత రోమాలను తొలగించుకోవాలి
- బిగుతైన లోదుస్తులకు స్వస్తి చెప్పాలి
- సింథటిక్ బదులుగా చమటను పీల్చుకునే కాటన్ లోదుస్తులు ఎంచుకోవాలి
- అండర్‌వేర్ పిరుదులకు సపోర్ట్ ఇచ్చేలా ఉండాలే తప్ప, బిగుతుగా ఉండకూడదు
- ఇన్‌ఫెక్షన్లు దరి చేరకుండా యాంటీ ఫంగల్ పౌడర్లు వాడుకోవచ్చు
- నెలసరి సమయంలో ఉపయోగించే ప్యాడ్స్ తరచూ మారుస్తూ ఉండాలి
- నాణ్యమైన, మన్నికైన శానిటరీ ప్యాడ్స్ వాడుకోవాలి
- పొద్దున, రాత్రి రెండుసార్లు తప్పనిసరిగా స్నానం చేయాలి
- ఎదిగే వయసులో ఉన్న టీనేజర్ల లోదుస్తుల సైజుల పట్ల తల్లి ఓ కన్నేసి ఉంచి, తదనుగుణంగా మారుస్తూ ఉండాలి
- బ్రాసరీలు, ప్యాంటీలు సాగిపోయి, వేలాడే పరిస్థితి తలెత్తేవరకూ వాటిని మార్చకుండా ఉండకూడదు
- నెలసరి తొలి రెండు రోజులూ శానిటరీ న్యాప్కిన్స్ రెండు నాలుగు గంటలకోసారి మార్చుకుంటూ, తర్వాత నుంచి ఉదయం, సాయంత్రం మార్చుకుంటూ ఉండాలి
- వ్యాయామంలో భాగంగా బరువులు ఎత్తేటప్పుడు, మలద్వారం మీద ఒత్తిడి పడుతుంది. కాబట్టి పిరుదులకు చక్కని సపోర్ట్ ఇచ్చే లోదుస్తులు వేసుకోవాలి

డాక్టర్ శాంతి వర్ధని
సీనియర్ ప్రొక్టాలజిస్ట్,
లాప్రోస్కోపిక్ అండ్ కొలొరెక్టల్ సర్జన్,
యశోద హాస్పిటల్స్, సికింద్రాబాద్



కొత్త వైద్యం

ప్రయాణంతో ఆరోగ్యం

ఆరోగ్యం కోసం ప్రయాణాన్ని సూచించే మొట్టమొదటి దేశంగా తాజాగా స్వీడన్ పేరు పొందింది. ది స్వీడిష్ ప్రిస్క్రిప్షన్ అనే కొత్త ప్రయత్నంలో భాగంగా, దేశ పర్యాటక సంస్థ, కరోలిన్‌స్కా సంస్థకు చెందిన పరిశోధకులు ఉమ్మడిగా, ప్రకృతి, సంస్కృ



తులకు ఔషధాలుగా ప్రచారం కల్పిస్తున్నారు. అడవిలో నడక, సానా, చల్లనీళ్లలో మునక, ఫీకా బ్రేక్స్, ఆకాశంలో నక్షత్రాలను వీక్షించడం లాంటి పనుల వల్ల ఒత్తిడి తగ్గి, ఆరోగ్యం మెరుగుపడుతుందని వాళ్లు సూచిస్తున్నారు. రోగులు ఈ ప్రకృతి చికిత్సలను నిరాటంకంగా పొందడానికి వీలుగా వైద్యుల ప్రిస్క్రిప్షన్‌ను డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయాన్ని కూడా కల్పిస్తున్నారు. అయితే ప్రయాణ ఖర్చులు తమ పరిధిలోకి రావనీ, చికిత్స పైనుంచి నివారణ, సమగ్రమైన ఆరోగ్యాల వైపు దృష్టిని మళ్లించడమే తమ లక్ష్యమనీ వైద్యులు ప్రిస్క్రిప్షన్‌లో స్పష్టం చేస్తున్నారు.

ఆరోగ్యం - ఆహారం

యాపిల్స్‌ను ఉడికించి తింటే?

యాపిల్ జ్యూస్ తాగుతాం. ముక్కలు చేసుకుని తింటాం. అయితే వీటిని ఉడికించి తినడం వల్ల మరిన్ని ఆరోగ్య ప్రయోజనాలను పొందే వీలుంది.

- యాపిల్స్‌ను ఉడికించినప్పుడు వాటిలో పెరిగే పెక్టిన్ పేగుల్లోని ప్రయోజనకరమైన బ్యాక్టీరియాకు ఆహారంగా మారుతుంది. దాంతో పేగుల్లోని వాతావరణం మెరుగుపడుతుంది
- నీటిలో కరిగే పీచు పేగుల ఆరోగ్యాన్ని క్రమబద్ధీకరించి, ఆరోగ్యకరమైన బ్యాక్టీరియా సంఖ్యను పెంచుతుంది
- యాపిల్స్‌ను ఉడికించడం వల్ల అవి సులభంగా జీర్ణమవుతాయి. దాంతో అజీర్తి తలెత్తదు
- వీటిలో యాంటీఆక్సిడెంట్లు ఎక్కువ. ఫలితంగా పేగుల్లోని ఇన్‌ఫ్లమేషన్ తగ్గుతుంది



ఇలా వండుకోవాలి: రెండు యాపిల్స్‌ను శుభ్రంగా కడిగి, తొక్కు తొలగించాలి. ముక్కలుగా కోసి, విత్తనాలు తొలగించాలి. ఆ తర్వాత బాండీలో అర కప్పు నీళ్లు పోసి, యాపిల్ ముక్కలు జోడించి, అర టీస్పూను దాల్చినచెక్క పొడి, అర చెక్క నిమ్మరసం పిండి, చిన్న మంట మీద ఏడు నిమిషాలు ఉడికించాలి. ముక్కలు మెత్తబడే కలుపుతూ ఉడికించిన తర్వాత, ఈ పదార్థాన్ని అలాగే తినొచ్చు లేదా పెరుగు జోడించి తినొచ్చు.

ఈ మందులతో కాలేయ రక్ష

బరువు తగ్గించే మందులతో కాలేయ ఆరోగ్యం మెరుగుపడుతుందనే ఒక తాజా అధ్యయనం, వరల్డ్ జర్నల్ ఆఫ్ గ్యాస్ట్రోఎంటరాలజీలో ప్రచురితమైంది. మరిన్ని వివరాలు...

కాలేయ జబ్బు మూలంగా మెటబాలిక్ డిస్‌ఫంక్షన్ సమస్యను ఎదుర్కొంటున్న రోగులకు, స్థూలకాయం, మధుమేహం కోసం అభివృద్ధి చేసిన మందులు కాలేయానికి ప్రయోజనాలను అందిస్తున్నట్టు, 'ఎఫికసీ అండ్ సేఫ్టీ ఆఫ్ యాంటి ఒబేసిటీ డ్రగ్స్ ఇన్ మెటబాలిక్ డిస్‌ఫంక్షన్ అసోసియేటెడ్ స్టెటోయిక్ లివర్ డిసీజ్' అనే పేరుతో చేపట్టిన ఒక తాజా అధ్యయనంలో వెల్లడైంది. ప్రపంచవ్యాప్తంగా 30 శాతం మంది ప్రజలు, మెటబాలిక్ డిస్‌ఫంక్షన్ ఫలితంగా కాలేయంలో కొవ్వు పేరుకుపోయే సమస్యను ఎదుర్కొంటున్నారు. మెటబాలిక్ డిస్‌ఫంక్షన్ అసోసియేటెడ్ స్టెటో హెపటైటిస్, మ్యాష్ సమస్యతో బాధపడే రోగుల్లో కాలేయ కణాలు దెబ్బతిని, అంతిమంగా కాలేయం, ఫైబ్రోసిస్, సిర్రోసిస్‌కు



దారి తీస్తూ ఉంటుంది. అయితే సంప్రదాయ చికిత్సలో భాగంగా జీవనశైలి మార్పులు, ఆహారం, వ్యాయామాల ద్వారా బరువు తగ్గించుకోవడం లాంటి నియమాలను వైద్యులు సూచిస్తూ ఉంటారు. వీటితో ఫలితం కనిపించని సందర్భాల్లో అంతిమంగా సర్జరీని ఆశ్రయిస్తూ ఉంటారు. అయితే మ్యాష్ సమస్యతో బాధపడుతున్న రోగులకు లీరాగ్లూటైడ్ లాంటి బరువు తగ్గించే మందులను 48 వారాల పాటు సూచించినప్పుడు. ఆ రోగులు బరువు తగ్గడంతో పాటు వారి కాలేయ ఆరోగ్యం కూడా మెరుగుపడుతున్న స్పష్టమైంది. అలాగే సెమాగ్లూటైడ్‌తో కాలేయంలో కొవ్వు పేరుకునే తీవ్రత తగ్గడంతో పాటు శరీరం ఇన్సులిన్‌ను ఉపయోగించుకునే తీరు మెరుగుపడి, కాలేయ వాపు, నొప్పి అదుపులోకొచ్చాయి. ఈ మందులతో కాలేయ ఫైబ్రోసిస్ కూడా తగ్గుముఖం పడుతున్నట్టు ప్రయోగాల్లో తేలింది కాబట్టి బరువును తగ్గించే మందులు కాలేయ ఆరోగ్యాన్ని కూడా మెరుగుపరుస్తాయని పరిశోధకులు అంటున్నారు.

అధ్యయనం

అధిక పిండిపదార్థాలే శత్రువులు

భారతీయులు పిండిపదార్థాల ప్రియులు. మనకు అన్నం లేదా రోటీ లేనిదే ఆకలి తీరదు. ఇలాంటి అధిక పిండిపదార్థాల ఆహార శైలి వల్లే ఊబకాయం, మధుమేహ సమస్యలు పెరుగుతున్నాయని తాజా ఐసిఎమ్‌ఆర్ (ఇండియన్ కౌన్సెల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్) అధ్యయనం హెచ్చరిస్తోంది. మరిన్ని వివరాలు...



పిండిపదార్థాలు కచ్చితంగా శక్తి భాండాగారాలే! అయితే భారతీయుల ఆహారంలో రోజువారీ 62% క్యాలరీలు పిండిపదార్థాల నుంచే అందుతున్నాయి. మరీ ముఖ్యంగా తెల్ల అన్నం, అదనపు చక్కెరల నుంచే ఈ పిండిపదార్థాలు సమకూరుతూ ఉండడం మరింత ఆందోళనకరమైన విషయం. దక్షిణ భారత దేశంలో తెల్ల అన్నం ప్రధాన పిండిపదార్థ వనరు అయితే, తూర్పు, ఈశాన్య భారతదేశంలో గోధుమలు ప్రధాన పిండిపదార్థ వనరుగా ఉపయోగపడుతున్నాయి. దేశంలోని 21 రాష్ట్రాలు, సూచించిన చక్కెర మోతాదులను మించిపోయాయి. పిండిపదార్థాలతో ఊబకాయం, మధుమేహ ముప్పు పొంచి ఉంది కాబట్టి మన కంచాల్లో నుంచి అన్నం, రోటీలను పూర్తిగా తొలగించుకోవాలా? అంటే, అవసరం లేదు. వాటి పరిమాణాన్ని 5% తగ్గించుకుంటే సరిపోతుందని అంటున్నారు సీనియర్ డయాబెటాలజిస్ట్, అధ్యయనం తొలి రచయిత్రి, డాక్టర్ అంజన. ఐదు శాతం పిండిపదార్థాల కోతతో మధుమేహానికీ, ప్రిడయాబెటిస్‌కూ అడ్డుకట్ట వేయొచ్చని అంటున్నారామె. ఉదయం అల్పాహారంలో రెండు ఇడ్లీలు తినే అలవాటున్నవారు, ఒక ఇడ్లీని తొలగించి, దాని స్థానాన్ని సాంబారుతో భర్తీ చేసుకోవచ్చు. ఒక పూరీ స్థానాన్ని ఒక కప్పు పప్పుతో, రాజ్మాతో భర్తీ చేసుకోవచ్చు. అలాగే కప్పు పెరుగు, గుడ్డుతో బ్రేక్‌ఫాస్ట్‌ను పరిపూర్ణం చేసుకోవచ్చని సూచిస్తున్నారామె.

అన్నం, రోటీ ఒకటే!

సాధారణంగా అన్నం తగ్గించాలనుకునేవారు ఆ లోటును రోటీతో భర్తీ చేస్తూ ఉంటారు. కానీ అన్నం, రోటీ... రెండూ పిండిపదార్థాలే అనే విషయం గుర్తుపెట్టుకోవాలి. ఈ రెండింట్లో గ్లైసెమిక్ ఇండెక్స్ సమానంగా ఉంటుంది. పిండిపదార్థాలు త్వరగా జీర్ణమై, శరీరం వాటిని త్వరగా ప్రాసెస్ చేసుకుంటుంది. దాంతో శరీరంలో చక్కెర మోతాదులు పెరిగి, వెంట వెంటనే ఆకలేస్తుంది. ఇదే క్రమం కొనసాగుతూ, శరీరంలోకి చేరుకునే అదనపు క్యాలరీల వల్ల ఊబకాయం, మధుమేహం తలెత్తుతాయి. కాబట్టి పిండి పదార్థాల మోతాదును తగ్గించుకోవడం ఉత్తమం.

చిరుధాన్యాలు తినొచ్చా?

రాగులు, కొర్రలు, జొన్నలు, సజ్జలు, సామలు... ఇలా అనేక చిరుధాన్యాల పట్ల ఇటీవలి కాలంలో మక్కువ పెరిగింది. అయితే వీటిలో పీచు, మాంసకృత్తులు, విటమిన్లు, ఖనిజ లవణాలు ఉన్నప్పటికీ, ప్రస్తుతం మార్కెట్లో దొరుకుతున్న చిరుధాన్యాలన్నీ పాలిష్ పట్టినవేననే విషయం గుర్తుపెట్టుకోవాలని అంటున్నారు సీనియర్ న్యూట్రిషనిస్ట్ సుధా వాసుదేవన్. వీటిని తినడం వల్ల, శుద్ధి చేసిన బియ్యానికి రెండు రెట్లు ఎక్కువగా చక్కెర మోతాదులు పెరుగుతాయని హెచ్చరిస్తున్నారామె. నిల్వ సామర్థ్యాన్ని పెంచడం కోసం చిరుధాన్యాలను శుద్ధి చేయడం వల్ల పోషకభరితమైన పొరలన్నీ తొలగిపోతున్నాయ(ని అంటున్నారు సుధ. చిరుధాన్యాలు జీర్ణమయ్యే సమయాన్ని పెంచడం కోసం వాటిని కూరగాయలు, చిక్కుళ్లు, పప్పుధాన్యాలతో కలిపి వండుకోవాలని సూచిస్తున్నారామె.

మాంసకృత్తులను పెంచి...

పిండిపదార్థాలను తగ్గించడంతో పాటు మాంసకృత్తులను పెంచడం మీద కూడా దృష్టి పెట్టాలి. మన దేశంలో ఒక రోజుకు తీసుకుంటున్న సగటు మాంసకృత్తులతో అందుతున్న క్యాలరీల సంఖ్య 12 శాతం మాత్రమే! కానీ రోజు మొత్తంలో మన శరీరానికి అందవలసిన మొత్తం క్యాలరీల్లో 50 శాతం క్యాలరీలు మాత్రమే పిండిపదార్థాల నుంచి, 20 నుంచి 30 శాతం క్యాలరీలు కొవ్వుల నుంచి, 20 శాతం క్యాలరీలు మాంసకృత్తుల నుంచి, 3 నుంచి 6 శాతం క్యాలరీలు పీచు నుంచి అందేలా చూసుకోవాలి. నిజానికి మాంసకృత్తులను కలిగిన పదార్థాలన్నీ ఖరీదైనవే! కాబట్టి పిండిపదార్థాల మోతాదు పెరుగుతోంది. అయితే ఇలాంటి పరిస్థితిలో పిండిపదార్థాల ప్రభావాన్ని తగ్గించుకోవడం కోసం 'ఫాస్ట్ కార్బ్స్'ను పరిమితం చేసుకోవాలి. అందుకోసం వైట్ బ్రెడ్, పాలిష్ పట్టిన ధాన్యాలను తగ్గించి, నెమ్మదిగా జీర్ణమయ్యే బీన్స్, చిక్కుళ్లు, నట్స్, పండ్లు తీసుకోవాలి. శాకాహారులు వృక్షాధారిత మాంసకృత్తులు మీద దృష్టి పెట్టాలి. ప్రతి భోజనంలో పులిసిన పాల ఉత్పత్తులకు చోటు కల్పించాలి. మాంసాహారులు రోజులో ఒక్క పూటైనా చేపలు, గుడ్లు తినాలి.

కళోంజి కథే వేరు

కళోంజి, లేదా కాలా జీరా ఆరోగ్యాన్ని అందించే ఒక ప్రత్యేకమైన దినుసుగా పేరు పొందింది. ప్రాచీన ఈజిప్టు సమాధుల్లో, చారిత్రక వైద్య ప్రతుల్లో స్థానం సంపాదించుకున్న ఈ చిన్న విత్తనం ప్రయోజనాల గురించి తెలుసుకుందాం!



మూత్రపిండాల్లోని రాళ్ల పరిమాణాన్ని తగ్గించడంలో, వాటిని కరిగించడంలో కళోంజి ఎంతో బాగా సహాయపడుతుందని తాజా అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఈ విత్తనం ప్రభావాన్ని ప్రత్యక్షంగా పరిశీలించడం కోసం 2019 ఒక ప్రయోగాన్ని కూడా చేపట్టడం జరిగింది. ఈ ప్రయోగంలో భాగంగా మూత్రపిండాల రాళ్లతో బాధపడుతున్న 60 మంది రోగులకు రోజుకు రెండు సార్లు చొప్పున పది రోజుల పాటు 500 మిల్లీగ్రాముల కళోంజీని అందించినప్పుడు, కళోంజి తీసుకున్న 44 శాతం మందిలో, మూత్రపిండాల్లోని రాళ్లు బయటకు వచ్చేశాయి. 50 శాతం మంది మూత్రపిండాల్లోని రాళ్ల పరిమాణం తగ్గిపోయింది. దీన్ని బట్టి కళోంజి మూత్రపిండాల రోగులకు వరప్రదాయనిగా ఉపయోగపడుతుందని తేలింది. ఈ విత్తనాల్లోని థైమోక్వినోన్ అనే మూలకం యాంటీఆక్సిడెంట్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ ప్రభావాలను కలిగి ఉండడంతో పాటు మూత్రపిండాలకు ప్రయోజనాలను అందిస్తుంది. అలాగే మూత్రపిండాల్లోని రాళ్లను కరిగించడంతో పాటు, వ్యాధినిరోధకశక్తిని మెరుగుపరచడం, ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గించడం, రక్తపోటు, మధుమేహాల అదుపుకు తోడ్పడడం, జీర్ణశక్తిని మెరుగుపరచడం మొదలైన ప్రయోజనాలను కూడా అందిస్తుంది.

వీటితో గుండెజబ్బులు దూరం

గ్రీన్ టీ, దానిమ్మ రసం, బీట్‌రూట్ రసం, పసుపు కలిపిన పాలు... వీటితో గుండె రక్తనాళాల్లో అవరోధాలు పేరుకునే పరిస్థితి కుంటుపడుతుంది. అందుకు తోడ్పడే అంశాలు ఈ పానీయాల్లో ఏమున్నాయంటే...

ఆక్సిజన్‌ను మోసుకువెళ్తూ, రక్తప్రవాహానికి తోడ్పడే రక్తనాళాల్లో కాలక్రమేణా అవరోధాలు పేరుకుపోయి, అథెరోస్క్లెరోసిస్ అనే సమస్య తలెత్తుతుంది. క్రమేపీ పేరుకుపోయే కొలెస్ట్రాల్, కొవ్వు లేదా క్యాల్షియంలు రక్తనాళాలను మూసుకుపోయేలా చేసి, రక్తపోటుకూ అంతిమంగా గుండెపోటుకూ దారి తీస్తాయి. కాబట్టి ఈ పరిస్థితికి దోహదపడే ఇన్‌ఫ్లమేషన్, చెడు కొలెస్ట్రాల్‌లను తగ్గించే ఆహార నియమాలను పాటించాలి.

గ్రీన్ టీ: గ్రీన్‌టీలోని కాటెచిన్స్ అనే యాంటీఆక్సిడెంట్స్. రక్తనాళాల్లో ప్రధాన అవరోధాలకు దోహదపడే, ఎల్‌డిఎల్ కొలెస్ట్రాల్‌నూ, ఆక్సిడేటివ్ స్ట్రెస్‌నూ తగ్గిస్తాయి. ప్రతిరోజూ గ్రీన్ టీ తాగడం వల్ల, రక్తనాళాల్లోని అంతర్గత గోడల పనితీరు మెరుగుపడి, రక్తనాళాల్లో నమ్యత పెరిగి రక్త ప్రవాహం సాఫీగా జరుగుతుంది. కాబట్టి రోజుకు రెండు నుంచి మూడు కప్పుల తాజా గ్రీన్ టీ తాగడం ద్వారా గుండె రక్తనాళాలు ఆరోగ్యంగా ఉంటాయి

దానిమ్మ రసం: దానిమ్మలోని ప్యూనికలాజిన్స్, యాంథోసయానిన్స్. రక్తనాళాల్లో ఇన్‌ఫ్లమేషన్‌నూ ఆక్సిడేటివ్ స్ట్రెస్‌నూ తగ్గిస్తాయి. అలాగే క్రమం తప్పకుండా దానిమ్మ రసం తాగితే గుండె రక్తనాళాల్లో ప్లేక్ నిల్వ తగ్గుతుంది. ఈ పండులోని ఫ్లేవనాయిడ్స్ రక్తంలో కొలెస్ట్రాల్ ఆక్సిడేషన్‌ను కూడా తగ్గిస్తాయి. కాబట్టి ఈ పండు ప్రయోజనాలను పూర్తిగా పొందాలనుకుంటే తాజా దానిమ్మ రసాన్ని చక్కెర జోడించకుండా తాగాలి



బీట్‌రూట్ రసం: ఈ రసంలో నైట్రేట్స్ ఉంటాయి. వీటిని శరీరం నైట్రిక్ ఆమ్లంగా మలుచుకుంటుంది. దాంతో రక్తనాళాలు విప్పారి, రక్తపోటు తగ్గుతుంది, రక్త ప్రవాహం మెరుగవుతుంది. ప్రతి రోజూ బీట్‌రూట్ రసం తాగడం వల్ల రక్తనాళాల బిరుసుతనం తగ్గుతుందని పరిశోధనలు నిరూపించాయి

మహిళల ఆరోగ్యం

ఎముకల దృఢత్వం 30 ఏళ్ల లోపే...

30 ఏళ్లు దాటిన మహిళల్లో ఎముకలు గుల్లబారే ముప్పు ఎక్కువగా ఉంటుంది. ఈ ముప్పు నుంచి తప్పించుకోవాలంటే ఒక చిట్కా పాటించాలి. మహిళల్లో ఎముకలు 30 ఏళ్ల వయసుకు పతాక స్థాయి దృఢత్వానికి చేరుకుని, ఆ తర్వాత నుంచి క్రమేపీ బలహీనపడుతూ పెళుసుగా మారి విరిగిపోయే స్వభావాన్ని అలవరుచుకుంటాయి. కాబట్టి ప్రతి మహిళా 30 ఏళ్ల వయసుకు చేరుకునే సమయానికి ఎముకల సాంద్రత గరిష్ఠ స్థాయికి చేరుకునేలా జాగ్రత్తలు తీసుకోవాలి. అందుకోసం వ్యాయామం, పోషకాహారం, ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరించాలి. ఎముకల ఆరోగ్యాన్ని కాపాడే జీవనశైలిని అనుసరించిన మహిళల్లో ఎముకల క్షీణత తక్కువగా ఉన్నట్టు అధ్యయనాలు సైతం నిరూపించాయి. కాబట్టి ఆహారంలో మాంసకృత్తులు అధికంగా ఉండేలా చూసుకోవాలి. బరువులెత్తే వ్యాయామాలు చేయాలి. ఈ వ్యాయామాలు ఎముకల సాంద్రతనూ, కండరపుష్టినీ పెంచేలా ఉండాలి. మెగ్నీషియం మోతాదు తగ్గితే ఎముకల సాంద్రత కూడా తగ్గుతుంది. కాబట్టి మెగ్నీషియం కలిగి ఉండే బాదం, జీడిపప్పు, గుమ్మడి విత్తనాలు, పాలకూర తింటూ ఉండాలి. అలాగే ఎముకల దృఢత్వాన్ని పెంచే విటమిన్ కె కోసం, బ్రొకొలి, సోయాబీన్స్ తీసుకోవాలి.



హెచ్‌సీఎల్ టెక్ లాభం రూ.4,235 కోట్లు

రూ.31,942 కోట్ల ఆదాయం

ఒక్కో షేరుకు రూ.12 మధ్యంతర డివిడెండ్ ●వరుసగా 91వ త్రైమాసిక డివిడెండ్ ఇది

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) సెప్టెంబరుతో ముగిసిన రెండో త్రైమాసికానికి (క్యూ2) హెచ్‌సీఎల్ టెక్ రూ.4,235 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని ప్రకటించింది. వార్షిక ప్రాతిపదిక లాభంలో ఎలాంటి వృద్ధి లేనప్పటికీ, ఈ జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో నమోదైన రూ.3,843 కోట్ల లాభంతో పోలిస్తే 10.2 శాతం పెరిగింది. ఈ క్యూ2లో కంపెనీ ఏకీకృత ఆదాయం మాత్రం వార్షిక ప్రాతిపదికన 10.6 శాతం పెరిగి రూ.31,942 కోట్లకు చేరింది. గత ఆర్థిక సంవత్సరం (2024-25)లో ఇదే కాలానికి ఆదాయం రూ.28,862 కోట్లుగా నమోదైంది. ఈ క్యూ1లో నమోదైన రూ.30,349 కోట్ల రెవెన్యూతో పోలిస్తే 5.25 శాతం వృద్ధి నమోదైంది. ఈ ఆర్థిక సంవత్సరం మొత్తానికి ఆదాయం వృద్ధి అంచనాను గతంలో ప్రకటించిన 3-5 శాతంగా కొనసాగించినప్పటికీ, సేవల ఆదాయ వృద్ధి అంచనాను మాత్రం 3-5 శాతం నుంచి 4-5 శాతానికి మెరుగుపరిచింది.

కాగా, ఈ త్రైమాసిక ఆర్థిక ఫలితాల సందర్భంగా హెచ్‌సీఎల్ టెక్ తన వాటాదారులకు ఒక్కో షేరుకు రూ.12 మధ్యంతర డివిడెండ్‌ను ప్రకటించింది. డివిడెండ్‌కు అర్హులైన వాటాదారుల ఎంపికకు రికార్డు తేదీని ఈ నెల 17గా నిర్ణయించిన కంపెనీ.. 28న చెల్లింపులు చేపట్టనుంది. హెచ్‌సీఎల్ వరుసగా 91 త్రైమాసికాలుగా డివిడెండ్ ప్రకటిస్తూ వస్తోంది.



గ్లోబల్ డెలివరీ మోడల్‌ను బలోపేతం చేసుకుంటూ రావడం ద్వారా కంపెనీ వ్యూహాత్మకంగా హెచ్1బీ వీసాలపై ఆధారపడటం తగ్గించుకుంటూ వచ్చింది. అమెరికాలో స్థానిక నియామకాలను, శిక్షణను పెంచడం ద్వారా స్థానికీకరణను మెరుగుపరుచుకోవాలనుకుంటున్నాం.

- సీ విజయ్ కుమార్, సీఈఓ, ఎండీ, హెచ్‌సీఎల్ టెక్

- గడిచిన త్రైమాసికంలో హెచ్‌సీఎల్ టెక్ ఉద్యోగులు నికరంగా 3,489 మంది పెరిగి 2,26,640కి చేరుకున్నారు. గత మూడు నెలల్లో కొత్తగా 5,196 మంది ఫ్రెషర్లను ఉద్యోగంలో చేర్చుకున్నట్లు కంపెనీ తెలిపింది. కాగా, ఈ క్యూ2లో ఉద్యోగుల వలసల రేటు 12.6 శాతానికి తగ్గింది.
- గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే, ఈసారి ఫ్రెషర్ల నియామకాలను గణనీయంగా పెంచాలన్నది ఆలోచన. గత ఏడాది హైరింగ్‌తో పోలిస్తే, ఈ ప్రథమార్ధంలో దాదాపు 92% నియామకాలు చేపట్టినట్లు హెచ్‌సీఎల్ టెక్ చీఫ్ పీపుల్ ఆఫీసర్ రామ్ సుందర రాజన్ తెలిపారు. ఈ ఏడాది ప్రణాళికకు అనుగుణంగా ద్వితీయార్ధంలో మిగతా నియామకాలను చేపడతామన్నారు.
- ఉద్యోగులందరికీ వేరియబుల్ చెల్లింపులను వారి జీతంలో 'ఫిక్స్‌డ్ పే'లో విలీనం చేస్తున్నట్లు ప్రకటించిన కంపెనీ.. ఈ నెల నుంచి వేతనాలను పెంచుతున్నట్లు తెలిపింది.

ఎమిరేట్స్ ఎన్‌బీడీకి ఆర్‌బీఎల్ బ్యాంక్‌లో మెజారిటీ వాటా?

- ఇరువర్గాల మధ్య కొనసాగుతున్న చర్చలు
- డీల్ విలువ రూ.9,000 కోట్ల పైనే ఉండే చాన్స్

న్యూఢిల్లీ: దేశీయ ప్రైవేట్ రంగానికి చెందిన లిస్టెడ్ బ్యాంకింగ్ సంస్థ ఆర్‌బీఎల్ బ్యాంక్‌లో మెజారిటీ వాటాను దక్కించుకునేందుకు ఎమిరేట్స్ ఎన్‌బీడీ సన్నాహాలు చేస్తోంది. గత కొద్ది నెలలుగా ఇరువర్గాల మధ్య చర్చలు జరుగుతున్నాయని, ఆర్‌బీఎల్ బ్యాంక్‌లో 51 శాతానికి పైగా వాటాను చేజిక్కించుకునేందుకు ఎమిరేట్స్ ఎన్‌బీడీ ఆసక్తిగా ఉందని బ్యాంకింగ్ వర్గాలు వెల్లడించాయి. చర్చలు పురోగతిలో ఉన్నాయని, డీల్ కుదిరేందుకు మరికొంత సమయం పట్టవచ్చని ఆ వర్గాలు తెలిపాయి. సోమవారం బీఎస్ఈలో ఆర్‌బీఎల్ షేరు ధర రూ.290.15 వద్ద స్థిరపడింది. బ్యాంక్ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.17,786.79 కోట్లుగా నమోదైంది. ఈ లెక్కన బ్యాంక్‌లో 51 శాతం వాటా కోసం ఎమిరేట్స్ ఎన్‌బీడీ రూ.9,071 కోట్లు వెచ్చించాల్సి ఉంటుంది. కాగా ప్రభుత్వ రంగంలోని ఐడీబీఐ బ్యాంక్‌లో వ్యూహాత్మక వాటా కొనుగోలుకు పోటీపడుతున్న సంస్థల్లో ఎమిరేట్స్ ఎన్‌బీడీ కూడా ఉందని గతంలో వార్తలు వచ్చాయి.

బయోసెక్యూర్ చట్టానికి అమెరికా సెనెట్ ఆమోదం

భారత ఫార్మా సీడీఎంఓ కంపెనీలకు ఊతం



వాషింగ్టన్: అమెరికా-చైనాల మధ్య వాణిజ్య యుద్ధం ముదురుతోంది. అమెరికా సెనెట్ తాజాగా యూఎస్ బయోసెక్యూర్ యాక్ట్‌తో కూడిన నేషనల్ డిఫెన్స్ ఆథరైజేషన్ యాక్ట్ (ఎన్‌డీఏఏ)కు ఆమోదం తెలిపింది. ప్రతినిధుల సభ, అధ్యక్షుడు ట్రంప్ ఇంకా ఈ బిల్లుకు ఆమోదం తెలపాల్సి ఉంది. ఈ రెండు ప్రక్రియలు పూర్తయితే ఇది చట్టంగా మారి అమల్లోకి వస్తుంది. అమెరికా బయోటెక్, హెల్త్ డేటా కంపెనీల్లో చైనా బయోటెక్, ఫార్మా కంపెనీలు పెట్టే పెట్టుబడులకు ఈ చట్టంతో తెర పడుతుందని భావిస్తున్నారు. ఈ చట్టం కింద అమెరికా రక్షణ శాఖ (పెంటగాన్) ఏదైనా చైనా ఫార్మా కంపెనీ, చైనా సైన్యం కనుసన్నల్లో పని చేస్తోందని భావిస్తే ఆ కంపెనీ అమెరికా బయోటెక్, హెల్త్‌కేర్ డేటా కంపెనీల్లో పెట్టే పెట్టుబడులను దేశ భద్రత పేరుతో అమెరికా ప్రభుత్వం అడ్డుకోవచ్చు. ఇప్పటికే ఉప్పు-నిప్పుల్లా ఉన్న అమెరికా-చైనా వాణిజ్య సంబంధాలు ఈ చట్టంతో మరింత వేడెక్కే అవకాశం ఉందని భావిస్తున్నారు.

భారీ మార్కెట్: అమెరికా ఫార్మా కంపెనీలు ప్రస్తుతం ఏటా 4,100 కోట్ల డాలర్ల నుంచి 4,370 కోట్ల డాలర్ల విలువైన సీడీఎంఓ సేవలను ఔట్‌సోర్స్ చేసుకుంటున్నాయి. 2034 నాటికి ఇది 8,400 కోట్ల డాలర్లకు చేరుకుంటుందని అంచనా. ఎఫ్‌డీఏ ఆమోదిత ప్లాంట్లు అత్యధికంగా ఉన్న భారత్‌కు ఇది ఎంతో కలిసి వస్తుందని భావిస్తున్నారు.

మన కంపెనీలకు మేలే

ఈ చట్టం భారత ఫార్మా రంగానికి చెందిన కాంట్రాక్ట్ డెవలప్‌మెంట్, మాన్యుఫాక్చరింగ్ ఆర్గనైజేషన్స్ (సీడీఎంఓ)కు మేలు చేస్తుందని భావిస్తున్నారు. దీంతో అమెరికా బయోటెక్, ఫార్మా కంపెనీలు తమ కొత్త ఔషధాల అభివృద్ధి, తయారీ కార్యకలాపాలను భారత్‌లోని సీడీఎంఓ కంపెనీలకు తరలించే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఇప్పటికే అనేక అమెరికా కంపెనీలు.. భారత్‌కు చెందిన దివీస్ లేబొరేటరీస్, లారస్ ల్యాబ్స్, న్యూలాండ్ లేబొరేటరీస్, జుబిలెంట్ ఫార్మా, పిరామల్ ఫార్మా వంటి ఫార్మా కంపెనీల నుంచి ఈ సేవలు అందుకుంటున్నాయి. తాజా పరిణామాలతో ఇది మరింత పెరగనుంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



14వ తేదీ			
హైదరాబాద్	510	విజయవాడ	525
వరంగల్	512	గోదావరి	520
చిత్తూరు	553	విశాఖపట్నం	510
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	102	విజయవాడ	119
వరంగల్	102	గుంటూరు	114
కరీంనగర్	102	ఒంగోలు	114
మహబూబ్‌నగర్	102	చిత్తూరు	97
కర్నూలు	102	నెల్లూరు	102
విశాఖపట్నం	127	అనంతపురం	102
గోదావరి	119		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,25,400 ▲	1,14,950 ▲	1,80,000 ▲
విజయవాడ	1,28,000 ▲	1,22,000 ▲	1,82,000 ▲
విశాఖపట్నం	1,28,000 ▲	1,13,900 ▲	1,97,000 ▲
రాజమండ్రి	1,25,400 ▲	1,14,950 ▲	1,79,000 ▲
ప్రొద్దుటూరు	1,30,200 ▲	1,19,780 ▲	1,79,000 ▲
ముంబై	1,24,155 ▲	1,13,726 ▲	1,75,325 ▲

8 ఏళ్ల కనిష్ఠానికి ద్రవ్యోల్బణం

- 2017 జూన్ తర్వాత ఇదే ప్రథమం
- సెప్టెంబరులో 1.54 శాతంగా నమోదు

న్యూఢిల్లీ: రిటైల్ ద్రవ్యోల్బణం సెప్టెంబరు నెలలో 8 సంవత్సరాల కనిష్ఠ స్థాయి 1.54 శాతానికి దిగి వచ్చింది. ఆగస్టు నెలలో ఇది 2.07% ఉండగా గత ఏడాది సెప్టెంబరులో 5.49% ఉంది. ఆహార వస్తువుల ధరలు ప్రత్యేకించి కూరగాయలు, పళ్లు, పప్పు దినుసుల ధరలు గణనీయంగా తగ్గడం ఇందుకు కారణం. 2017 జూన్‌లో నమోదైన 1.46% తర్వాత నమోదైన కనిష్ఠ స్థాయి ఇదే. అలాగే ఈ ఏడాది రిటైల్ ద్రవ్యోల్బణం 2% కన్నా దిగువకు రావడం ఇది రెండో సారి. ప్రభుత్వం ఆర్‌బీఐకి నిర్దేశించిన ద్రవ్యోల్బణం కట్టడి పరిధిలో (2% పైకి లేదా దిగువకు సద్దుబాటుతో 4% అంటే 2-6%) కనిష్ఠ స్థాయి కన్నా దిగి వచ్చినట్లు జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) విడుదల చేసిన గణాంకాలు వెల్లడించాయి. సెప్టెంబరు నెలలో ద్రవ్యోల్బణం 53 బేసిస్ పాయింట్లు (0.53%) తగ్గిందని ఎన్ఎస్ఓ తెలిపింది. ఆహార ద్రవ్యోల్బణం ఆగస్టులో (-) 0.64% ఉండగా సెప్టెంబరులో (-) 2.28 శాతానికి తగ్గింది. గత ఏడాది సెప్టెంబరులో ఈ విభాగంలో ద్రవ్యోల్బణం 9.24 శాతంగా ఉంది.

కేరళలో గరిష్ఠం

రాష్ట్రాల వారీగా చూసినట్టయితే సెప్టెంబరు నెలలో రిటైల్ ద్రవ్యోల్బణం కేరళలో గరిష్ఠంగా 9.05% ఉండగా ఉత్తరప్రదేశ్‌లో కనిష్ఠంగా (-) 0.61 శాతంగా నమోదైంది. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో 1.07% ఉండగా పట్టణ ప్రాంతాల్లో 2.04 శాతంగా ఉంది.

బం'గరం గరం'

పసిడి సరికొత్త ఆల్‌టైం రికార్డు

- రూ.1.28 లక్షలకు 10 గ్రాముల ధర
- ఒక్కరోజే రూ.1,950 పెరుగుదల
- ప్రొద్దుటూరులో రూ.130,200కి చేరిన పసిడి

న్యూఢిల్లీ: పసిడి, వెండి పరుగు ఆపనంటున్నాయి. ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి (99.9 శాతం స్వచ్ఛత) బంగారం ధర సోమవారం రూ.1,950 పెరిగి సరికొత్త జీవితకాల గరిష్ఠస్థాయి రూ.1,27,950కి చేరింది. 99.5 శాతం స్వచ్ఛత లోహమూ అదే స్థాయిలో ఎగబాకి కొత్త ఆల్‌టైం రికార్డు స్థాయి రూ.1,27,350కి పెరిగింది. కిలో వెండి సైతం ఏకంగా రూ.7,500 పెరుగుదలతో రూ.1.79 లక్షల ధర పలికింది. సిల్వర్‌కూ ఇది కొత్త రికార్డే. అంతర్జాతీయంగా వీటి ధరలు మరింత ఎగబాకడమే ఇందుకు ప్రధాన కారణం. కాగా ప్రొద్దుటూరులో 10 గ్రాముల బంగారం ఏకంగా రూ.1,30,200 పలికింది. మరోవైపు ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం దాదాపు 2 శాతం ఎగబాకి సరికొత్త రికార్డు స్థాయి 4,084 డాలర్లకు చేరింది. సిల్వర్ సైతం దాదాపు 3 శాతం పెరుగుదలతో ఆల్‌టైం గరిష్ఠ స్థాయి 51.74 డాలర్లకు చేరుకుంది.

ధనత్రయోదశి నాటికి రూ.1.30 లక్షలకు: ఈ ఏడాదిలో బంగారం ధరలు ఇప్పటికే 50% పెరిగాయి. అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితులు కొనసాగితే, ఈ ధనత్రయోదశి (శనివారం) నాటికి 10 గ్రాముల బంగారం రూ.1.30 లక్షలు దాటవచ్చని ఎస్ఎంసీ గ్లోబల్ సెక్యూరిటీస్ కమోడిటీ రీసెర్చ్ హెడ్ వందన భారతి అభిప్రాయపడ్డారు. వచ్చే ఏడాది తొలినాళ్లలో ధర రూ.1.50 లక్షలకు చేరుకోవచ్చని ఆమె అంచనా వేశారు.

మార్కెట్‌కు ట్రంప్ సుంకాల పోటు

సెన్సెక్స్ 174 పాయింట్లు పతనం

ముంబై: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గత వారాంతంలో చైనాపై 100 శాతం అదనపు సుంకాలు ప్రకటించడంతో ఆసియా మార్కెట్లతో పాటు దేశీయ ఈక్విటీ సూచీలూ సోమవారం నష్టాల్లో పయనించాయి. ఐటీ, ఎఫ్ఎంసీజీ షేర్లలో అమ్మకాలతో సెన్సెక్స్ 173.77 పాయింట్లు కోల్పోయి 82,327.05 వద్ద ముగిసింది. నిఫ్టీ 58 పాయింట్లు తగ్గి 25,227.35 వద్ద స్థిరపడింది.

టాటా క్యాపిటల్‌కు స్పందన అంతంతే: గత వారం ఐపీఓ ముగించుకున్న టాటా క్యాపిటల్ లిమిటెడ్ సోమవారం స్టాక్ ఎక్స్ఛేంజీల్లో తన షేర్లను నమోదు చేసింది. ఐపీఓ ధర రూ.326తో పోలిస్తే, బీఎస్ఈలో కంపెనీ షేరు 1.22 శాతం లాభంతో రూ.330 వద్ద ట్రేడింగ్‌ను ఆరంభించింది. తొలిరోజు ట్రేడింగ్ ముగిసేసరికి 1.35 శాతం లాభంతో రూ.330.40 వద్ద స్థిరపడింది.

టాటా సన్స్ సారథిగా చంద్రశేఖరన్ హ్యాట్రిక్!

న్యూఢిల్లీ: టాటా సన్స్ సారథిగా ఎన్ చంద్రశేఖరన్‌ను మరో విడత కొనసాగించాలని టాటా ట్రస్ట్స్ బోర్డు నిర్ణయం తీసుకుంది. దీంతో వరుసగా మూడో విడత చంద్రశేఖరన్ గ్రూప్ సారథ్య బాధ్యతలు నిర్వహించనున్నారు. గ్రూప్ రిటైర్మెంట్ పాలసీకి భిన్నంగా టాటా ట్రస్ట్స్ బోర్డు ఆయనకు మరో విడత పొడిగింపు ఇవ్వాలని ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకుంది. అయితే దీన్ని టాటా ట్రస్ట్స్ అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. చంద్రశేఖరన్ ప్రస్తుతం రెండో విడత సారథ్య బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆయనకు 65 సంవత్సరాల వయసు నిండే నాటికి అంటే 2027 ఫిబ్రవరికి ఈ రెండో విడత అధికార కాలం పూర్తి కావలసి ఉంది. టాటా సన్స్ సారథిగా ఆయన రెండో విడత పదవీ కాలం 2022 ఫిబ్రవరిలో ప్రారంభమైంది. టాటా సన్స్ బోర్డుతో ఆయన అనుబంధం 2016 అక్టోబరులో ప్రారంభం కాగా 2017 జనవరిలో ఆయనను టాటా సన్స్ చైర్మన్‌గా నియమించారు. టాటా గ్రూప్ రిటైర్మెంట్ నిబంధనావళి ప్రకారం సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు 65 సంవత్సరాల వయసు నిండగానే రిటైర్ కావలసి ఉంది.

ఇక లాంఛనమే..

విజయానికి 58 పరుగుల దూరంలో గిల్ సేన

రెండో టెస్టు

- భారత్ లక్ష్యం 121.. ప్రస్తుతం 63/1
- విండీస్ రెండో ఇన్నింగ్స్ 390
- క్యాంప్‌బెల్, హోప్ శతకాలు



న్యూఢిల్లీ: వెస్టిండీస్‌తో రెండు టెస్టుల సిరీస్‌ను టీమిండియా క్లీన్‌స్వీప్ చేయడం ఇక లాంఛనమే. కానీ రెండో టెస్టులో విండీస్ బ్యాటర్ల పట్టువదలని పోరాటంతో సిరీస్‌లో తొలిసారిగా ఆట ఐదో రోజుకు చేరడం గమనార్హం. అటు 121 పరుగుల లక్ష్య ఛేదనకు సోమవారం చివరి సెషన్‌లో బరిలోకి దిగిన భారత్ ఆట ముగిసేసరికి రెండో ఇన్నింగ్స్‌లో 63/1 స్కోరుతో ఉంది. క్రీజులో సాయి సుదర్శన్ (30), రాహుల్ (25) ఉన్నారు. ఇక, విజయానికి భారత్ కేవలం 58 పరుగుల దూరంలో ఉంది. దీంతో మంగళవారం తొలి సెషన్‌లోనే మ్యాచ్ ముగిసే చాన్సుంది. యశస్వీ జైస్వాల్ (8) రెండో ఓవర్‌లోనే వెనుదిరిగాడు. అయితే అంతకుముందు విండీస్ తమ ఫాలోఆన్‌లో అంచనాలకు మించి చివరి వికెట్ వరకు పోరాడింది. క్యాంప్‌బెల్ (115) కెరీర్‌లో తొలి శతకం నమోదు చేయగా.. అటు షాయ్ హోప్ (103) ఎనిమిదేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత టెస్టుల్లో సెంచరీని అందుకోవడం విశేషం. వీరిద్దరి ఆటతీరుతో విండీస్ రెండో ఇన్నింగ్స్‌లో 390 పరుగులకు ఆలౌటైంది. గ్రీవ్స్ (50 నాటౌట్), చేజ్ (40), సీల్స్ (32) రాణించి విండీస్‌కు 120 పరుగుల ఆధిక్యాన్ని అందించారు. బుమ్రా, కుల్దీప్ చెరో 3.. సిరాజ్ 2 వికెట్లు తీశారు.


హోప్ (103) / క్యాంప్‌బెల్ (115)

శతకాల మోత: ఓవర్‌నైట్ స్కోరు 173/2తో నాలుగో రోజు ఆరంభించిన విండీస్‌ను వీలైనంత త్వరగా ఆలౌట్ చేద్దామనుకున్న భారత బౌలర్లకు అవకాశం దక్కలేదు. ఈ సెషనల్‌లో ఒక వికెట్‌ను మాత్రమే తీయగలిగారు. తొలి గంట ఆటలో క్యాంప్‌బెల్, హోప్ ఇబ్బంది లేకుండా ఆడారు. స్పిన్నర్లు కూడా బంతిని టర్న్ చేయలేక పోయారు. ఓ సిక్సర్‌తో క్యాంప్‌బెల్ సెంచరీని అందుకున్నాడు. చివరకు మూడో వికెట్‌కు 177 పరుగుల భారీ భాగస్వామ్యం అందాక క్యాంప్‌బెల్‌ను జడేజా అవుట్ చేశాడు. ఆ తర్వాత చేజ్ కూడా దీటుగా ఆడాడు. లంచ్ బ్రేక్ అనంతరం హోప్ కూడా సెంచరీ పూర్తి చేశాడు. ఆ వెంటనే సిరాజ్ రెండో కొత్త బంతితో అతడిని బౌల్డ్ చేయగా..కుల్దీప్ ఒకే ఓవర్‌లో చేజ్, పియర్ (0)లను అవుట్ చేశాడు. టెయిలెండర్లను బుమ్రా దెబ్బతీసినప్పటికీ.. ఆఖరి వికెట్‌కు గ్రీవ్స్, సీల్స్ మాత్రం పట్టు వీడలేదు. 311 రన్స్‌కే 9 వికెట్లు కోల్పోయిన దశలో.. ఈ ఇద్దరూ క్రీజులో పాతుకుపోయి 361/9 స్కోరుతో మ్యాచ్‌ను ఆఖరి సెషన్‌కు తీసుకెళ్లారు. మరో 29 పరుగులు జోడించాక సీల్స్‌ను బుమ్రా అవుట్ చేయడంతో పదో వికెట్‌కు 79 పరుగుల భాగస్వామ్యం ముగిసినట్టయ్యింది. వీరి పోరాటం లేకపోయుంటే మ్యాచ్ సోమవారమే ముగిసేది.

స్కోరుబోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: 518/5 డిక్లేర్; వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్: 248 ఆలౌట్;

వెస్టిండీస్ రెండో ఇన్నింగ్స్: క్యాంప్‌బెల్ (ఎల్బీ) జడేజా 115, చందర్‌పాల్ (సి) గిల్ (బి) సిరాజ్ 10, అథనజె (బి) సుందర్ 7, హోప్ (బి) సిరాజ్ 103, చేజ్ (సి సబ్) దేవ్‌దత్ (బి) కుల్దీప్ 40, ఇమ్లాచ్ (ఎల్బీ) కుల్దీప్ 12, గ్రీవ్స్ (నాటౌట్) 50, పియర్ (సి) నితీశ్ (బి) కుల్దీప్ 0, వారికన్ (బి) బుమ్రా 3, ఫిలిప్ (సి) జురెల్ (బి) బుమ్రా 2, సీల్స్ (సి) సుందర్ (బి) బుమ్రా 32; **ఎక్స్‌ట్రాలు: 16; మొత్తం: 118.5 ఓవర్లలో 390 ఆలౌట్. వికెట్ల పతనం:** 1-17, 2-35, 3-212, 4-271, 5-293, 6-298, 7-298, 8-307, 9-311, 10-390. **బౌలింగ్:** సిరాజ్ 15-3-43-2, జడేజా 33-10-102-1, సుందర్ 23-3-80-1, కుల్దీప్ 29-4-104-3, బుమ్రా 17.5-5-44-3, జైస్వాల్ 1-0-3-0.

భారత్ రెండో ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) ఫిలిప్ (బి) వారికన్ 8, రాహుల్ (బ్యాటింగ్) 25, సాయి సుదర్శన్ (బ్యాటింగ్) 30; **ఎక్స్‌ట్రాలు: 0; మొత్తం: 18 ఓవర్లలో 63/1. వికెట్ పతనం:** 1-9 .**బౌలింగ్:** సీల్స్ 3-0-14-0; వారికన్ 7-1-15-1; పియర్ 6-0-24-0; చేజ్ 2-0-10-0.



సిరాజ్‌కు వడదెబ్బ

అధిక వేడి, తేమ కారణంగా భారత పేసర్ సిరాజ్ మైదానంలో తీవ్ర అలసటకు గురయ్యాడు. నాలుగో రోజు రెండో సెషన్‌లో అతను వరుసగా ఆరు ఓవర్లు వేయడంతో నీరసించాడు. దీంతో వెంటనే డగౌట్‌కు వెళ్లిన సిరాజ్‌కు సహాయక సిబ్బంది అతడి తలపై ఐస్ ప్యాక్ పెట్టి శరీర ఉష్ణోగ్రతను తగ్గించే ప్రయత్నం చేశారు. ఫిజియో థెరపిస్ట్ సిరాజ్ కాలికి మసాజ్ చేశాడు. ఆ తర్వాత సిరాజ్ బౌలింగ్‌కు దిగలేదు. అయితే ఇదంతా గమనించిన కామెంటేటర్ దినేశ్ కార్తీక్.. పేసర్లకు మహరాజా తరహా చికిత్స లభిస్తుంటుందని సరదాగా వ్యాఖ్యానించాడు.

1 ఈ ఏడాది టెస్టుల్లో ఎక్కువ వికెట్లు (8 టెస్టుల్లో 37) తీసిన బౌలర్‌గా సిరాజ్. జింబాబ్వే పేసర్ ముజరబాని (36)ని అధిగమించాడు.

దక్షిణాఫ్రికా 216/6

పాక్‌తో మొదటి టెస్టు

లాహోర్: టోనీ జోర్జి (81 బ్యాటింగ్), ఓపెనర్ రికెల్టన్ (71) అర్ధ శతకాలతో ఆదుకోవడంతో పాకిస్థాన్‌తో తొలి టెస్టు మొదటి ఇన్నింగ్స్‌లో రెండో రోజు ఆఖరికి దక్షిణాఫ్రికా 216/6 స్కోరు చేసింది. నొమన్ అలీ నాలుగు వికెట్లు పడగొట్టాడు. పాకిస్థాన్ తొలి ఇన్నింగ్స్ స్కోరుకు సఫారీలు ఇంకా 162 పరుగులు వెనుకంజలో ఉన్నారు. చేతిలో నాలుగే వికెట్లే ఉన్నాయి. జోర్జి, రికెల్టన్ మూడో వికెట్‌కు 94 పరుగులు జోడించారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 313/5తో సోమవారం మొదటి ఇన్నింగ్స్ కొనసాగించిన పాకిస్థాన్ 378 పరుగులకు ఆలౌటైంది.

స్పోర్ట్స్

వెన్నెల శుభారంభం

ప్రపంచ జూ.బ్యాడ్మింటన్

గువాహటి: ప్రపంచ జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో తెలుగమ్మాయి వెన్నెల శుభారంభం చేసింది. సోమవారం మొదలైన టోర్నీ వ్యక్తిగత విభాగం బాలికల సింగిల్స్‌లో వెన్నెల 15-1, 15-6తో సియోఫ్రా ఫ్లిన్ (ఐర్లాండ్)పై గెలిచి రెండో రౌండ్ చేరింది. బాలుర సింగిల్స్‌లో లల్తాజువాల 15-4, 15-4తో డెనిస్ ముకాస (ఉగాండా)పై, జ్ఞాన దత్తా 5-15, 15-7, 15-7తో మిలన్ మెస్టెర్‌హాజీ (హంగేరీ)పై గెలిచి రెండో రౌండ్‌లో ప్రవేశించారు.

వైభవ్ మరో చరిత్ర

బిహార్ వైస్ కెప్టెన్‌గా ఎంపిక



పట్నా: బాల బ్యాటింగ్ సంచలనం వైభవ్ సూర్యవంశీ బిహార్ రంజీ జట్టు వైస్ కెప్టెన్‌గా నియమితుడయ్యాడు. బుధవారం మొదలయ్యే ఈ రంజీట్రోఫీ సీజన్‌లో తొలి రెండు మ్యాచ్‌లకు 14 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నట్టు బిహార్ క్రికెట్ సంఘం సోమవారం ప్రకటించింది. దాంతో రంజీట్రోఫీ చరిత్రలో అతి చిన్న వయస్సులో వైస్ కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టనున్న క్రికెటర్‌గా వైభవ్ చరిత్ర సృష్టించనున్నాడు. వైభవ్ గత సీజన్‌లో 13 ఏళ్లప్పుడు రాజస్థాన్ తరపున ఐపీఎల్ అరంగేట్రం చేసి రికార్డు సృష్టించిన సంగతి తెలిసిందే. సకీబుల్ గనీని బిహార్ కెప్టెన్‌గా ఎంపిక చేశారు.

జోష్నకు 'జపాన్' టైటిల్



న్యూఢిల్లీ: భారత వెటరన్ స్క్వాష్ ప్లేయర్ జోష్న చిన్నప్ప పదేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత సింగిల్స్ టైటిల్ నెగ్గింది. సోమవారం జరిగిన జపాన్ ఓపెన్ మహిళల సింగిల్స్ ఫైనల్లో 39 ఏళ్ల జోష్న 11-5, 11-9, 6-11, 11-8తో మూడో సీడ్ హయా అలీ (ఈజిప్టు)ను చిత్తు చేసి విజేతగా నిలిచింది. జోష్న చివరిగా 2015లో ప్రొఫెషనల్ స్క్వాష్ అసోసియేషన్ సింగిల్స్ టైటిల్ గెలిచింది.

సఫారీల ఉత్కంఠ విజయం

మహిళల వరల్డ్‌కప్

పోరాడి ఓడిన బంగ్లాదేశ్


నదినె డిక్లెర్క్ (37 నాటౌట్)

విశాఖపట్నం స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): మహిళల వన్డే వరల్డ్ కప్‌లో దక్షిణాఫ్రికా మరో అద్భుత విజయాన్నందుకుంది. సోమవారం బంగ్లాదేశ్‌తో ఆఖరి ఓవర్ వరకు ఆసక్తికరంగా జరిగిన ఈ మ్యాచ్‌లో సఫారీలు 3 వికెట్ల తేడాతో గట్టెక్కారు. ముందుగా బంగ్లాదేశ్ 50 ఓవర్లలో 232/6 స్కోరు సాధించింది. షోర్న అక్తర్ (51 నాటౌట్), షర్మీన్ అక్తర్ (50), నిగర్ సుల్తానా (32), ఫర్గానా (30) రాణించారు. ఎంలబాకు రెండు వికెట్లు దక్కాయి. ఛేదనలో దక్షిణాఫ్రికా 49.3 ఓవర్లలో 235/7 స్కోరు చేసి నెగ్గింది. 78 రన్స్‌కే ఐదు వికెట్లు కోల్పోయిన దశలో 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' ట్రియాన్ (62), కాప్ (56) 85 పరుగుల భాగస్వామ్యంతో ఆదుకునే ప్రయత్నం చేశారు. అయితే చివర్లో బౌలర్ల కట్టడితో ఉత్కంఠ పెరిగింది. 8 బంతుల్లో 9 రన్స్ కావాల్సిన వేళ జోరు మీదున్న నదినె డిక్లెర్క్ (37 నాటౌట్) సులువైన క్యాచ్‌ను షోర్న వదిలేయడం బంగ్లాను దెబ్బతీసింది. ఇక ఆఖరి ఓవర్‌లో తనే 4,6తో గెలుపునకు కావాల్సిన 8 రన్స్‌ను సాధించి మూడు బంతులుండగానే మ్యాచ్‌ను ముగించింది. నహీదాకు 2 వికెట్లు లభించాయి. భారత్‌తో జరిగిన మ్యాచ్‌లోనూ డిక్లెర్క్ ఆఖరిదాకా నిలిచి విజయాన్నందించిన విషయం తెలిసిందే.

నేటి మ్యాచ్ — మ.3 నుంచి స్టార్ నెట్‌వర్క్‌లో

శ్రీలంక x న్యూజిలాండ్

సంక్షిప్త స్కోర్లు

బంగ్లాదేశ్: 50 ఓవర్లలో 232/6 (షోర్న అక్తర్ 51 నాటౌట్, షర్మీన్ అక్తర్ 50; ఎంలబా 2/42). **దక్షిణాఫ్రికా:** 49.3 ఓవర్లలో 235/7 (ట్రియాన్ 62, కాప్ 56, డిక్లెర్క్ 37 నాటౌట్; నహీదా 2/44).

వెంకట్రామ్, మోహిత్ పసిడి ధమాకా

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో తెలుగు క్రీడాకారులు పతకాల మోత మోగించారు. భువనేశ్వర్‌లో సోమవారం జరిగిన అండర్-20 విభాగం 800 మీటర్ల పరుగులో మోగిలి వెంకట్రామ్ రెడ్డి (కర్నూలు) స్వర్ణం నెగ్గాడు. 3వేల మీటర్ల రేసులో మోహిత్ చౌధురి (నాగర్ కర్నూల్) పసిడి పతకం సొంతం చేసుకున్నాడు. ఇద్దరికీ ఇది ఈ టోర్నీలో రెండో స్వర్ణం కావడం విశేషం. అండర్-18 హెప్టాథ్లాన్‌లో ఖమ్మం అథ్లెట్ బడ్డి వైశాలి రజతంతో మెరిసింది.


వెంకట్రామ్ రెడ్డి

ఒలింపిక్ విజేతలకు నజరానాలు

అందజేసిన క్రీడామంత్రి

న్యూఢిల్లీ: స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా, షూటర్ మను భాకర్ సహా 2024 పారిస్ ఒలింపిక్స్‌లో పతకాలు నెగ్గిన ఆటగాళ్లను భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) నగదు బహుమతులతో ఘనంగా సత్కరించింది. సోమవారం జరిగిన కార్యక్రమంలో కేంద్ర క్రీడా మంత్రి మన్సుఖ్ మాండవీయ, ఐఓఏ చీఫ్ ఉష. అథ్లెట్లకు చెక్కులను ప్రదానం చేశారు. జావెలిన్ త్రోలో రజతం సాధించిన నీరజ్ చోప్రా విదేశాల్లో ఉండడంతో అతడి నజరానా కింద రూ. 75 లక్షల చెక్‌ను భారత అథ్లెటిక్స్ సమాఖ్య అధికారి అందుకొన్నారు. షూటింగ్ వ్యక్తిగత, మిక్స్‌డ్ విభాగాల్లో కాంస్యాలు సాధించిన మను భాకర్‌కు రూ. 75 లక్షలు, షూటర్లు స్వప్నిల్ (కాంస్యం)కు రూ. 50 లక్షలు, సరబ్‌జోత్ (మిక్స్‌డ్ కాంస్యం)కు రూ. 25 లక్షలు, రెజ్లింగ్‌లో కాంస్యం నెగ్గిన అమన్ సెహ్రావత్‌కు రూ. 50 లక్షల చెక్‌ను బహూకరించారు. కాంస్యం గెలిచిన భారత హాకీ జట్టు సభ్యులకు రూ. 10 లక్షలు చొప్పున చెక్‌లు ప్రదానం చేశారు.

మను భాకర్



కోర్టు ప్రొసీడింగ్స్‌ను తేలిగ్గా తీసుకుంటున్నారు!

- కొందరు ప్రభుత్వ ఉద్యోగుల తీరుపై హైకోర్టు అసంతృప్తి
- సీఎస్ పేరుతో జారీ చేసిన జీవోలో తప్పులపై ఆక్షేపణ

అమరావతి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): కోర్టు ప్రొసీడింగ్స్‌ను కొందరు ప్రభుత్వ ఉద్యోగులు తేలిగ్గా తీసుకుంటున్నారని హైకోర్టు పేర్కొంది. కోర్టు విచారణలపై గౌరవం లేదని ఘాటు వ్యాఖ్యలు చేసింది. సీఎస్ పేరుతో జారీచేసిన ఉత్తర్వుల్లో తప్పులు ఉండటాన్ని తీవ్రంగా ఆక్షేపించింది. సొసైటీలు, కార్పొరేషన్ల ఉద్యోగుల పదవీవిరమణ వయసు పెంపు సాధ్యాసాధ్యాలపై అధ్యయనానికి మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేస్తూ ఇచ్చిన జీవో, ఆర్థికశాఖ లేఖలో పొరపాటున తప్పు దొర్లిందని, ఉద్దేశపూర్వకంగా చేసింది కాదన్న సీఎస్ అఫిడవిట్‌తో సంతృప్తి చెందింది. ఉప సంఘం నివేదిక ఇచ్చేందుకు సమయం పడుతుందని, విచారణను వాయిదా వేయాలన్న ఏజీ వాదనకు అంగీకరించింది. ఈ విషయంలో దాఖలైన అప్పీళ్లు, రిట్ పిటిషన్లపై విచారణను 8వారాలకు వాయిదా వేసింది. సింగిల్ జడ్జి ఉత్తర్వులపై యథాతథస్థితి పాటించాలంటూ గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను పొడిగించింది. ఈ మేరకు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ హరిహరనాథశర్మ ధర్మాసనం సోమవారం ఉత్తర్వులిచ్చింది. ప్రభుత్వ ఉద్యోగుల లానే తమకూ పదవీ విరమణ వయసును 60 నుంచి 62 ఏళ్లకు పెంచేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ ఏపీ హౌసింగ్ బోర్డ్ కార్పొరేషన్‌కు చెందిన పలువురు ఉద్యోగులు హైకోర్టును ఆశ్రయించారు. విచారణ జరిపిన సింగిల్ జడ్జి పిటిషనర్లకు 62ఏళ్లు వచ్చేవరకు సర్వీసులో కొనసాగించాలని ఆదేశించారు. ఈ తీర్పును సవాల్ చేస్తూ హౌసింగ్ బోర్డ్ వైస్‌చైర్మన్ అప్పీల్ చేశారు. అలాగే పదవీ విరమణ వయసును 62ఏళ్లకు పెంచేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ పలు సొసైటీలు, కార్పొరేషన్ ఉద్యోగులు రిట్ పిటిషన్లు వేశారు. ఈ విషయంలో మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేస్తూ సీఎస్ పేరుతో ఇచ్చిన జీవోలో ఏపీ పునర్విభజన చట్టానికి బదులు ఏపీ విభజన చట్టంగా పేర్కొనడాన్ని ధర్మాసనం తప్పుపట్టింది. ఆర్థికశాఖ రాసిన లేఖలో పదవీ విరమణ వయసును 62 నుంచి 65ఏళ్లకు పెంచడానికి మంత్రివర్గం ఉపసంఘాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొనడాన్ని ఆక్షేపించింది. ఇలాంటి కేసులో అధికారులు బాధ్యతరాహిత్యంగా, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారని ఆశించలేమని పేర్కొంది. మొత్తం వ్యవహారం పై సీఎస్‌ను వివరణ కోరడమే సరైనదని అభిప్రాయపడుతూ ఆయనను ప్రతివాదిగా చేర్చింది. అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించింది. ఈ వ్యాజ్యం సోమవారం విచారణకు రాగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ స్పందిస్తూ.... ప్రభుత్వం ఇచ్చిన జీవోలో పొరపాటున విభజనచట్టంగా పేర్కొన్నాని తెలిపారు. అలాగే, ఆర్థికశాఖ రాసిన లేఖలో పదవీ విరమణ వయసును 62 ఏళ్ల నుంచి 65ఏళ్లకు పెంచేందుకు అని పేర్కొనడంపై సంబంధిత ఉద్యోగులను సీఎస్ మందలించారన్నారు. ఉద్దేశపూర్వకంగా చేసింది కాదని, ఈ విషయంలో సీఎస్ అఫిడవిట్ దాఖలు చేశారని తెలిపారు. పదవీ విరమణ వయసు పెంపు పిటిషనర్ల వరకే పరిమితం కాదని, మంత్రివర్గ ఉపసంఘం అన్ని కార్పొరేషన్ల నుంచి వివరాలను తెప్పించుకొని అధ్యయనం చేయాల్సి ఉందని పేర్కొన్నారు. నివేదిక సమర్పించేందుకు మూడు నెలల సమయం పడుతుందన్నారు.

కొత్తగా హెచ్-1బీ ఉద్యోగులను నియమించం

- టీసీఎస్ సీఈవో కృతివాసన్ వెల్లడి

న్యూఢిల్లీ, అక్టోబరు 13: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం హెచ్-1బీ వీసాలపై కొత్త ఉద్యోగులను తీసుకోబోమని టీసీఎస్ సీఈవో కే కృతివాసన్ తెలిపారు. వారికి బదులు అమెరికాలోని స్థానిక ప్రతిభావంతులను నియమించుకోవడంపై దృష్టి సారిస్తామని పేర్కొన్నారు. అమెరికాలో తమ కంపెనీకి 32 వేల మంది సిబ్బంది ఉండగా.. వారిలో దాదాపు 11 వేల మంది హెచ్-1బీపై వచ్చిన వారేనని చెప్పారు. హెచ్-1బీ వీసా ఉద్యోగులపై ఆధారపడటాన్ని క్రమంగా తగ్గించాలని భావిస్తున్నామని చెప్పారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్-1బీ వీసా ఫీజును లక్ష డాలర్లకు పెంచడం టెక్ కంపెనీల్లో గందరగోళానికి దారి తీసిన తెలిసిందే.

బాబోయ్.. ఇథనాల్



- ఇ20తో తగ్గిపోతున్న పాత వాహనాల మైలేజీ.. తరచుగా రిపేర్లు
- ఇంధన ఖర్చు పెరుగుతోందని యజమానుల గగ్గోలు
- లోకల్‌సర్కిల్స్ సంస్థ సర్వే వెల్లడి

న్యూఢిల్లీ, అక్టోబరు 13: కొండ నాలుకకు మందు వేస్తే.. ఉన్న నాలుక ఊడినట్లుంది ఇథనాల్ కలిపిన పెట్రోల్‌తో వ్యవహారం. కాలుష్యంతో పాటు, ఇంధన దిగుమతుల వ్యయం తగ్గుతుందని పెట్రోల్‌లో ప్రస్తుతం ఇథనాల్‌ను 20 శాతం (ఇ20) కలుపుతున్నారు. దేశవ్యాప్తంగా ఈ ఏడాది ఏప్రిల్ నుంచి దీనిని సరఫరా చేస్తున్నారు. అయితే ఈ ఇథనాల్ మిశ్రమ పెట్రోల్‌తో తమ కార్ల మైలేజీ భారీగా తగ్గిపోతోందని, మరమ్మతులు ఎక్కువగా వస్తున్నాయని వాహనదారులు గగ్గోలు పెడుతున్నారు. ఈ విషయంలో లోకల్‌సర్కిల్స్ అనే సంస్థ ఓ సర్వే చేసింది. ఆ మేర కు.. 2022 కంటే ముందు కొనుగోలు చేసిన తమ వాహనాల మైలేజీ ఇ20 పెట్రోల్‌తో తగ్గిపోతోందని 10లో 8 మంది పేర్కొన్నారు. గతంతో పోల్చితే ఈ ఏడాది ఇంధన ఖర్చు ఎక్కువ అయిపోతోందన్నారు. ఈ పెట్రోల్‌తో వాహనాలకు రిపేర్లు వస్తున్నాయని 52% మంది చెప్పారు. ఇంజన్లు పాడైపోతున్నాయని, ట్యాంకులు, కార్బురేటర్లు చెడిపోతున్నాయన్నారు.

- సర్వేలో భాగంగా దేశంలోని 323 జిల్లాల్లో 36 వేలకు పైగా వాహనాల యజమానుల అభిప్రాయాలు సేకరించారు. దీనిలో టైర్1 నగరాల నుంచి 45%, టైర్2 నగరాల నుంచి 27, ఇతర చిన్న పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల నుంచి 28 శాతం ఉన్నారు. పెట్రోల్ సంబంధిత మరమ్మతులు ఈ ఏడాది ఏప్రిల్ నుంచి 40 శాతం పెరిగాయని మెకానిక్‌లు కూడా చెప్పారు.
- ఇ20 వల్ల తన కారులో ఇంధనం నీరుగా మారిపోయిందని, దాని రిపేర్‌కు 4 లక్షలు ఖర్చయిందని చెన్నైలోని ఓ లగ్జరీ కార్ ఓనర్ వాపోయారు.
- ఆగస్టులో సర్వే చేసినపుడు 28 శాతం మంది మాత్రమే రిపేర్ల గురించి చెప్పారు. కానీ అక్టోబరు సర్వేలో ఆ సంఖ్య 52 శాతానికి పెరిగింది.
- కొనుగోలు చేసి మూడేళ్లు, ఆపైబడ్డ వాహనాల విడిభాగాలు త్వరగా పాడైపోతున్నట్లు గుర్తించారు. ద్విచక్రవాహనాల్లో ఫ్యూయల్ ఇంజెక్టర్లు దెబ్బతింటున్నాయని, ఆయిల్ ట్యాంకులు తుప్పు పట్టిపోతున్నాయని మెకానిక్స్ వెల్లడించారు.

పెరుగుతున్న ఇథనాల్ వినియోగం

స్వచ్ఛ ఇంధనం వైపు వేసే అడుగుల్లో ఇ20 ఓ భాగమని, దీంతో రైతులకు లాభాలు చేకూరతాయంటూ పెట్రోల్‌లో ఇథనాల్ శాతాన్ని పెంచడాన్ని ప్రభుత్వం సమర్థించుకుంటోంది. 2024 నాటికి ప్రపంచ రవాణా ఇంధనంలో ఇథనాల్ మిశ్రమం వాటా 5 నుంచి 6 శాతంగా ఉంది. గతేడాది నాటికి ఇథనాల్ మార్కెట్ విలువ 98.5 బిలియన్ డాలర్లకు పైగా ఉంది. ఏటా 6.9% పెరుగుదలతో 2035 నాటికి ఆ మార్కెట్ విలువ 205.2 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నారు.

పీఎం కిసాన్ పక్కదారి!

(మొదటిపేజీ తరువాయి)



మంది భార్యాభర్తలు ప్రయోజనం పొందుతున్నారని రుజువైంది. బుధవారం(ఈ నెల 15)లోగా తనిఖీల ప్రక్రియ పూర్తిచేయాలని అన్ని రాష్ట్రాలకు కేంద్రం లేఖలు రాసింది. పీఎం-కిసాన్ పథకం కింద అన్నదాతలకు పెట్టుబడి సాయంగా కేంద్రం ఏటా రూ.6 వేల చొప్పున అర్హులైన లబ్ధిదారుల ఖాతాల్లో మూడు విడతల్లో నేరుగా జమ చేస్తున్న సంగతి తెలిసిందే. పథకం మార్గదర్శకాల ప్రకారం.. కుటుంబంలో భార్య గానీ, భర్త గానీ ఎవరో ఒకరు మాత్రమే ఈ సాయం పొందడానికి అర్హులు. ఒకే కుటుంబంలో మైనర్ పిల్లలు, ఇతర కుటుంబ సభ్యులు కూడా లబ్ధి పొందుతున్న 1.76 లక్షల కేసులను కూడా కేంద్రం గుర్తించింది. 2019 ఫిబ్రవరి 1 తర్వాత రిజిస్టర్ చేసుకున్న రైతులు.. తమ భూములకు గత యజమానులు ఎవరో వివరాలు సమర్పించాల్సి ఉండగా.. 33.34 లక్షల మంది తప్పుడు వివరాలు ఇవ్వడమో.. ఫారంలో ఆ వివరాలను ఖాళీగా వదిలేయడమో చేశారు. పూర్వపు యజమానులు అనుచితంగా ఈ పథకం ప్రయోజనాలను పొందకుండా ఉండేందుకే ఈ నిబంధన పెట్టారు. అయినా 8.11 లక్షల మంది పూర్వపు యజమానులు, ప్రస్తుత యజమానులు.. ఉభయులూ ఆరేసి వేలు పొందుతున్నారని తేలింది. వారసత్వం ద్వారా భూములు మ్యుటేషన్ చేయించుకున్న రైతులు కూడా ఈ పథకానికి అర్హులే. అయితే ఇతర మార్గాల్లో మ్యుటేషన్ చేయించుకున్న రైతులు కూడా ఈ పథకం కింద సొమ్ము తీసుకుంటున్నారు. ఇలాంటివారు 8.11 లక్షల మంది వరకు ఉన్నట్లు తాజా తనిఖీల్లో వెల్లడైంది. ఇలాంటి లోపాలను నివారించేందుకు, పథకం ప్రయోజనాలను అసలైన లబ్ధిదారులకే అందించేందుకు కేంద్రప్రభుత్వం ఇటీవల పలు చర్యలకు శ్రీకారం చుట్టింది. ఈ ఏడాది జనవరి 1 నుంచి కొత్త లబ్ధిదారుల ఎంపికకు రైతు గుర్తింపు కార్డును తప్పనిసరి చేసింది.

ఆరేళ్లు.. 20 వాయిదాలు

చిన్న సన్నకారు రైతులకు ఆర్థికంగా చేయూతనిచ్చేందుకు, పెట్టుబడి సాయం కోసం వారు ప్రైవేటు వడ్డీవ్యాపారుల బారిన పడకుండా కాపాడడానికి, సాగును నిరాటంకంగా సాగించేందుకు రూ.6 వేల చొప్పున పెట్టుబడి సాయంగా అందించడానికి మోదీ ప్రభుత్వం 2019 ఫిబ్రవరి 24న లోక్‌సభ ఎన్నికలకు ముందు పీఎం-కిసాన్ స్కీంను ప్రారంభించింది. ఇది పూర్తిగా కేంద్ర పథకం. గుర్తించిన లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమచేస్తోంది. ఏటా మూడు వాయిదాల్లో రూ.2 వేల చొప్పున ఇస్తోంది. ఇప్పటికి 20 వాయిదాలు చెల్లించింది. దీని మొత్తం విలువ రూ.3.90 లక్షల కోట్లు. ఈ ఏడాది ఆగస్టు 2న ప్రధాని మోదీ వారాణసీ నుంచి 9.7 కోట్ల మందికి 20వ వాయిదా కింద తలో రూ.2 వేల చొప్పున జమచేశారు. 21వ వాయిదా మొత్తాన్ని మెరుపు వరదల ప్రభావిత జమ్మూకశ్మీరు రైతులకు ఈ నెల 7వ తేదీనే చెల్లించారు. కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ 8.55 లక్షల మంది ఖాతాల్లో రెండేసి వేలు జమచేశారు. దేశంలోని మిగతా రైతులకు దీపావళిలోగా జమచేసే అవకాశం ఉంది. భూమిపై హక్కులు కలిగిన చిన్న, సన్నకారు రైతు కుటుంబాలు ఈ పథకానికి అర్హులు. అధికాదాయం పొందే రైతులు, సర్వీసులో ఉన్న, రిటైరైన ప్రభుత్వాధికారులు, ఆదాయ పన్ను చెల్లింపుదారుల కుటుంబాలకు అర్హత లేదు. పీఎం కిసాన్ పోర్టల్ లేదా పీఎం కిసాన్ యాప్, చేరువలోని కామన్ సర్వీస్ సెంటర్ (సీఎస్‌సీ) ద్వారా ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకోవలసి ఉంటుంది. ఈ పథకానికి గత ఏడాది బడ్జెట్‌లో రూ.60 వేల కోట్లు కేటాయించగా.. పెరిగిన లబ్ధిదారులను దృష్టిలో ఉంచుకుని 2025-26 బడ్జెట్‌లో రూ.63,500 కోట్లు కేటాయించారు. మరోవైపు.. రైతుకు ఇప్పుడిస్తున్న రూ.6 వేల సాయం చాలడం లేదని.. దీనిని రూ.12 వేలకు పెంచాలని పార్లమెంటరీ కమిటీ ఇటీవల సిఫారసు చేయడం విశేషం.

కరూర్ ఘటనపై సీబీఐ దర్యాప్తు

- రిటైర్డ్ జడ్జి నేతృత్వంలో పర్యవేక్షణ కమిటీ
- సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలు



చెన్నై, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని కరూర్‌లో గత నెల టీవీకే అధినేత విజయ్ సభలో జరిగిన తొక్కిసలాట ఘటనపై సీబీఐ దర్యాప్తునకు సుప్రీంకోర్టు సోమవారం ఆదేశించింది. దర్యాప్తు పర్యవేక్షణకు సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ అజయ్ రస్తోగి నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపింది. ఇదే సమయంలో తొక్కిసలాట ఘటనపై మద్రాస్ హైకోర్టు ఐజీ అస్రాగార్గ్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన 'సిట్, తమిళనాడు ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ అరుణా జగదీశన్ నేతృత్వంలోని ఏకసభ్య కమిషన్‌లను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు సుప్రీంకోర్టు మధ్యంతర తీర్పు వెలువరించింది. కరూర్‌లో గత సెప్టెంబరు 27వ తేదీ రాత్రి తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత, నటుడు విజయ్ నిర్వహించిన రోడ్‌షోలో జరిగిన తొక్కిసలాట ఘటనలో 41 మంది మృతిచెందిన విషయం తెలిసిందే. ఇప్పటి వరకు చేపట్టిన దర్యాప్తు వివరాలు, సంబంధిత పత్రాలను తక్షణమే జస్టిస్ రస్తోగి కమిటీ, సీబీఐలకు అప్పగించాలని సుప్రీంకోర్టు తమిళనాడు ప్రభుత్వాన్ని ఆదేశించింది. సుప్రీంకోర్టు తీర్పును విజయ్ స్వాగతించారు. 'న్యాయానిదే గెలుపు' అంటూ ఏకవాక్యంతో 'ఎక్స్'లో తన అభిప్రాయాన్ని పేర్కొన్నారు.

అపరిశుభ్ర మరుగుదొడ్డి ఫొటోకు రూ.1,000 ఫాస్టాగ్ బహుమతి

- ఈ నెల 31 వరకు అమలు..ఎన్‌హెచ్ఏఐ ప్రకటన

న్యూఢిల్లీ, అక్టోబరు 13: టోల్ ప్లాజాల వద్ద పరిశుభ్రత పాటించేలా ప్రభుత్వ రంగ సంస్థ అయిన భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) పలు చర్యలు తీసుకుంటోంది. టోల్ ప్లాజాల వద్ద తమ నిర్వహణలోని మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉన్నాయన్న సమాచారం పంపేవారికి బహుమతి ఇవ్వనున్నట్టు ప్రకటించింది. రూ. వెయ్యి విలువ చేసే మొత్తాన్ని ఫాస్టాగ్ అకౌంట్‌లో రీఛార్జి చేయనుంది. జాతీయ రహదారిపై ప్రయాణించేవారు అపరిశుభ్రంగా ఉన్న మరుగుదొడ్లను గమనిస్తే అందుకు సంబంధించిన ఫొటోనే 'రాజ్ మార్గ్ యాత్ర' యాప్‌లో పోస్టు చేయాల్సి ఉంటుంది. వినియోగదారుడి పేరు, లొకేషన్, వాహనం రిజిస్ట్రేషన్ నెంబరు, ఫోన్ నెంబరు వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది. అర్హత సాధించిన ఫొటోను ఎంపిక చేసిన అనంతరం రూ. వెయ్యి సంబంధిత వెహికల్ రిజిస్ట్రేషన్ నెంబరు (వీఆర్ఎన్)కు అనుసంధానమైన ఫాస్టాగ్‌కు జమ అవుతాయి. ఈ కార్యక్రమం ఈ నెల 31 వరకు అమల్లో ఉంటుంది.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

గ్రామీణ నేపథ్యంలో



సందీప్ కిషన్

సందీప్ కిషన్, మిథిలా పార్కర్ జంటగా 'డీజే టిల్లు' ఫేమ్ మల్లిక్ రామ్ తెరకెక్కిస్తున్న సిరీస్ 'సూపర్ సుబ్బు'. రాజీవ్ ప్రొడక్షన్స్‌పై రాజీవ్ చిలకా నిర్మిస్తున్నారు. వచ్చే ఏడాది నెట్‌ఫ్లిక్స్ వేదికగా విడుదల కానుంది. సోమవారం చిత్రబృందం మీడియా సమావేశం ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా సందీప్ కిషన్ మాట్లాడుతూ 'ప్రస్తుతం తెరకెక్కుతోన్న కథలు మన జీవితాల్ని ప్రతిబింబిస్తున్నాయి. 'సూపర్ సుబ్బు' కథ విన్న వెంటనే ఇది అందరికీ రీచ్ అవ్వాలని అనిపించింది. ప్రేక్షకులు ఈ సిరీస్‌ని ప్రేమిస్తారనే నమ్మకం ఉంది. సిరీస్ ఆద్యంతం నవ్వుల భరితంగా ఉంటుంది. అందర్నీ అలరించేలా ఇందులోని సన్నివేశాలు ఉంటాయి' అని అన్నారు. 'గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ కథాంశం మనకు చాలా విషయాలు తెలియజేస్తుంది. కొత్తదనంతో పాటు హృదయానికి హత్తుకునే భావోద్వేగాలతో ఈ సిరీస్‌ను రూపొందిస్తున్నాం. చాలా రోజుల తర్వాత గుర్తుండిపోయే కంటెంట్ చూశామన్న అనుభూతి కలుగుతుంది' అని మల్లిక్‌రామ్ చెప్పారు. 'ఇందులోని పాత్రలు చాలా దగ్గరగా, వైవిధ్యంగా అనిపిస్తాయి' అని మిథిలా పార్కర్ పేర్కొన్నారు.

వినోదం పంచే లవ్ ఓటీపీ



ఇద్దరమ్మాయిలను ఒకరికి తెలియకుండా మరొకరిని ప్రేమలోకి దింపిన ఓ యువకుడి జీవితంలో జరిగిన సంఘటనల ఆధారంగా తెరకెక్కిన వినోదాత్మక చిత్రం 'లవ్ ఓటీపీ'. అనీష్ కథానాయకుడిగా నటిస్తూ దర్శకత్వం వహించారు. జాన్విక, స్వరూపిణి హీరోయిన్లు. రాజీవ్ కనకాల కీలకపాత్ర పోషించారు. విజయ్ ఎం. రెడ్డి నిర్మించారు. చిత్రబృందం సోమవారం ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'చక్కని ప్రేమకథతో పాటు తండ్రీ కొడుకుల అనుబంధాన్ని ఆవిష్కరించేలా ఈ చిత్రం ఉంటుంది' అని అన్నారు. 'చిత్రీకరణ పూర్తయింది. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తాం. ప్రేక్షకులకు వినోదంతో పాటు మంచి సందేశాన్ని ఇచ్చే చిత్రమిద'ని నిర్మాత తెలిపారు.

అంచనాలను అందుకుంటాం



సిద్ధు జొన్నలగడ్డ

"తెలుసు కదా' చిత్రం ట్రైలర్ ద్వారా ప్రేక్షకులకు సినిమా గురించి ఒక గొప్ప, అద్భుతమైన అనుభూతిని ఇవ్వాలని నిర్ణయించుకున్నాం. మా లక్ష్యం నెరవేరింది. ట్రైలర్‌తో ప్రేక్షకుల్లో సినిమాపై అంచనాలు పెరిగాయి. వాటిని అందుకునేలా మా సినిమా ఉంటుంది' అని సిద్దు జొన్నలగడ్డ అన్నారు. ఆయన కథానాయకుడిగా ప్రముఖ స్టైలిస్ట్ నీరజకోన దర్శకత్వం వహించిన చిత్రమిది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్, కృతిప్రసాద్ నిర్మించారు. ఈ నెల 17న విడుదలవుతోంది. సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా సిద్ధు జొన్నలగడ్డ మాట్లాడుతూ 'టిల్లూ లాంటి పాత్రల నుంచి బయటకు రావాలంటే ఇలాంటి సినిమాలు చేయాలి. టిల్లు అమాయకుడు. కానీ 'తెలుసు కదా'లో మాత్రం నాది చాలా తెలివైన వ్యక్తి పాత్ర. చాలా ఎంటర్‌టైనింగ్‌గా ఉంటుంది. యువతను, కుటుంబ ప్రేక్షకులను మెప్పించే సినిమా ఇది' అని చెప్పారు. హీరోయిన్ రాశీ ఖన్నా మాట్లాడుతూ 'ప్రేమకథల్లో ఇదో గొప్ప చిత్రమవుతుంది. ప్రేక్షకుల మనసును తాకే భావోద్వేగాలున్న చిత్రమిది' అన్నారు. నీరజ కోన మాట్లాడుతూ 'దర్శకురాలిగా ఇది నాకు తొలి చిత్రం. చాలా ప్రత్యేకమైనది. ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేసే మంచి కంటెంట్‌తో వస్తున్నాం. ఇదొక మ్యూజికల్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్' అని చెప్పారు. నిర్మాత కృతి ప్రసాద్ మాట్లాడుతూ "తెలుసు కదా' కథ వినగానే నాకు నచ్చింది. ఈ తరం యువతకు బాగా నచ్చుతుంది. ఒక మంచి సినిమాను నిర్మించినందుకు గర్వంగా ఉంది. ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను' అని అన్నారు. ఈ సినిమాలో నా మనసుకు నచ్చిన పాత్ర పోషించాను అని హీరోయిన్ శ్రీనిధి శెట్టి అన్నారు.

ఈ విజయం ఐశ్వర్య త్యాగానికి నిదర్శనం





అభిషేక్ బచ్చన్

'ఈ విజయం నాకెంతో ప్రత్యేకం. నేను ఇండస్ట్రీకి వచ్చి 25 ఏళ్లు అయ్యింది. ఈ ఏడాది ఫిల్మ్‌ఫేర్ అవార్డుల్లో ఉత్తమ నటుడి అవార్డు వచ్చినందుకు ఆనందంగా ఉంది. ఈ స్పీచ్ కోసం చాలా రోజులు సాధన చేశాను. ఈ సందర్భంగా నా భార్య ఐశ్వర్య, కుమార్తె ఆరాధ్యకు ప్రత్యేక కృతజ్ఞతలు చెప్పాలి. నా కలలను సాకారం చేసుకోవడానికి వాళ్లు నన్ను ఎంతో ప్రోత్సహించారు. ఈ అవార్డు అందుకోవడానికి ఐశ్వర్య ప్రధాన కారణం. ఆమె చేసిన త్యాగాల వల్లే నేను ఇక్కడ ఉన్నాను. ఈ పురస్కారమే అందుకు నిదర్శనం' అని అన్నారు అభిషేక్ బచ్చన్. ఇటీవలె జరిగిన 70వ ఫిల్మ్‌ఫేర్ వేడుకల్లో ఆయన ఉత్తమ నటుడిగా అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన భావోద్వేగానికి గురయ్యారు. 'ఇది నా కల. నా కుటుంబం ముందు అవార్డును స్వీకరించడం నాకు రెట్టింపు సంతోషాన్ని ఇస్తోంది. నేను కృతజ్ఞతలు చెప్పాల్సిన వ్యక్తులు చాలా మందే ఉన్నారు. వారిలో 'ఐ వాంట్ టూ టాక్ దర్శకుడు సూజిత్ సర్కార్ ఒకరు. ఇక నన్ను 25 ఏళ్ళుగా ప్రోత్సహిస్తున్న ప్రేక్షకులకు ఎప్పటికీ రుణపడి ఉంటాను. ఈ విజయాన్ని నా తండ్రి అమితాబ్ బచ్చన్‌కు, నా కుమార్తె ఆరాధ్యకు అంకితం చేస్తున్నాను' అని పేర్కొన్నారు.

నా పాత్రకు ప్రాధాన్యమెక్కువ

- మమిత బైజు



'ప్రేమలు' చిత్రంతో ఘన విజయం సొంతం చేసుకున్న మమిత బైజు తాజాగా 'డ్యూడ్'లో ప్రదీప్ రంగనాథన్ సరసన కథానాయికగా నటించారు. ఈ చిత్రంతో కీర్తీశ్వరన్ డైరెక్టర్‌గా పరిచయం అవుతున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ బేనర్‌పై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మించారు. ఈనెల 17న తమిళం, హిందీ, మలయాళం, కన్నడ భాషల్లో విడుదల కానుంది. ఈ సందర్భంగా మమిత బైజు మీడియాతో చిత్ర విశేషాలు పంచుకున్నారు. "డ్యూడ్'లో నా పాత్రకు చాలా ప్రాధాన్యం ఉంది. మునుపెన్నడూ చేయని 'కురల్' అనే పాత్రలో కనిపిస్తాను. ఆమె తన భావోద్వేగాల పట్ల నిబద్ధతగా, తన చుట్టూ ఉన్న వారందరితో స్నేహంగా ఉంటుంది. ఈ పాత్ర పోషించడం నాకు ఓ గొప్ప అనుభవం. ఈ చిత్రంలోని కొన్ని భావోద్వేగ సన్నివేశాలు నాకు సవాలుగా అనిపించాయి. వాటికోసం రాత్రంతా డైలాగ్స్ ప్రాక్టీస్ చేశాను. చిత్రీకరణ సమయంలో ఎలాంటి ఆందోళనకు గురికాకుండా సన్నివేశాలపై దృష్టి కేంద్రీకరించాను. ప్రదీప్‌తో కలిసి నటించడం ఓ గొప్ప అనుభూతి. సాయి అభ్యంకర్ అద్భుతమైన సంగీతాన్ని అందించారు. పాటలన్నీ మనసుని ఆకట్టుకుంటాయి' అని తెలిపారు.



మిత్రమండలి అందర్నీ అలరిస్తుంది

శ్రీవిష్ణు

'మిత్రమండలి' పెద్ద హిట్ అవుతుంది. ప్రియదర్శి ఎప్పుడూ ఎనర్జిటిక్‌గా ఉంటారు. ఆయన ఎంచుకునే కథలు చాలా బావుంటాయి. బన్నీ వాసు గారు నెలకి ఒక సూపర్‌హిట్ మూవీని అందిస్తున్నారు. ఈ చిత్రంపై ఆయన చాలా నమ్మకంతో ఉన్నారు' అని కథానాయకుడు శ్రీ విష్ణు అన్నారు. ప్రియదర్శి, నిహారిక ఎన్ఎమ్ జంటగా విజయేందర్ తెరకెక్కించిన చిత్రం 'మిత్రమండలి'. బివి వర్క్స్ బ్యానర్, బన్నీ వాసు సమర్పణలో కల్యాణ్ మంతిన, భానుప్రతాప, డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల నిర్మించారు. ఈ నెల 16న చిత్రం విడుదలవుతోన్న సందర్భంగా ప్రీరిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీ విష్ణు మాట్లాడుతూ 'మిత్రమండలి' అందర్నీ అలరిస్తుంది. మీ అందర్నీ ఫుల్లుగా ఖుషీ చేసి థియేటర్ల నుంచి బయటకు పంపిస్తుంది' అని చెప్పారు. 'ఈ చిత్రంతో దీపావళిని ముందుగానే మీ ముందుకు తెస్తున్నాం' అని ప్రియదర్శి తెలిపారు. 'ఇదో క్లీన్ ఎంటర్టైనర్. సినిమాలోని ప్రతీ సన్నివేశం నవ్విస్తుంది. నా సినిమాలే ఆడాలని నేను ఎప్పుడూ ఆలోచించను. అందరి సినిమాలూ ఆడాలి. హిట్ అవ్వాలి' అని బన్నీ వాసు కోరారు.

కథా నేపథ్యం మేరకే కె - ర్యాంప్ టైటిల్



జైన్స్ నాని

మా సినిమా కథకు 'కె- ర్యాంప్' అనే టైటిల్ చక్కగా సరిపోతుందనే పెట్టాం. ముందు కొన్ని వేరే టైటిల్స్ అనుకున్నా ఇది క్యాచీగా ఉండడంతో, త్వరగా ప్రేక్షకుల్లోకి వెళ్తుందనిపించింది. ఈ చిత్రంలో హీరో పాత్ర పేరు కుమార్. ర్యాంప్ అనే మాట మనందరం బాగా వాడుతుంటాం. అలా కథా నేపథ్యం, హీరో పాత్రచిత్రణకు సరిపోయేలా 'కె-ర్యాంప్' అనే టైటిల్‌ను నిర్ణయించాం' అని దర్శకుడు జైన్స్ నాని అన్నారు. ఆయన దర్శకత్వంలో కిరణ్ అబ్బవరం కథానాయకుడిగా నటించిన చిత్రమిది. రాజేశ్ దండా, శివ బొమ్మక్ నిర్మించారు. ఈ నెల 18న విడుదలవుతోంది. ఈ సందర్భంగా జైన్స్ నాని సినిమా విశేషాలను మీడియాతో పంచుకున్నారు.

- ఈ సినిమా ట్రైలర్‌లో కుటుంబ ప్రేక్షకులు ఇబ్బందిపడేలా ఒకట్రెండు డైలాగ్‌లు ఉన్నాయి. అయితే సినిమా అంతా అదే తరహాలో ఉంటుందని అనుకోవద్దు. ప్రతి ప్రేక్షకుణ్ణి మెప్పించేలా ఈ కథ ఉంటుంది. మంచి కథతో పాటు ప్రేక్షకులను అబ్బురపరిచే మలుపులు ఉన్నాయి. ముఖ్యంగా విరామం సమయంలో వచ్చే ట్విస్ట్ ప్రేక్షకులను సంభ్రమాశ్చర్యాలకు గురిచేస్తుంది. మా నిర్మాతలు పూర్తి స్వేచ్ఛనివ్వడం వల్లే అనుకున్న విధంగా సినిమాను తెరకెక్కించగలిగాను.
- నేను మద్రాస్ ఐఐటీలో చదువుకునేటప్పుడే కొన్ని లఘుచిత్రాలను తెరకెక్కించాను. వాటికి మంచి పేరు వచ్చింది. చదువు పూర్తయ్యాక దర్శకత్వ శాఖలో సహాయకుడిగా చేరాను. కిరణ్ అబ్బవరానికి ఈ కథ వినిపించడం, ఆయన ఓకే చేయడంతో 47 రోజుల్లో చిత్రీకరణ పూర్తి చేశాం. కొత్తదనం కోసం కేరళ నేపథ్యంలో ఈ చిత్రాన్ని తెరకెక్కించాను.

విడుదల తేదీ ఖరారు



విక్రాంత్, చాందినీ చౌదరి, వెన్నెల కిశోర్, తరుణ్ భాస్కర్, అభినవ్ గోమటం ప్రధాన పాత్రధారులుగా సంజీవ్ రెడ్డి తెరకెక్కిస్తోన్న 'సంతాన ప్రాప్తిరస్తు' సినిమా విడుదల తేదీ ఖరారైంది. మధుర శ్రీధర్ రెడ్డి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి నిర్మిస్తోన్న ఈ చిత్రం నవంబరు 14న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. వెన్నెల కిశోర్ డాక్టర్ భ్రమరం పాత్రలో నవ్వించబోతున్నారు. నేటి సమాజంలో యువ జంటలు ఎదుర్కొంటున్న ఓ సమస్య నేపథ్యంలో సినిమా రూపుదిద్దుకుంటోంది. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి.

రేపటి నుంచి విద్యుత్తు ఉద్యోగుల సమ్మె

అమరావతి, విజయవాడ, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): విద్యుత్తు ఉద్యోగులు సమ్మెకు సిద్ధమయ్యారు. 15వ తేదీ ఉదయం 6 గంటల నుంచి సమ్మెలోకి వెళుతున్నామని విద్యుత్తు ఉద్యోగుల జేఏసీ ఛైర్మన్ ఎస్.కృష్ణయ్య ప్రకటించారు. విద్యుత్తు సంస్థల యాజమాన్యంతో సోమవారం సాయంత్రం జరిగిన చర్చల్లో తమ డిమాండ్లపై స్పష్టత రాలేదని తెలిపారు. 29 డిమాండ్లను యాజమాన్యం ముందుంచగా, ప్రధాన అంశాలపై స్పష్టత ఇవ్వలేదని తెలిపారు. స్పష్టత వచ్చే వరకు సమ్మెపై పునరాలోచన లేదని స్పష్టం చేశారు. మరోవైపు విజయవాడలోని గాంధీనగర్‌లో సోమవారం విద్యుత్ జేఏసీ ఆధ్వర్యంలో జరిగిన మహాధర్నాలో 15 వేల మందికి పైగా విద్యుత్ కార్మికులు పాల్గొన్నారు. కృష్ణయ్య మాట్లాడుతూ ఉద్యోగులపై యాజమాన్యం బెదిరింపులకు పాల్పడుతోందన్నారు. కన్వీనర్ ఎం.వి.రాఘవరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించకపోవడంతోనే సమ్మె బాట పడుతున్నామన్నారు.

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల పదోన్నతులపై కసరత్తు

▸ 10 మంది సభ్యులతో మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు

అమరావతి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించే అంశంపై రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. పదోన్నతులపై అధ్యయనానికి 10 మంది సభ్యులతో మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేస్తూ సాధారణ పరిపాలన శాఖ సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. కమిటీలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తోపాటు ఇతర మంత్రులు డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, పయ్యావుల కేశవ్, నారాయణ, సత్యకుమార్, అచ్చెన్నాయుడు, అనిత, అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, సంధ్యారాణి ఉన్నారు. ఉపసంఘానికి కార్యదర్శిగా గ్రామ, వార్డు సచివాలయ శాఖ కార్యదర్శిని నియమించారు. పదోన్నతుల తర్వాత ఖాళీల భర్తీపై హేతుబద్ధీకరణ ప్రక్రియను కూడా ఖరారు చేయాలని సూచించింది. వీలైనంత త్వరగా దీనిపై అధ్యయనం చేసి.. సిఫారసులతో కూడిన నివేదికను సమర్పించాలని పేర్కొంది.

నోరు మెదపని కి'లేడీ'!

▸ తుపాకీతో బెదిరించిన కేసులో అరుణ 2 రోజుల విచారణ పూర్తి

నెల్లూరు(క్రైం), అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగరం కుసుమహరిజనవాడలో అన్నదమ్ముల ఆస్తి వివాదం సెటిల్‌మెంట్‌కు వెళ్లిన లేడీడాన్ అరుణ తుపాకీతో బెదిరించిన కేసులో నెల్లూరు నవాబుపేట పోలీసులు రెండోరోజైన సోమవారం కూడా విచారించారు. 'తుపాకీ నీకు ఎక్కడ నుంచి వచ్చింది? జిల్లాతోపాటు రాష్ట్రవ్యాప్తంగా గన్‌లు, గ్యాంగ్‌లతో ఎన్ని సెటిల్‌మెంట్లు చేశావు? నీ వెనుక ఎవరున్నారు?' అంటూ అరుణపై పోలీసులు ప్రశ్నలవర్షం కురిపించినట్లు సమాచారం. ఏ ప్రశ్నవేసినా 'నా వద్ద అసలు తుపాకీయే లేదు, నేను ఎలాంటి సెటిల్‌మెంట్‌లు చేయలేదు. నాకు అండగా ఎవరూ లేరు'.. అంటూ ఆమె సమాధానాలు ఇచ్చినట్లు తెలుస్తోంది.

ఐటీడీఏలకు రూ.67.26 కోట్ల ట్రైకార్ నిధులు


అమరావతి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమశాఖ ద్వారా ఆర్టికల్ 275(1) అమలు నిధులు రూ.67.26 కోట్లను విడుదల చేస్తూ ఏపీ గిరిజన కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్(ట్రైకార్) ఎండీ మణికుమార్ ఆదేశాలిచ్చారు. 2024-25 ఆర్థిక సంవత్సర నిధులను 8 ఐటీడీఏలకు విడుదల చేశారు.

ఐపీఎస్ అధికారి కృష్ణకాంత్ పటేల్‌కు క్లీన్‌చిట్

ఐపీఎస్ అధికారి కృష్ణకాంత్ పటేల్‌కు క్లీన్‌చిట్ లభించింది. ఎన్నికల తర్వాత కౌంటింగ్‌లో చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కుమారుడు మోహిత్ రెడ్డి అనుచరులు టీడీపీ చంద్రగిరి అభ్యర్థి పులివర్తి నానిపై తిరుపతిలో మద్యం బాటిళ్లు, సుత్తితో దాడి చేశారు. ఈ ఘటనతో ఈసీ అప్పట్లో కృష్ణకాంత్‌ను అక్కడి నుంచి బదిలీ చేసి విచారణకు ఆదేశించింది. తిరుపతి ఎస్పీ తప్పులేదని తేలడంతో ప్రభుత్వం క్లీన్‌చిట్ ఇస్తూ సోమవారం జీవో ఇచ్చింది.

పోలీసు శాఖను మూసేయండి!

▸ డీజీపీ సహా అధికారులు నిద్రపోతున్నారా?
▸ రికార్డులు సీజ్ చేయమన్నా పట్టించుకోరా?
▸ 'పరకామణి' కేసులో నిందితులకు సహకారం
▸ తదుపరి విచారణకు రికార్డులు కోర్టుకు ఇవ్వండి
▸ సీఐడీ డీజీకి హైకోర్టు ఆదేశం..



అమరావతి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): టీటీడీ పరకామణిలో జరిగిన అక్రమాల విషయంలో నమోదైన కేసును లోక్ అదాలత్ వద్ద రాజీ చేసుకున్న ఘటనకు సంబంధించి రికార్డులను సీజ్ చేయాలని ఇచ్చిన ఆదేశాలను పోలీసులు అమలు చేయకపోవడంపై హైకోర్టు నిప్పులు చెరిగింది. రాష్ట్రంలో పోలీస్ శాఖను మూసివేయడం మంచిదని, డీజీపీ నిద్రపోతున్నారని ఘాటుగా వ్యాఖ్యానించింది. "పాలనాపరంగా శాఖలో సీఐడీ ఇన్‌స్పెక్టర్ జనరల్(ఐజీ) పోస్టు లేదనే కారణంతో కోర్టు ఆదేశాలను అమలు చేయరా?." అని ప్రశ్నించింది. సదుద్దేశం ఉంటే మరో ఐజీ స్థాయి అధికారిని నియమించి రికార్డులను సీజ్ చేసేందుకు డీజీపీ ఆదేశించేవారని వ్యాఖ్యానించింది. ఈ మొత్తం వ్యవహారానికి డీజీపీనే బాధ్యులని పేర్కొంది. "రికార్డులు సీజ్ చేయమని గత నెల 19న ఉత్తర్వులు ఇచ్చాం. ఆ ఆదేశాలలో సవరణ అవసరమని భావిస్తే తక్షణమే అనుబంధ పిటిషన్ వేసి ఉండాల్సింది. రికార్డులను సీజ్ చేయమని ఇచ్చిన ఉత్తర్వులు అమలు చేయకుండా.. సీఐడీ ఐజీ స్థానంలో సీఐడీ ఎస్పీ లేదా డీజీని చేర్చాలని ఈ నెల 6న అనుబంధ పిటిషన్ వేయడం ఏంటి?. ఏ కేసులలో వేగంగా స్పందించాలో కూడా తెలియట్లేదా?. పోలీసు వ్యవస్థ పనిచేసేది ఇలాగేనా" అని ప్రశ్నించింది. కేసుకు ఉన్న ప్రాముఖ్యత గురించి డిపార్ట్‌మెంట్‌లో ఉన్న కానిస్టేబుల్‌కి కూడా తెలుసని, ఈ వ్యవహారంలో ఎంత నిజాయితీగా వ్యవహరించారో పోలీసు అధికారుల చర్యలే చెబుతున్నాయని వ్యాఖ్యానించింది. కేసు దర్యాప్తునకు కీలకమైన కొద్దో గొప్పో ఆధారాలను సైతం తారుమారు చేసేలా, నిందితులకు సహరించేలా పోలీసులు చర్యలు ఉన్నాయని పేర్కొంది. మొత్తం వ్యవహారాన్ని దారి తప్పించారని వ్యాఖ్యానించింది. డిపార్ట్‌మెంట్ మొత్తం నిస్సారంగా, నిరుపయోగంగా మారిందని, పోలీసుశాఖను మూసివేయడం మంచిదని ఘాటుగా స్పందించింది. కేసుకి సంబంధించిన రికార్డులు అన్నింటినీ తక్షణం సీజ్ చేసి తదుపరి విచారణ రోజు తమ ముందుంచాలని సీఐడీ డీజీని ఆదేశించింది. విచారణను ఈ నెల 17కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ సోమవారం ఉత్తర్వులు ఇచ్చారు.

అసలు వివాదం ఏంటి?

2023, వైసీపీ ప్రభుత్వ హయంలో తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ)లో శ్రీవారికి భక్తులు సమర్పించే కానుకల పరకామణిలో కుంభకోణం జరిగింది. ఈ వ్యవహారంపై సీఐడీతో దర్యాప్తు చేయించాలని సమర్పించిన వినతిని ఆలయ కార్యనిర్వహణాధికారి(ఈవో) పరిగణనలోకి తీసుకోలేదు. ఈ చర్యలను చట్టవిరుద్ధమైన చర్యగా ప్రకటించాలని కోరుతూ పాత్రికేయుడు ఎం. శ్రీనివాసులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అదేవిధంగా సీఐడీ దర్యాప్తునకు ఆదేశించాలని కోరుతూ గత ఏడాది సెప్టెంబరు 10న ఇచ్చిన వినతిని పరిగణనలోకి తీసుకొని నిర్ణయం వెల్లడించేలా టీటీడీ ఈవోను ఆదేశించాలని కోరుతూ మరో అనుబంధ పిటిషన్ వేశారు. "పరకామణిలో విధులు నిర్వహిస్తున్న టీటీడీ ఉద్యోగి సీవీ రవికుమార్ డాలర్ల రూపంలో పెద్దఎత్తున నగదు, బంగారాన్ని అపహరించారు. ఈ వ్యవహారంపై అసిస్టెంట్ విజిలెన్స్ సెక్యూరిటీ అధికారి వై. సతీశ్ కుమార్ 2023, ఏప్రిల్ 29న తిరుమల వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దర్యాప్తు పూర్తి చేసిన పోలీసులు చార్జ్‌షీట్ దాఖలు చేసిన అనంతరం టీటీడీ బోర్డు తీర్మానం, అప్పటి ఈవో అనుమతి లేకుండానే అదే ఏడాది సెప్టెంబరు 9న లోక్ అదాలత్ వద్ద అసిస్టెంట్ విజిలెన్స్ సెక్యూరిటీ అధికారి, నిందితుడు రవికుమార్‌తో రాజీ చేసుకున్నారు." అని వివరించారు. ఈ వివరాలు పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు న్యాయమూర్తి.. పరకామణి నుంచి నగదు అపహరణ విషయంలో ఇచ్చిన ఫిర్యాదును లోక్‌అదాలత్ వద్ద రాజీ చేసుకోవడాన్ని తప్పుబట్టారు. విస్తృత ప్రజా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని 2023, సెప్టెంబరు 9న లోక్ అదాలత్ ఇచ్చిన ఉత్తర్వులను సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. తాము తదుపరి ఆదేశాలు ఇచ్చేవరకు ఇవి అమల్లో ఉంటాయన్నారు. కేసులో సీఐడీ ఇన్‌స్పెక్టర్ జనరల్‌ను సుమోటోగా ప్రతివాదిగా చేర్చారు. ప్రస్తుత కేసుతో ముడిపడి ఉన్న తిరుమల వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ రికార్డులు, లోక్ అదాలత్ ప్రొసీడింగ్స్, టీటీడీ బోర్డు తీర్మానాలు, ఈ కేసుతో సంబంధం ఉన్న అన్ని ప్రొసీడింగ్స్‌ను తక్షణం స్వాధీనం చేసుకోవాలని, వాటిని సీల్డ్ కవర్‌లో కోర్టు ముందు ఉంచాలని సీఐడీ ఐజీని గత విచారణలో ఆదేశించారు.

సీఐడీలో ఐజీ పోస్టు లేదు!

హైకోర్టులో ఈ పిటిషన్ సోమవారం మరోసారి విచారణకు రాగా సీఐడీ తరఫున ఏపీపీ పాణిని సోమయాజి వాదనలు వినిపించారు. "రికార్డులను సీజ్ చేయాలని సెప్టెంబరు 19న సీఐడీ ఐజీకి కోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. కానీ, సీఐడీలో ఐజీ పోస్టు లేదు. ఈ నేపథ్యంలో రికార్డులు సీజ్ చేసే బాధ్యతను సీఐడీ ఎస్పీ, డీజీకి అప్పగిస్తూ ఉత్తర్వులను సవరించాలని కోరుతూ.. అనుబంధ పిటిషన్ వేశాం" అని కోర్టుకు వివరించారు.

ఉల్లంఘనలు ఉపేక్షించం!

▸ పోలీసులను హెచ్చరించిన హైకోర్టు.. కోర్టులతో ఎలా మెలగాలో వారికి చెప్పండి
▸ హోంశాఖ ప్రత్యేక కార్యదర్శికి నిర్దేశించిన ధర్మాసనం
▸ 27న హోంశాఖ ముఖ్యకార్యదర్శి హాజరుకావాలని ఆదేశం

అమరావతి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): అధికార విధుల్లో ఉండగా చట్టనిబంధనలను తు.చ. తప్పకుండా అనుసరించాల్సిందేనని పోలీసులకు హైకోర్టు స్పష్టం చేసింది. నిబంధనలను ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదని, కఠిన చర్యలు తప్పవని తేల్చిచెప్పింది. కోర్టులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బందితో ఎలా మెలగాలో పోలీసు సిబ్బందికి సూచనలు చేయాలని.. విచారణ నిమిత్తం కోర్టుకు హాజరైన హోంశాఖ ప్రత్యేక కార్యదర్శి విజయ్‌కుమార్‌కు హైకోర్టు స్పష్టం చేసింది. వ్యక్తిగత కారణాలతో విచారణకు హాజరుకాలేకపోతున్నానని, హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరుతూ హోంశాఖ ముఖ్యకార్యదర్శి కుమార్ విశ్వజిత్ వేసిన అనుబంధ పిటిషన్‌ను అనుమతించింది. తదుపరి విచారణ రోజు తమ ముందు హాజరుకావాలని ఆయనకు స్పష్టం చేస్తూ విచారణను ఈనెల 27వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ హరిహరనాథశర్మతో కూడిన ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు ఇచ్చింది. ఎస్సై పోస్టుల భర్తీ నిమిత్తం 2018 నవంబరు 1న రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్‌లో ట్రాన్స్‌జెండర్‌కు రిజర్వేషన్ కల్పించకపోవడాన్ని సవాల్ చేస్తూ ట్రాన్స్‌జెండర్ గంగాభవాని 2019లో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధంగా నోటిఫికేషన్ ఉందని పిటిషన్‌లో పేర్కొన్నారు. పిటిషనర్ తరఫు న్యాయవాది సాల్మన్‌రాజు వాదనలు వినిపిస్తూ... పిటిషనర్ పురుషుడిగా జన్మించారని, తర్వాత లింగమార్పిడి ద్వారా ట్రాన్స్‌జెండర్‌గా మారారని తెలిపారు. ఎస్సై ఉద్యోగం దరఖాస్తులో స్త్రీ, పురుష ఐచ్ఛికం మాత్రమే ఇవ్వడంతో పిటిషనర్ స్త్రీగా ఐచ్ఛికాన్ని ఇచ్చారని, ప్రాథమిక పరీక్ష రాసి బీసీ రిజర్వేషన్ కోటాలో 35 మార్కులు సాధించారని పేర్కొన్నారు. అయితే అధికారులు తర్వాతి ప్రక్రియను అనుమతించలేదని తెలిపారు. హైకోర్టు సింగిల్ జడ్జి ఈ వ్యాజ్యాన్ని కొట్టివేస్తూ 2022 జనవరి 21న తీర్పు ఇవ్వగా, ఆ తీర్పును సవాల్ చేస్తూ 2022లో ధర్మాసనం ముందు గంగాభవాని అప్పీల్ వేశారు. ఈ అప్పీల్‌పై గతేడాది డిసెంబరు 12న విచారణ జరిపిన ధర్మాసనం...రాష్ట్ర హోంశాఖ ఆధ్వర్యంలో నవంబరు 22న నిర్వహించిన సమావేశంలో తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా గంగాభవాని ఉద్యోగంపై నిర్ణయం తీసుకోవాలని హోంశాఖ ముఖ్యకార్యదర్శిని ఆదేశించింది. అందుకు సంబంధించిన నివేదికను తమకు సమర్పించాలని స్పష్టం చేసింది. ఈ నెల 6న అప్పీల్ మరోసారి విచారణకు రాగా...హోంశాఖ ముఖ్యకార్యదర్శి కుమార్ విశ్వజిత్ నివేదిక సమర్పించకపోవడంపై ధర్మాసనం అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ వ్యవహారంపై వివరణ ఇచ్చేందుకు ఈనెల 13న నేరుగా తమ ముందు హాజరుకావాలని ఆయనను ఆదేశించింది. అప్పీల్ సోమవారం మరోసారి విచారణకు రాగా హోంశాఖ ముఖ్యకార్యదర్శి తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ సాంబశివ ప్రతాప్ వాదనలు వినిపిస్తూ.... విశ్వజిత్ సెలవులో ఉన్నారని, తన అభ్యర్థన మేరకు ఆన్‌లైన్ ద్వారా విచారణకు హాజరయ్యారని తెలిపారు. హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. విశ్వజిత్ బదులు హోంశాఖ ప్రత్యేక కార్యదర్శి విచారణకు హాజరయ్యారన్నారు. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం విచారణను ఈనెల 27కి వాయిదా వేసింది.

తిరుమల చేరుకున్న సీఐడీ బృందం

పరకామణి కేసు రికార్డులను పరిశీలించనున్న డీజీ రవిశంకర్

తిరుమల, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయ పరకామణి దొంగతనం కేసు విచారణ నిమిత్తం సీఐడీ బృందం సోమవారం రాత్రి తిరుమలకు చేరుకుంది. లోక్ అదాలత్‌లో రాజీ కుదిర్చిన కేసును సీఐడీకి అప్పగిస్తూ హైకోర్టు గత నెలలో ఆదేశాలు ఇచ్చిన విషయం తెలిసిందే. వైసీపీ ప్రభుత్వ హయాంలో రవికుమార్ అనే జియ్యంగారి మఠం ఉద్యోగి శ్రీవారి ఆలయ హుండీ పరకామణిలో దొంగతనం చేసి పట్టుబడగా, ఆయన నుంచి కొన్ని ఆస్తులను టీటీడీ పేరిట రాయించి కేసును లోక్‌అదాలత్‌లో రాజీ కుదుర్చుకున్నారు. దీనిపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ.. పరకామణి వ్యవహారంపై సీఐడీ ద్వారా విచారణ చేయించాలంటూ ఎం.శ్రీనివాసులు హైకోర్టులో పిటిషన్ వేయగా, లోక్ అదాలత్‌లో ఇచ్చిన ఆదేశాన్ని తాత్కాలికంగా నిలిపివేస్తూ తీర్పువచ్చింది. కేసును సీఐడీకి అప్పగించడంతో సీఐడీ డీజీ రవిశంకర్ అయ్యానార్, మరికొంత మంది అధికారులు సోమవారం రాత్రి తిరుమలలోని పోలీస్ అతిథిగృహానికి చేరుకున్నారు. మంగళవారం ఉదయం శ్రీవారిని దర్శించుకుని తిరుమల వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌కు చేరుకోనున్నారు. అక్కడ పరకామణి కేసుకు సంబంధించిన రికార్డులను పరిశీలించి పలు అంశాలపై విచారణ చేపట్టనున్నారు.


శ్రీశైలంలో వీర శివాజీ





1986 ఏప్రిల్ 8వ తేదీన శ్రీశైలంలోని ఛత్రపతి శివాజీ స్ఫూర్తి కేంద్రం సభామందిరం ప్రారంభోత్సవానికి హాజరైన అప్పటి సీఎం ఎన్టీ రామారావు. వివరాలను వెల్లడిస్తున్న అప్పటి కర్నూలు ఎమ్మెల్యే టీజీ వెంకటేశ్

16న శ్రీశైలంలో ప్రధాని మోదీ పర్యటన.. శివాజీ నడయాడిన ప్రాంతాల సందర్శన



శివాజీ మహారాజ్ స్ఫూర్తి కేంద్రంలో రాజదర్బార్



శ్రీశైలంలో భ్రమరాంబికా దేవి శివాజీకి వీర ఖడ్గాన్ని అందజేస్తున్నట్లు ఉన్న విగ్రహం

(మొదటి పేజీ తరువాయి)

పౌరాణిక గ్రంథాల్లోనే కాదు.. చరిత్ర పుటల్లోనూ మల్లన్న వైభవం కనిపిస్తూనే ఉంటుంది. ఛత్రపతి శివాజీ మహారాజ్‌ను కూడా ఈ దివ్యక్షేత్రం ఎంతో ఆకర్షించింది. 1677 ప్రాంతంలో దక్షిణ భారతదేశంపైకి ఆయన దండయాత్ర మొదలు పెట్టారు. ఈ సందర్భంగా ఆయన తొలిసారిగా శ్రీశైలానికి చేరుకుని మల్లన్న ఆశీస్సులు తీసుకున్నారని చరిత్ర చెబుతోంది. శ్రీశైలంలో దాదాపు పది రోజుల పాటు ఉండి దండయాత్రకు సంబంధించిన కార్యాచరణ రూపొందించారు. స్వతహాగా అమ్మవారి భక్తుడు కావడంతో ఆ సమయంలో చేసిన సాధనకు మెచ్చి భ్రమరాంబికా దేవి సాక్షాత్కరించి శివాజీ మహారాజ్‌కు దివ్య ఖడ్గాన్ని ప్రసాదించారని ఆలయ చరిత్ర చెబుతోంది.

శివాజీ రాజగోపురం... స్ఫూర్తి కేంద్రం

శ్రీశైలంలో ఉండగా మల్లన్న ఆలయ ఉత్తర రాజగోపురాన్ని నిర్మించాలని శివాజీ మహారాజ్ సంకల్పించారు. ఇందుకోసం రామచంద్ర పంత్ అనే తన మంత్రిని రెండేళ్లపాటు ఇక్కడే ఉంచి రాజగోపుర నిర్మాణాలను పూర్తి చేయించారు. శివాజీ మహారాజ్ అప్పట్లో ఎక్కడైతే ధ్యానం చేశారో.. ఆ ప్రాంతంలోనే శివాజీ మహారాజ్ ధ్యాన స్ఫూర్తి కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. 1975లో శివాజీ మెమోరియల్ కమిటీ ఏర్పాటైంది. ఆ తర్వాత 1983లో మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న వసంత దాదాపాటిల్ ఆధ్వర్యంలో శివాజీ స్ఫూర్తి కేంద్రానికి పునాదిరాయి వేశారు. సుమారు 19 ఏళ్ల పాటు సాగిన ఈ నిర్మాణం పూర్తిస్థాయిలో 2004లో భక్తులకు అందుబాటులోకి వచ్చింది. 1994లో శివాజీ మహారాజ్ కాంస్య విగ్రహన్ని కూడా ఇక్కడ ప్రతిష్ఠ చేశారు.

రాజదర్బార్‌ను మైమరపించే స్ఫూర్తి కేంద్రం

ఈ స్ఫూర్తి కేంద్రంలో శివాజీ మహారాజ్ పట్టాభిక్తుడైనట్లు ఉన్న కాంస్య విగ్రహం ఏర్పాటు చేశారు. పది మందితో కూడిన మంత్రి మండలిని స్ఫురించేలా రాజదర్బార్‌ను రూపొందించారు. శివాజీ మహారాజ్ సింహాసనంపై ఠీవీగా కూర్చున్న కాంస్య విగ్రహం బరువు ఛత్రంతో కలిపి 12 అడుగుల ఎత్తు ఉండగా, 4.5 టన్నుల బరువు ఉండటం విశేషం. స్ఫూర్తి కేంద్రంలోకి వెళ్తే ప్రస్తుత కాలాన్ని మరిచి రాజుల కాలం నాటి దర్బార్‌లో ఉన్నట్లుగా అనిపించేలా మందిరాన్ని నిర్మించారు. అంతేకాకుండా ఈ మందిరంలో శివాజీ మహారాజ్ చేసిన దండయాత్రలు, విజయాలకు గుర్తుగా త్రీడీ చిత్రాలను ఏర్పాటు చేశారు. పలు భాషల్లో శివాజీ మహారాజ్ చరిత్ర విశేషాలను ఇందులో చూడవచ్చు. ఆ పక్కనే శివాజీ ధ్యానం చేసిన స్ఫూర్తి కేంద్రాన్ని నిర్మించారు. ఈ ధ్యానకేంద్రంలోకి వెళ్లగానే సమస్యలన్నీ మర్చిపోతారని, మనసు తేలికపడుతుందని సందర్శకుల నమ్మకం.



2022 డిసెంబరు 12వ తేదీన శివాజీ స్ఫూర్తి కేంద్రానికి వచ్చిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

తెలంగాణ ఇస్తోంది.. మేమూ ఇస్తున్నాం!

▸ కాంట్రాక్టర్స్ ఓవర్‌హెడ్స్-ప్రాఫిట్స్‌పై ఏపీ ట్రాన్స్‌కో వివరణ
▸ 'ఆంధ్రజ్యోతి' కథనంపై పొంతన లేని జవాబు
▸ మరి అక్కడి ఎస్ఎస్ఆర్ ధరలు అమలు చేస్తున్నారా?
▸ కొవిడ్ ఎప్పుడో 2021లోనే ముగిసింది
▸ అయినా దాని సాకుతో 2024 వరకూ సీవోపీ పునరుద్ధరణపై దృష్టిపెట్టలేదని సమర్థన

అమరావతి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ట్రాన్స్‌కో కూడా కాంట్రాక్టర్లకు కాంట్రాక్టర్స్ ఓవర్‌హెడ్స్-ప్రాఫిట్స్ (సీవోపీ) కింద టెండరు మొత్తానికి అదనంగా 14 శాతం చెల్లిస్తోందని, దానిని అనుసరించే తాము కూడా అమలు చేస్తున్నామని ఏపీ ట్రాన్స్‌కో అధికారులు వివరణ ఇచ్చారు. 'ఆ నిర్ణయం ఖరీదు రూ.300 కోట్లు' శీర్షికన ఆదివారం (12న) 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై వారు స్పందించారు. అయితే తెలంగాణ ట్రాన్స్‌కో ఎస్ఎస్ఆర్ (స్టాండర్డ్ షెడ్యూల్ రేట్స్) ధరలనే ఇక్కడా అమలు చేస్తున్నారా అంటే సమాధానం లేదు. అక్కడి కన్నా ఇక్కడి ఎస్ఎస్ఆర్ ధరలు 20 శాతం అధికంగా ఉన్నాయి. 2020 నుంచి 2024 వరకు కొవిడ్ మహమ్మారి కారణంగా భారీ ప్రాజెక్టులేవీ చేపట్టలేదని.. అందుకే సీవోపీని పునరుద్ధరించడంపై దృష్టి సారించలేదని అధికారులు పేర్కొన్నారు. అయితే ఆ నాలుగేళ్లలో ఏటా ట్రాన్స్‌కో రూ.2 వేల కోట్లకు తగ్గకుండా భారీ టెండర్లు పిలిచింది. అయినా 2021లోనే ముగిసిపోయిన కొవిడ్‌ను 2024 వరకు సాకుగా చూపడం.. తప్పును కప్పిపుచ్చుకునేందుకేనన్నది స్పష్టమవుతోంది. ట్రాన్స్‌కో పిలిచే టెండర్లకు కాంట్రాక్టర్ల నుంచి స్పందన లేకపోవడం వల్లే సీవోపీ ఇస్తున్నామని చెప్పడం కూడా హాస్యాస్పదం. 2019-2024 వరకు అధికశాతం టెండర్లు తక్కువకు పడగా.. 2024 నుంచి పిలిచిన టెండర్లలో ఎక్కువ ఎక్సెస్‌కు పడడం గమనార్హం. కొన్ని టెండర్లు ఏకంగా 11 శాతం ఎక్కువకు పడిన దాఖలాలూ ఉన్నాయి. దీనికి సీవోపీ 14 శాతం కలుపుకొంటే టెండరులో కోట్ చేసిన దానికి 25 శాతం అత్యధికం. వీటన్నింటినీ కప్పిపెట్టి.. ప్రభుత్వానికి నష్టం కలిగించే సీవోపీ పునరుద్ధరణ నిర్ణయాన్ని ట్రాన్స్‌కో సమర్థించుకోవడం గమనార్హం.

ట్రాన్స్‌కో బలోపేతమే లక్ష్యం

▸ జేఎండీగా ప్రవీణ్ చంద్ బాధ్యతలు స్వీకరణ



అమరావతి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌కో అభివృద్ధికి, బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని ట్రాన్స్‌కో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ (జేఎండీ) సూర్యసాయి ప్రవీణ్ చంద్ అన్నారు. సోమవారం విద్యుత్ సౌధలో ఆయన జేఎండీగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా 24/7 నాణ్యమైన విద్యుత్ సరఫరాకు ప్రాధాన్యమిచ్చి పని చేస్తానన్నారు. ట్రాన్స్‌కో డైరెక్టర్లు ఏకేవీ భాస్కర్, జేవీరావు, ఎన్‌వీ రమణమూర్తి తదితరులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

వడివడిగా డయాఫ్రం వాల్

▸ ఇప్పటికి 58 శాతం పనులు పూర్తి

అమరావతి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు పనులు 2027 డిసెంబరు నాటికి పూర్తిచేయాలన్న లక్ష్యం దిశగా సాగుతున్నాయి. కొత్త డయాఫ్రం వాల్ పనులు వేగంగా నడుస్తున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో మొదలైన పనులు 58 శాతం పూర్తయ్యాయి. మిగిలిన 42 శాతం పనులు చేస్తూనే.. ఇప్పటికే పూర్తయిన గోడపై సమాంతరంగా ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ (ఈసీఆర్ఎఫ్) డ్యాం పనులను నవంబరు 1న ప్రారంభించేందుకు ఇంజనీర్లు సిద్ధమవుతున్నారు. డయాఫ్రం వాల్ నదీ గర్భంలోపల పునాదిలా ఉంటుంది. బయటకు కనిపించదు. కానీ సాంకేతిక పరిశీలన నిమిత్తం.. బయటకు 1.5 మీటర్ల ఎత్తులో నిర్మించారు. ఈ ఎత్తును ఇలాగే కొనసాగిస్తూ.. దానిపై ఈసీఆర్ఎఫ్ డ్యాంను నిర్మిస్తే.. గోదావరి నదికి భారీ వరద వస్తే.. దాని ప్రభావంతో వాల్ కంపించిపోయే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరించారు. దీంతో సోమవారం ఆ ఎత్తు తగ్గించడం ప్రారంభించారు.

విశాఖలో నిషేధిత దగ్గు మందు స్వాధీనం

▸ రూ.4.5 లక్షల విలువ చేసే 5,900 సిరప్‌లు గుర్తింపు

విశాఖపట్నం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): నిషేధిత దగ్గు, జలుబు మందు రివి కోల్డ్‌ను విశాఖపట్నంలోని ఔషధ నియంత్రణ విభాగం అధికారులు పట్టుకున్నారు. స్థానిక కిర్బిలైఫ్ సైన్సెస్ అనే మెడికల్ ఏజెన్సీ గోడౌన్‌లో రూ.4.5 లక్షల విలువచేసే 5,900 నిషేధిత సిరప్‌లను స్వాధీనం చేసుకున్నారు. సిరప్ తయారీ సంస్థలు రెండేళ్ల లోపు పిల్లలకు ఈ మందు వాడకూడదనే లేబుల్‌ను ప్రత్యేకంగా ముద్రించాలి. అయితే ఈ ముద్రణ లేని మందును విశాఖ మర్రిపాలెం ప్రాంతానికి చెందిన వ్యాపారి కొనుగోలు చేసి తెచ్చినట్టు అధికారులకు సమాచారం అందింది. సోమవారం మర్రిపాలెంలోని కిర్బి లైఫ్ సైన్సెస్ ఏజెన్సీ గోడౌన్‌లో తనిఖీలను నిర్వహించగా.. 5,900 నిషేధిత సిరప్‌లు పట్టుబడ్డాయి.



ప్రధాని మోదీకి వేంకటేశ్వరుని ప్రతిమను అందజేస్తున్న సీఎం చంద్రబాబు, పక్కన కేంద్ర మంత్రులు రామ్మోహన్, పెమ్మసాని, ఎంపీ లావు

విశాఖ సదస్సుకు రండి

ప్రధాని మోదీకి చంద్రబాబు ఆహ్వానం

- ప్రభుత్వాధినేతగా మోదీ 25 ఏళ్ల పూర్తికి అభినందనలు
- నేడు గూగుల్‌తో ఎంఓయూ గురించి వెల్లడి
- గత వైసీపీ విధ్వంస పాలన ప్రస్తావన

న్యూఢిల్లీ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో వచ్చే నెల 14, 15వ తేదీలలో జరగనున్న సీఐఐ భాగస్వామ్య సదస్సు-2025కు రావాల్సిందిగా ప్రధానమంత్రి నరేంద్రమోదీని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆహ్వానించారు. ముఖ్యమంత్రి, ప్రధాని పదవుల్లో ప్రభుత్వాధినేతగా 25 ఏళ్ల పూర్తిచేసుకున్నందుకు మోదీకి అభినందనలు తెలిపారు. సోమవారం సాయంత్రం ఢిల్లీలో ప్రధానితో చంద్రబాబు దాదాపు గంట పాటు సమావేశమయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన అనేక అంశాలపై చర్చించారు. కర్నూలులో జరిగే సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ కార్యక్రమానికి రావాల్సిందిగా మోదీని కోరారు. జీఎస్టీ సంస్కరణల వల్ల ప్రజల ఆదాయం, ప్రభుత్వ సామర్థ్యం పెరగడంతో పాటు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు కలిసికట్టుగా నిర్ణయం తీసుకుంటే లభించే ఫలితాలను తెలియజేసేందుకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. విశాఖపట్నం సీఐఐ భాగస్వామ్య సదస్సు రాష్ట్రాభివృద్ధికి కొత్త మార్గాన్ని ఏర్పరుస్తుందని అన్నారు. దేశ, విదేశాల నుంచి పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, విధాన నిర్ణేతలు ఈ సమావేశంలో పాల్గొని తమ అనుభవాలను పంచుకుంటారని వివరించారు. రాష్ట్రాభివృద్ధిలో భాగస్వామ్యం అయ్యేందుకు ఉన్న అవకాశాలపై చర్చిస్తారని తెలిపారు. మంగళవారం గూగుల్‌తో జరిగే చరిత్రాత్మకమైన ఎంఓయూ కార్యక్రమం గురించి కూడా మోదీకి ఆయన వివరించారు. విశాఖలో ఒక గిగావాట్ డేటా సెంటర్ ఏర్పాటుకు ఈ ఒప్పందం కుదుర్చుకుంటున్నామని, దీనివల్ల రాష్ట్ర భవిష్యత్ మారుతుందని తెలిపారు. వికసిత భారత్‌లో భాగంగా ఏపీ బ్రాండ్‌ను అభివృద్ధి చేయాలన్న తన లక్ష్యానికి దోహదం చేయాల్సిందిగా కోరారు. ప్రధానితో ముఖాముఖి భేటీలో చంద్రబాబు పలు రాజకీయ అంశాలపై కూడా చర్చించినట్లు సమాచారం. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పూర్తిగా విధ్వంసమైందని, దానిని పునర్‌నిర్మించేందుకు వేగంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మద్యం కుంభకోణంలో గత జగన్ ప్రభుత్వం, ఆయన అనుచరులు పాల్పడిన నేరాలపై జరుగుతున్న సిట్ విచారణపై కూడా ఆయన స్థూలంగా వివరించినట్లు సమాచారం. ప్రధానితో భేటీలో కేంద్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు తదితరులు పాల్గొన్నారు. ప్రధానితో సీఎం అంతర్గత చర్చలు కూడా జరిపారు. సమావేశం అనంతరం భేటీ వివరాలను సీఎం చంద్రబాబు 'ఎక్స్'లో పోస్టు చేశారు. సీఐఐ భాగస్వామ్య సదస్సు, సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్ కార్యక్రమానికి రావాలని మోదీని ఆహ్వానించినట్లు తెలిపారు. ప్రజాజీవితంలో గుజరాత్ ముఖ్యమంత్రిగా, ప్రధానిగా 25 ఏళ్ల దిగ్విజయంగా పూర్తి చేసుకున్నందుకు మోదీని అభినందించినట్లు తెలిపారు.

విశాఖలో నాలుగోసారి సీఐఐ సదస్సు

సీఐఐ భాగస్వామ్య సదస్సును నవ్యాంధ్రలో నిర్వహించడం ఇది నాలుగోసారి. గతంలో మూడు సార్లు (2016, 2017, 2018) విశాఖలోనే నిర్వహించారు. ఇప్పుడు నాలుగోసారి కూడా సదస్సుకు విశాఖ నగరమే ఆతిథ్యం ఇవ్వనుంది. ఈసారి 'టెక్నాలజీ-ట్రస్ట్-ట్రేడ్ నావిగేటింగ్ ది జియో ఎకనామిక్ ఆర్డర్' థీమ్‌తో మొత్తం 13 సెషన్లుగా సదస్సును నిర్వహించనున్నారు. వివిధ దేశాల నుంచి 29 మంది వాణిజ్య మంత్రులు, 80 మంది దేశ, విదేశీ సీఈఓలు, 40 దేశాల నుంచి ప్రతినిధులు, 13 మంది కేంద్ర మంత్రులు ఈ సదస్సుకు హాజరవుతారని అధికారులు చెబుతున్నారు. జీ20 దేశాలు, మిడిల్ ఈస్ట్, యూరప్, ఆసియా, పశ్చిమాసియా తదితర ప్రాంతాల నుంచి ప్రతినిధులు పాల్గొనే అవకాశం ఉంది. ట్రేడ్, జియో ఎకనమిక్ ఫ్రేమ్ వర్క్, టెక్నాలజీ-ఇన్నోవేషన్, డిఫెన్స్, ఏరోస్పేస్, హెల్త్‌కేర్, బయోటెక్నాలజీ, స్మార్ట్ మాన్యుఫాక్చరింగ్, లాజిస్టిక్స్-సప్లయ్‌చైన్, సస్టెయినబులిటీ-క్లీన్ ఎనర్జీ, లెవరేజింగ్ టెక్నాలజీ అంశాలపై సెషన్లు జరుగుతాయి. సదస్సును విజయవంతం చేసేందుకు మంత్రి లోకేశ్ ఇప్పటికే పలు దేశాల్లో పర్యటించి పారిశ్రామికవేత్తలను ఆహ్వానించడంతో పాటు రోడ్ షోలు నిర్వహించారు.




సీఆర్‌డీఏ భవంతి ప్రారంభం అనంతరం బయటకు వస్తున్న సీఎం చంద్రబాబు, మంత్రి నారాయణ, ఎమ్మెల్యేలు శ్రవణ్, ధూళిపాళ్ల, గుంటూరు కలెక్టర్, తదితరులు



సీఆర్‌డీఏ భవంతిని ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబు, పక్కన మంత్రి నారాయణ



సీఆర్‌డీఏ భవన్‌లో ఉన్న ఏపీ టిడ్కో విభాగం





జగన్‌ది క్రిమినల్ మాస్టర్ మైండ్!

- వివేకా హత్య తరహాలో ఇప్పుడు 'కల్తీ' వ్యవహారం
- రాష్ట్రంలో అలజడి సృష్టించేందుకు ప్రయత్నం
- నేరాలు చేసి టీడీపీపై నెట్టడం పరిపాటిగా మారింది
- ఢిల్లీలో పార్టీ ఎంపీలతో చంద్రబాబు

న్యూఢిల్లీ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య తరహాలోనే మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఇప్పుడు కల్తీ మద్యం దందాను నడిపారని పార్టీ ఎంపీలతో సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. క్రిమినల్ మాస్టర్ మైండ్ ఎలా ఉంటుందన్న దానికి జగనే ఉదాహరణ అని చంద్రబాబు అన్నట్లు సమాచారం. సోమవారం సాయంత్రం ఢిల్లీలో ప్రధాని మోదీతో భేటీ అనంతరం చంద్రబాబు తన అధికారిక నివాసంలో పార్టీ ఎంపీలతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. వివేకానందరెడ్డి హత్య తరహాలో మళ్లీ నేరాలు, ఘోరాలు చేసి ఏపీలో అలజడి సృష్టించేందుకు జగన్ ప్రయత్నం చేస్తున్నారని చంద్రబాబు అన్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. అందరూ అప్రమత్తంగా ఉండాలని, వైసీపీ వాళ్ల క్రిమినల్ కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని పార్టీ ఎంపీలకు చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. మూర్ఖుడు, క్రూరుడు లాంటి పదాలు.. జగన్, ఆయన అనుచరులకే వర్తిస్తాయని అన్నారు. జగన్ నేర కార్యకలాపాలు అనంతమని, రాష్ట్రంలో ఆయన పార్టీ అంతా క్రిమినల్ కార్యకలాపాలకు అడ్డాగా మారిందని విమర్శించారు. వైసీపీ నేతలు నేరాలు చేసి, వాటిని తెలుగుదేశం మీదకు నెట్టడం పరిపాటిగా మారిందని ఆరోపించారు. కల్తీ మద్యం దర్యాప్తులో లోతుగా వెళ్తున్న కొద్దీ అనేక విషయాలు బయట పడుతున్నాయని, వాళ్ల నేరాన్ని తెలుగుదేశం మీదకు నెట్టేందుకు అన్నివిధాలా ప్రయత్నం చేస్తున్నారని చంద్రబాబు అన్నారు.

ఆ తప్పు మళ్లీ చేయొద్దు!

(మొదటి పేజీ తరువాయి)

ఏపీ సీఆర్‌డీఏ కార్యాలయాన్ని సోమవారం ఉదయం 9.55 గంటలకు.. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ.. రాజధాని రైతులతో కలిసి ఆయన ప్రారంభించారు. సీఆర్‌డీఏ, అమరావతి అభివృద్ధి కార్పొరేషన్, పురపాలక శాఖకు సంబంధించిన అన్ని విభాగాలూ ఒకే చోట నుంచి కార్యకలాపాలు నిర్వహించేలా నిర్మించిన ఈ భవనంలో వాటన్నిటినీ ఆయన పరిశీలించారు. అనంతరం కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో రైతులతో మాట్లాడారు. ఐదేళ్లపాటు వారు. మహిళలు పడ్డ కష్టాలు, ఎదుర్కొన్న అవమానాలను చూశానని.. వారి ఇబ్బందులు పోగొట్టి రెట్టింపు గౌరవం కల్పించేలా తోడ్పాటునందిస్తానని భరోసా ఇచ్చారు. తన ఆలోచన ఎప్పుడూ ప్రజల కోసం, వారి భవిష్యత్ కోసమేనని స్పష్టం చేశారు. ఇంకా ఏమన్నారంటే...



ఐజీబీసీ సర్టిఫికెట్‌ను సీఎంకి అందజేస్తున్న ఆ సంస్థ ప్రతినిధులు

ఎక్కడా లేని నగరంగా..

ఒక్క రూపాయి కూడా ప్రజాధనం ఖర్చు చేయకుండా నిర్మించే స్వీయ ఆదాయార్జన నగరం అమరావతి. రాజధాని మాస్టర్ ప్లాన్‌లోని తొలి భవనమైన సీఆర్‌డీఏ కార్యాలయాన్ని ఈ రోజు ప్రారంభించుకున్నాం. ఇది ఆరంభం మాత్రమే! ఇక రాజధాని అభివృద్ధి యాత్ర మొదలైంది. అమరావతికి క్వాంటం కంప్యూటర్‌ను తీసుకొచ్చా. గ్రీన్ ఎనర్జీ వ్యాలీని తీసుకొస్తున్నా. ఏఐ డేటా సెంటర్ తెస్తున్నా! అప్పుడు హైటెక్ సిటీ తెస్తే.. అవహేళన చేశారు. ఇప్పుడు రాజధాని విషయంలోనూ అవహేళన చేస్తున్నారు. కానీ ప్రూఫ్ ఆఫ్ కాన్సెప్ట్‌ను తయారు చేసుకుని అమరావతిని నిర్మిస్తున్నాం. ప్రజా రాజధాని అమరావతిని ప్రపంచంలో ఎక్కడా లేని నగరంగా తీర్చిదిద్దుతా! అది భవిష్యత్ నగరం! ఇందుకు కారణమైన రైతులు, ఆడబిడ్డలను ఎప్పటికీ మర్చిపోను. అందుకే ఆ వేంకటేశ్వరస్వామిని ప్రతి రోజూ దేవతల రాజధాని లాంటి రాజధానిని, రాష్ట్రాన్ని నిర్మించే అవకాశాన్ని ఇవ్వాలని వేడుకుంటున్నా. అమరావతికి స్థల బలం బలంగా ఉంది. అందుకే గత ప్రభుత్వం ఐదేళ్లపాటు వేధించినా దీటుగా నిలబడింది. రాజధాని కోసం మహిళా రైతులు రోడ్డెక్కి పోరాడారు. అనేక ఉద్యమాలు చేశారు. వారు పడ్డ అవమానాలు, పడ్డ బాధలు నేను ఎప్పటికీ మరిచిపోలేను. అందుకే రైతుల ఉద్యమానికి మద్దతుగా నేను కూడా జోలె పట్టాను. ఉద్యమానికి అండగా నిలిచాను. కష్టాలు మరచిపోవద్దు. రైతులు చేసిన త్యాగాల ఫలితాలను రైతులే అనుభవించాలి. నేను దానికి పూర్తిగా కట్టుబడి ఉన్నాను. రైతులకు రెట్టింపు గౌరవం దక్కేలా.. రెట్టింపు ఫలాలు అనుభవించేలా చేస్తా. అమరావతి పునాదులు చాలా బలంగా ఉన్నాయి. విశాఖ కూడా అద్భుతంగా అభివృద్ధి అవుతోంది. స్వాతంత్ర్యం వచ్చాక దేశంలో అతి పెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి ఇక్కడికే వస్తోంది.

భూములు అమ్ముకోవద్దు..

రాజధాని ప్రాంత ప్రజలు భూములు అమ్ముకోవద్దు. గతంలో నేను సైబరాబద్‌లో వాళ్లకూ అదే చెప్పా. హైదరాబాద్‌లో 9 మునిసిపాలిటీలు కలిపి ఒక వడ్డాణంలా ఔటర్ రింగ్ రోడ్ వచ్చింది. అప్పుడు రాయదుర్గంలో ఎకరా లక్ష ఉండే భూమి ఇప్పుడు ఎకరా 170 కోట్లు పలుకుతోంది. అదీ అభివృద్ధి ఫలమంటే.. అందుకే ఇక్కడ కూడా భూములు అమ్ముకోవద్దు. ఇంత మంచి ప్రాంతం ఎక్కడా ఉండదు. ఒక పక్క 30, 40 లక్షలు ఎకరాలు సాగు చేసే కృష్ణానది. ఇక్కడేమో బంగారం పండే భూములు.. పచ్చదనం అద్భుతంగా వస్తుంది. అంటే బ్లూ, గ్రీన్ సిటీగా ఉంటుంది. హైదరాబాద్‌లో రోడ్ కింద పైప్ లైన్ వేస్తారు. అది పగిలితే రోడ్‌పై నీరు ఉంటుంది. అందుకే ఇక్కడ అన్నిటికి ప్రత్యేక డక్టులు ఏర్పాటు చేశాం. ఫ్యూచర్ సిటీ అమరావతి. రాజధాని నుంచి 7 రోడ్లు నేరుగా ఇతర రాష్ట్రాలకు వెళ్తాయి. కాబట్టి రైతులెవరూ భూములు అమ్ముకోవద్దు.

దారి చూపిన రైతులు..

సైబరాబాద్ నిర్మించిన అనుభవంతో అమరావతి నిర్మాణం ప్రారంభించాం. భూమి కోసం ఎదురు చూస్తున్న సమయంలో అమరావతి రైతులు నాకు దారి చూపారు. రాజధాని నిర్మాణానికి భూ సమీకరణ అనే కొత్త విధానాన్ని తెచ్చాం. సమీకరణ విధానాన్ని విజయవంతం చేసిన చరిత్ర అమరావతి రైతులదే. ప్రపంచంలో ఎక్కడా ల్యాండ్ పూలింగ్ విధానం లేదు. మనమే తెచ్చాం. సక్సెస్ చేశాం. అమరావతి పనులు పునఃప్రారంభమయ్యాక మొదటిగా సీఆర్‌డీఏ బిల్డింగ్ ప్రారంభమైంది. నాకు సంతోషంగా ఉంది. ఇది ఆరంభం మాత్రమే! త్వరలో భూములిచ్చిన రైతులతో ప్రత్యేకంగా సమావేశమవుతా. అందరం కలిసి రాజధానిని అభివృద్ధి చేసుకుందాం.

సీఆర్‌డీఏ కార్యాలయానికి నెట్ జీరో ఎనర్జీ సర్టిఫికెట్

సీఎంకు అందజేసిన ఐజీబీసీ ప్రతినిధులు

తుళ్లూరు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): సీఆర్‌డీఏ కార్యాలయానికి నెట్ జీరో ఎనర్జీ (డిజైన్) సర్టిఫికెట్ లభించింది. సోమవారం సీఎం చంద్రబాబు అమరావతిలో సీఆర్‌డీఏ కార్యాలయాన్ని ప్రారంభించడానికి విచ్చేసిన సందర్భంలో సీఐఐ, ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ (ఐజీబీసీ) ప్రతినిధులు ప్రాజెక్టు కార్యాలయానికి ప్రతిష్ఠాత్మకమైన నెట్ జీరో ఎనర్జీ(డిజైన్) సర్టిఫికెట్‌ను ముఖ్యమంత్రికి అందజేశారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రి నారాయణ, మునిసిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేశ్ కుమార్, ఐజీబీసీ నేషనల్ వైస్ చైర్మన్ సీ శేఖర్ రెడ్డి, ఐజీబీసీ అమరావతి చాప్టర్ చైర్మన్ మేకా విజయ సాయి, అమరావతి కోర్ కమిటీ సభ్యులు కిరణ్ పరచూరి, డాక్టర్ సాందీపని, సీనియర్ కౌన్సిలర్ వి.సుందీప్ పాల్గొన్నారు. 'భవనం రూపకల్పన, నిర్మాణంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడకం వల్ల అత్యంత తక్కువ ఇంధనం లేదా విద్యుత్తు మాత్రమే అవసరమవుతుంది. దానిని రెన్యూవబుల్ ఎనర్జీ పద్ధతులు ద్వారా భవనం సమీపం నుంచే ఉత్పత్తి చేసుకుంటారు. అలాంటి భవనాలకే నెట్ జీరో ఎనర్జీ(డిజైన్) సర్టిఫికెట్ ఇస్తారు' అని సంబంధిత వర్గాలు చెప్పాయి.



సీఆర్‌డీఏ భవంతి లోపలి భాగం

నేడే గూగుల్‌తో ఒప్పందం

ఏఐ సిటీగా మారనున్న వైజాగ్!

- బాబు బ్రాండింగ్, లోకేశ్ కృషితో అతిపెద్ద పెట్టుబడి.. రాష్ట్రానికి భారీ ఆదాయం
- యువతకు 1.88 లక్షల ఉద్యోగావకాశాలు

న్యూఢిల్లీ, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తును మలుపుతిప్పే అతిపెద్ద ప్రాజెక్టుకు మంగళవారం ఢిల్లీలో అవగాహన ఒప్పందం కుదరనుంది. విశాఖపట్నంలో రూ.88,628 కోట్ల (పది బిలియన్ డాలర్ల)తో గూగుల్ 1 గిగావాట్ హైపర్‌స్కేల్ డేటా సెంటర్ ఏర్పాటుకు గూగుల్ అనుబంధ సంస్థ రైడెన్‌తో ఎంఓయూ కుదరనుంది. దేశంలోనే తొలి కృత్రిమ మేధస్సు కేంద్రం ఏర్పాటుకు "గూగుల్ ఏఐ హబ్" పేరుతో రాష్ట్ర ప్రభుత్వం విశాఖపట్నంలో శ్రీకారం చుట్టనుంది. ఢిల్లీలోని తాజ్‌మాన్‌సింగ్ హోటల్‌లో ఉదయం 10గంటలకు ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర సమాచార, ప్రసార శాఖల మంత్రి అశ్వినీ వైష్ణవ్, కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి లోకేశ్ సమక్షంలో ఏపీ ప్రభుత్వ ప్రతినిధులు, గూగుల్ ఉన్నతస్థాయి బృందం ఎంఓయూపై సంతకాలు చేయనున్నారు. ఇది దేశంలోనే అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి (ఎఫ్‌డీఐ)గా రికార్డు సృష్టించబోతోంది. రాష్ట్రచరిత్రలో మైలురాయిగా నిలువబోతోంది. ఏపీని ఏఐ ఆధారిత ఆవిష్కరణలు, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్‌లో దేశంలోనే అగ్రగామిగా నిలపడమే ఈ ఒప్పందం ప్రధాన లక్ష్యం. మంత్రి లోకేశ్ గతేడాది అక్టోబరు 31వ తేదీన అమెరికా పర్యటన సందర్భంగా శాన్ ఫ్రాన్సిస్కోలో గూగుల్ క్లౌడ్ సీఈవో థామస్ కురియన్‌తో జరిపిన చర్చల్లో ఈ ప్రాజెక్టును ప్రతిపాదించారు. ఆ తర్వాత గూగుల్ ప్రతినిధులతో పలుదఫాలుగా జరిగిన చర్చలు కార్యరూపం దాల్చాయి. దీని ద్వారా దేశంలో కృత్రిమ మేధస్సు ఆధారిత అభివృద్ధిలో ఏపీ కీలక నాయకత్వం వహించబోతోంది. ఈ ప్రాజెక్ట్ ద్వారా గూగుల్ రాబోయే అయిదేళ్లలో (2026-2030 మధ్య) సుమారు రూ.88,628 కోట్ల(10 బిలియన్ డాలర్ల) పెట్టుబడి పెట్టనుంది. ఇది ఆసియాలోనే గూగుల్ చేపట్టే అతి పెద్ద ప్రాజెక్టుల్లో ఒకటిగా నిలవనుంది. ఈ పెట్టుబడి ద్వారా వేల సంఖ్యలో ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు లభిస్తాయి. యువత కోసం ఏఐ నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తారు. ఈ ఏఐ హబ్ ద్వారా విశాఖకు మరిన్ని గ్లోబల్ పెట్టుబడులను ఆకర్షించే అవకాశముంది. తద్వారా టెక్నాలజీ, ఇన్నోవేషన్ రంగాల్లో విశాఖ ప్రధాన కేంద్రంగా మారుతుంది. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాల కల్పనతోపాటు వ్యాపార అనుకూల విధానాల అమలు ద్వారా ఏపీని జాతీయ స్థాయి ఏఐ ఎక్సలెన్స్ సెంటర్‌గా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యం. ఈ ప్రాజెక్టు ద్వారా విశాఖపట్నాన్ని ఏఐ సిటీగా మార్చబోతోంది. ఇక్కడ ఏర్పాటుచేసే డేటా సెంటర్ ద్వారా గూగుల్ భారత్‌లో ఏఐ ఆధారిత ట్రాన్స్‌ఫర్మేషన్‌ను వేగవంతం చేయనుంది. ఏఐ మౌలిక సదుపాయాలు, భారీ ఇంధన వనరులు, ఫైబర్ ఆప్టిక్ నెట్‌వర్క్‌లను ఒకేచోట సమన్వయపరచి.. విశాఖను భారతదేశ ఏఐ ట్రాన్స్‌ఫర్మేషన్ కేంద్రంగా గూగుల్ నిలబెడుతుంది. గూగుల్ గ్లోబల్ నెట్‌వర్క్‌తో సముద్ర గర్భ, భూభాగపు కేబుల్ కనెక్టివిటీ ద్వారా అనుసంధానించి, క్లీన్ ఎనర్జీతో పనిచేసే విధంగా ఈ ప్రాజెక్టును డిజైన్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ అంచనా ప్రకారం.. ఈ ప్రాజెక్ట్ 2028-2032 కాలంలో సగటున సంవత్సరానికి రూ.10,518 కోట్ల జీఎస్‌డీపీ వాటాతోపాటు సుమారు 1,88,220 ఉద్యోగాలను సృష్టిస్తుంది. గూగుల్ క్లౌడ్ ఆధారిత ఉత్పత్తుల ద్వారా సంవత్సరానికి రూ.9,553 కోట్ల అదనపు ఆదాయం సమకూరుతుంది. మొత్తం ఐదేళ్లలో సుమారు రూ.47,720 కోట్ల ఆర్థిక లక్ష్యాన్ని చేరుకోనుందని అంచనా. ఈ ప్రాజెక్టును వేగవంతంగా ప్రారంభించడానికి వీలుగా సింగిల్ విండో క్లియరెన్స్, ఆధునిక మౌలిక సదుపాయాలు, రెన్యువబుల్ ఎనర్జీ, ప్లగ్-అండ్-ప్లే వసతులను ఏపీ ఎకనమిక్ డెవలప్‌మెంట్ బోర్డు, ఐటీ శాఖలు సమన్వయంతో అందించేవిధంగా ఏర్పాట్లు చేశారు.



శాన్ ఫ్రాన్సిస్కోలో గత ఏడాది అక్టోబరు 31న ఏపీలో గూగుల్ 1 గిగావాట్ హైపర్‌స్కేల్ డేటా సెంటర్ ఏర్పాటుపై గూగుల్ క్లౌడ్ సీఈఓ థామస్ కురియన్‌తో మంత్రి లోకేశ్ చర్చించారు. నేడు దీనికి సంబంధించిన ఒప్పందం చేసుకుంటున్న నేపథ్యంలో ఎక్స్‌లో లోకేశ్ నాటి ఫొటోలను పంచుకున్నారు.

రైడెన్‌కు భారీగా రాయితీలు

రూ.22,002 కోట్ల ప్రోత్సాహకాలు ప్రకటించిన ప్రభుత్వం

అమరావతి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): విశాఖలో డేటా సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్న గూగుల్ అనుబంధ సంస్థ రైడెన్‌కు రాష్ట్ర ప్రభుత్వం భారీగా ప్రోత్సాహకాలను ప్రకటించింది. ఈ సంస్థకు మొత్తం రూ.22,002 కోట్ల మేర రాయితీలు లభించనున్నాయి. రూ.87,520 కోట్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడితో, వెయ్యి మెగావాట్ల సామర్థ్యంతో ఏర్పాటు చేసే ఈ డేటా సెంటర్‌కు ప్రభుత్వం 480 ఎకరాలను కేటాయించింది.

1. కేటాయించిన భూముల విలువలో 25 శాతం రాయితీ ఇస్తారు. మరో 15 ఎకరాలు ల్యాండింగ్ కేబుల్ స్టేషన్‌కు కేటాయించింది. ఈ భూములకు స్టాంపు డ్యూటీ 100 శాతం మినహాయింపు ఇచ్చారు.
2. ప్లాంటు మినపనరీ ఖర్చులో 10 శాతం మూలధన రాయతీ కింద పదేళ్లలో గరిష్ఠంగా రూ.2,129 కోట్లు చెల్లించా లని నిర్ణయించించారు.
3. జీపీజీడబ్ల్యూ ఫైబర్ యాక్సెస్ కోసం చేసే వ్యయంలో 30శాతం మొత్తాన్ని 20ఏళ్లలో ప్రభుత్వ ం చెల్లిస్తుంది. ఆపరేషన్ యాజమాన్య నిర్వహణ చార్జీలు ప్రతి మూడేళ్లకు 5శాతం చొప్పున పెంచుతూ రూ.282 కోట్లు చెల్లించనుంది.
4. డేటా సెంటర్ నిర్మాణం కోసం రూ.2,245 కోట్ల జీఎస్టీకి మినహాయింపు ఇచ్చింది.
5. ఐదేళ్ల పాటు లీజులపై చెల్లించే జీఎస్టీని పూర్తిగా మినహాయిస్తారు. దీని విలువ రూ.1745 కోట్లు. నీటి చార్జీపై పదేళ్లపాటు 25శాతం రాయితీ ఇస్తారు.

విశాఖకు మరో ఐటీ కంపెనీ!

- ఇమేజినోవేట్ టెక్నాలజీస్(ఇండియా)కు 4.05 ఎకరాలు

అమరావతి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో పెట్టుబడులు పెట్టేందుకు, ఐటీ కార్యకలాపాలు నిర్వహించేందుకు ముందుకు వచ్చే సంస్థలకు రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ ప్రోత్సాహకాలు అందిస్తోంది. ఇందులో భాగంగా రూ.140 కోట్ల పెట్టుబడితో 2,600 మందికి ఉద్యోగాలు కల్పిస్తామంటూ ప్రతిపాదనలు పంపిన ఇమేజినోవేట్ టెక్నాలజీస్ (ఇండియా)కు కాపులుప్పాడలో 4.05 ఎకరాలు కేటాయిస్తూ రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏపీఐటీ అండ్ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్స్(జీసీసీ) పాలసీ 2024-29 ప్రాతిపదికన ఎకరా రూ.2 కోట్లు చొప్పున భూమి కేటాయించినట్లు ఉత్తర్వులో పేర్కొన్నారు. తమ సంస్థకు బహిరంగ మార్కెట్ ధరకు కాకుండా పాలసీ ప్రకారం ఎకరా రూ.2 కోట్లకు కేటాయించాలని చేసిన అభ్యర్థనపై సానుకూలంగా స్పందించినట్లు భాస్కర్ వెల్లడించారు.

ఏపీ బ్రాండ్ ఇమేజ్ పెంచాలి

భారీస్థాయిలో పెట్టుబడులు ఆకర్షించాలి

- దేశ ఆర్థిక, సాంకేతిక ప్రగతిలో ఆంధ్రప్రదేశ్‌ను అగ్రగామిగా నిలపాలి
- సీఐఐ భాగస్వామ్య సదస్సు లక్ష్యమిదే
- మంత్రులు, అధికారులతో చంద్రబాబు సమీక్ష
- నవంబరు 14, 15 తేదీల్లో విశాఖలో నిర్వహణ
- దేశ, విదేశాల నుంచి ప్రతినిధులు రాక
- ఇప్పటికే పారిశ్రామికవేత్తలకు లోకేశ్ ఆహ్వానం

అమరావతి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి భారీస్థాయిలో పెట్టుబడులు ఆకర్షించడంతో పాటు ఏపీ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచడానికి సీఐఐ భాగస్వామ్య సదస్సు వేదిక కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. దేశ ఆర్థిక, సాంకేతిక ప్రగతిలో ఆంధ్రప్రదేశ్‌ను అగ్రగామిగా నిలపడమే లక్ష్యంగా ఈ సదస్సును ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. వివిధ దేశాల వాణిజ్య మంత్రులు, లీడింగ్-గ్లోబల్ సీఈవోలను ఆహ్వానించాలని అధికారులకు నిర్దేశించారు. నవంబరు 14, 15 తేదీల్లో విశాఖపట్నంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనున్న సీఐఐ భాగస్వామ్య సదస్సు సన్నాహాలపై సోమవారం సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. దేశ, విదేశాలకు చెందిన పారిశ్రామికవేత్తలు, విధాన ఆలోచనాపరులు, నిపుణులకు ఈ సదస్సులో ప్రాధాన్యం ఇవ్వాలని దిశానిర్దేశం చేశారు. గ్లోబల్ టెక్ ట్రాన్స్‌ఫర్మేషన్, గ్లోబల్ ట్రస్ట్, గ్లోబల్ ట్రేడ్‌లో మన వాటా పెంచుకోవడం లక్ష్యంగా ఉండాలన్నారు. ఈ సదస్సుకు హాజరయ్యే అతిథులకు అన్ని సౌకర్యాలతో ఆతిథ్యం ఇచ్చేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ సదస్సు నిర్వహణ నేపథ్యంలో విశాఖ నగరాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దాలని అన్నారు. సదస్సు ఏర్పాట్లకు సమయం తక్కువగా ఉన్నందున వేగంగా పనులు పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. 'గ్రీన్ ఎనర్జీ రంగంలో రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలుస్తోంది. గూగుల్ వంటి అంతర్జాతీయ సాంకేతిక దిగ్గజ సంస్థలు రాష్ట్రానికి వస్తున్నాయి. రాష్ట్రం త్వరలోనే కృత్రిమ మేధస్సు (ఏఐ), ఇన్నోవేషన్ హబ్‌గా మారనుంది. ఈ అంశాలు, రాష్ట్ర ఆకాంక్షలు విశాఖ సదస్సులో ప్రతిబింబించాలి' అని చెప్పారు. ఈ సమీక్ష సమావేశంలో మంత్రులు లోకేశ్, పొంగూరు నారాయణ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, సీఐఐ డైరెక్టర్ జనరల్ చందర్జిత్ బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.


విజయవాడలో రోడ్డు భద్రతపై సమీక్షా సమావేశంలో హోంమంత్రి అనిత, ఏడీజీ కృపానంద త్రిపాఠి, డీఐజీ విజయరావు, మల్లికాగార్గ్ తదితరులు

రోడ్డు ప్రమాదాలను కట్టడి చేయాలి

» అధికారులకు హోంమంత్రి అనిత దిశానిర్దేశం

అమరావతి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాల కట్టడికి పోలీసు శాఖ గట్టి చర్యలు తీసుకోవాలని హోంమంత్రి అనిత అధికారులను ఆదేశించారు. సంబంధిత అధికారులతో సోమవారం ఆమె విజయవాడలో సమీక్షించారు. 'గతేడాదితో పోల్చితే ఈ ఏడాది 3.5శాతం రోడ్డు ప్రమాదాలు పెరిగాయి. ఇందుకు కారణాలను అధ్యయనం చేయాలి. బ్లాక్ స్పాట్స్ వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి. ఆర్టీజీఎస్ ద్వారా రియల్ టైమ్ ట్రాఫిక్ పరిశీలన, ప్రమాదాలపై నిరంతర మానిటరింగ్ వ్యవస్థను బలోపేతం చేయాలి. ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు నిరంతరం అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి. విజయవాడలో ఎన్టీఆర్ జిల్లా పోలీసులు చేపట్టిన 'అస్త్రం' విధానాన్ని ఇతర పట్టణాల్లోనూ అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలి' అని ఆమె సూచించారు. సమావేశంలో రోడ్ సేఫ్టీ ఏడీజీ కృపానంద త్రిపాఠి, డీఐజీ విజయా రావు, టెక్నికల్ సర్వీసెస్ ఎస్పీ మాలికా గార్గ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ నగరంగా అమరావతి: రామ్మోహన్‌నాయుడు

న్యూఢిల్లీ, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఏళ్ల కొలది నిలిచిపోయిన అమరావతి అభివృద్ధి సీఎం చంద్రబాబు నాయకత్వంలో మరోసారి వేగం పుంజుకుందని కేంద్ర మంత్రి కింజారపు రామ్మోహన్ నాయడు అన్నారు. ఆధునిక పాలన, దార్శనిక ప్రణాళికకు చిహ్నంగా ఉన్న సీఆర్డీఏ ప్రధాన కార్యాలయాన్ని సీఎం చంద్రబాబు ప్రారంభించడం చారిత్రాత్మక ఘట్టంగా సోమవారం ఒక ప్రకటనలో అభివర్ణించారు.

'స్వర్ణాంధ్ర 2047' సాధనకు ప్రణాళికలు

» వనరుల సమీకరణకు క్యాబినెట్ సబ్ కమిటీ

అమరావతి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర-2047 లక్ష్యసాధన కోసం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో భాగంగా ఆదాయ వనరుల సమీకరణ కోసం మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమిస్తూ ప్రభుత్వం సోమవారం జీవో ఇచ్చింది. ప్రస్తుతం రాష్ట్రరెవెన్యూలో సింహభాగం జీతాలు, పెన్షన్లు, వడ్డీ చెల్లింపుల కోసమే ఖర్చవుతోందని, దీంతో సంక్షేమం, అభివృద్ధి కార్యకలాపాల కోసం ఆదాయం పెద్దగా అందుబాటులో ఉండడం లేదని జీవోలో పేర్కొంది. ఈ కమిటీలో మంత్రులు పయ్యావుల కేశవ్, కొల్లు రవీంద్ర, అనగాని సత్యప్రసాద్, సత్యకుమార్, కందుల దుర్గేష్, అనిత సభ్యులుగా, ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి కన్వీనర్‌గా ఉంటారు. ఈ కమిటీ నెలకోసారి సమావేశమై రాష్ట్ర ఆదాయాన్ని పెంచే ప్రతిపాదనలపై చర్చించి వాటిని ప్రభుత్వానికి సిఫారసు చేస్తుంది. అలాగే, స్వర్ణాంధ్ర-2047 సాధన కోసం మధ్యకాలిక, దీర్ఘకాలిక ప్రణాళికలు సిద్ధం చేస్తుంది.

చురుగ్గా ప్రధాని పర్యటన ఏర్పాట్లు

» పనులను పరిశీలించిన మంత్రులు, నేతలు

» మోదీ పర్యటనకు 3,220 ఆర్టీసీ బస్సులు

» పలు జిల్లాల నుంచి భారీగా జన సమీకరణ


కర్నూలులో ప్రధాని పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, అనగాని సత్యప్రసాద్, పయ్యావుల కేశవ్, రాష్ట్ర నాయకులు మంతెన సత్యనారాయణ రాజు, దామచర్ల సత్య, కిలారి రాజేశ్, బి.వెంకటరాముడు

కర్నూలు/విజయవాడ, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ఈనెల 16న ప్రధాని మోదీ పర్యటనకు చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ పర్యటన విజయవంతం చేయడానికి కూటమి నేతలు నిర్విరామంగా కృషి చేస్తున్నారు. రాష్ట్ర మంత్రులు, టీడీపీ, జనసేన, బీజేపీ రాష్ట్ర ముఖ్య నాయకులు సోమవారం కర్నూలుకు వచ్చి ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు మంత్రుల బృందం ఇక్కడి ఏర్పాట్లపై అధికారులతో సమీక్షలు నిర్వహించింది. కర్నూలు శివారులో నన్నూరు టోల్‌ప్లాజా దగ్గర రాగమయూరి గ్రీన్ హిల్స్‌లో ప్రధాని మోదీ సభా ప్రాంగణం, పార్కింగ్, రోడ్లు తదితర ఏర్పాట్లను మంత్రులు, టీడీపీ నేతల బృందం పరిశీలించింది. పీఎం ప్రోగ్రామ్ స్పెషల్ ఆఫీసర్ వీరపాండియన్, కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి, ఎస్పీ విక్రాంత్ పాటిల్ పర్యవేక్షణలో ఏర్పాట్లు దాదాపుగా ఓ కొలిక్కి వచ్చాయి. 3 నుంచి 4 లక్షలకు పైగా జనసమీకరణ చేయాలని నేతలు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఏర్పాట్లను పరిశీలించిన వారిలో మంత్రులు పయ్యావుల కేశవ్, నారాయణ, నిమ్మల రామానాయుడు, టీజీ భరత్, బీసీ జనార్దన్‌రెడ్డి, రాంప్రసాద్‌రెడ్డి, అనగాని సత్యప్రసాద్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, ఎమ్మెల్సీలు బీటీ నాయుడు, బీద రవిచంద్ర, భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్యేలు గౌరు చరిత, బొగ్గుల దస్తగిరి, పుత్తా చైతన్యరెడ్డి, ఉగ్ర నరసింహా, దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ నాగరాజు, పార్టీజిల్లా అధ్యక్షుడు పి.తిక్కారెడ్డి, రాష్ట్ర నాయకులు కిలారి రాజేశ్, సత్యనారాయణ రాజు, దామచర్ల సత్య, బీవీ వెంకటరాముడు తదితరులు ఉన్నారు.

జనసమీకరణకు బస్సులు

ప్రధాని మోదీ పర్యటన కోసం 3,220 ఆర్టీసీ బస్సులను రాష్ట్ర ప్రభుత్వం అద్దెకు తీసుకుంది. బస్సులన్నీ మంగళవారం సాయంత్రం కర్నూలులో రిపోర్టు చేయాల్సి ఉంది. అనంతరం పలు ప్రాంతాలకు బయలుదేరి వెళ్తాయి. 16న ఉదయం నాటికి ప్రజలను సభాస్థలికి చేర్చాల్సి ఉంటుంది. సభ ముగిసిన తర్వాత 17న సొంత డిపోలకు చేరుకుంటాయి. ఈ మూడు రోజులు రాష్ట్ర వ్యాప్తంగా బస్సులు తగ్గనున్న నేపథ్యంలో ప్రజలు ప్రత్యామ్నాయాలు చూసుకోవాలని ఆర్టీసీ అధికారులు తెలిపారు.

నకిలీ మద్యానికి ఆద్యుడు జగనే: నిమ్మల

రాష్ట్రంలో లిక్కర్ మాఫియా లీడర్.. నకిలీ మద్యానికి ఆద్యుడు వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అని కర్నూలు జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు. కర్నూలు జిల్లా టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, మరో మంత్రి టీజీ భరత్‌లతో కలసి సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నకిలీ మద్యం భాగోతాన్ని వెలుగులోకి తెచ్చిందే కూటమి ప్రభుత్వమని, అందులో తమ పార్టీ వాళ్ల పాత్ర ఉందని తెలియగానే వారిపై కఠిన చర్యలు తీసుకున్న ఘనత సీఎం చంద్రబాబుది అని అన్నారు. జీఎస్టీ సంస్కరణలతో ఎన్డీఏ ప్రభుత్వం చరిత్ర సృష్టించిందన్నారు.


గుర్రంపై తెనాలిలో ఎల్ఐసీ ప్రీమియం కట్టేందుకు వస్తున్న లక్ష్మారెడ్డి

'గుర్రం' లక్ష్మారెడ్డి!

» 30 ఏళ్లుగా అశ్వమే వాహనం!

ఆరు పదుల వయస్సు.. పంచెకట్టు.. గుర్రంపై దర్జాగా స్వారీ! సోమవారం గుంటూరు జిల్లా తెనాలి రోడ్లపై ఓ వ్యక్తి బైకులు, కార్లను దాటుకొని ముందుకు దూసుకుపోవడం అందరిదృష్టినీ ఆకర్షించింది. బాపట్ల జిల్లా చుండూరు మండలం కారుమూరువారిపాలెం గ్రామానికి చెందిన ఆయన పేరు లక్ష్మారెడ్డి (61). పాలసీ సొమ్ము చెల్లించేందుకు స్థానిక ఎల్ఐసీ కార్యాలయానికి గుర్రంపై వచ్చి ఇలా కనిపించారు. బైక్‌ల కంటే గుర్రంపై స్వారీనే మేలని చెబుతున్న ఆయన.. 30 ఏళ్లకు పైగా తన ప్రయాణాలకు దాన్నే వినియోగిస్తున్నారట! పొలానికి వెళ్లాలన్నా, ఇతర గ్రామాలకు వెళ్లాలన్నా ఇదే ఆయన వాహనం!! రాజధాని ప్రాంత గ్రామాలకు, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో బంధువులవద్దకు సైతం గుర్రంపైనే వెళ్తానని, ఇప్పటికి 10 గుర్రాలను మార్చానని చెబుతున్నారు. తన ప్రయాణ అవసరాల కోసం గుర్రం బండి తయారు చేయించుకోవాలని అనుకుంటున్నట్లు చెప్పారు. - తెనాలి-ఆంధ్రజ్యోతి

282.6 బిలియన్ డాలర్ల పెట్టుబడులే లక్ష్యం!

» ఐటీలో అత్యున్నత అడ్వయిజరీ కౌన్సిల్

» మంత్రి లోకేశ్ నేతృత్వంలో ఏర్పాటు

అమరావతి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఐటీ రంగంలో 282.5 బిలియన్ డాలర్ల పెట్టుబడి లక్ష్యంగా, యువతకు ఉపాధి కల్పించేందుకు వీలుగా మంత్రి లోకేశ్ నేతృత్వంలో 16 మందితో కూడిన రాష్ట్రస్థాయి అత్యున్నత కౌన్సిల్‌ను ప్రభుత్వం ఏర్పాటుచేసింది. ఈ మేరకు సోమవారం ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్ ఉత్తర్వు జారీ చేశారు. జాతీయ స్థాయిలో ప్రఖ్యాత ఐటీ కంపెనీలలైన ఇండియా అండ్ సార్క్ సియానా డైరెక్టర్ సుజిత్ బాబు, ఇన్ఫోసిస్, ఫైనాన్స్ వైస్ ప్రెసిడెంట్ సునీల్‌కుమార్, ఐబీఎం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నందిని సింగ్, కాగ్నిజెంట్ వైస్‌ప్రెసిడెంట్ గౌరవ్ హజారా, టీసీఎస్, రీజియన్ హెడ్ ఎం.రవి భావరాజు, ఐటీ డెవలప్‌మెంట్ సెంటర్స్ హెడ్స్ విభాగంలో సిస్టమ్స్ పెర్సిస్టెంట్ సిస్టమ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ విష్ణు మామిడిపల్లి, కోవర్కింగ్ స్పేస్ విభాగంలో వి-వర్క్ సీఈవో విశ్వని, ఇండిక్యూబ్ చైర్మన్ రిషి దాస్, 91 స్ప్రింగ్ బోర్డు సీఓఓ సమీర్ సింగ్, నాస్కామ్, నాస్కమ్ వైస్ ప్రెసిడెంట్ సంగీతా గుప్త, సీఐఐ ఏపీ చైర్మన్ మురళీకృష్ణ, ఆక్వా ఎక్స్ఛేంజ్ అగ్రిటెక్ సీఈవో పవర్ కృష్ణ, ఆర్‌అండ్‌డీ విభాగంలో నాస్కమ్ సీఈవో సంజీవ్ మల్హోత్ర, కాటమనేని భాస్కర్, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి యువరాజ్ ఇందులో ఉన్నారు.



మెగా డీఎస్సీ మాట నిలబెట్టుకున్నాం: లోకేశ్

అడ్డంకులు ఎదురైనా, ఆటంకాలు సృష్టించినా మెగా డీఎస్సీ మాట నిలబెట్టుకున్నామని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. మెగా డీఎస్సీ టీచర్లు సోమవారం నుంచి విధుల్లోకి వస్తున్న సందర్భంగా ఆయన ఎక్స్ వేదికగా వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. 'పిల్లలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతున్న లక్షలాది మంది టీచర్లకు.. ఇప్పుడు కొత్తగా మరో 16వేల మంది కొత్త టీచర్లు తోడవుతున్నారు. అంతాకలిసి విద్యార్థుల సమగ్ర వికాసాన్ని గురుతర బాధ్యతగా నిర్వర్తించాలి' అని లోకేశ్ ఆకాక్షించారు.



రుషికొండపై ప్రజాభిప్రాయ సేకరణ

» నోటిఫికేషన్ జారీ చేసిన రాష్ట్ర పర్యాటక శాఖ

అమరావతి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం విశాఖ సాగర తీరంలో రుషికొండపై రూ.450 కోట్లతో నిర్మించిన ప్యాలెస్‌ను ఎలా వినియోగించాలన్న విషయమై కూటమి ప్రభుత్వం ప్రజాభిప్రాయ సేకరణకు దిగింది. దీనిపై ఇప్పటికే మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించినా ఫలితం లేకపోవడంతో ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఏపీ టూరిజం అథారిటీ, టూరిజం కార్పొరేషన్లు తమ వెబ్‌సైట్‌లో అభిప్రాయ సేకరణ ప్రారంభించాయి. ఈ భవనాలను ఎలా ఉపయోగిస్తే బాగుంటుంది? టూరిజం ప్రమోషన్స్‌కు లేదా పీపీపీకి ఇస్తే మంచిదా? ఎకో టూరిజానికి ఉపయోగించాలా? కల్చరల్ ఈవెంట్స్‌కు ఉపయోగిస్తే బాగుంటుందా? లేదా ప్రభుత్వ కార్యక్రమాలకు ఉపయోగిస్తే మేలా? అన్న దానిపై ప్రజలు తమ సూచనలు, సలహాలు, అభిప్రాయాలను 7 రోజులలోపు rushikonda@aptdc.in మెయిల్ చేయాలని పేర్కొన్నాయి.

'రేషన్' అక్రమ రవాణాకు చెక్

అక్కడికక్కడే నిర్ధారణ కోసం 700 ర్యాపిడ్ మొబైల్ కిట్లు

» కాకినాడ 'దోషులను' వదిలేది లేదు

» పోర్టుల్లో చెక్ పోస్టులు ఏర్పాటు: మనోహర్

విశాఖపట్నం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రేషన్ బియ్యం అక్రమ రవాణాను అరికట్టడానికి అన్ని రకాలుగా చర్యలు తీసుకుంటున్నట్టు మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. సోమవారం ఉదయం సర్క్యూట్ హౌస్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'పట్టుకున్న బియ్యాన్ని అక్కడికక్కడే పరీక్షించేందుకు జిల్లాలకు 700 ర్యాపిడ్ మొబైల్ కిట్లు సరఫరా చేశాం. ప్రభుత్వం సరఫరా చేసే ఫోర్టిఫైడ్ బియ్యమైతే కిట్‌లోని రసాయన ద్రావకాలను చల్లితే ఎరుపు రంగులోకి మారిపోతాయి. బయట మార్కెట్‌లో విక్రయించే బియ్యం అయితే రంగు మారకుండా ఉంటాయి. గతంలో అయితే బియ్యాన్ని పట్టుకున్న తరువాత పరీక్షలకు ల్యాబ్‌కు పంపి, ఆ రిపోర్టు వచ్చేంత వరకూ ఆగాల్సి వచ్చేది. ఈ నేపథ్యంలో దేశంలోనే తొలిసారిగా రెండు రసాయన ద్రావకాలతో కిట్లు రూపొందించాం. దీనివల్ల అక్రమ రవాణా చేసే బియ్యాన్ని అక్కడక్కడే నిర్ధారించి సీజ్ చేసే అవకాశం వచ్చింది. గతేడాది కాకినాడ పోర్టులో బియ్యం పట్టుకుని కేసులు నమోదు చేశాం. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేకంగా నియమించిన సిట్ బృందానికి ఇతరత్రా పనులు అప్పగించడం వల్ల దర్యాప్తులో స్వల్ప జాప్యం జరిగింది. ఈ వ్యవహారంలో దోషులను వదిలేది లేదు. కాకినాడ పోర్టులో మూడు చెక్ పోస్టులు ఏర్పాటుచేసి బియ్యం అక్రమ రవాణాపై నిఘా పెంచాం. అదే మాదిరిగా విశాఖపట్నం పోర్టు పరిధిలో ఏర్పాటు చేసిన మూడు చెక్ పోస్టులు ఆదివారం నుంచి అందుబాటులోకి వచ్చాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన 16 నెలల్లో రూ.245 కోట్ల విలువైన 5.65 లక్షల క్వింటాళ్ల రేషన్ బియ్యం సీజ్ చేశాం. బహిరంగ మార్కెట్లలో కొనుగోలు చేసిన బియ్యంలో కెర్నల్స్ కలిపి విదేశాలకు ఎగుమతి చేస్తామంటే అనుమతించేది లేదు. క్యూఆర్ కోడ్ కలిగిన స్మార్ట్ రైస్ కార్డుల పంపిణీ 89 శాతం పూర్తయింది' అని మంత్రి తెలిపారు. పౌర సరఫరాల శాఖ కమిషనర్ సౌరభ్‌గౌర్ మాట్లాడుతూ, ర్యాపిడ్ మొబైల్ కిట్ ద్వారా రేషన్ బియ్యాన్ని సులువుగా గుర్తించవచ్చునన్నారు.


విలేకరుల సమావేశంలో రేషన్ బియ్యాన్ని గుర్తించే కిట్లు ప్రదర్శిస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్. చిత్రంలో పౌరసరఫరాల సంస్థ ఎండీ మనిజీర్ జిలానీ, కమిషనర్ సౌరబ్‌గౌర్, విశాఖ జేసీ మయూర్ అశోక్

దళారుల వ్యవస్థ నిర్మూలనకు యాప్

శ్రీకాకుళం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): దేశంలోనే కొత్తగా రైతు వాట్సాప్ ద్వారా ధాన్యం విక్రయాలకు అవకాశం కల్పించనున్నామని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. దళారుల వ్యవస్థ నిర్మూలనకు ఈ యాప్‌ను తీసుకువస్తున్నామని, స్థానిక పోలీసు స్టేషన్‌కు ఈ యాప్ వివరాలు అనుసంధానం చేస్తామని చెప్పారు. శ్రీకాకుళం కలెక్టరేట్‌లో ఉత్తరాంధ్ర జిల్లాల జాయింట్ కలెక్టర్లు, పౌరసరఫరాల అధికారులతో సోమవారం సివిల్ సప్లయ్ కమిషనర్ సౌరభ్‌గౌర్, పౌరసరఫరాల సంస్థ ఎండీ మనజీర్ జిలానీ సమూన్‌తో కలసి మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'గత ప్రభుత్వంలో నాయకులకు రైతులు భయపడేవారు. అటువంటి పరిస్థితి కూటమి ప్రభుత్వంలో లేదు. రైతులు తమకు నచ్చిన మిల్లుకు ధాన్యాన్ని తరలించుకోవచ్చు. ధాన్యం కొనుగోలు చేసిన ఒకటి, రెండు రోజుల్లోనే ప్రభుత్వం వారి ఖాతాల్లో నగదు జమ చేస్తోంది. కేంద్రప్రభుత్వ సహకారంతో ఈ దఫా ఏకంగా 50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి సీఎంఆర్ చేయించి.. బియ్యాన్ని అందిస్తాం' అని స్పష్టం చేశారు.

30 లక్షల టన్నుల బియ్యం సేకరణకు అనుమతి: ఎంపీ లావు

గత అనుభవాల దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వ అభ్యర్థన మేరకు ఈ ఏడాది ఖరీఫ్‌లో రెట్టింపు స్థాయిలో 30 లక్షల టన్నుల బియ్యం సేకరణకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని ఎఫ్‌సీఐ రాష్ట్రస్థాయి సంప్రదింపుల కమిటీ చైర్మన్, పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీకృష్ణ దేవరాయలు తెలిపారు. గతేడాది ఖరీఫ్‌లో 15.92 లక్షల టన్నుల బియ్యాన్ని ఎఫ్‌సీఐ ద్వారా కొనుగోలు చేశామన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రైతు పండించిన ప్రతి గింజనూ కనీసమద్దతు ధరకు కొనుగోలు చేయాలనేది ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు.

వెంకటేష్ నాయుడి ఫోన్

అన్‌లాక్‌కు అనుమతి

» కసిరెడ్డి, చెవిరెడ్డి సహా ఏడుగురికి 16 వరకు రిమాండ్ పొడిగింపు

» విజయవాడ ఏసీబీ కోర్టు ఉత్తర్వులు



విజయవాడ, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో ఏ-34 నిందితుడిగా ఉన్న చెరుకూరి వెంకటేష్ నాయుడి ఫోన్‌ను ఫేస్ ఐడీ ద్వారా తెరిచేందుకు విజయవాడ ఏసీబీ కోర్టు అనుమతిచ్చింది. దీనికి సంబంధించి సోమవారం న్యాయాధికారి పి.భాస్కరరావు ఉత్తర్వులు జారీ చేశారు. గత ప్రభుత్వంలో జరిగిన మద్యం కుంభకోణంలో డబ్బుల కట్టలను లెక్కిస్తుండగా చిత్రీకరించిన వీడియోను సిట్ అధికారులు స్వాధీనం చేసుకుని కోర్టుకు సమర్పించారు. ఈ ఫోన్‌లో మరిన్ని ఆధారాలు ఉన్నాయని అనుమానిస్తున్నారు. వాటిని బయటకు తీయడానికి వెంకటేష్ నాయుడి ఐఫోన్‌ను ఫేస్ ఐడీ ద్వారా తెరవడానికి అనుమతి ఇవ్వాలని కోరుతూ సిట్ కొద్దిరోజుల క్రితం కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. కాగా మద్యం కుంభకోణంలో రిమాండ్ ఖైదీలుగా ఉన్న ఏడుగురు నిందితులకు 16వ తేదీ వరకు ఏసీబీ కోర్టు రిమాండ్ పొడిగించింది. విజయవాడ జిల్లా జైల్లో ఉన్న కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, సజ్జల శ్రీధర్‌రెడ్డి, చెరుకూరి వెంకటేష్‌నాయుడు, బూనేటి చాణక్యతో పాటు గుంటూరు జిల్లా జైల్లో ఉన్న బాలాజీకుమార్ యాదవ్, నవీన్ కృష్ణను పోలీసులు సోమవారం ఏసీబీ కోర్టులో హాజరు పరిచారు. న్యూయార్క్ వెళ్లడానికి అనుమతి ఇవ్వాలని కోరుతూ రాజంపేట వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి ఏసీబీ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తాను అనారోగ్య సమస్యతో బాధపడుతున్నానని కస్టడీలోనే చికిత్స చేయించుకునేందుకు అనుమతి ఇవ్వాలని చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి న్యాయాధికారిని కోరారు.

మీరు నన్నేం చేయలేరు!

» 'సిట్' సిబ్బందిపై వెంకటేష్‌నాయుడు వీరంగం

విజయవాడ, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో రిమాండ్ నిందితుడిగా ఉన్న చెరుకూరి వెంకటేష్ నాయుడు కోర్టు హాలు బయట వీరంగం సృష్టించాడు. సిట్ సిబ్బందిపై రెచ్చిపోయాడు. 'నా వ్యక్తిగత విషయాలు మీకెందుకు? మీవల్లే అవి బయటకు తెలుస్తున్నాయి. మీరు నన్ను ఏం చేయగలరు? మహా అయితే మరోఏడాది జైలులో పెడతారు. అంతకుమించి ఏమీ చేయలేరు' అంటూ చిందులు తొక్కాడు. ఈ ఘటన విజయవాడ ఏసీబీ కోర్టులో సోమవారం జరిగింది. మద్యం స్కాం నిందితులను రిమాండ్ పొడిగింపు నిమిత్తం సిట్ పోలీసులు కోర్టుకు తీసుకొచ్చారు. నిందితులందరినీ న్యాయాధికారి ముందు ప్రవేశపెట్టినప్పుడు వెంకటేష్ నాయుడు ఫోన్ తెరవడానికి సంబంధించి సిట్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిగింది. దీనిపై ఫోరెన్సిక్ ల్యాబ్ ప్రతినిధులు కోర్టుకు హాజరై మెమో దాఖలు చేశారు. ఫోన్ విషయంపై కోర్టు హాలు బయట వెంకటేష్ న్యాయవాది కె.జయరాం, సిట్ కానిస్టేబుల్ సందీప్ మధ్య చర్చ జరిగింది. ఆ సమయంలో అక్కడే ఉన్న వెంకటేష్ సతీమణి వారి మాటలు విన్నారు. ఆపై నేరుగా తన భర్త వద్దకు వెళ్లి ఫోన్‌లో తెలియకుండా ఏం దాచావని గట్టిగా ప్రశ్నించారు. దీంతో ఫోన్‌లో ఉన్న రహస్యాలు భార్యకు తెలియడానికి సిట్ సిబ్బందే కారణమని వెంకటేష్ భావించాడు. దీంతో సిట్ కానిస్టేబుల్ సందీప్ వద్దకు వెళ్లి.. మీరు నన్ను ఏమీ చేయలేరంటూ పూనకం వచ్చినట్టు ఊగిపోయాడు. ఈ క్రమంలో మద్యం కుంభకోణం కేసులో బెయిల్‌పై బయటఉన్న నిందితుడు మాజీ ఐఏఎస్ అధికారి కె.ధనుంజయ్‌రెడ్డి.. వెంకటేష్‌ని కూర్చోబెట్టి పరిస్థితులు బాగోలేవని, ఆచితూచి మాట్లాడాలని వారించారు.

జోగి చెప్పారు.. మేం చేశాం!

(మొదటి పేజీ తరువాయి)

ఆయన చెప్పిన వివరాల ప్రకారం.. 2012లో మద్యం వ్యాపారంలోకి ప్రవేశించిన జనార్దన్.. ఇబ్రహీంపట్నంలోని ఏఎన్ఆర్ బార్ ద్వారా లాభాలు గడించారు. అయితే సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జాతీయ రహదారి పక్కన మద్యం షాపులు తొలగించాల్సి రావడంతో ఈయన దుకాణం కూడా పోయింది. దీంతో వ్యాపారం దెబ్బతింది. 2019లో వైసీపీ ప్రభుత్వం వచ్చాక.. ప్రభుత్వ మద్యం దుకాణాలు పెట్టడం, తర్వాత కొవిడ్ సమయంలో లిక్కర్‌కు డిమాండ్ పెరగడంతో.. జనార్దన్ హైదరాబాద్ నుంచి ఫినాయిల్ స్టిక్కర్లు అతికించిన క్యాన్లలో లిక్కర్‌ను ఇబ్రహీంపట్నం తీసుకొచ్చి స్థానిక వైసీపీ నేతల సహకారంతో బాట్లింగ్ చేసి విక్రయాలు జరిపేవారు. బెంగళూరు, ముంబై, కేరళ నుంచి కూడా ముడిసరుకు తీసుకొచ్చి ఇబ్రహీంపట్నంలోనే బాట్లింగ్ చేసి మంజీరా విస్కీ, ఓల్డ్ అడ్మిరల్, కేరళ మాల్ట్, క్లాసిక్ బ్లూ వంటి ప్రసిద్ధ బ్రాండ్లను మార్కెట్లో విక్రయించారు. తర్వాత కూటమి ప్రభుత్వం రావడం, ఎక్సైజ్ పాలసీ మారిపోవడంతో నకిలీ దందా కొనసాగించేందుకు ఇబ్బందులు ఎదురయ్యాయి. 'జోగి రమేశ్ ఆధ్వర్యంలోనే నకిలీ మద్యం తయారు చేశాం. కూటమి ప్రభుత్వం రాగానే నిఘా పెరగడంతో ఈ వ్యాపారం ఆపేశాం. కొన్నాళ్లు ఆఫ్రికాలో ఉన్నాను. ఈ ఏడాది ఏప్రిల్లో జోగి నాకు ఫోన్ చేసి.. అక్కడి నుంచి వచ్చి మళ్లీ నకిలీ మద్యం తయారు చేయాలని చెప్పారు. కూటమి ప్రభుత్వాన్ని భ్రష్టు పట్టించడానికి.. పై వారి ఆదేశాలతో నమ్మకస్తుడివైన నీకు ఈ పని అప్పజెబుతున్నానన్నారు. మొదట ఇబ్రహీంపట్నంలో తయారు చేయాలనుకున్నాం. అయితే తంబళ్లపల్లె నుంచి ప్రారంభిస్తే చంద్రబాబు ప్రభుత్వంపై బురద జల్లొచ్చని, అది మనకు మంచి అవకాశం అవుతుందని జోగి అన్నారు. ఆయన ఆదేశాలతో ఆ నియోజకవర్గంలో మద్యం దుకాణాలను నేను తీసుకున్నా. ములకలచెరువులో తయారీ మొదలుపెట్టాం. వేరే వాళ్ల పేరు మీద గది అద్దెకు తీసుకుని లిక్కర్ తయారీకి కావలసిన యంత్రాలన్నీ తీసుకొచ్చాం. నకిలీ మద్యం తయారు చేసి, మంచి సమయం చూసి ప్రభుత్వం మీద రుద్దుదామని జోగి అన్నారు. ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడడానికి నాకు సహాయం చేస్తామని హామీ ఇచ్చారు. అంతా సిద్ధమయ్యాక నన్ను ఆఫ్రికాలో ఉన్న స్నేహితుడి దగ్గరకు పంపారు. జోగి తన మనుషులతో ఎక్సైజ్ శాఖకు లీకులిచ్చి ములకలచెరువులో దాడులు చేయించారు. తద్వారా ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకురావాలని కుట్ర చేశారు. ఈ వ్యవహారంలో టీడీపీ ఇన్‌చార్జిగా ఉన్న జయచంద్రారెడ్డిని చంద్రబాబు సస్పెండ్ చేయడంతో.. మన ప్లాన్ వర్కవుట్ కాలేదని.. ఇబ్రహీంపట్నంలో దాడులు చేయిద్దామని జోగి నాకు చెప్పారు. గోడౌన్‌లో దాడి జరగడానికి ముందురోజే అన్నీ తీసుకొచ్చి పెట్టాలన్నారు. ఆయన చెప్పినట్లే లీకులిచ్చి ఎక్సైజ్ అధికారులతో దాడి చేయించారు. సాక్షి మీడియాను ముందే అక్కడ ఉంచారు. అనుకున్నట్లే అంతా జరిగింది.. చంద్రబాబు ప్రభుత్వానికి చెడ్డపేరు వచ్చింది.. అంతా బాగా జరిగింది.. ఆఫ్రికా నుంచి నువ్వు రావలసిన అవసరం లేదని జోగి నాకు చెప్పారు. బెయిల్ ఇప్పిస్తానని హామీ ఇచ్చి చివరకు హ్యాండిచ్చారు. నా తమ్ముడిని ఇందులో ఇరికించారు. జరిగిన దానితో జయచంద్రారెడ్డికి ఎలాంటి సంబంధం లేదు. జోగితో నాకు చిన్నప్పటి నుంచి పరిచయం ఉంది. నన్ను నమ్మించి మోసం చేయడంతో అసలు నిజాలు బయటపెడుతున్నాను' అని సదరు వీడియోలో జనార్దనరావు వెల్లడించారు. ఆయన ఎక్సైజ్ కోర్టులో సోమవారం బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు.

నకిలీ మద్యంపై సిట్ ఏర్పాటు

» ఐజీ అశోక్‌కుమార్ సారథ్యం

అమరావతి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యం తయారీ-విక్రయాల వ్యవహారాన్ని నిగ్గుతేల్చేందుకు రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటుచేసింది. ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ సారథిగా, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్, డీఐజీ రాహుల్‌దేవ్ శర్మ, సీఐడీ ఎస్పీ కె.చక్రవర్తి, టెక్నికల్ సర్వీసెస్ ఎస్పీ మల్లికా గార్గ్‌లతో సిట్ ఏర్పాటుచేస్తూ సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ) సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. ఎక్సైజ్ శాఖ కమిషనర్ నియంత్రణ, పర్యవేక్షణలో సిట్ పనిచేస్తుందని తెలిపింది. ములకలచెరువు, ఇబ్రహీంపట్నం ఘటనలతో పాటు నకిలీ మద్యం ఉత్పత్తి, సరఫరా, పంపిణీకి సంబంధించిన ఇతర అక్రమాలపై కూడా దర్యాప్తు చేస్తుంది. ఎక్సైజ్ కమిషనర్ ద్వారా ప్రతి 15 రోజులకోసారి నివేదిక పంపాలని సిట్‌ను ప్రభుత్వం ఆదేశించింది.

సీబీఐ విచారణ వేయండి: జోగి

విజయవాడ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యం తయారీలో తన ప్రమేయం ఉందంటూ రాజకీయంగా తనపై బురదజల్లుతున్నారని.. నకిలీ మద్యంపై సీబీఐతో విచారణ జరిపించాలని మాజీ మంత్రి జోగి రమేశ్ డిమాండ్ చేశారు. జనార్దనరావు వీడియో బయటకు వచ్చాక ఆయన కూడా ఓ వీడియో విడుదల చేశారు. తర్వాత విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం ఈ వ్యవహారంలో తనను కావాలనే ఇరికించిందన్నారు. తాను ఏ పాపమూ ఎరుగనని.. భార్యాబిడ్డల సాక్షిగా ప్రమాణం చేస్తున్నానని చెప్పారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.